13-2Pg1exHMNWJQEV.qxd:13-2Pg1exHMNWJQEV.qxd 1/1/02 6:49 AM Page 1

ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ

తెలుగు జాతీయ దినపత్రిక
# వార్త
epaper.vaartha.com WWW.VAARTHA.COM
శ్రీకాకుళం
fb.com/vaartha Digital

రంగంలోకి కొత్త రాఫెల్ విమానాలు
ట్రంప్- నెతన్యాహు కీలక భేటీ
5లో

Published from Srikakulam, Vijayawada, Hyderabad, Visakhapatnam, Rajahmundry, Guntur, Nizamabad, Ongole, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem,
13-2-2026 శుక్రవారం సంపుటి: 32 సంచిక: 13 పేజీలు: 16 వెల: 6.50

# మండలికి ఓకే అసెంబ్లీకి 'నో'

విపక్ష హోదా ఇవ్వనందుకు వైసిపి నిరసన

మండలిలో పోరాడుతాం: జగన్



**విజయవాడ,ఫిబ్రవరి 12,ప్రభాతవార్తప్రతినిధి:** శాసనసభలో వైసిపికి చట్టసభల నిబంధనలను అనుసరించి విపక్షహోదా ఇవ్వాల్సి ఉందని మాజీ సీఎం జగన్ అన్నారు.ఇది రాజ్యాంగబద్ధమైన అంశం కాబట్టి ఆ దిశలో ఆందోళన చేస్తున్నామన్నారు.అయితే ఈ విషయంపై ఎందుకు చట్టపరంగా వ్యవహరించాల్సిన వాళ్ళు,ఇతరులు మాట్లాడుతున్నారని ఆయన ప్రశ్నించారు.వ్యవస్థను నాశనం చేస్తున్నారు.ప్రశ్నించే అవకాశం లేకుండా సభలో మనకు విపక్ష హోదా ఇవ్వడం లేదన్నారు.ఏపీ అసెంబ్లీలో వైసీపీకి విపక్ష హోదా ఇవ్వకపోవడాన్ని నిరసిస్తూ.. ఈసారి బడ్జెట్ సమావేశాల్లోనూ గవర్నర్ ప్రసంగం సందర్భంగా అసెంబ్లీకి హాజరైన జగన్‌ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు.. బాయ్ కాట్ చేసి వెళ్లిపోయారు. అనంతరం అసెంబ్లీ బీఏసీ సమావేశానికి కూడా జగన్ హాజరు కాలేదు. గురువారం తాడేపల్లిలోని వైఎస్సార్సీపీ కేంద్ర కార్యాలయంలో జరిగిన పార్టీ శాసనసభాపక్ష సమావేశంలో పార్టీ ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలతో జగన్ భేటీ అయ్యారు. తాజా పరిణామాలపై వారితో చర్చించారు. అనంతరం కీలక నిర్ణయం ప్రక టించారు. వైఎస్సార్సీపీకి విపక్ష పార్టీ హోదా ఇవ్వనందుకు నిరసనగా ఈసారి కూడా >>2



వివిధ శాఖల ఉన్నతాధికారులతో సమీక్షలో సిఎం చంద్రబాబు

ప్రాయోజిత పథకాలకు అదనపు నిధులు సాధించాలి

గరిష్ట కేటాయింపులతో ప్రణాళికలు

మరిన్ని ఎలక్ట్రిక్ బస్సులు కూడా అడగాలి

# కేంద్రం నుంచి మరిన్ని నిధులు

**విజయవాడ, ఫిబ్రవరి 12,ప్రభాతవార్తప్రతినిధి:** కేంద్ర బడ్జెట్‌లో 2026 – 27 ఏపీలో కేటాయించిన రేర్ ఎర్త్ కారిడార్ సహా వివిధ ప్రాజెక్టులను రాష్ట్రంలో ఏర్పాటు చేసే అంశంపై అత్యంత సమన్వయంతో వ్యవహరించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అధికారులకు దిశానిర్దేశం చేశారు. కేంద్రం మంజూరు చేసిన ప్రాజెక్టులతో పాటు దేశవ్యాప్తంగా ప్రకటించిన వాటిని ఏపీలో ఏర్పాటు చేసుకునే అంశంపై ప్రతిపాదనల్ని సిద్ధం చేయాలని సీఎం ఆదేశించారు. కేంద్ర ప్రాయోజిత పథకాలు, వివిధ కార్యక్రమాలను అనుసంధానం చేసుకుంటూ అదనపు నిధులు సాధించాలని ముఖ్యమంత్రి సూచించారు. క్యాంపు కార్యాలయంలో గురువారం కేంద్ర బడ్జెట్ లో రాష్ట్రానికి చేసిన కేటాయింపులపై వివిధ శాఖల ఉన్నతాధికారులతో సీఎం సమీక్ష నిర్వహించారు. కేంద్రం నుంచి ఎక్కువ నిధులు రాబట్టుకునేలా కార్యాచరణ చేపట్టాలని సూచించారు. గత పాలకులు కేంద్ర ప్రాయోజిత పథకాల నిధులు ఖర్చు పెట్టకుండా పథకాలను నిర్వీర్యం చేశారని యుటిలిటీ సర్టిఫికెట్ల విషయంలో సమస్యలు తలెత్తాయన్నారు. ప్రభుత్వ శాఖలు అన్నీ వివిధ పథకాలకు కేటాయించిన నిధుల్ని ఖర్చు చేయగలిగితే అదనపు నిధుల్ని కూడా డ్రా చేసుకునేందుకు అవకాశం ఉంటుందన్నారు. వచ్చే బడ్జెట్‌లోగా గరిష్ట కేటాయింపులు చేసుకునేలా ప్రణాళికలు ఉండాలని ముఖ్యమంత్రి అధికారులకు సూచనలు చేశారు. ఇటీవల కేంద్రం ప్రవేశపెట్టిన చాలెంజ్ విధానంలోనూ మరికొన్ని నిధులు సాధించుకునేలా కార్యాచరణ చేసుకోవాలన్నారు. కేంద్రం ప్రకటించిన రేర్ ఎర్త్ కారిడార్ ను శ్రీకాకుళం విజయనగరంవిశాఖ జిల్లాల్లో ఏర్పాటు చేయాలని స్పష్టం చేశారు. వీటితో పాటు ఇతర విలువైన ఖనిజాలకు సంబంధించి వ్యాల్యూ చైన్ పరిశ్రమల్ని ఏర్పాటు చేసే ఆలోచన చేయాలన్నారు. ఈస్ట్ కోస్ట్ ఇండస్ట్రియల్ కారిడార్ ఏర్పాటులోనూ తీరప్రాంతంలో ఉన్న మూలపేట నుంచి దిగువున కృష్ణపట్నం వరకూ ప్రతిపాదన చేయాలన్నారు. కంటైనర్ మాన్యుఫాక్చరింగ్, ఎక్విప్మెంట్ మాన్యుఫాక్చరింగ్ ప్రాజెక్టులను త్వరితగతిన ఏర్పాటు చేసుకునేలా ప్రతిపాదనలు సమర్పించాలన్నారు. మెగాటెక్స్‌టైల్ పార్కును పలనాడు ప్రాంతంలోనూ, స్పోర్ట్ మాన్యుఫాక్చరింగ్ హబ్ తిరుపతిలో ఏర్పాటు చేసే అంశాన్ని పరిశీలించాలన్నారు. ఇండియా సెమికండక్టర్ మిషన్ 2.0 లో భాగంగా సెమీ కండక్టర్ డిజైన్ తదితర ప్రాజెక్టులను అమరావతిలో ఏర్పాటు చేసేలా కార్యాచరణ చేపట్టాలన్నారు. వీటితో పాటు రాజధాని ప్రాంతంలోని హెల్త్ సిటీలో బయోడిజైన్, మెడ్ టెక్ పార్క్, బయో ఫార్మా శక్తి మిషన్ లాంటి ఎకోసిస్టం వస్తుందన్నారు. మెడికల్ టూరిజం హీల్ ఇన్ ఏపీ అన్న విధానంలో అమరావతిలో ప్రాజెక్టులు >>2

# బంగ్లా ఎన్నికలు హింసాత్మకం

**ఢాకా, ఫిబ్రవరి 12:** ఏడాదిన్నర నుంచి తీవ్ర రాజకీయ సంక్షోభాన్ని ఎదుర్కొంటున్న బంగ్లాదేశ్ లో గురువారం సార్వత్రిక ఎన్నికల పోలింగ్ హింసాత్మక సంఘటనల మధ్య జరింగింది. ఈ 13వ సార్వత్రిక ఎన్నికల్లో బంగ్లాదేశ్ తాత్కాలిక ప్రభుత్వ ముఖ్య సలహాదారు మహ్మద్ యూనస్ తన ఓటు హక్కును వినియోగించుకున్నారు. దేశ రాజధాని ఢాకాలో ఆయన ఓటు వేశారు. ప్రజలు కొత్త ప్రభుత్వాన్ని ఎన్నుకుంటున్నారు. 2024 ఆగస్టులో విద్యార్థుల ఉద్యమంతో అవామీ లీగ్ నేతృత్వంలోని హసీనా ప్రభుత్వం పడిపోయింది. అప్పటి నుంచి బంగ్లాదేశ్ పాలనను మహమ్మద్ యూనస్ నేతృత్వంలోని తాత్కాలిక ప్రభుత్వం పర్యవేక్షిస్తూ వస్తున్నది. ఇప్పుడు ఈ ఎన్నికలతో ఢాకాలో కొత్త ప్రభుత్వం కొలువుదీరనుంది. మొత్తం 299 పార్లమెంటు స్థానాలకు జరుగుతున్న ఈ ఎన్నికల్లో వివిధ పార్టీలకు చెందిన 1,981 మంది అభ్యర్థులు బరిలో నిలిచారు. దాదాపు 12.7 కోట్ల మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. హసీనా నేతృత్వంలోని అవామీ లీగ్‌పై ప్రభుత్వం నిషేధం విధించడంతో ఈసారి ప్రధాన పోటీ బంగ్లాదేశ్ నేషనలిస్టు పార్టీ (బీఎన్‌పీ), షఫీకుర్ రెహమాన్ నేతృత్వంలోని జమాత్‌ఎఇస్లామీ కూటమి మధ్యే ఉంది. విద్యార్థుల ఉద్యమంలో కీలకపాత్ర పోషించిన నేషనల్ సిటిజన్ పార్టీ కూడా జమాతే కూటమిలో ఉంది. ఈ ఎన్నికలతోపాటు కీలక రాజ్యాంగ సంస్కరణలపైనా రిఫరెండం జరగనుంది. హసీనా నాయకత్వంలోని అవామీ లీగ్ పార్టీ లేకుండా ఎన్నికలు జరగడం ఇదే తొలిసారి. హసీనా ప్రస్తుతం భారత్‌లో ఆశ్రయం పొందుతున్నారు. హసీనా ప్రభుత్వం కుప్పకూలిన తర్వాత బంగ్లాదేశ్‌లో హిందువులు లక్ష్యంగా దాడులు జరుగుతున్నాయి. ఈ సార్వత్రిక ఎన్నికల్లో మతతత్వ పార్టీ జమాత్‌ఎఇస్లామీ నేతృత్వంలోని కూటమి అధికారంలోకి వస్తే మైనారిటీలపై దాడులు మరింతగా పెరిగే అవకాశం ఉందని హిందువులు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు.దేశవ్యాప్తంగా పలు పోలింగ్ కేంద్రాల వద్ద ఉద్రిక్త పరిస్థితులు నెలకొనగా, ఖుల్నా జిల్లాలో జరిగిన ఘర్షణలో బంగ్లాదేశ్ నేషనలిస్ట్ పార్టీ (బీఎన్‌పీ) నేత మొహిబుజ్జమాన్ కోచీ మరణించారు.ఈ ఘటనలతో దేశంలో శాంతిభద్రతల పరిస్థితిపై ఆందోళన వ్యక్తమవుతోంది. ఖుల్నాలోని అలియా మదరసా పోలింగ్ కేంద్రం వద్ద బీఎన్‌పీ, జమాత్ ఏఇస్లామీ మద్దతుదారుల మధ్య ఘర్షణజరిగింది. జమాత్‌తరపున ప్రచారం చేస్తున్న మదరసా ప్రిన్సిపాల్‌ను మొహిబుజ్జమాన్ కోచీ అడ్డుకునే ప్రయత్నంలో ఈ మరణం సంభవించింది.



ఢాకాలో ఓటు వేసిన మహ్మద్ యూనస్



# కార్మిక సమ్మె ప్రశాంతం

నిలిచిన ఉత్పత్తిరంగ కార్యకలాపాలు

**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 12:** కేంద్ర ప్రభుత్వం కొత్తగా తెచ్చిన లేబర్ కోడ్‌లు, ఇండో అమెరికా ట్రేడ్‌డీల్‌తో వ్యవసాయ రంగానికి తీరని నష్టం వాటిల్లుతోందని, ఎన్డీయే ప్రభుత్వం కార్పొరేట్‌శక్తులకే అనుకూలంగా వ్యవహరిస్తోందని పేర్కొంటూ దేశవ్యాప్తంగా 13 ట్రేడ్‌యూనియన్లు ఇచ్చిన నిరసన పిలుపు మేరకు ప్రశాంతంగా ముగిసింది. సుమారు 30 కోట్లమందికిపైగా రైతులు, కార్మికులు, ట్రేడ్‌యూనియన్ కార్యకర్తలు పాల్గొన్న ఈ సమ్మె ప్రశాంతంగానే >>2



# అంబటికి 14 రోజులు రిమాండ్

సంక్రాంతి లక్కీ డ్రా కేసు

**విజయవాడ.ఫిబ్రవరి 12,ప్రభాతవార్తప్రతినిధి:** సంక్రాంతి లక్కీ డ్రా కేసులో మాజీ మంత్రి, వైసీపీ సీనియర్ నేత అంబటి రాంబాబుకు గుంటూరు ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ కోర్టు ఆయనకు 14 రోజుల జ్యుడీషియల్ రిమాండ్ విధించింది.2023లో సత్తెనపల్లిలో సంక్రాంతి సంబరాల సందర్భంగా అంబటి లక్కీ డ్రా నిర్వహించారు. ఈ సందర్భంగా వాలంటీర్ల ద్వారా పింఛనుదారుల నుంచి రూ.200 చొప్పున అక్రమంగా వసూలు చేసి, వారికి బలవంతంగా లాటరీ టికెట్లు అంటగట్టారన్న ఆరోపణలున్నాయి. ఈ వ్యవహారంపై జనసేన పార్టీ గుంటూరు జిల్లా అధ్యక్షుడు గాదె వెంకటేశ్వరరావు కోర్టులో ఫిర్యాదు చేయడంతో పోలీసులు కేసు నమోదు చేశారు. ప్రస్తుతం మరో కేసులో రాజమండ్రి సెంట్రల్ జైలులో రిమాండ్ ఖైదీగా ఉన్న అంబటిని, పోలీసులు పీటీ వారెంట్‌పై ఇవాళ గుంటూరు కోర్టులో హాజరుపరిచారు. కేసు వివరాలను పరిశీలించిన న్యాయమూర్తి ఎం. కుముదిని, ఆయనకు 14 రోజుల రిమాండ్ విధిస్తూ ఆదేశాలు జారీ చేశారు.కోర్టు ఉత్తర్వుల నేపథ్యంలో అంబటిని తిరిగి రాజమండ్రి జైలుకు తరలించారు.

# యువతకు ఉద్యోగాలే లక్ష్యం

ఐదు కంపెనీల ద్వారా 65వేల మందికి ఉపాధి కల్పన

విశ్వసనీయత ఉన్న కంపెనీలకే రూ.99పైసలకు భూములు

ఎంఒయులు కుదుర్చుకొన్న కంపెనీలు చాలా ఉన్నాయి: మంత్రి లోకేష్

పరిశ్రమలకు భూకేటాయింపులపై మండలిలో వాడివేడి చర్చ



గురువారం శాసనమండలిలో బొత్స సత్యనారాయణ, మంత్రి లోకేష్

**విజయవాడ,ఫిబ్రవరి12,ప్రభాతవార్తప్రతినిధి:** యువతకు ఉద్యోగాలు కల్పించాలనే లక్ష్యంతో మేం పనిచేస్తున్నాం. ఏపీకి పరిశ్రమలు రాకూడదనే లక్ష్యంతో వైసీపీ ఉంది. విశ్వసనీయత ఉన్న కంపెనీలకే రూ.99 పైసలకు భూములు కేటాయించాం. ఐదు కంపెనీల ద్వారా 65వేల మందికి ఉద్యోగాలు రానున్నాయి. భూముల కేటాయింపుల్లో మేం ఎక్కడా లాలూచీ పడాల్సిన అవసరం లేదు. విమర్శించాలనుకుంటే కప్ టీ గురించి నన్ను విమర్శించవచ్చు. ఒక కప్పు కాఫీ కంటే నేను వారి వద్ద ఎక్కువ తీసుకుని ఉంటే నిరూపించాలి. అప్పుడు ఏ చర్యకైనా సిద్ధమని విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ పేర్కొన్నారు. పరిశ్రమలకు 99 పైసలకే భూ కేటాయింపులపై ప్రశ్నోత్తరాల సమయంలో మండలిలో వాడీవేడి చర్చ జరిగింది. వైసీపీ సభ్యుల ఆరోపణలకు మంత్రి ధీటుగా సమాధానం ఇచ్చారు. గత 20 నెలల కాలంలో పరిశ్రమలు, వాణిజ్య సంస్థలు, ఇతర సంస్థలకు 99 పైసలకు కేటాయించిన భూముల వివరాలు, కుదుర్చుకున్న ఎంవోయూలు, పరిశ్రమల వారీగా భూముల కేటాయింపులు, ధరల వివరాలపై శాసన మండలిలో వైసీపీ సభ్యులు తూమాటి మాధవరావు, వరుదు కల్యాణి, డా.పండుల రవీంద్రబాబు అడిగిన ప్రశ్నకు మంత్రి సమాధానం ఇచ్చారు. ఈ సందర్భంగా మంత్రి నారా లోకేష్ మాట్లాడుతూ రాష్ట్రంలో 5 కంపెనీలకు 99 పైసలకు భూమి కేటాయించాం. టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్, కాగ్నిజెంట్, ఏఎన్ఎస్ఆర్ గ్లోబల్, రహేజా, మదర్సన్ ఇంటర్నేషనల్ కంపెనీలకు 99 పైసలకే మొత్తం భూములు కేటాయించాం. ఏయే కంపెనీ ఎన్ని ఉద్యోగాలు కల్పించనుందో కూడా ప్రభుత్వ సమాధానంలో పొందుపర్చాం. కాగ్నిజెంట్ కు భూమి కేటాయించినప్పుడు 8వేల ఉద్యోగాలు కల్పిస్తామని చెప్పారు. కానీ భూమిపూజ సమయంలో 25వేల ఉద్యోగాలు కల్పిస్తామని చెప్పడం జరిగింది. ఎనర్జీ, ఇండస్ట్రీస్ అండ్ కామర్స్, ఐఎన్ఐ, ఐటీ అండ్ కామర్స్, ఏపీసీఆర్డీయే, టూరిజం, ఫుడ్ ప్రాసెసింగ్, మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ అండ్ అర్బన్ డెవలప్ మెంట్, టెక్స్ టైల్, ఎడ్యుకేషన్, హెల్త్ పాలసీల కింద ఆయా సంస్థలకు భూములు కేటాయించడం జరిగింది. ఐదు కంపెనీలకు మాత్రమే 99 >>2

# విద్యాసంస్థల్లో వసతుల ప్రతిపాదనలు

త్వరలో పనులు పూర్తి: మంత్రి లోకేశ్

**విజయవాడ, ఫిబ్రవరి 12 ప్రభాతవార్త ప్రతినిధి:** రాష్ట్రంలోని పలు విద్యాసంస్థల్లో వసతుల కోసం ఆర్థికశాఖ ప్రతిపాదనలు పంపామని త్వరలోనే పనులు పూర్తిచేస్తామని మంత్రి నారా లోకేశ్ తెలిపారు. శాసనసభ ప్రశ్నోత్తరాల సమయంలో పలువురు సభ్యులు అడిగిన ప్రశ్నలకు మంత్రులు సమాధానమిచ్చారు. పుట్టపర్తిలో ట్రిపుల్ ఐటీ ఏర్పాటు, పలు కళాశాలల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలని అక్కడి ఎమ్మెల్యే పల్లె సింధూరరెడ్డి కోరారు. దీనికి మంత్రి లోకేశ్ సమాధానమిస్తూ పుట్టపర్తిలో ట్రిపుల్ ఐటీ ప్రతిపాదన లేదని ఈ అంశాన్ని సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకెళ్తామని తెలిపారు. తిరుపతిలో భక్తుల రాక పెరిగినందున తాగునీరు మరింత అవసరమని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు కోరారు. గాలేరు నగరి, హంద్రీనీవా ప్రాజెక్టు ద్వారా నీరు అందించే విషయాన్ని పరిశీలించాలని ఆయన కోరారు. దీనికి మంత్రి నిమ్మల రామానాయుడు సమాధాన >>2

# విపక్షాల ప్రశ్నలకు సమాధానం చెప్పలేరా?



మీడియాతో కౌన్సిల్ విపక్షనేత బొత్స

**విజయవాడ,ఫిబ్రవరి 12,ప్రభాతవార్తప్రతినిధి:** శాసనమండలిలో ప్రతిపక్ష పార్టీ అడుగుతున్న ప్రశ్నలకు కనీస సమాధానం కూడా చెప్పలేని పరిస్థితుల్లో రాష్ట్ర ప్రభుత్వం ఉందని శాసనమండలి ప్రతిపక్ష నేత బొత్స సత్యనారాయణ ఆరోపించారు. కార్పొరేట్ సంస్థలకు 99 పైసలకే భూములు కేటాయిస్తున్న అంశంపై శాసనమండలిలో ప్రశ్నిస్తే ప్రభుత్వం నుంచి సరైన సమాధానం రాలేదన్నారు. అసెంబ్లీ ప్రాంగణంలో మీడియాతో మాట్లాడిన ఆయన, కీలక అంశాలపై ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగా స్పష్టత ఇవ్వకుండా తప్పించుకుంటోందని ఆరోపించారు.వైఎస్సార్ హయాంలోనే విశాఖపట్నంలో ఐటీ రంగాన్ని అభివృద్ధి చేశామని, అప్పుడే ఆదానీ డేటా సెంటర్ కూడా రాష్ట్రానికి వచ్చిందని గుర్తుచేశారు. అలాంటప్పుడు ఇప్పుడు కూటమి ప్రభుత్వం 99 పైసలకే భూములు ఇస్తామంటూ కంపెనీలకు లాలూచీ పడటం వెనుక ఏం ఉందో ప్రజలకు చెప్పాలని డిమాండ్ చేశారు. ముఖ్యమంత్రి కుటుంబ సభ్యులు వేల కోట్ల విలువైన భూములు కబ్జా చేశారన్న ఆరోపణలపై కూడా ప్రభుత్వం సమాధానం ఇవ్వలేదని అన్నారు.ఒకవైపు 5 వేల కోట్ల భూములున్నాయన్న విమర్శలు వస్తే, గీతం సంస్థ మాత్రం వెయ్యి కోట్ల భూములే తమ వద్ద ఉన్నాయని చెబుతోందని, అసలు నిజం ఏంటో ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని కోరారు. పెన్షన్ల అంశంపై ప్రశ్నిస్తే ప్రభుత్వం నుంచి సమాధానం లేదని, గవర్నర్ ప్రసంగం సందర్భంగా అధికారపార్టీ సభ్యులు డప్పులు కొట్టడం తప్ప ప్రజల సమస్యలపై మాట్లాడలేదని విమర్శించారు. ప్రతి ఒక్కరికీ తల్లికి వందనం కింద 15 వేల రూపాయలు ఇస్తామని ప్రకటించిన ప్రభుత్వం, వాస్తవంగా అందరికీ అందించిందా అని ప్రశ్నిస్తే మోనం వహించిందని >>2



# చట్టసభలపై చులకన వద్దు

సభ్యులకు సూచించిన అసెంబ్లీ స్పీకర్ అయ్యన్నపాత్రుడు

**విజయవాడ.ఫిబ్రవరి 12,ప్రభాతవార్తప్రతినిధి:** చట్టసభలంటే చులకన భావం కలగకూడదని ఏపీ స్పీకర్ అయ్యన్నపాత్రుడు శాసనసభలో వ్యాఖ్యానించారు. అసెంబ్లీ సమావేశాలు రెండవ రోజుకు చేరుకున్నాయి.ఈ క్రమంలో ఆంధ్రప్రదేశ్ 16వ శాసనసభ 5వ బడ్జెట్ సమావేశాల తొలిరోజే సభలో భావోద్వేగ వాతావరణం నెలకొనడం ఆవేదన కలిగించిందని స్పీకరు అన్నారు. నిన్న గవర్నర్ ప్రసంగం సమయంలో చోటుచేసుకున్న పరిణామాలపై స్పీకర్ అయ్యన్నపాత్రుడు మాట్లాడుతూ సభ్యుల ప్రవర్తన వల్ల సభా గౌరవం దెబ్బతింటోందని వ్యాఖ్యానించారు. యువతకు, విద్యార్థులకు చట్టసభల పనితీరుపై అవగాహన కల్పించాలనే సదుద్దేశంతో లోకేష్ మాక్ అసెంబ్లీ అనే కార్యక్రమాన్ని రూపొందించారు. ఈ కార్యక్రమానికి దేశవ్యాప్తంగా ఎంతో గుర్తింపు లభించిందని, ఇతర రాష్ట్రాల ప్రతినిధులు సైతం దీన్ని ప్రశంసించారని స్పీకర్ గుర్తుచేశారు. 'నిన్న గవర్నర్ >>2

## తెలుగు భాషపై ప్రత్యేక చర్చ జరపండి

స్పీకర్‌కు వినతిపత్రం ఇచ్చిన అధికార భాషా సంఘం అధ్యక్షుడు

**విజయవాడ.ఫిబ్రవరి 12,ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్ర శాసనసభ బడ్జెట్ సమా వేశాల సందర్భంగా ఒక రోజంతా తెలుగు భాషా అమలు తెలుగు భాషాభివృద్ధి అనే అంశంపై సభ్యులందరితో ప్రత్యేక చర్చ నిర్వహించాలని మం డలి వెంకటకృష్ణారావు అధికార భాషా సంఘం అధ్యక్షులు పి. త్రివిక్రమరావు (విక్రమ్‌పూల) కోరారు. గురువారం అసెంబ్లీలోని స్పీకర్ ఛాంబర్‌లో చింతకాయల అయ్యన్నపాత్రుడుని కలిసి ఆయన వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా త్రివిక్రమరావు మాట్లాడుతూ, ఆంధ్రప్రదేశ్ శాసనసభా పతిగా అయ్యన్నపాత్రుడు ఎంతో హుందగా, ప్రజాస్వామ్య విలువలతో సభను నడిపిస్తున్న తీరు ఒక నూతన అధ్యాయమని ప్రశంసించారు. తెలుగు భాషాభిమానిగా మాతృభాష పరిరక్షణకు ఆయన చేస్తున్న కృషి అనన్యసామాన్యమని కొనియాడారు. ఈ బడ్జెట్ సమావేశాల్లో ఒక రోజును తెలుగు భాషా అంశంపై చర్చకు కేటాయించి, సభలో సభ్యులు అందించే విలువైనసలహాలను పరిగణనలోకి తీసుకుని,వాటిని అమలుచేసేలా రాష్ట్ర >>2

13-2Pg2exHNWMJQE.qxd:13-2Pg2exHNWMJQE.qxd 1/1/02 6:55 AM Page 1




గురువారం తిరువూరు నియోజకవర్గ సమస్యలపై సిఎం చంద్రబాబుకు వినతి పత్రం అందిస్తున్న ఎమ్మెల్యే కొలికపూడి

# అన్ని సమస్యలను పరిష్కరించుకుందాం: సిఎం చంద్రబాబు

## సిఎంను కలిసిన తిరువూరు శాసనసభ్యుడు కొలికపూడి

**విజయవాడ.ఫిబ్రవరి 12,ప్రభాతవార్తప్రతినిధి:** సమస్యలపై మీ తపన,ఆందోళన నాకు తెలుసు, అన్నింటిని పరిష్కరించుకుందామని సీఎం చంద్రబాబు తిరువూరు ఎంఎల్ఏ కొలకపూడి శ్రీనివాసరావుతో వ్యాఖ్యానించారు.వివాదస్పద అంశాలకు దూరంగా ఉండండి. ఏ అంశమైన తన దృష్టికి తేవాలన్నారు. తిరువూరు నియోజకవర్గానికి సంబంధించిన పలు కీలక సమస్యలు, అభివృద్ధి అవసరాలపై ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సానుకూలంగా స్పందించి, త్వరలోనే అవసరమైన నిధులు మంజూరు చేస్తామని ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావుకు హామీ ఇచ్చారు. అసెంబ్లీ సమావేశం ముగిసిన అనంతరం ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుని కలిసి, తిరువూరు నియోజకవర్గంలో నెలకొన్న ప్రధాన సమస్యలను వివరించారు.ముఖ్యంగా గంపలగూడెం మండలం వినగడప కట్టలేరు వంతెన నిర్మాణానికి అవసరమైన నిధుల అంశాన్ని సీఎం దృష్టికి తీసుకువెళ్లారు. వంతెన నిర్మాణం పూర్తయితే తిరువూరు ప్రాంత ప్రజలకు రాకపోకలు మరింత సులభమవుతాయని, వ్యవసాయ ఉత్పత్తుల రవాణాకు, విద్యార్థుల ప్రయా ణాలకు, అత్యవసర సేవలకు కీలకంగా మారుతుందని ఎమ్మెల్యే వివరించారు. అలాగే నియోజకవర్గంలో రహదారులు, తాగునీరు, సాగునీరు, ఇతర మౌలిక వసతులకు సంబంధించిన అంశాలను కూడా సమగ్రంగా వివరించారు. ఈ అంశాలపై స్పందించిన ముఖ్యమంత్రి, తిరువూరు నియోజకవర్గ అభివృద్ధికి ప్రభుత్వం పూర్తి ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. వినగడప కట్టలేరు వంతెనతో పాటు ఇతర అభివృద్ధి పనులకు అవసరమైన నిధులు త్వరలో మంజూరు చేస్తామని స్పష్టం చేశారు. ప్రజల సమస్యలు దశలవారీగా పరిష్కరించి, నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని సీఎం భరోసా ఇచ్చారు.

# యువతకు ఉద్యోగాలే లక్ష్యం

>> పైసలకు భూములు కేటాయించాం.

**పరిశ్రమలకు భూములు కేటాయింపుపై వాడీవేడి చర్చ..**

విశాఖలో కోట్లాది రూపాయల విలువైన భూములను 99 పైసలకే ప్రైవేటు సంస్థలకు, రియల్ ఎస్టేట్ కంపెనీలకు ఎలా కేటాయిస్తారంటూ వైసీపీ పక్ష నేత బొత్స సత్యనారాయణ, ఇతర వైసీపీ సభ్యులు మాధవరావు, వరుదు కల్యాణి ప్రశ్నించారు. దీనిపై మంత్రి నారా లోకేష్ ధీటుగా సమాధానం ఇచ్చారు. మంత్రి స్పందిస్తూ.. హైదరాబాద్ లో రహేజా మైండ్ స్పేస్ కు ఆనాడు 97 ఎకరాలను చంద్రబాబు గారు కేటాయించారు. వారు 21 బిల్డింగ్ ల ద్వారా 10వేల మిలియన్ స్క్వేర్ ఫీట్ నిర్మాణం చేశారు. నేడు ఒక్క మైండ్ స్పేస్ లోనే ఐటీ రంగంలో లక్ష మంది పనిచేస్తున్నారు. అనేక ప్రముఖ కంపెనీలు అక్కడ కొలువుదీరాయి. రహేజా, ఏఎన్ఎస్ఆర్ సంస్థలు జీసీసీలకు అవసరమైన భవనాలు నిర్మించి అద్దెకు ఇవ్వడం జరుగుతుంది. వారు ఎకోసిస్టమ్ ను అభివృద్ధి చేస్తారు. వారికి పారదర్శకంగా భూములు కేటాయించాం. బెంగళూరులో ఏఎన్ ఎస్ఆర్ సంస్థ నిర్మించిన జీసీసీ సెంటర్ ను నేను స్వయంగా చూశా. ఈ ఒక్క కంపెనీ 150 జీసీసీలను నిర్మించడం జరిగింది. సుమారు లక్షా 40వేల మంది ఆయా జీసీసీల్లో పనిచేస్తున్నారు. భూముల కేటాయింపు విషయంలో ప్రతి కంపెనీని అధికారుల కమిటీ, ఎస్ఐపీబీ, మంత్రుల సంఘం క్షుణ్ణంగా సమీక్షి ంచడం జరుగుతుంది. అనంతరం కేబినెట్ ఆమోదంతో భూములను కేటా యించడం జరుగుతుందన్నారు.గతంలో 99 పైసలకే వేరే కంపెనీకి భూమి ఇచ్చారని ఆరోపించారు. నిరూపిస్తే రాజీనామా చేస్తానని సవాల్ చేస్తే పారిపోయారు. క్రెడిబులిటీ ఉన్న కంపెనీలకే 99 పైసలకు భూములు ఇస్తున్నాం తప్పే ఆయారాం గయారాం కంపెనీలకు ఇచ్చేందుకు మేం సిద్ధంగా లేం. అంతకుముందు వైసీపీ సభ్యుల తీరును మంత్రి అచ్చెన్నాయుడు తప్పుబట్టారు. పరిశ్రమ లకు భూముల కేటాయింపులపై చర్చకు సిద్ధమని, ప్రశ్నోత్తరాలు గంటలోనే ముగించాలని నిర్ణయం తీసుకున్నందున బీఏసీలో చర్చించి ఈ అంశంపై లఘు చర్చ చేపట్టాలని చెప్పారు. ప్రశ్నకు సంబంధం లేనివి అడగడం వల్ల సమయం వృధా అవుతోందన్నారు.

**భూముల కేటాయింపు విషయంలో వైసీపీ పిల్‌పై కోర్టు మొట్టికాయలు వేసింది:** మంత్రి లోకేష్ సమాధానం సమాధానం పట్ల వైసీపీ సభ్యులు అభ్యంతరం లేవనెత్తారు. దీనిపై మంత్రి స్పందిస్తూ.. టీసీఎస్, కాగ్నిజెంట్, మదర్సన్, రహేజా, ఏఎన్ఎస్ఆర్ సంస్థలకు భూములు ఇవ్వకూడదా అంటూ ప్రశ్నించారు. భూముల కేటాయింపుపై వైసీపీనే కోర్టులో పిల్ వేయించారని, కోర్టు కూడా మొట్టికాయలు వేసిందన్నారు. విశాఖలో రహేజా రియల్ ఎస్టేట్ సంస్థకు 99 పైసలకే 27.1 ఎకరాలను ఎలా కేటాయిస్తారని వైసీపీ సభ్యులు మాధవరావు, వరుదు కల్యాణి ప్రశ్నించారు. అడ్రస్ లేని ఉర్సా కంపెనీకి 99 పైసలకే భూములు కట్టబెట్టాలని ప్రయత్నించారని ఆరోపించారు. వైసీపీ సభ్యుల ఆరోపణలను మంత్రి లోకేష్ ధీటుగా తిప్పికొట్టారు. తాము 5 కంపెనీలకే 99 పైసలకు భూములు కేటాయించామని, ఆరో కంపెనీ పేరు ప్రస్తావించినందున ఆధారాలు బయట పెట్టాలని, ఆరోపణలు చేసి బయటకు వెళ్లడం కాదని సవాల్ చేశారు. లేనిపక్షంలో తమ ప్రకటనను ఉపసంహరించుకోవాలని మంత్రి లోకేష్ పట్టుబట్టారు. ఉర్సాకు తాము ఎలాంటి భూములు కేటాయించలేదని మరోసారి స్పష్టం చేశారు. మంత్రి అచ్చెన్నాయుడు స్పందిస్తూ.. యువతకు ఉద్యోగాలు కల్పించేందుకే పరిశ్రమలకు తక్కువ రేటుకు భూములు ఇస్తున్నామని చెప్పారు. ఉర్సా విషయంలో వైసీపీ సభ్యుల ఆరోపణలను నిరూపించాలని సవాల్ చేశారు.

**లెక్కల్లోకి వెళితే 151 కాస్తా 11 అయ్యాయి:** వైసీపీ సభ్యుల అరుపులు నేపథ్యంలో మంత్రి లోకేష్ కలుగచేసుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. వైసీపీ సభ్యులు వినేందుకు ఓపిక పడితే సమాధానం చెప్పేందుకు సిద్ధంగా ఉన్నాం. వైసీపీ సభ్యులు ఎందుకు అరుస్తున్నారు. సమాధానం చెప్పాలా, వద్దా? నేడు దేశానికి వస్తున్న రూ.100 పెట్టుబడుల్లో 25.3 రూపాయలు ఏపీకి వస్తున్నాయన్నారు. వైసీపీ సభ్యులు అరుపులపై స్పందిస్తూ.. లెక్కల్లోకి వెళితే 151 కాస్తా 11 అయ్యాయి. టీం 11 తయారైంది. దీనిపైనా చర్చిద్దామా? 2014 నుంచి 2019 వరకు వైసీపీ ప్రభుత్వం ఏ విధంగా వ్యవహరించిందో చూశాం. రాష్ట్రంలో ఆర్థిక ఉగ్రవాదం నడిచింది. అమర్ రాజాను రాష్ట్రం నుంచి తరిమేశారు. ఆర్సెల్లార్ మిట్టల్ ఎక్కడికీ వెళ్లలేదు. వైసీపీ సభ్యులు వాస్తవాలు తెలుసుకోకుండా మాట్లాడటం సరికాదు. 50వేల ఐటీ ఉద్యోగాలు రావడం వల్ల సిటీలో డైరెక్ట్ గా సుమారు బిలియన్ డాలర్లు ప్రతి ఏడాది ఆ ఎకానమీకి వస్తుంది. మా లక్ష్యం 5 లక్షల ఐటీ ఉద్యోగాలు. తద్వారా 10 బిలియన్ డాలర్ల మేర ఎకనామిక్ యాక్టివిటీస్ విశాఖలో జరగాలనేది మా లక్ష్యం.

**భూముల కేటాయింపుల విషయంలో కప్ టీ గురించి నన్ను విమర్శించవచ్చు:**

వైసీపీ సభ్యులు ఎందుకు వాకౌట్ చేశారో అర్థం కాలేదు. బొత్స గారికి అదొక ఫ్యాషన్. ఈ తలుపు నుంచి వచ్చి ఆ తలుపు నుంచి వెళతారు. మేం చాలా పారదర్శకంగా భూ కేటాయింపులు చేశాం. వారి దగ్గర నుంచి ఏం తీసుకున్నారని ఆరోపించారు. నన్ను విమర్శించాలనుకుంటే ఒక్క విషయంలో విమర్శించవచ్చు. నేను బాంబే హౌస్‌కు వెళ్లాను. టాటా సన్స్ ఛైర్మన్ చంద్ర గారు ఒకసారి కలవాలని చెప్పారు. నేను బాంబే హౌస్ కు వెళ్లాను. బాంబే హౌస్ లో కప్ టీ ఇచ్చారు. నన్ను విమర్శించాలనుకంటే కప్ టీ గురించి విమర్శించవచ్చు. నో ప్రాబ్లమ్. కాగ్నిజెంట్ విషయంలో కూడా నన్ను విమర్శించవచ్చు. వాళ్లు నాకు ఓ కప్ కేక్ ఇచ్చారు. దావోస్ లో వారి ఆఫీసుకు వెళ్లినప్పుడు ఆ రోజు నా పుట్టినరోజు. వారు మర్యాదపూర్వకంగా కప్ కేక్ లో క్యాండిల్ పెట్టి నాతో బ్లో చేయించారు. సింపుల్. అంతేగానీ ఆధారాలు లేకుండా ఆరోపణలు చేస్తున్నారు. ఉద్యోగాలు కల్పించాలనేది మా లక్ష్యం. మేం ఎక్కడా లాలూటీ పడాల్సిన అవసరం లేదు.

ఒక్క కియా పరిశ్రమ వల్ల ఆ ప్రాంత రూపురేఖలు మారాయి. క్లస్టర్ విధానంలో మేం ముందుకు వెళ్తున్నాం. మేం ప్రతి పరిశ్రమను గ్రౌండింగ్ చేస్తాం. 20 లక్షల ఉద్యోగాలు కల్పిస్తాం. ఒక కప్పు కాఫీ కంటే నేను వారి వద్ద ఎక్కువ తీసుకుని ఉంటే నిరూపించాలి. అప్పుడు ఏ చర్యకైనా నేను సిద్ధమని సవాల్ చేశారు. వైసీపీ సభ్యులు ఆరోపణలు చేసి పారిపోవడం సరికాదని చెప్పారు.


గురువారం డిసిఎం పవన్‌ను కలిసిన ఎమ్మెల్యే బాలకృష్ణ, ఎమ్మెల్సీ నాగబాబు, గిద్దలూరు ఎమ్మెల్యే అశోక్ రెడ్డి

# డిసిఎం పవన్‌ను కలిసిన ఎమ్మెల్యే బాలకృష్ణ

**విజయవాడ.ఫిబ్రవరి 12,ప్రభాతవార్తప్రతినిధి:** డిప్యూటీ సీఎం పేషీలో పవన్‌కల్యాణ్‌తో భేటీ బాలకృష్ణ అయ్యారు.అసెంబ్లీలో నందమూరి బాలకృష్ణ, పవన్‌కల్యాణ్ ఆత్మీయంగా పలుకరించుకున్నారు.తమ్ముడు పంచాయతీ రాజ్వ్య వస్థలో మంచి మార్పులు తెస్తున్నావంటూ పవన్ అభినందించారు. పవన్‌కల్యాణ్‌ను ఆయనను తన ఛాంబర్‌లోకి తీసుకొనివెళ్ళారు.ఈ సం దర్భంగాబాలకృష్ణ హిందూపురం ప్రజాసమస్యలపై పవన్‌కల్యాణ్‌తో చర్చలు జరిపారు. హిందుపురంలో గ్రామీణాభివృద్ధికి సహకరించాలని పవన్‌ను కోరారు.తన నియోజ కవర్గంలో పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి పనులకు సంబంధించి పలు అంశాలను వివరిస్తూ వినతి పత్రం అందజేసారు.గిద్దలూరు నియోజకవర్గ సమస్యలపై పవన్‌కు వినతిపత్రం ఇచ్చిన ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి పవన్‌కల్యాణ్‌ను ఆయన సోదరుడు, ఎమ్మెల్సీ నాగబాబు కలుసుకున్నారు.

# మండలికి ఓకే

>> అసెంబ్లీ సమావేశాలకు హాజరు కాకుండా దూరంగా ఉండాలని జగన్ నిర్ణయించారు. అయితే అసెంబ్లీలో మాత్రమే విపక్ష హోదా ఇవ్వడం లేదు కాబట్టి ఎప్పటిలాగే ఈసారి కూడా శాసనసభకు మాత్రమే ఎమ్మెల్యేలు హాజరుకాకూడదని నిర్ణయించారు. దీంతో మండలికి మాత్రం వైఎస్సార్సీపీ ఎమ్మెల్సీలు హాజరుకాబోతున్నారు. ఈ సందర్భంగా శాసనమండలిలో గట్టిగా పోరాడాలని ఎమ్మెల్సీలకు జగన్ దిశానిర్దేశం చేశారు.కూటమి ప్రభుత్వం స్కామ్‌ల మయంగా మారిందని, ఎక్కడికక్కడ యథేచ్ఛగా దోపిడి చేస్తున్నారని జగన్ వారికి తెలిపారు. రూ.5 వేల కోట్ల విలువైన భూమి 54 ఎకరాలు గీతమ్ వర్సిటీకి ఇచ్చేశారని, ఏ ముఖ్యమంత్రీ తన సొంత బంధువులకు ఎవరూ ఇలా ఇచ్చుకోలేదన్నారు. ఇప్పుడు ఈ ప్రభుత్వంలో కొత్త నినాదం వినిపిస్తోందని, అదే క్యాష్.. సూట్‌కేసు.. రాజేష్.. లోకేష్. అన్నారు. ఈ అంశాలన్నింటిపైనా సభలో గట్టిగా గొంతు వినిపించాలని ఎమ్మెల్సీలకు సూచించారు. కళ్లు మూసి తెరిచేలోపు మూడేళ్లు గడుస్తాయని, వచ్చేది మన ప్రభుత్వమేనన్నారు. ఇప్పుడు కష్టపడి పని చేస్తున్న వారందరికీ, తగిన గుర్తింపు ఉంటుందన్నారు. పనితీరు ఆధారంగా మీకు మీ పదవులు తిరిగి వస్తాయి కూడా అన్నారు. అలాగే ఇంతకన్నా మంచి పదవులు కూడా దక్కే అవకాశం మీకు ఉందన్నారు.

# కేంద్రం నుంచి మరిన్ని నిధులు

>> చేపట్టాలన్నారు. హిందుపురంలో ఎలక్ట్రానిక్స్ కాంపోనెంట్స్ తయారీని ప్రతిపాదించాలన్నారు. తిరుపతిని టూరిజం డెస్టినేషన్ కింద అభివృద్ధి చేసేందుకు అవకాశం ఉందని తెలిపారు. కేంద్రం మంజూరు చేసిన 1000 ఎలక్ట్రిక్ బస్సులను సద్వినియోగం చేసుకుని మరిన్ని ఇబస్సులను సాధించేలా ప్రణాళిక చేయాలన్నారు. కొబ్బరి, కోకో, కాజు, కాఫీ పంటలకు ఎక్కువ నిధులను సాధించుకునే అవకాశం ఉందని అన్నారు. ఫుడ్ ప్రాసెసింగ్ ప్రాజెక్టులను కూడా రాష్ట్రంలో పెద్ద ఎత్తున ఏర్పాటు చేసేందుకు ఆస్కారం ఉందన్నారు.


గురువారం న్యూఢిల్లీలో రైల్వే మంత్రి అశ్వని వైష్ణవ్‌కు వినతిపత్రం అందచేస్తున్న మంత్రి రాంప్రసాద్ రెడ్డి

# బెంగళూరు- కడప రైల్వే మార్గం ఏర్పాటు చేయండి

## కేంద్ర మంత్రిని కోరిన రాష్ట్ర మంత్రి రాంప్రసాద్ రెడ్డి

## సానుకూలంగా స్పందించిన అశ్విని వైష్ణవ్

## మంత్రి వెంట ఎంపి పురందేశ్వరి, సాయి లోకేష్

**విజయవాడ, ఫిబ్రవరి 12 ప్రభాతవార్త ప్రతినిధి:** బెంగళూరు నుంచి కడప వరకు కొత్త రైల్వే మార్గం ఏర్పాటు చేయాలంటూ రాష్ట్ర రవాణా, యువజన, క్రీడాశాఖల మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్‌తో ఢిల్లీలో సమావేశమై కోరారు. ఈ భేటీలో ఎంపి పురందేశ్వరి, అన్నమయ్య జిల్లా బిజెపి అధ్యక్షుడు సాయి లోకేష్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా బెంగళూరు-కడప రైల్వే మార్గం ఏర్పాటు చేస్తే రాయలసీమ ప్రాంతానికి రవాణా సౌకర్యాలు మెరుగుపడటంతో పాటు ఆర్థిక, పారిశ్రామిక అభివృద్ధికి దోహదపడుతుందని కేంద్ర మంత్రికి వివరించారు. రాయలసీమ ప్రాంత అభివృద్ధి సీఎం చంద్రబాబు నాయుడు సారథ్యంలోనే సాధ్యం అని మంత్రి రాంప్రసాద్ రెడ్డి తెలిపారు. ప్రాంత ప్రజల దీర్ఘకాలిక ఆకాంక్ష అయిన ఈ రైల్వే మార్గాన్ని త్వరితగతిన మంజూరు చేయాలని కోరగా కేంద్ర మంత్రి సానుకూలంగా స్పందించారు.

**కడప విమానాశ్రయం నుంచి విమాన సేవల విస్తరణపైనా:** కడప విమానాశ్రయం నుంచి దేశంలోని వివిధ ప్రాంతాలకు విమానాల సేవలను పెంపొందించాలని కోరుతూ రాష్ట్ర రవాణా, యువజన, క్రీడాశాఖల మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి ఢిల్లీలో కేంద్ర విమానయాన శాఖ మంత్రి కింజరపు రామ్మోహన్ నాయుడుని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సారథ్యంలో రాష్ట్ర అభివృద్ధి లక్ష్యంగా ముందుకుసాగుతున్న క్రమంలో, కడప విమానాశ్రయం ద్వారా కడప జిల్లాకు మెరుగైన విమాన కనెక్టివిటీ కల్పిస్తే రాయలసీమ ప్రాంత అభివృద్ధికి, వ్యాపార, పర్యాటక రంగాల పురోగతికి దోహదపడుతుందని మంత్రి రాంప్రసాద్ రెడ్డి కేంద్ర మంత్రికి వివరించారు.

**ఎపిని క్రీడా హబ్‌గా తీర్చిదిద్దటమే లక్ష్యం**

ఢిల్లీ పర్యటనలో ఉన్న రాష్ట్ర రవాణా, యువజన, క్రీడాశాఖల మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి జాతీయ యువజన వ్యవహారాలు, ఎస్ఏఐ జాయింట్ సెక్రెటరీ వినీల్ కృష్ణతో జవహర్ లాల్ నెహ్రూ స్టేడియంలో సమావేశమయ్యారు. ఈ సమావేశంలో రాయచోటి నియోజకవర్గంలో క్రీడల అభివృద్ధికి అవసరమైన నిధులు, ఖేలో ఇండియా పథకం కింద ప్రతిపాదనల ఆమోదం, అలాగే ఆంధ్రప్రదేశ్‌ను దేశంలోనే అగ్రశ్రేణి క్రీడా హబ్‌గా తీర్చిదిద్దే లక్ష్యంతో రాష్ట్రవ్యాప్తంగా క్రీడా మౌలిక సదుపాయాల అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం తరపున రాష్ట్ర ప్రభుత్వానికి అదనపు నిధుల మంజూరు అంశాలపై సుదీర్ఘంగా చర్చించారు.

# వైకాంగ్రెస్ పాలనలో విశాఖకు ఒక్క కంపెనీ అయినా తెచ్చారా? : మంత్రి లోకేశ్

**విజయవాడ ఫిబ్రవరి 12 ప్రభాతవార్త ప్రతినిది:** రాష్ట్రానికి పెట్టుబడులు రాకూడదని వైకాపా కుట్రలు చేసిందని మంత్రి నారా లోకేశ్ విమర్శించారు. పరిశ్రమలకు భూ కేటాయింపులపై శాసన మండలిలో వాడీవేడి చర్చ జరిగింది. కంపెనీల పేరిట రియల్ ఎస్టేట్ సంస్థలకు అప్పనంగా భూములను కట్టబెట్టారంటూ వైకాపా సభ్యులు చేసిన ఆరోపణలను లోకేశ్ తిప్పికొట్టారు. క్రెడిబులిటీ ఉన్న ఐదు సంస్థలకే 99 పైసల చొప్పున భూములు కేటాయించామని, ఆధారాలు లేకుండా విమర్శలు చేస్తే సహించబోమని లోకేశ్ చెప్పారు. ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాల వల్ల 18 నెలల్లో రాష్ట్రానికి భారీగా పెట్టుబడులు వచ్చాయన్నారు. ఆర్సెలార్ మిత్తల్ ప్రాజెక్ట్ ఉత్తరాంధ్రకు రానుందని దీనికి భూములు కేటాయించామని మంత్రి లోకేశ్ అన్నారు. టీసీఎస్, కాగ్నిజెంట్ వంటి సంస్థలకు భూములు ఇవ్వడం తప్పా? అని నిలదీశారు. వైకాపా పాలనలో విశాఖకు కనీసం ఒక్క కంపెనీ అయినా తీసుకొచ్చారా అని ప్రశ్నించారు.

# కార్మిక సమ్మె ప్రశాంతం

>> ముగిసింది. ఇండో అమెరికా ట్రేడ్‌డీల్‌లో రైతులు, చిన్న వ్యాపారాలు, కార్మికుల హక్కులు, శ్రేయస్సును కాలరాచేదిగా ఉందని నాయకులు ఆరోపించారు. పార్లమెంటులో కూడా ప్రజాప్రతినిధులు, విపక్ష ఎంపిలు ప్రభుత్వం వెంటనే ఈ డీల్‌ను రద్దుచేసి ప్రధాని నరేంద్రమోడీ ట్రంప్‌నకు లొంగిపోయారంటూ నినాదాలుచేసారు. ఒకరోజు సమ్మెకారణంగా ఉత్పత్తిరంగ కార్యకలాపాలు కుంటుపడ్డాయి. మోడీ చేపట్టిన సంస్కరణల అజెండాను కార్మికులు తీవ్రంగా వ్యతిరేకించారు. ఈ ఏడాదిలో జరిగే అసెంబ్లీ ఎన్నికలను దృష్టిలో ఉంచుకునే ఎన్డీయే సర్కారు పనిచేస్తోందని ఆరోపించారు. రైతు నేత హన్స్ మొల్లామాట్లాడుతూ ఇటీవల ట్రేడ్ ఒప్పందాలు న్యూజిలాండ్, యూరోప్, అమెరికాలతో జరిగిన ఒప్పందాలు భారత్‌లోని వ్యవసాయ రంగాన్ని దెబ్బతీస్తుందని, స్థానిక మార్కెట్లలోకి అమెరికా ఉత్పత్తులు ఇకపై వెల్లువలా వచ్చిపడతాయని, దీనివల్ల దేశీయ ఉత్పత్తులకు గండం ఏర్పడుతుందని ఆరోపించారు. అమెరికాతో జరిగిన ఒప్పందం వల్ల భారత్‌లోనిసన్నచిన్నకారు రైతుల జీవనోపాధి దెబ్బతింటుందని పేర్కొన్నారు. అమెరికా కారుచౌక వనయవసాయ ఉత్పత్తుల భారత్‌లోకి డంప్‌చేస్తారని, వీటివల్ల చిన్న వ్యాపారాలు, చిరువ్యాపారులకు తీరనినష్టం ఏర్పడుటుందని ఆలిండియా ట్రేడ్‌యూనియన్ కాంగ్రెస్ నేత అమర్‌జీత్‌కౌర్ విమర్శించారు. దేశవ్యాప్తంగా కూడా కీలక రాష్ట్రాల్లో ఈసమ్మె కొనసాగింది. ఆటోకార్మికులు కూడా రోడ్లపైకి వచ్చి క్యాబ్‌లు, ఆటోలను నిలిపివేసారు. కొన్ని చోట్లప్రభుత్వ పరిధిలోని ఆర్టీసీ సర్వీసులు మధ్యాహ్నం వరకూ నిలిచిపోయాయి. తదనంతరం తగుమాత్రంలోనే సర్వీసులను నడపాల్సి వచ్చింది. దేశవ్యాప్తంగా ఎక్కడా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోలేదు.

# విద్యాసంస్థల్లో వసతుల ప్రతిపాదనలు

>> మిచ్చారు. పెరుగుతున్న జనాభా అవసరాలకు తగినట్లు నీటిసరఫరాలను పెంచుతామని చెప్పారు. బొబ్బిలి నియోజకవర్గంలో లోచర్ల శివదావలస ఎత్తిపోతల పథకంపై ఎమ్మెల్యే బేబినాయన ప్రశ్నించగా వైకాపా హయాంలో టెంబర్లు రద్దు చేసి పనులు నిలిపివేశారని మంత్రి రామానాయుడు తెలిపారు. గిరిజన ప్రాంతాల్లో ఉద్యోగుల బదిలీపై పోలవరం ఎమ్మెల్యే బాలరాజు ప్రశ్నించారు. దీనికి మంత్రి సంధ్యారాణి సమాధానం చెప్పారు. వైకాపా ప్రభుత్వం హయాంలో కోర్టు కేసుల పరిష్కారానికి చొరవ తీసుకోనందువల్ల సమస్యలు వచ్చాయన్నారు. దీనిపై చర్యలు తీసుకుంటామని చెప్పారు.

# భారత ఆర్థిక వ్యవస్థకు బడ్జెట్ ఊతం

## రాజ్యసభలో ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్

**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 12:** పెరుగుతున్న వృద్ధి, తక్కువ ద్రవ్యోల్బణం కలిసి సాధించబడుతున్న భారత ఆర్థిక వ్యవస్థకు 2026-27 కేంద్ర బడ్జెట్ ఊతమిస్తుందని ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ అన్నారు. గురువారం రాజ్యసభలో విత్త మంత్రి మాట్లాడుతూ, ఇదొక 'గోల్డిలాక్స్ మూమెంట్' ఇది అవకాశం కాదు, నిరంతర ప్రయత్నం, జాగ్రత్తగా ప్రణాళిక, సకాలంలో విధాన చర్య ఫలితంగా ఉందని అన్నారు. "జాతీయ గణాంక కార్యాలయం విడుదల చేసిన మొదటి ముందస్తు అంచనాల ప్రకారం, భారతదేశ వాస్తవ జిడిపి వృద్ధి 2025-26 సంవత్సరానికి 7.4 శాతంగా అంచనా వేయబడింది, అయితే నామమాత్రపు వృద్ధి దాదాపు 8 శాతంగా అంచనా వేయబడింది" అని ఆర్థిక మంత్రి పేర్కొన్నారు. "అదే సమయంలో, వినియోగదారుల ధరల ద్రవ్యోల్బణం దాదాపు 2 శాతానికి తగ్గిపోయింది. నియంత్రణలో ఉంది" అని ఆమె పేర్కొన్నారు. ఆత్మనిర్భర్ భారత్ ప్రభుత్వ ఆర్థిక వ్యూహంలో ఒక ప్రధాన సూత్రంగా మిగిలిపోయిందని ఆర్థిక మంత్రి సీతారామన్ పునరుద్ఘాటించారు. "బడ్జెట్ దేశీయ ఉత్పాదక సామర్థ్యాన్ని పెంపొందించడం, ఇంధన భద్రతను నిర్ధారించడంపై దృష్టి పెడుతుంది, అదే సమయంలో పౌరులు వారి స్వంత జీవితాలలో స్వావలంబన చెందడానికి కూడా సహాయపడుతుంది" అని ఆర్థిక మంత్రి సీతారామన్ వివరించారు. "జీవన సౌలభ్యాన్ని మెరుగుపరచడం, ఉపాధిని సృష్టించడం, వ్యవసాయ ఉత్పాదకతను పెంచడం, గృహ కొనుగోలు శక్తిని పెంచడం లక్ష్యంగా ఉన్న చర్యలు ఈ విధానంలో భాగం" అని కేంద్ర మంత్రి పేర్కొన్నారు. మానవ మూలధనాన్ని అభివృద్ధి చేయడానికి చర్యలను వివరిస్తూ, రాబోయే ఐదు సంవత్సరాలలో ఒక లక్ష అనుబంధ ఆరోగ్య నిపుణులను సృష్టించాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుందని ఆర్థిక మంత్రి అన్నారు. "ప్రస్తుత సంవత్సరంలో దీని కోసం రూ.1,000 కోట్లు వెచ్చిస్తాం. ఈ చర్య ఉద్యోగాలను సృష్టించడమే కాకుండా ఆరోగ్య సేవలను బలోపేతం చేస్తుంది. వైద్య పర్యాటక వృద్ధికి తోడ్పడుతుంది" అని మంత్రి పేర్కొన్నారు. ఉన్నత స్థాయి విద్య నుండి ఉపాధి, సంస్థ స్టాండింగ్ కమిటీని ఏర్పాటు చేస్తున్నట్లు ఆర్థిక మంత్రి సీతారామన్ ప్రకటించారు. 2047 నాటికి ప్రపంచ సేవల మార్కెట్‌లో 10 శాతం వాటాను ఆక్రమించాలనే లక్ష్యంతో, సేవల రంగానికి భారతదేశ యువతను సిద్ధం చేయడంపై ఈ కమిటీ దృష్టి సారిస్తుందని వివరించారు.

# ప్రత్యేక చర్చ జరపండి

>> ప్రభుత్వానికి నివేదించాలని ఆయన స్పీకర్‌ను కోరారు. అదేవిధంగా, మీ నేతృత్వంలో సాగే సభా కార్యక్రమాల్లో ప్రతి సభ్యుడూ తప్పనిసరిగా తెలుగు మాట్లాడేలా స్థిర నిర్ణయం తీసుకోవాలని కోరారు.

# చట్టసభలపై చులకన వద్దు

>> ప్రసంగిస్తున్నప్పుడు సభలో జరిగిన దృశ్యాలు నన్ను కలచివేశాయి. సభ్యులు నినాదాలు చేస్తూ, కాగితాలు చింపి వేయడం వంటి చర్యలు అత్యంత బాధాకరం' అని స్పీకర్ అన్నారు. వేలాది మంది పోటీ పడితే కేవలం 175 మందికి మాత్రమే దక్కే అరుదైన గౌరవం ఈ సభలో సభ్యులుగా ఉండటం అని, ఆ గౌరవాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని ఆయన గుర్తుచేశారు. రాష్ట్రవ్యాప్తంగా దాదాపు 200లకు పైగా విద్యాసంస్థల నుండి విద్యార్థులు అసెంబ్లీని చూసేందుకు ఆసక్తి చూపుతున్నారని స్పీకర్ తెలిపారు. "మనం చేసే పనులను చూసి ఆ పసిపిల్లలు ఏం నేర్చుకుంటారు? చట్టసభలంటే వారికి చులకన భావం ఏర్పడితే దాన్ని మనం మళ్ళీ మార్చలేము" అని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. సభా గౌరవాన్ని పెంచలేకపోయినా పర్వాలేదు కానీ, దిగజార్చే హక్కు మాత్రం ఎవరికీ లేదని స్పీకర్ స్పష్టం చేశారు. ప్రజలు మన ప్రతి కదలికను గమనిస్తున్నారని, సభ్యులందరూ ఆత్మవిమర్శ చేసుకోవాలని కోరుతూ స్పీకర్ తన ప్రసంగాన్ని ముగించారు.

# విపక్షాల ప్రశ్నలకు సమాధానం చెప్పలేరా?

>> చెప్పారు. తల్లికి వందనం డబ్బులు పూర్తిగా తల్లుల ఖాతాల్లో జమ కాలేదని, చాలా మంది ఖాతాల్లో ఏడెనిమిది వేల రూపాయలే వచ్చాయని పేర్కొన్నారు. తాము చెప్పిన విషయాలు అవాస్తవమని ప్రభుత్వం నిరూపిస్తే తమ వ్యాఖ్యలను వెనక్కి తీసుకుంటామని స్పష్టం చేశారు. 15 సంవత్సరాల పాటు తాను కూడా మంత్రిగా పనిచేశానని, వివరాలు లేకుండా ఏ అంశాన్నీ ప్రతిపక్షం ప్రశ్నించదని అన్నారు. ప్రభుత్వం కావాలంటే అధికారులతో విచారణ చేయించుకుని తాము చెప్పింది అసత్యమని నిరూపించాలని సవాల్ విసిరారు.

ఈ సమావేశాలు ముగిసేలోపు తల్లికి వందనం బకాయిలను పూర్తిగా చెల్లించాలని, ప్రతిపక్షం లేవనెత్తిన అంశాలను కనీసం పరిగణలోకి తీసుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వానిదేనని బొత్స సత్యనారాయణ స్పష్టం చేశారు. కొత్తగా ఒక్క వితంతు పెన్షన్ కూడా ఇవ్వలేని పరిస్థితిలో ప్రభుత్వం ఉందని, గతంలో వైసిపి పాలనలో ఏడాదికి రెండు సార్లు కొత్త పెన్షన్లు మంజూరు చేశామని గుర్తుచేశారు. శాసనమండలిలో తాను లేవనెత్తిన ప్రతి అంశానికి కట్టుబడి ఉన్నానని ఆయన సమాధానం చెప్పారు.

## వారం - వర్జ్యం

13-02-2026, శుక్రవారం
శ్రీ విశ్వావసు నామ సంవత్సరం,
మాఘమాసం, ఉత్తరాయణం
శిశిర ఋతువు, కృష్ణపక్షం, ధనిష్ఠ కార్తె
ఏకాదశి మ.2.23
మూల సా.4.09
వర్జ్యం : రా.2.35-4.19
దు.ఉ.8.54-9.40
2) మ.12.45-1.31
రాహుకాలం - ఉ.10.30-12.00

## వార్తాఫలం

**మేషం:**కుటుంబ విషయములో ఇతరుల జోక్యము అధికమౌతుంది. పోటీ పరీక్షలలో పాల్గొంటారు.ప్రతిష్టను నిలబెట్టుకుంటారు.

**వృషభం:** ఓర్పు బాగా అవసరము. విదేశీ వస్తువులు ఆకర్షణల నుండి బయట పడుటకు జాగ్రత్తను వహించండి.

**మిథునం:**చికాకులు ఉన్నప్పటికీ బాధ్యతలు సక్రమంగా నిర్వహించగలుగుతారు. ఋణయత్నము ఫలిస్తుంది. వాహనసౌఖ్యం.

**కర్కాటకం:**అస్తవ్యస్తంగా ఉన్న చాలా వ్యవహారాలను మీ ప్రతిభతో అనుకూలంగా మలచుకుంటారు. వస్త్రలాభం.

**సింహం:**విలువైన పత్రములు డాక్యు మెంట్స్ మొదలైన వాటితో జాగ్రత్త అవసరం.విదేశీయానయత్నాలు ఫలిస్తాయి.

**కన్య :**విలువైన వస్తువుల కొనుగోలు విషయాలలో తగిన శ్రద్ధ చూపడం చెప్పదగినది. శుభవార్తలు అందుకుంటారు.

**తుల :** మిమ్మలను మోసం చేసే ప్రయత్నాలు ఫలించవు. సంఘసేవా కార్యక్రమాలలో పాల్గొంటారు.

**వృశ్చికం:** నేర్పుతో ముఖ్యులవద్ద గుర్తింపు పొందుతారు. ఆధ్యాత్మిక కార్యక్రమాలను నిర్వహిస్తారు. వస్తు కొనుగోలు.

**ధనుస్సు:** కొంతమేర జాగ్రత్తలు అవసరం. భాగస్వామ్య వ్యాపారాలలో జాగ్రత్తలు అవసరం. సోదరుల కలయిక.

**మకరం:**పెట్టుబడులకు అనుకూలంగా ఉంటుంది. కోర్టుకేసుల నుండి బయటపడతారు. స్థలాలు కొనుగోలు.

**కుంభం:** ఆత్మీయవర్గానికి ధన సహాయం చేస్తారు. చేపట్టిన పనులు సకాలంలో పూర్తి చేస్తారు.విద్యా, ఉద్యోగావకాశాలు పొందుతారు.

**మీనం:** విధి నిర్వహణలో పై అధికారుల ప్రశంసలు అందుకుంటారు. వాహనాల విషయంలో జాగ్రత్త అవసరం.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

# సార్వత్రిక సమ్మెతో తిరుపతిలో కదం తొక్కిన కార్మికులు




**తిరుపతి,ఫిబ్రవరి 12ప్రభాతవార్తప్రతినిధి:** దేశవ్యాప్తంగా చేపట్టిన సార్వత్రిక సమ్మెలో భాగంగా తిరుపతిలో కార్మిక సంఘాలు చేపట్టిన సమ్మె విజయవంతమైంది. ఈ సమ్మెలో సంఘటిత, అసంఘటిత రంగాలకు చెందిన వేలాదిమంది కార్మికులు గురువారం ఉదయం అంబేద్కర్ విగ్రహం వద్దకు చేరుకున్నారు. అక్కడనుండి రైల్వే స్టేషన్ ,కర్నాలవీధి, బేరి వీధి, గాంధీ రోడ్డు, తిలక్ రోడ్డు మీదుగా పాత మున్సిపల్ కార్యాలయం వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. కార్మిక చట్టాలను రక్షి ంచాలని... నాలుగు లేబర్ కోడ్ లను రద్దు చేయాలని.. మోడీ నిరంకుశ విధానాలపై కార్మికులు నినదించారు. బహిరంగ సభలో ముఖ్యఅతిథిగా హాజరైన సిపిఐ జాతీయ కార్యదర్శి వర్గ సభ్యుడు ప్రకాష్ బాబు మాట్లాడుతూ స్వాతంత్రానికి ముందు బ్రిటిష్ పాలకులు ఆమోదించిన కార్మిక చట్టాలను నరేంద్ర మోడీ కాలరాస్తున్నారని విమర్శించారు. 29 కేంద్ర కార్మిక చట్టాలను నాలుగు లేబర్ కోర్టులుగా మార్చడం దారుణం అన్నారు. మోడీ అనుసరి స్తున్న కార్మిక వ్యతిరేక విధానాలపై నేడు సార్వత్రిక సమ్మెలో దేశవ్యాప్తంగా కోట్లాదిమంది కార్మికులు రోడ్లపైకి వచ్చి ఆందోళన వ్యక్తం చేస్తున్నారని అన్నారు. సిపిఐ జాతీయ కంట్రోల్ కమిషన్ చైర్మన్ డాక్టర్ కె నారాయణ మాట్లాడుతూ స్వాతంత్రానికి పూర్వమే దేశంలో మొట్టమొదటిసారిగా పాండిచ్చేరిలో కార్మిక నాయకుడు సుబ్బయ్య నేతృత్వంలో ఎనిమిది గంటల పని విధానానికి పోరాడి సాధించారని అన్నారు.

నేడు రైతాంగం దివాలా తీస్తోందని రైతులు కార్మికులను కేంద్రం కట్టు బానిసలుగా చూస్తోందని విమర్శించారు. రాజ్యాం గాన్ని అంచలంచలుగా తగ్గించి వేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. గ్రామీణ ఉపాధి హామీ పథకం పేరులో గాంధీని తొలగించారని, స్వాతంత్ర సమరయోధుల పేర్లు కనబడకుండా చేసి ఘాడ్సే లాంటి వారిని తెర ముందుకు తీసుకువస్తున్నారని విమర్శించారు. డేరా బాబా లాంటివారు అరెస్టు అయితే వెంటనే బెయిల్ మంజూరు అవుతుందని..

వరవరరావు లాంటివారు అరెస్టు అయితే బెయిల్ రాదని ఎద్దేవా చేశారు. సిఐటి యు రాష్ట్ర ఉపాధ్యక్షుడు కందారపు మురళి, ఐఎఫ్టియు రాష్ట్ర ఉపాధ్యక్షుడు హరికృష్ణ ,,ఏఐటీయూసి జిల్లా కార్యదర్శి కె రాధాకృష్ణ , మాజీ ఎమ్మెల్సీ కత్తి నరసింహారెడ్డి, ,ఏఐటీయూసీ నాయకులు ఎన్ డి. రవి, శివ, సిపిఐ నగర కార్యదర్శి విశ్వనాథ్, సిఐటియు నాయకులు జయచంద్ర, వేణుగోపాల్, ఐఎఫ్టియు నాయకులు వెంకటరత్నం, ఐ ఎన్ టి యు సి నాయకులు రత్నకుమార్, వైయస్సార్సీపి టి యు రాజారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# మావోయిస్టుల పేరిట బెదరింపు లేఖలపై కేసు నమోదు

**గుంటూరు ఫిబ్రవరి 12 ప్రభాత వార్త ప్రతినిధి :** ఏపీలో నలుగురు మంత్రులకు మావోయిస్టుల పేరిట బెదిరింపు లేఖలు రావడం తీవ్ర కలకలం రేపింది. మంత్రులు కందుల దుర్గేశ్, కొల్లు రవీంద్ర, అనగాని సత్యప్రసాద్, సత్యకుమార్‌కు ఈ లేఖలు వచ్చాయి.మీ జీవితం ప్రమాదంలో వుందని, మీతోపాటు మీ కుటుంబ సభ్యుల పైన త్వరలోనే దాడి జరుగుతుందని, 7981777325 ఫోన్ నంబర్ ఈ లేఖల్లో ఉంది. వెలగపూడిలోని రాష్ట్ర సచివాలయం చిరునామాతో లేఖలు పంపారు. ఈ అంశంపై ఏపీ అసెంబ్లీ లాబీ వద్ద బుధవారం మంత్రి కందుల దుర్గేష్ మీడియాతో మాట్లాడుతూ.. తనతోపాటు ముగ్గురు మంత్రులకు పోస్టు ద్వారా లేఖలు వచ్చినట్టు చెప్పారు. మావోయిస్టుల పేరిట వచ్చిన లేఖలు చూసి కుటుంబసభ్యులు ఆందోళన చెందినట్టు వెల్లడించారు. వ్యక్తిగతంగా, శాఖపరంగా తాము ఎలాంటి తప్పులు చేయలేదని పేర్కొన్నారు. ఎవరో ఉద్దేశపూర్వకంగానే ఈ లేఖలు రాసి ఉంటారని అనుమానం వ్యక్తంచేశారు. అయితే ఈ బెదిరింపు లేఖపై తుళ్లూరు పోలీసు స్టేషన్‌లో మంత్రి దుర్గేశ్ కార్యాలయ సిబ్బంది ఫిర్యాదు చేశారు.ఈ ఫిర్యాదు పై తుళ్ళూరు పోలీసులు 37/2026 గా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. అసెంబ్లీ సమావేశాలు జరుగుతున్న సమయంలో మంత్రులకు బెదిరింపు లేఖలు రావడం చర్చనీయాంశమైంది.

# తిరుమల సమాచారం

## తిరుమలనుండి శ్రీనివాసమంగాపురానికి లక్ష్మీకాసులహారం



**తిరుమల, ఫిబ్రవరి 12ప్రభాతవార్తప్రతినిధి:** శ్రీనివాసమంగాపురంలోని కల్యాణ వేంకటేశ్వరస్వామిబ్రహ్మోత్సవాల్లో గురువారం రాత్రి గరుడ సేవలో స్వామివారికి అలంకరించేందుకు లక్ష్మీకాసుల హారం ఊరేగింపు జరిగింది. గురువారం మధ్యాహ్నం శ్రీవారి లక్ష్మీకాసులహారం శోభాయాత్ర టిటిడి పరిపాలనా భవనం వద్ద నుండి వైభవంగా ప్రారంభమైంది. టిటిడి అదనపు ఇఒ తల పై కాసులహారం పెట్టుకుని తీసుకెళ్ళారు. ఈ కార్యక్రమంలో టిటిడి అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్య చౌదరి దంపతులు, టిటిడి జెఇఒలు వి. వీరబ్రహ్మం, డాక్టర్ ఎ. శరత్, సివిఎస్ఒ కే. వి. మురళీకృష్ణ పాల్గొన్నారు. టిటిడి స్థానిక ఆలయాల్లో బ్రహ్మోత్సవాలు జరుగుతున్న క్రమంలో తిరుమల శ్రీవారి ఆలయం నుంచి గరుడసేవకుకల్యాణ వేంకటేశ్వరస్వామికి అత్యంత ప్రీతిపాత్రమైన లక్ష్మీకాసుల హారాన్ని అలంకరించేందుకు ఊరేగింపుగా తీసుకెళుతున్నట్టు తెలిపారు.టిటిడి నుండి దాదాపు 6.40 కోట్లు రూపాయలు విలువగల నాలుగుకిలోల డైమండ్ మోపుగల ఆరు పేటల బంగారు యజ్ఞోపవీతము స్వామి వారికి అందించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో టిటిడి బోర్డు సభ్యులు జి.భానుప్రకాశ్ రెడ్డి, పనబాక లక్ష్మీ, తిరుపతి జిల్లా ఎస్పీ లంకెల సుబ్బరాయుడు, ఆలయ ప్రత్యేక శ్రేణి డెప్యూటీ ఇఒవరలక్ష్మీ, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## అధికార నందివాహనంపై సోమస్కందుడు



**తిరుమల,ఫిబ్రవరి 12ప్రభాతవార్తప్రతినిధి:** టిటిడికి అనుబంధంగా ఉన్న తిరుపతిలోని ప్రముఖ శైవాలయం కపిలేశ్వరస్వామికి జరుగు తున్న వార్షిక బ్రహ్మోత్సవాల్లో గురువారం రాత్రి అధికార నందివాహనంపై కపిలేశ్వరుడు భక్తులకు అభయమిచ్చాడు. ఆద్యంత రహితుడైన శివదేవుడు ఐశ్వర్యసూచికమైన నందిని అధిష్టించినపుడు దర్శనం చేసుకోవడం భక్తులకు పుణ్యం. ఆలయ మాఢ పురవీధుల్లో భక్తుల భజనలు, కోలాటలు ముందు వాహనసేవ జరిగింది. గురువారం ఉదయం బ్రహ్మోత్సవాల్లో సోమస్కంధమూర్తి బంగారుతిరుచ్చిపై కామాక్షి అమ్మవారితో కలసి ఊరేగారు.

## ఎస్వీగోసంరక్షణ ట్రస్ట్‌కు రూ.10లక్షలు విరాళం



**తిరుమల ఫిబ్రవరి 12ప్రభాతవార్తప్రతినిధి:** టిటిడి నిర్వహిస్తున్న ట్రస్ట్‌ల్లో ఎస్వీ గోసంరక్షణ ట్రస్ట్‌కు దాత 10లక్షలు రూపాయలు విరాళం అందించారు. తిరుపతికి చెందిన బాలాజీ రైల్వే డివిజన్ సాధన సమితి కన్వీనర్ కుప్పాల గిరిధర్ కుమార్ కుమారుడు కుప్పాల నీలేశ్ కుమార్ 10,00,116 రూపాయలు డిడిని టిటిడి అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరికి అందజేశారు.

## శ్రీవారి ఆశీస్సులకు ఎస్టీ కమిషన్ చైర్మన్ బొజ్జిరెడ్డి



**తిరుమల,ఫిబ్రవరి 12ప్రభాతవార్తప్రతినిధి:** కలియుగప్రత్యక్షదైవం శ్రీవారి దర్శనార్థం రాష్ట్ర ఎస్టీ కమిషన్ చైర్మన్ సొల్ల బొజ్జిరెడ్డి గురువారం రాత్రి తిరుమలకు వచ్చారు. ఆయనకు వసతికల్పన విభాగం ఒఎస్‌డి సత్రానాయక్ స్వాగతం పలికారు. నేటి ఉదయం దేవుని దర్శనం చేసుకోనున్నారు.

## తిరుమలలో తెలంగాణ డిసిఎం భట్టి

### - నేటి ఉదయం శ్రీవారి దర్శనం



**తిరుమల,ఫిబ్రవరి 12ప్రభాతవార్తప్రతినిధి:** తెలంగాణ రాష్ట్ర ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క గురువారం సాయంత్రం తిరుమలకు వచ్చారు. పద్మావతి అతిధిగృహం వద్ద వసతికల్పన విభాగం ఒఎస్‌డి సత్రానాయక్ పుష్పగుచ్చంతో స్వాగతం పలికారు. రాత్రికి తిరుమలలోనే బసచేస్తున్న భట్టి నేటి ఉదయం శ్రీవారిని దర్శించుకోనున్నారు. తెలంగాణాలో ఇటీవల స్థానిక సంస్థల ఎన్నికలు జరిగాయి. ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులు విజయం సాధించాలని, తెలంగాణ ప్రజలకు మరిన్ని సంక్షేమ పథకాలు అమలుచేసే శక్తిని కాంగ్రెస్ ప్రభుత్వానికి కలగజేయాలని వేడుకోనున్నారు.

## శ్రీవారి ఆశీస్సులు కోరిన తమిళనాడు మాజీ సిఎం పళనిస్వామి



**తిరుమల,ఫిబ్రవరి 12ప్రభాతవార్తప్రతినిధి:** తమిళనాట త్వరలో జరగనున్న సార్వత్రిక ఎన్నికలకు ముందు తమిళనాడు మాజీ ముఖ్యమంత్రి ఎడపాడి పళనిస్వామి ఏడుకొండల వేంకటేశ్వరస్వామి ఆశీస్సు లందుకునేందుకు గురువారం సాయంత్రం తిరుమలకు చేరుకున్నారు. తిరుమలలోని వకుళమాత విశ్రాంతి భవనం వద్ద పద్మావతి వసతికల్పన విభాగం అధికారులు పుష్ప గుచ్ఛంతో స్వాగతం పలికారు. రాత్రికి ఇక్కడే బసచేసి నేటి ఉదయం శ్రీవారిని దర్శించుకోనున్నారు.

# శ్రీశైల మల్లన్న చెంత భక్త జనసందోహం

# నల్లమల్ల నడకదారులన్నీ శివ నామస్మరణం



నడక దారుల్లో వస్తున్న భక్తులు

**శ్రీశైలంప్రాజెక్టు,ఫిబ్రవరి12,ప్రభాతవార్త** శివ నామస్మరణం నల్లమల్ల నడక మార్గం అంతా మారుమ్రోగుతుంది.ఓం నమ:శివయా,ఓం నమ:శివయా అంటూ జనసంద్రం శ్రీశైలం మల్లన్న చెంతకు తండోపా తండాలుగా భక్త జనసందోహం తరలివస్తున్నారు.భక్తి పారవశ్యంతో అలరారుతోంది.శ్రీస్వామిఅమ్మవార్ల ఉభయ దేవాలయాలను కనువిందు చేసే విధంగా పుష్పాలతో ముస్తాబు చేసారు.చికటి పడితే మల్లన్న క్షేత్రం విధ్యుత్ కాంతులతో మిరుమిట్లు గోలుపుతుంది.నల్లమల్ల నడకదారులన్ని శివ నామస్మరణంతో ప్రజ్వరిల్లు తున్నాయి.ఇల కైలాసమైన శ్రీగిరి క్షేత్రంలో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి.హారహార మహదేవా శంభో శంకరా అన్న నినాదంతో పరుగుపరుగున క్షేత్రంకు చేరుకుంటున్నారు.నడక దారి మార్గలన్ని భక్తుల కోలహాలంతో కనువిందు చేస్తున్నాయి.ఈ నడక దారులన్ని దాతలచే అన్నప్రసాద వితరణ జరుగుతుంటే,దేవస్థానం ఆధ్వర్యంలో భక్తులకు అవసరమైన వైద్యశిబిరాలు,ఉచిత మంచీనీరు,తదితర సౌకర్యాలను ఏర్పాటు చేసింది.మండుటేండను సైతం లెక్కచేయకుండా వెంకటాపురం నుండి నట్టడవి మొట్ల మార్గన మల్లన్నను మనస్సులో స్మరించుకుంటూ కైలాసద్వారం వద్దకు చేరుకుంటున్నారు.అక్కడికి చేరుకున్న భక్తులకు సేద తీరేందుకు చలువ పందిళ్లు,అన్నప్రసాద వితరణ,మంచినీటి సౌకర్యం,వైద్య శిబిరాలు,అత్యవసర సమయాలకు అంబులేన్స్‌లు తదితర వంటివి ఏర్పాట్లు గావించారు.ఈ నడక దారులన్ని చిన్న,పెద్ద,ముసలి,ముతక అనే తేడా లేకుండా మల్లన్న నీ దర్శన భాగ్యం కోరకు తరలివస్తున్నామని నీ చెంతకు చేరుకోగానే మమ్మల్ని పిల్లపాపాలతో చల్లగా దీవించుస్వామి అంటూ వేడుకుంటున్నారు.మల్లన్న వద్దకు చేరుకున్న భక్తాదులకు సలక సౌకర్యాలను ఏర్పాటు చేసి అనువైన దర్శన బాగ్యం కల్పించడం దేవస్థానం తీసుకోంది.శ్రీశైలక్షేత్రం నలుచేరుగుల భక్తులతో కిక్కిరిసిపోతున్నాయి.శివ మాలలో వచ్చిన స్వాములు శివదీక్ష శిబిరాలకు చేరుకోని ఇరుముడిని సమర్పిస్తున్నారు.శివస్వాములకు తగిన సమయంలో దర్శనం కల్పిస్తుండడంతో వారు పునితులౌవుతున్నారు. ఈక్రమంలోనే మరికొందరు భక్తులు పాతళగంగకు చేరుకోని పుణ్యస్నానాలు అచరించి తమ మ్రొక్కులను తీర్చుకుంటున్నారు.దర్శనం క్యూలై న్లన్ని భక్త సంద్రంతో కిటకిటాలాడు తున్నాయి.



# దేవుడిని అడ్డుపెట్టుకుని రాజకీయాలు చేయొద్దు: సిపిఐ నారాయణ

**తిరుమల,ఫిబ్రవరి 12ప్రభాతవార్తప్రతినిధి:** తిరు మల లడ్డూ నెయ్యిలో కల్తీజరిగిన మాట వాస్తవమేనని, ఆ దోషులను కఠినంగా శిక్షించాలని సిపిఐ జాతీయనేత డాక్టర్ కె.నారాయణ సంచలన వ్యాఖ్యలు చేశారు. ఈ పాపంలో తప్పుచేసిన అధికారులను, పాత ఇఒను వదిలేయకూడదని చెప్పారు. రాజకీయ లబ్ధికోసమే అధికార, ప్రతిపక్షపార్టీలు లడ్డూ విషయంపై రాద్ధాంతం చేస్తున్నాయని, దేవుడిని అడ్డుపెట్టుకుని రాజకీయాలు చేయడం సరికాదని హితవు పలికారు. రాజకీయ లబ్ధికోసం కోట్లాదిమంది భక్తులను మనోవేదనకు గురి చేయొద్దని ఆయన కోరారు. ఇందుకు సంబంధించి ఈ కేసులో సుప్రీంకోర్టు విచారణ చేస్తోందని, ఈ సమయంలో రాజకీయ నేతలు లడ్డూపై మాట్లాడటం ఆపేయాలని సూచించారు. ఎవరిరాజకీయాల కోసం వాళ్ళు కావాలంటే కొట్టుకోండని, అయితే దేవుడిని మాత్రం లాగొద్దని ,లడ్డూ వివాదంపై అనవసర చర్చ ఆపి భక్తుల మనోభావాలను కాపాడండి అని నారాయణ ఘాటుగా స్పందించారు. కల్తీ ప్రసాదంతో సిఎం చంద్రబాబునాయుడు స్వామి ప్రతిష్టను దెబ్బతీసే ప్రయత్నం చేశారని మండిపడ్డారు. గత ఐదేళ్ళలో రసాయనాలతో తయారైన కల్తీ నెయ్యితో లడ్డూల తయారుచేయించారని ఆయన తీవ్రస్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు.

# రసవత్తరంగా సాగిన ప్రశ్నోత్తరాలు

## పుట్టపర్తిలో ట్రిపుల్ ఐటి ప్రతిపాదన లేదన్న మంత్రి లోకేష్

**విజయవాడ.ఫిబ్రవరి12,ప్రభాతవార్తప్రతినిధి:** ఏపీ అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు గురువారం రెండో రోజు ప్రారంభమయ్యాయి. సభలో పలు ఆసక్తికర అంశాలు చోటు చేసుకున్నాయి.సభ మొదలైన వెంటనే స్పీకర్ అయ్యన్న పాత్రుడు ప్రశ్నోత్తరాలను చేపట్టారు.ఈ కార్యక్రమం రసవత్తరంగా సాగింది. పుట్టపర్తిలో ఐఐటీ ఏర్పాటుపై ఎమ్మెల్యే పల్లె సింధూరరెడ్డి ప్రశ్న లేవనెత్తారు. ఒంగోలు ఐఐటీ తాత్కాలిక క్యాంపస్ వల్ల విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. ఇడుపులపాయ, ఒంగోలు మధ్య విద్యార్థులు తిరగాల్సి వస్తోందని, ఇది తీవ్ర ఇబ్బందికరంగా ఉందని ఎమ్మెల్యే వివరించారు. ఎమ్మెల్యే సింధూర రెడ్డి ప్రశ్నకు మంత్రి నారా లోకేశ్ సమాధానం ఇచ్చారు. పుట్టపర్తిలో ఐఐటీ ఏర్పాటు ప్రతిపాదన లేదని మంత్రి స్పష్టం చేశారు. ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం పరిధిలో అక్రమాలు జరుగుతున్నాయని ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ సభలో ప్రస్తావించారు. సరైన అనుమతులు లేకుండానే కొందరు కాలేజీలు పెడుతున్నారని ఎమ్మెల్యే బత్తుల ఆరోపించారు. దీనిపై మంత్రి లోకేశ్ సమాధామిస్తూ.. అక్రమాలపై వివరాలు తెలియజేస్తే తప్పకుండా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఏయే కాలేజీలకు అనుమతులు ఇచ్చారనే దానిపై తన దృష్టికి తీసుకురావాలని మంత్రి లోకేశ్ పేర్కొన్నారు. పుత్తూరు పురపాలక సంస్థ ఛైర్మన్‌పై తప్పుడు కుల ధ్రువీకరణ ఆరోపణలకు సంబంధించి సభ్యులు అడిగిన ప్రశ్నకు మంత్రి నారాయణ సమాధానం ఇచ్చారు. పుత్తూరు పురపాలక సంస్థ ఛైర్మన్‌ను ఇప్పటికే తొలగించినట్లు మంత్రి స్పష్టం చేశారు. ఎమ్మెల్యే భాను ప్రకాశ్ మాట్లాడుతూ.. గత ప్రభుత్వంలో స్థానిక ఎన్నికలు ఎలా జరిగాయో అదరికీ తెలుసని.. తప్పుడు సర్టిఫికెట్లతో పదవులు పొందారని తెలిపారు. గత ప్రభుత్వం స్థానిక వ్యవస్థలను కూడా నిర్వీర్యం చేసిందని ఆరోపించారు. రిజర్వ్ స్థానాలను కూడా గత ప్రభుత్వం కాజేసిందని ఆరోపిస్తూ.. దీనిపై క్రిమినల్ చర్యలు తీసుకుంటారా అని ఎమ్మెల్యే భాను ప్రకాశ్ ప్రశ్నించారు.దీనిపై మంత్రి నారాయణ సమాధానం ఇస్తూ.. జీవో 135లో అడిగిన అన్ని ప్రశ్నలకు సమాధానాలు ఇచ్చినట్లు తెలిపారు. సభ్యులు అడిగినట్లు అదనపు చర్యలు ఏమి తీసుకోవచ్చో పరిశీలిస్తామని మంత్రి నారాయణ పేర్కొన్నారు. విజయవాడలోని సెంట్రల్ నియోజకవర్గ పరిధిలోని పాయకాపురం ప్రాంతంలో ప్రభుత్వ జూనియర్ ఇంటర్మీడియట్ కాలేజీని డిగ్రీ కాలేజీ వరకు అప్ గ్రేడ్ చేయాలి.రాష్ట్రంలో మొట్టమొదటి సారిగా డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకం విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ఇక్కడే మొదటిసారి ప్రవేశ పెట్టడం జరిగింది. సుమారు రూ.15కోట్ల వ్యయంతో అదనపు బిల్డింగ్ నిర్మాణం ఖర్చు చేయడం ద్వారా డిగ్రీ కాలేజి పూర్తి అవుతుంది. ఎందుకంటే అనేకమంది పేదలు, ఆటో కార్మికులు,తాపీ కూలీలు ఈ నియోజవర్గంలో ఉన్నారు. ఇక్కడ ప్రభుత్వ డిగ్రీ కాలేజీ లేదు.ఆడపిల్లలు డిగ్రీ కాలేజీలో చదువుకోసం నగరంలోని వేరొక ప్రాంతాలకు వెళ్ళవలసి వస్తున్నది.చాలా ఇబ్బందులు పడుతున్నారు.అలాగే ఇంటర్మీడియట్ కాలేజీ విద్యార్థులు ఆదుకోవడానికి, కాలేజీ చుట్టూతా ప్రహరీ గోడ,మిగిలిన వాటి నిమిత్తం మంత్రి లోకేష్ 20లక్షలు కేటాయించగా, సంవత్సరం పొడువునా ఆ గోడ నిర్మాణం జరిగి ఇటీవల పూర్తి చేశారు.ప్రక్కన బీసీ సంక్షేమ హాస్టల్ ఉంది.హాస్టల్కు కూడా నిధులు కేటాయించాలి. జగ్గయ్యపేట నియోజకవర్గంలో తీవ్రంగా నెలకొన్న సాగునీటి సమస్యపై ఎమ్మెల్యే శ్రీరామ్ రాజగోపాల్ శాసనసభలో జీరో అవర్ సందర్భంగా గళం విప్పారు. బోనకల్లు బ్రాంచ్ కాల్వ పరిధిలోని వత్సవాయి, వీర్లపాడు, నందిగామ మండలాలకు చెందిన వేలాది ఎకరాల భూములు పూర్తిగా ఈ కాల్వపైనే ఆధారపడి ఉన్నాయని, అయితే అవసరమైన స్థాయిలో నీరు అందక రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని సభ దృష్టికి తీసుకువచ్చారు. బోనకల్లు బ్రాంచ్ కాల్వ సామర్థం 1350 క్యూసెక్కులు కాగా,

ప్రస్తుతం కేవలం 900 క్యూసెక్కుల నీటిని మాత్రమే విడుదల చేస్తున్నారని పేర్కొన్నారు. దీంతో బోనకల్లు మం డలం దాటిన తర్వాత కాల్వలో నీరు ముందుకు వెళ్లడం లేదని, వత్సవాయి మండలానికి 30 క్యూసెక్కులకు మించి నీరు రావడం లేదని తెలిపారు.

# టిడిపి ఎమ్మెల్యే కొలకపూడికి పల్లా శ్రీనివాస్ తీవ్ర హెచ్చరికలు

**విజయవాడ ఫిబ్రవరి 12 ప్రభాతవార్త ప్రతినిధి** తిరువూరు ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాస్‌తో తెదేపా రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాస్ సమావేశమయ్యారు. అసెంబ్లీ లాబీలో కొలికపూడితో ఆయన మాట్లాడారు. కొలికపూడి వ్యవహార శైలిపై విమర్శలు వస్తున్న నేపథ్యంలో సీఎం చంద్రబాబు ఆదేశాలుగా ఆయనకు పల్లా తీవ్ర హెచ్చరికలు చేశారు. పార్టీ లేకపోతే వ్యక్తిగతంగా జీరో అనే విషయాన్ని గుర్తించి ప్రవర్తించాలని హితవు పలికారు. పార్టీ క్రమశిక్షణ దాటి ప్రవర్తిస్తే చూస్తూ ఊరుకునేందుకు సీఎం సిద్ధంగా లేరన్నారు. ఎన్నిసార్లు మందలించినా పద్ధతి మార్చుకోకుండా తప్పుల మీద తప్పులు చేస్తే పార్టీ ఎమ్మెల్యేగా గుర్తించడం మానేస్తుందని పల్లా శ్రీనివాస్ స్పష్టం చేశారు.

# రాష్ట్ర ప్రభుత్వంచే పట్టువస్త్రాల సమర్పణ




**శ్రీశైలం ప్రాజెక్టు ఫిబ్రవరి 12, ప్రభాత వార్త.** మహా శివరాత్రి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని గురువారం నాడు సాయంకాలం రాష్ట్ర ప్రభుత్వం తరుపున రాష్ట్ర దేవదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, స్థానిక శాసనసభ్యులు బుడ్డా రాజశేఖరరెడ్డితో కలిసి శ్రీస్వామిఅమ్మ వార్లకు పట్టువస్త్రాలను సమర్పించారు. ఈ సమర్ప ణ కార్యక్రమంలో దేవదాయ కమిషనరు, కె. రామచంద్ర మోహన్, జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా, చీఫ్ ఫెస్టివల్ ఆఫీసర్ ఎస్.ఎస్. చంద్రశేఖర ఆజాద్ , ధర్మకర్తల అధ్యక్షులు పోతుగుంట రమేష్ నాయుడు, కార్యనిర్వహణాధికారి యం.శ్రీనివాసరావు వారు పలువురు ధర్మకర్తల మండలి సభ్యులు పాల్గొన్నారు.
కార్యక్రమములో ముందుగా ఆలయ రాజగోపురం వద్ద వస్త్ర సమర్పణ సంకల్పం, వస్త్రాలకు పూజాదికాలు మొదలైన కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం మంత్రి మరియు స్థానిక శాసనసభ్యుల మేళతాళాలతో ఆలయ ప్రవేశం చేసి ప్రదక్షిణ పూర్వకంగా స్వామిఅమ్మవార్లకు పట్టు వస్త్రాలను సమర్పించారు. కాగా ఎంతో చారిత్రక ప్రసిద్ధి పొందిన శ్రీశైలక్షేత్రంలో ఎందరో చక్రవర్తులు, రాజులు, రాజకుటుంబీకులు మొదలైన వారు ఆయా ఉత్సవ సందర్భాలలో శ్రీ స్వామి అమ్మవార్లకు పట్టువస్త్రాలను సమర్పించేవారని ప్రతీతి. ఈ సంప్రదాయాన్ని అనుసరించే రాష్ట్ర ప్రభుత్వం ఏటా మహాశివరాత్రి మరియు దసరా మహోత్సవాలలోనూ శ్రీ స్వామిఅమ్మవార్లకు పట్టువస్త్రాలను అనవాయితీగా సమర్పిస్తోంది.

# ఎమ్మెల్యేలతో మంత్రి లోకేష్ డిన్నర్ మీటింగ్‌లు

**విజయవాడ,ఫిబ్రవరి12,ప్రభాతవార్తప్రతినిధి:** పార్టీ బలోపేతం విషయంలో టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, మంత్రి నారా లోకేష్ వినూత్న పంథా ఎంచుకున్నారు. పార్టీని గ్రౌండ్ లెవల్ నుంచి బలోపేతం చేసేందుకు సరికొత్త వ్యూహాలకు పదును పెడుతున్నారు. అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల వేళ..ఎమ్మెల్యేలు, క్యాడర్‌కు మరింత దగ్గరయ్యేలా డిన్నర్ మీటింగ్స్‌కు శ్రీకారం చుట్టారు. కేవలం రాజకీయాలకే పరిమితం కాకుండా..ఆత్మీయ వాతావరణంలో ప్రతి రోజూ ఏడుగురు ఎమ్మెల్యేలతో భోజనం చేస్తూ..వారి మనోగతాలు తెలుసుకుంటున్నారు. ఈ నిర్ణయం పార్టీ శ్రేణుల్లో కొత్త ఉత్సహాన్ని నింపుతోంది. ఈ సమావేశాల్లో ప్రధానంగా నియోజకవర్గాల అభివృద్ధి, పెండింగ్‌లో ఉన్న సమస్యలపై ఎమ్మెల్యేలను ఆరా తీస్తున్నారు నారా లోకేష్. జిల్లాల వారీగా ఎమ్మెల్యేలతో ముఖాముఖి సమావేశాలు నిర్వహిస్తూ, వారి వ్యక్తిగత యోగక్షేమాలతో పాటు స్థానిక పరిస్థితులను అడిగి తెలుసుకుంటున్నారు. సమస్య ఏదైనా ఉంటే వెంటనే పరిష్కరించేలా అధికారులకు దిశానిర్దేశం చేసున్నారు. కేవలం ఆఫీసు గోడల మధ్య కాకుండా, డైనింగ్ టేబుల్‌పై సాగే చర్చల వల్ల ఎమ్మెల్యేలతో ఎమోషనల్ బాండింగ్ ఏర్పడుతుందని లోకేష్ భావిస్తున్నారు. మొదటిసారి ఎమ్మెల్యేలుగా గెలిచిన వారిపై లోకేష్ స్పెషల్ ఫోకస్ పెట్టారు. అనుభవం లేక కొంతమంది చేస్తున్న చిన్నపాటి పొరపాట్లను సరిదిద్దేందుకు ఈ వేదికను వాడుకుంటున్నారు. వార్నింగ్, గదమాయింపులు కాకుండా.. ఓ ఫ్రెండ్‌లా, ఓ మెంటార్‌లా పాలనపై అవగాహన కల్పిస్తున్నారు. హైకమాండ్‌కు, యువ ఎమ్మెల్యేల కు మధ్య ఉన్న దూరాన్ని తగ్గించి, వారిలో ఆత్మవిశ్వాసం పెంచడం ద్వారా పార్టీకి క్రమశిక్షణ కలిగిన నాయకత్వాన్ని అందించడమే ఈ సమావేశాల వెనుక ఉన్న ప్రధాన ఉద్దేశం. టెక్నాలజీని వాడుకుంటూ డాష్ బోర్డుల ద్వారా డెవలప్‌మెంట్‌ను పర్యవేక్షించడమే కాదు..క్షేత్రస్థాయిలో మనుషులతో మమేకమ వ్వడం తన శైలి అని లోకేష్ నిరూపిస్తున్నారు. సీనియర్లకు సముచిత గౌరవం ఇస్తూనే, యువ నాయకత్వాన్ని ప్రోత్సహిస్తున్న తీరు పార్టీ శ్రేణుల్లో నూతనోత్తేజాన్ని కలిగిస్తోంది. ఈ డిన్నర్ మీటింగ్స్ ద్వారా ఆయన వేస్తున్న అడుగులు అటు పార్టీ ఐక్యతను, ఇటు ప్రభుత్వ పనితీరును మెరుగుపరచడంలో కీలక పాత్ర పోషిస్తాయని

# కాలంచెల్లిన భవనాలపై నిర్లక్ష్యమేనా! - టెండర్ స్థాయికి చేరినా జాప్యమే



**తిరుమల,ఫిబ్రవరి 12ప్రభాతవార్తప్రతినిధి:** కలియుగవైకుంఠం తిరుమలలో పాతబడిన, కాలంచెల్లిచన వసతి గృహాల భవనాలపై టిటిడి నిర్లక్ష్యంగా వ్యవహరిం చడం ఎందుకనే విమర్శలు భక్తుల్లో వ్యక్తమవుతోంది. ఇప్పటికే తిరుమలలో పురాతన కాటేజీలను గుర్తించిన టిటిడి అధికారులు వాటి స్థానంలో కొత్తవి అధునాతనంగా నిర్మించేందుకు కార్యాచరణ సిద్ధం చేశారు. అయితే అప్పట్లో టిటిడి బోర్డు లేకపోవడంతో అధికారులు దాతల సహకారంతో వాటి స్థానంలో కొత్తవి నిర్మించాలని భావించారు. మళ్ళీ ఆ ప్రతిపాదనలు ఆచరణకు రాలేదు. వసతికల్పన విభాగం అధికారులు కూడా తిరుమలలో భక్తులకు ప్రయోజనం లే ని కాటేజీలను గుర్తించారు. భక్తుల నుండి వచ్చిన ఫిర్యాదు లతో సుదర్శన్ ,గోవ ర్ధన్, కల్యాణి, సిటైప్ క్వార్టర్స్, పద్మా వతి ప్రాం తంలోని కొన్ని విశ్రాంతి గృహాల స్థానంలో అధు నాతనంగా నిర్మిం చాలని నిర్ణయించారు.

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం
పంచాయతీరాజ్ శాఖ
నిట్ నెం.12 నుండి 14/2025-26, ఇ-ప్రొక్యూర్‌మెంట్ టెండరు ప్రకటన తేది: 09.02.2026
కార్యనిర్వాహక ఇంజనీరు, పంచాయతీరాజ్, పాలకొండ పరిధిలో 2 కార్యాలయపు భవనములు మరమ్మతులు అంచనా విలువ: రూ.15.00 లక్షలు మరియు 01 ఆరోగ్య చికిత్సాలయం నిర్మాణం పని నిమిత్తం రూ.36.00 లక్షలు అంచనా వ్యయంతో ఆన్‌లైన్ టెండర్లు కోరడమైనది. టెండర్లు తేది: 16.02.2026. తదుపరి ఇ-మార్కెట్ నందు లభ్యమగును. ఏదేని సమాచారానికి వెబ్‌సైట్ https://tender.apeprocurement.gov.in చూడండి.
సం/- కార్యనిర్వాహక ఇంజనీరు, పంచాయతీరాజ్, పాలకొండ
DIPR.No.19069/CL/Advt/1/1/2022-23, తేది: 12.02.2026

# బ్రాహ్మణ కుటుంబాలకు అండగా 'గరుడ'

విజయవాడ, ఫిబ్రవరి 12 ప్రభాతవార్తప్రతినిధి: ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న బ్రాహ్మణ కుటుంబాలకు అండగా నిలిచేందుకు రాష్ట్ర ప్రభుత్వం " గరుడ" పథకం ద్వారా చర్యలు తీసుకుంటోంది. ఆంధ్రప్రదేశ్ బ్రాహ్మణ సంక్షేమ కార్పొరేషన్ ఈ గరుడ పథకాన్ని అమలు చేస్తోంది. కుటుంబ సభ్యులెవరైనా మరణించిన తరుణంలో, వారి అంత్య క్రియల ఖర్చుల కోసం ప్రభుత్వం ఈ పథకం ద్వారా రూ.10,000 ఆర్థిక సహాయాన్ని అందిస్తోంది. రాష్ట్రంలోని అన్ని జిల్లాల వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవచ్చని అధికారులు చెప్తున్నారు.

అర్హతలు ఇవే: మరణించిన వ్యక్తి అలానే దరఖాస్తుదారుడు బ్రాహ్మణ సామాజిక వర్గానికి చెందిన వారు అయి ఉండాలి. అలానే కుటుంబ వార్షిక ఆదాయం రూ.75,000 మించి ఉండకూడదు. దరఖాస్తుదారుడు మరణించిన వ్యక్తికి భార్య/భర్త, కుమారుడు, కుమార్తె, తల్లిదండ్రులు, సోదరుడు లేదా మనవడు అయి ఉండాలి. ఇంక ఇతర ప్రభుత్వ పథకాల ద్వారా ఇలాంటి సాయం పొంది ఉండకూడదు.

కావలసిన పత్రాలు: దరఖాస్తు సమయంలో దరఖాస్తుదారుని ఫొటో, ఆధార్ కార్డు, మరణించిన వ్యక్తి ఆధార్, మరణ ధృవీకరణ పత్రం , మీసేవ ద్వారా పొందిన కుల, ఆదాయ, నివాస ధృవీకరణ పత్రాలు సిద్ధం చేసుకోవాలి. వీటితో పాటు ఆంధ్ర బ్యాంక్ లేదా ఎస్బీఐ ఖాతా పుస్తకం నకలును జత చేయాలి. బ్రాహ్మణ సంక్షేమ కార్పొరేషన్ అధికారిక వెబ్‌సైట్‌పై క్లిక్ చేయాలి. వ్యక్తిగత, బ్యాంకు వివరాలను నమోదు చేసి, పైన పేర్కొన్న పత్రాలను అప్‌లోడ్ చేయాలి. దరఖాస్తు పూర్తయ్యాక వచ్చే రిఫరెన్స్ నంబర్‌ను భద్రపరుచుకోవాలి. దరఖాస్తు చేసుకున్న వారు సాయం నేరుగా లబ్ధిదారుల ఖాతాకే జమ అవుతుందని కార్పొరేషన్ వర్గాలు స్పష్టం చేశాయి. మరణించిన వ్యక్తి యొక్క జీవిత భాగస్వామి, పిల్లలు లేదా కుటుంబ సభ్యులు ఈ సాయం కోసం దరఖాస్తు చేసుకోవచ్చు. ఆంధ్రప్రదేశ్ బ్రాహ్మణ సంక్షేమ కార్పొరేషన్ వెబ్‌సైట్‌లో దీనికి సంబంధించిన మరిన్ని వివరాలు అందుబాటులో ఉంటాయి. ఏదైనా సహాయం కోసం బ్రాహ్మణ సంక్షేమ కార్పొరేషన్ హెల్ప్‌లైన్ నంబర్లు 0866 6650345, 0866 6650300 సంప్రదించవచ్చు.

# బెంగళూరు- కడప కొత్త రైల్వే మార్గం ఏర్పాటు చేయండి

- కేంద్ర మంత్రిని కోరిన రాష్ట్ర మంత్రి రాంప్రసాద్ రెడ్డి
- సానుకూలంగా స్పందించిన అశ్విని వైష్ణవ్
- కడప నుంచి విమాన సేవలు పెంపొందించండి
- రామ్మోహన్‌నాయుడుకు మంత్రి మండిపల్లి విజ్ఞప్తి
- మంత్రి వెంట ఎంపి పురందేశ్వరి, సాయి లోకేష్



విజయవాడ, ఫిబ్రవరి 12 ప్రభాతవార్త ప్రతినిధి: బెంగళూరు నుంచి కడప వరకు కొత్త రైల్వే మార్గం ఏర్పాటు చేయాలంటూ రాష్ట్ర రవాణా, యువజన, క్రీడాశాఖల మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్‌తో ఢిల్లీలో సమావేశమై కోరారు. ఈ భేటీలో ఎంపి పురందేశ్వరి, అన్నమయ్య జిల్లా బిజెపి అధ్యక్షుడు సాయి లోకేష్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా బెంగళూరు-కడప రైల్వే మార్గం ఏర్పాటు చేస్తే రాయలసీమ ప్రాంతానికి రవాణా సౌకర్యాలు మెరుగుపడటంతో పాటు ఆర్థిక, పారిశ్రామిక అభివృద్ధికి దోహదపడుతుందని కేంద్ర మంత్రికి వివరించారు. రాయలసీమ ప్రాంత అభివృద్ధి సీఎం చంద్రబాబు నాయుడు సారధ్యంలోనే సాధ్యం అని మంత్రి రాంప్రసాద్ రెడ్డి తెలిపారు. ప్రాంత ప్రజల దీర్ఘకాలిక ఆకాంక్ష అయిన ఈ రైల్వే మార్గాన్ని త్వరితగతిన మంజూరు చేయాలని కోరగా కేంద్ర మంత్రి సానుకూలంగా స్పందించారు.

**విమాన సేవల విస్తరణపైనా**

కడప విమానాశ్రయం నుంచి దేశంలోని వివిధ ప్రాంతాలకు విమానాల సేవలను పెంపొందించాలని కోరుతూ రాష్ట్ర రవాణా, యువజన, క్రీడాశాఖల మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి ఢిల్లీలో కేంద్ర విమానయాన శాఖ మంత్రి కింజరపు రామ్మోహన్ నాయుడుని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు గారి సారథ్యంలో రాష్ట్రఅభివృద్ధిలక్ష్యంగా ముందుకుసాగుతున్న క్రమంలో, కడప విమానాశ్రయం ద్వారా కడప జిల్లాకు మెరుగైన విమాన కనెక్టివిటీ కల్పిస్తే రాయలసీమ ప్రాంత అభివృద్ధికి, వ్యాపార, పర్యాటక రంగాల పురోగతికి దోహదపడుతుందని మంత్రి రాంప్రసాద్ రెడ్డి కేంద్ర మంత్రికి వివరించారు.

**ఎపిని క్రీడా హబ్‌గా తీర్చిదిద్దటమే లక్ష్యం**

ఢిల్లీ పర్యటనలో ఉన్న రాష్ట్ర రవాణా, యువజన, క్రీడాశాఖల మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి జాతీయ యువజన వ్యవహారాలు, ఎస్ఏఐ జాయింట్ సెక్రెటరీ వినీల్ కృష్ణతో జవహర్ లాల్ నెహ్రూ స్టేడియంలో సమావేశమయ్యారు. ఈ సమావేశంలో రాయచోటి నియోజకవర్గంలో క్రీడల అభివృద్ధికి అవసరమైన నిధులు, ఖేలో ఇండియా పథకం కింద ప్రతిపాదనల ఆమోదం, అలాగే ఆంధ్రప్రదేశ్‌ను దేశంలోనే అగ్రశ్రేణి క్రీడా హబ్‌గా తీర్చిదిద్దే లక్ష్యంతో రాష్ట్రవ్యాప్తంగా క్రీడా మౌలిక సదుపాయాల అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం తరఫున రాష్ట్ర ప్రభుత్వానికి అదనపు నిధుల మంజూరు అంశాలపై సుదీర్ఘంగా చర్చించారు. ఎంపి పురందేశ్వరి, సాయి లోకేష్ పాల్గొన్నారు.

# ఇంటర్ ఫస్టియర్ పరీక్షా విధానంలో మార్పులు

- 32 పేజీల బుక్‌లెట్‌లోనే రాయాలి • అదనపు పేపర్లు ఇవ్వరు
- మార్కుల విధానంలో మార్పులు చేర్పులు • ఇంటర్ బోర్డు మార్గదర్శకాలు విడుదల

విజయవాడ, ఫిబ్రవరి 12 ప్రభాతవార్త ప్రతినిధి: రాష్ట్రంలో ఈనెల 23 నుంచి ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షలు ఆరంభమవుతున్నాయి. ఇందుకుగానూ ఇంటర్మీడియట్ విద్యా మండలి ఏర్పాట్లు పూర్తి చేసింది. ఇంటర్మీడియట్ విద్యార్థులు మొత్తం 10,57,899 మంది ఉండగా వీరిలో ప్రథమ సంవత్సరం విద్యార్థులు 5,31,275, ద్వితీయ సంవత్సరం వారు 5,26,624 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కానున్నారు. ప్రథమ సంవత్సరానికి సంబంధించి ఈ ఏడాది సిలబస్‌తో పాటు ప్రశ్నపత్రాల విధానంలోనూ కొన్ని మార్పులు, చేర్పులు తీసుకు వచ్చారు. ఈసారి ఫస్ట్ ఇయర్ స్టూడెంట్స్‌కు 32 పేజీల బుక్‌లెట్ ఇవ్వనున్నారు.

**అదనంగా పేజీలు ఇవ్వరు:** ఇప్పటివరకు సమాధానాలు రాయడానికి 24 పేజీల బుక్‌లెట్ ఇస్తుండేవారు. ఈసారి మాత్రం 32 పేజీల బుక్‌లెట్ ఇవ్వాలని నిర్ణయించారు. అన్ని ప్రశ్నలకు అందులోనే సమానాధాలు రాయాల్సి ఉంటుంది. అదనంగా ఎలాంటి పేజీలు ఇవ్వరు. పార్ట్‌ఏలో బోటనీ నుంచి 43, పార్ట్‌బిలో జువాలజీ నుంచి 42 మార్కులకు ప్రశ్నలు ఉంటాయి. వీటికి జవాబులు రాసేందుకు విడివిడిగా 24 పేజీల 2 బుక్‌లెట్లు ఇస్తారు. బుక్‌లెట్లపై వృక్ష శాస్త్రం, జంతుశాస్త్రం అని ప్రత్యేకంగా పేర్కొంటారు.

ఈ ఏడాది నుంచి ఫస్ట్ ఇయర్ వారికి ఒక్క మార్కు ప్రశ్నలు ఉంటాయి. సెకండ్ ఇయర్ ప్రశ్నపత్రాల్లో ఎలాంటి మార్పు ఉండదు. అదే విధంగా ఆర్థిక శాస్త్రం, పౌరశాస్త్రం, చరిత్ర సబ్జెక్టుల మార్కుల్లో ఎలాంటి మార్పు లేదు. అయినా ప్రశ్నల సంఖ్య పెరగడంతో వీటికి సైతం 32 పేజీల బుక్‌లెట్ ఇస్తారు.

భౌతిక, రసాయన, జీవశాస్త్రం సబ్జెక్టులకు మొదటి ఏడాదిలో 85 మార్కులకు రాత పరీక్ష ఉంటుంది. ఈ సబ్జెక్టుల్లో 35 శాతం మార్కులు వస్తే పాసయినట్లే. ఆ లెక్కన 29.75 మార్కులు రావాల్సి ఉండగా, 29 మార్కులు వచ్చిన కూడా ఉత్తీర్ణులైనట్లే పరిగణిస్తారు.

ద్వితీయ సంవత్సరంలో 85 మార్కులకు గానూ 30 మార్కులు తెచ్చుకోవాలనే నిబంధనను పెట్టారు.

రెండు సంవత్సరాలకు కలిపి 35 శాతం కింద 59.5 మార్కులు సాధించాల్సి ఉండగా, 59 మార్కులను ఉత్తీర్ణతగా నిర్ణయించారు. ఈ అర్ధ మార్కును సర్దుబాటు చేస్తున్నారు.

రెండో ఏడాదిలో ప్రాక్టికల్స్ 30 మార్కులకు ఉత్తీర్ణత మార్కులను 10.5 నుంచి 11కు పెంచారు.

గణితం 12, రసాయనశాస్త్రం 9, భౌతికశాస్త్రం 9, వృక్షశాస్త్రం 5, జంతుశాస్త్రంలో 4 ప్రశ్నలుగానూ సబ్జెక్టుల వారీగా ఒక్క మార్కు ప్రశ్నలనూ ఉండనున్నాయి.

అన్ని కేంద్రాల్లోను కూడా సీసీ కెమెరాలు ఏర్పాటు చేయనున్నారు. వీటిని జిల్లా, రాష్ట్ర స్థాయిల్లో ఇంటర్మీడియట్ బోర్డుకు అనుసంధానం చేయనున్నారు. రాష్ట్ర స్థాయిలో ఒక్కో జిల్లాను ఒక్కో అధికారి పర్యవేక్షించనున్నారు. ఆయా కళాశాలలు సీసీ కెమెరా పుటేజ్ హార్డ్‌డిస్క్‌ను ఆర్ఐఓలకు ఇస్తాయి. అక్కడ వాటిని భద్రపరచనున్నారు.

# నోరులేని మూగజీవాలకు వరంగా గరివిడి పశువైద్య కళాశాల



- అద్భుత వైద్యం... అత్యాధునిక పరికరాలు... నామమాత్రపు ఫీజు

గరివిడి (విజయనగరం జిల్లా), ఫిబ్రవరి 12 ప్రభాతవార్త: నోరులేని మూగజీవాలకు గరివిడి పశువైద్య కళాశాల వరంలా నిలుస్తోంది. అత్యాధునిక పరికరాలు, నిష్ణాతులైన వైద్యులతో అద్భుతమైన చికిత్సలు అందిస్తూ మూగ జీవాలకు ప్రాణం పోస్తోంది. ఉత్తరాంధ్రకే తలమానికంగా నిలిచే గరివిడి పశువైద్య కళాశాల వేలాది జీవులకు ఊపిరిపోస్తూ ప్రాణవాయువుగా నిలుస్తోంది. ఉత్తరాంధ్ర జిల్లాలు నుండి ఇక్కడ తమ పశువులు, పక్షులు ఇతర నోరులేని మూగజీవాలకు పశుపోషకులు తీసుకువచ్చి వైద్యాన్ని అందిస్తూ ఉన్నారు. వేరేప్రాంతాల్లో వేల రూపాయలు వ్యయం అయ్యే శస్త్ర చికిత్సలు గరివిడి పశువైద్య కళాశాలలో నామమాత్రపు రుసుముతో శస్త్ర చికిత్సలు అందిస్తూ మూగజీవాల పాలిట కల్పతరువుగా ఈ వైద్య కళాశాల నిలుస్తోంది. తమ పశువులకు, పెంపుడు జంతువులకు వైద్యంతో పునర్జన్మ ను అందించే ఇక్కడ వైద్యులకు పశుపోషకులు నిత్యం కృతజ్ఞతలు తెలువుకుంటూ ఉన్నారు.

ఉత్తరాంధ్రలో మరెక్కడా లేని వైద్య పరికరాలతో వైద్యాన్ని జీవాలకు అందిస్తూ ఉండటం ఈ కళాశాల ఎంతో ఖ్యాతి గడిస్తూ ఉందని చెప్పక తప్పదు. గరివిడి పశువైద్య కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ మక్కేన శ్రీను పర్యవేక్షణలో గరివిడి పశువైద్య కళాశాల అసిస్టెంట్ ప్రొఫెసర్, పశువైద్య పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్, సీనియర్ సర్జన్ డాక్టర్ పి.రవి కుమార్ పశువులకు శస్త్రచికిత్సలు అందిస్తూ మూగజీవాలకు ఊపిరిపోస్తున్నారు. రోజుకి అరడజనుకి పైగా శస్త్ర చికిత్సలు చేస్తున్న డాక్టర్ రవికుమార్,తన జూనియర్ డాక్టర్ లతో కలిసి అనేక జీవాలకు మెరుగైన వైద్యాన్ని అందిస్తూ పశుపోషకులు నుండి ప్రశంసలు అందుకుంటున్నారు. ఉత్తరాంధ్ర లో చౌకైన వైద్యం, మెరుగైన సేవలతో పశువులకి జీవనాన్ని అందిస్తున్న గరివిడి పశువైద్య కళాశాల ఈ ప్రాంత పశుపోషకులు కల్పతరువుగా, మూగ జీవాలకు వరంగా నిలుస్తుందని పేర్కొనక తప్పదు. తమ రోగం చెప్పుకోలేని జీవాలకు వైద్యం అందించే పశువైద్యులు దైవంతో సమానులుగా పశుపోషకులు నుండి కీర్తి గడిస్తున్నారు. మెరుగైన, మేలైన సేవలను అందించే గరివిడి పశువైద్య కళాశాలను పశుపోషకులు సద్వినియోగపరచుకొని పశు సంపదను కాపాడుకోవాల్సిన అవశ్యం అవసరం ఎంతైనా ఉంది. ఆ దిశగా పశుపోషకులు అడుగులు వేస్తారని అభిలషిద్దాం.

# ప్రజా సమస్యలు ప్రతిబింబించేలా చర్చలు జరగాలి

- మండలిలో సమయపాలన..ఉదయం 10నుంచి 1.30వరకు సభ
- శాసనమండలి బిఏసి నిర్ణయం • మండలి చైర్మన్ కొయ్యే మోషేనురాజు

సచివాలయం, ఫిబ్రవరి 12 ప్రభాతవార్త: ప్రజా సమస్యలు ప్రతిబింబించేలా చర్చలు జరగాలని చైర్మన్ కొయ్యే మోషేను రాజు పిలుపునిచ్చారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర శాసనమండలి బడ్జెట్ సమావేశాల నిర్వహణపై మండలి చైర్మన్ కొయ్యే మోషేన్ రాజు అధ్యక్షతన బిజినెస్ అడ్వైజరీ కమిటీ (బిఏసి) సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ప్రభుత్వం తరపున మంత్రులు,విపక్ష నేతలు అన్నీ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.సభను అర్థవంతంగా, క్రమశిక్షణతో నిర్వహించడమే లక్ష్యంగా పలు కీలక మార్గదర్శకాలను చైర్మన్ ఖరారు చేశారు.సమావేశాల షెడ్యూల్‌పై చర్చించిన బిఏసి, ప్రతిరోజూ ఉదయం 10.00గంటలకు సభను ప్రారంభించి,మధ్యాహ్నం 1.30గంటల వరకు నిర్వహించాలని నిర్ణయించింది. ప్రజలకు సంబంధించిన కీలక బిల్లులు, బడ్జెట్ అంశాలపై చర్చించేందుకు తగిన సమయం కేటాయించడమే కాకుండా, సభా సమయాన్ని వృధా చేయకూడదని చైర్మన్ స్పష్టంచేశారు. సాధారణంగా సభలో ప్రశ్నోత్తరాల సమయం సుదీర్ఘంగా సాగుతుంటుంది. దీన్ని క్రమబద్ధీకరించేందుకు బిఏసి ఈ క్రింది నిర్ణయాలు తీసుకుంది. ప్రశ్నోత్తరాల సమయాన్ని గరిష్టంగా 90నిమిషాలకు పరిమితం చేశారు. తద్వారా ఇతర సభా వ్యవహారాలకు, బిల్లులపై చర్చకు ఆటంకం కలగకుండా చూడవచ్చని భావించారు. సభ్యులు అడిగే ప్రశ్నలు సుదీర్ఘ ప్రసంగాల మాదిరిగా ఉండకూడదని, నేరుగా సమస్యను ప్రస్తావించాలని చైర్మన్ సూచించారు. అదేవిధంగా మంత్రులు కూడా తమ సమాధానాలను సాగదీయకుండా, గణాంకాలు మరియు వివరాలతో క్లుప్తంగా వివరించాలని కోరారు. ప్రశ్నలు క్లుప్తంగా ఉంటేనే ఎక్కువ మంది సభ్యులకు అవకాశం లభిస్తుందని గుర్తుచేశారు. సభ సజావుగా సాగేలా అధికార, ప్రతిపక్ష పార్టీలు సమన్వయంతో వ్యవహరించాలని కోరారు. బిఏసిలో తీసుకున్న నిర్ణయాలను తూచా తప్పకుండా పాటించాలని, సభా గౌరవాన్ని కాపాడలని సూచించారు. ఈ సమావేశంలో శాసనసభ వ్యవహారాల మంత్రి,ప్రతిపక్ష నేత ఇతర పార్టీల ముఖ్యనేతలు పాల్గొని తమ అభిప్రాయాలను పంచుకున్నారు. బడ్జెట్ కేటాయింపులు, సంక్షేమ పథకాలు రాష్ట్రాభివృద్ధిపై ఈ సమావేశాల్లో విస్తృతంగా చర్చ జరిగే అవకాశం ఉంది.

# తిరుపతిలో డ్రగ్స్ కలకలం

- 8 మంది అరెస్ట్... • మాదకద్రవ్యాలు, సిరప్ బాటిళ్లు స్వాధీనం

తిరుపతి, ఫిబ్రవరి 12 ప్రభాతవార్త ప్రతినిధి: తిరుపతి జిల్లా కేంద్రం లో తిరుపతి ఈస్ట్ పోలీస్ స్టేషన్ పరిధిలో నిషేధిత మందులను అక్రమంగా విక్రయిస్తున్న ముఠాపై పోలీసులు దాడులు చేశారు. ఎనిమిది మంది ముద్దాయిలను అరెస్ట్ చేసి, 33 బ్యాగులు డ్రగ్స్‌ను, సిరప్ బాటిళ్ల స్వాధీనం చేసుకున్నట్లు తిరుపతి డీఎస్పీ భక్తవత్సలం తెలిపారు. తిరుపతి నగరంలో నిషేధిత, మత్తు మందుల అక్రమ విక్రయాలపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి, ఇలాంటి కార్యకలాపాలపై కఠిన చర్యలు కొనసాగించాలని పోలీసు అధికారులకు ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపారు. యువతను, కార్మిక వర్గాలను లక్ష్యంగా చేసుకుని అక్రమంగా మందులు విక్రయించే వ్యక్తులపై ప్రత్యేక దృష్టి పెట్టామని, ఫార్మసీలు, మెడికల్ డిస్ట్రిబ్యూటర్లపై కూడా నిరంతర తనిఖీలు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు.

**నేరం జరిగిన విధానం:**

ప్రధాన ముద్దాయి లక్కిసెట్టి నాగార్జున అనంతపురం ప్రాంతంలో మెడికల్ డిస్ట్రిబ్యూషన్ ద్వారా నిషేధిత మందులను సరఫరా చేస్తుండగా, పాతకమూరి నాగేశ్వరరావు వాటిని తక్కువ ధరకు కొనుగోలు చేసి మధ్యవర్తుల ద్వారా విక్రయించేవాడు. అలతూరు రాజ్ కుమార్ ఈ మందులను భారీ మొత్తంలో కొనుగోలు చేసి తిరుపతి ప్రాంతంలో ఆటో డ్రైవర్లు, వలస కూలీలకు అధిక ధరలకు విక్రయిస్తూ అక్రమ లాభాలు పొందుతున్నాడు. ఇతర ముద్దాయిలను కూడా ఈ వ్యాపారంలో భాగస్వామ్యం చేసి మందులను సరఫరా చేయించగా, పోలీసులు సమాచారంపై దాడి చేసి మందులను పంచుకుంటున్న సమయంలో ఎనిమిది మందిని పట్టుకొని డ్రగ్స్ కంట్రోల్ అడ్మినిస్ట్రేషన్‌కి లక్కిసెట్టి నాగార్జున, కుదుముల జనార్ధన్, పాతకమూరి నాగేశ్వరరావు, మేదూరి గౌతమ్, అలతూరు రాజ్ కుమార్, కోనేటి జగదీష్ బాబు, దిగవిండ్ల ఆంజనేయులు, వెంకటేష్లను అరెస్ట్ చేశారు ధనమ్మ, పద్మ, చందు, ప్రతాప్, విష్ణు, ప్రదీప్ పరారీలో ఉన్నారు.

# ఉద్యోగుల తప్పిదం... ఓ తల్లికి మిగిల్చిన ఆవేదన



దత్తిరాజేరు (విజయనగరం జిల్లా), ఫిబ్రవరి 12, ప్రభాతవార్త: ఉద్యోగులు చేసిన తప్పిదం కారణంగా ఓ తల్లి ఆవేదనకు గురి అయింది. ఓ విద్యార్థికి తల్లికి వందనం మంజూరు విషయంలో వాస్తవ పరిస్థితులను తెలుసుకోకుండా ఉద్యోగులు చేసిన ఆన్లైన్ అప్ లోడ్ తప్పిదం వల్ల ఆ తల్లికి ఆవేదన మిగిల్చింది. వివరాలు ఇలా ఉన్నాయి. దత్తిరాజేరు మండలం చిన్న కాద గ్రామానికి చెందిన మన్యాల జానకి, చంద్రరావు దంపతులకు ధనశ్రీ, హర్షవర్ధన్ అనే ఇద్దరు పిల్లలు ఉన్నారు. భార్య భర్తల మధ్య మనస్పర్థలు కారణంగా గత ఎనిమిది సంవత్సరాలుగా ఇద్దరు వేర్వేరుగా ఉంటున్నారు. పిల్లలు సంరక్షణ బాధ్యత మాత్రం తల్లి జానకి చూసుకుంటున్నది. ఈ క్రమంలో కూటమి ప్రభుత్వం ప్రకటించిన తల్లికి వందనం పథకం ఇద్దరు పిల్లలకు వర్తిస్తుందని ఆశగా ఎదురు చూసింది. అయితే తల్లికి వందనం సొమ్ము కేవలం కూతురు ధనశ్రీకి మాత్రమే జమ అయిందని, కొడుకు హర్షవర్ధన్ పేరిట రావలసిన తల్లికి వందనం సొమ్ము ఇంతవరకు జమ కాలేదని ఆ తల్లి ఆవేదన చెందుతుంది. అటు గ్రామ సచివాలయానికి, ఇటు ప్రాథమిక పాఠశాలకు ఎన్నిసార్లు తిరిగి మొరపెట్టుకున్న సమస్య పరిష్కారం కాలేదని జానకి విలేకరులకు వివరించింది. అయితే తన సంరక్షణలో ఉన్న కుమారుడు హర్షవర్ధన్ పేరును తండ్రి చంద్ర రావు పేరుతో లింక్ అవ్వడం వల్లనే తనకు సమస్య ఎదురయిందని జిల్లా కలెక్టర్ గ్రీవెన్స్ లో మొరపెట్టుకున్న తనకు న్యాయం జరగలేదని ఆమె ఆవేదన వ్యక్తం చేసింది. తన సంరక్షణలో ఉన్న కొడుకు పేరును తండ్రి ఆధార్ కార్డుకు ఎలా లింక్ చేశారని ఆమె ప్రశ్నిస్తున్నది. ఆ తప్పిదానికి పాల్పడిన సచివాలయ ఉద్యోగులపై చర్యలు చేపట్టాలని జానకి కోరుతున్నది.

# హాజ్ యాత్రికుల ఆరోగ్య భద్రతే ముఖ్యం




గుంటూరు, ఫిబ్రవరి 12 ప్రభాతవార్త ప్రతినిధి: పవిత్ర హాజ్ యాత్రకు వెళ్లే యాత్రికుల ఆరోగ్య భద్రతకు రాష్ట్ర ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యత ఇస్తోందని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర హాజ్ కమిటీ ఛైర్మన్ జనాబ్ షేక్ హసన్ బాషా పేర్కొన్నారు. గురువారం గుంటూరు జిజిహెచ్‌లో హాజ్ యాత్రికుల కోసం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన మెడికల్ స్క్రీనింగ్, వ్యాక్సినేషన్ క్యాంపును చైర్మన్ పర్యవేక్షించారు. ఈ సందర్భంగా చైర్మన్ హసన్ బాషా మాట్లాడుతూ హాజ్ యాత్రకు వెళ్లే ప్రతి యాత్రికుడికి అంతర్జాతీయ ప్రమాణాల ప్రకారం అవసరమైన మెనింజైటిస్, పోలియో, సీజనల్ ఇన్ఫ్లుయెంజా వ్యాక్సిన్లను ఉచితంగా అందిస్తున్నట్లు తెలిపారు. యాత్రికులు సౌదీ అరేబియాలో ఎటువంటి అనారోగ్య సమస్యలు తలెత్తకుండా, క్షేమంగా యాత్రను ముగించుకుని తిరిగి రావాలన్నదే ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు, హాజ్ కమిటీ ప్రధాన ఉద్దేశమని అన్నారు. యాత్రికులు ఆరోగ్య సూత్రాలను పాటిస్తూ, యాత్రను విజయవంతం చేసుకోవాలని కోరారు.



**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 12:** లోక్‌సభ స్పీకర్ చాంబర్‌లోకి దూసుకెళ్లి విపక్ష ఎంపీలు దుర్భాషలాడారని పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు ఆరోపించారు. ఇందుకు సంబంధించిన వీడియోను సోషల్ మీడియాలో విడుదల చేశారు.

# స్పీకర్ చాంబర్‌లోకి వెళ్లి బెదరించారు.. ఇదిగో ఆధారం!

- విపక్ష ఎంపీలపై కేంద్రమంత్రి రిజిజు ఆరోపణలు • స్పీకర్ చాంబర్‌లో ఘటనపై విడియో విడుదల

స్పీకర్ ఛాంబర్ లోపల అనేక మంది మహిళా కాంగ్రెస్ ఎంపీలు బిజెపి మంత్రులతో తీవ్ర వాగ్వాదానికి దిగిన దృశ్యాలను ఈ ఫుటేజ్‌లో కనిపిస్తుంది. ఫిబ్రవరి 4న జరిగిన పార్లమెంటరీ ప్రతిష్టంభన సమయంలో కాంగ్రెస్ ఎంపీలు స్పీకర్ ఓం బిర్లాపై దూషణలు చేసి, ప్రధానమంత్రి నరేంద్ర మోడీని లక్ష్యంగా చేసుకుని బెదిరింపులు జారీ చేశారని ఆరోపించారు. 20-25 మంది కాంగ్రెస్ ఎంపీలు లోక్ సభ స్పీకర్‌ను దుర్భాషలాడి, ప్రధానిని బెదిరించారని ఆరోపించారు. బిజెపి, ఎన్డీఏ ఎంపీలకు 'పూర్తి స్వేచ్ఛ' ఇచ్చి ఉంటే పరిస్థితి గందరగోళంగా మారేదని, కానీ అధికార కూటమి అసహ్యకరమైన దృశ్యాన్ని నివారించడానికి సంయమనం పాటించిందని అన్నారు. 'దాదాపు 20-25 మంది ఎంపీలు స్పీకర్ ఛాంబర్‌లోకి బలవంతంగా ప్రవేశించారు. అప్పుడు ఏమి జరిగిందో, వారు ఎలాంటి దుర్వినియోగం చేస్తున్నారో చూడటానికి తాను పరిగెత్తాను. వారు దుర్భాషలాడుతున్నారు. ప్రియాంక గాంధీ కూడా అక్కడే ఉన్నారు. వారు స్పీకర్, ప్రధాన మంత్రిని ఆమె ముందు దుర్భాషలాడారు' అని రిజిజు అన్నారు. కాంగ్రెస్ నాయకులు కె.సి. వేణుగోపాల్, ప్రియాంక గాంధీ వాద్రా ఎవరినీ దుర్భాషలాడలేదని, అయితే అనేక మంది కాంగ్రెస్ ఎంపీలు వారి సమక్షంలో అభ్యంతరకర వ్యాఖ్యలతో దూషించారని ఆయన ఆరోపించారు.

**అవన్నీ అబద్ధాలు: ప్రియాంకగాంధీ**

పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు చేసిన ఆరోపణలన్నీ 'అబద్ధం' అని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి, ఎంపి ప్రియాంక గాంధీ పేర్కొన్నారు. 'తాము ఎవరినీ దుర్భాషలాడలేదు. పరుష పదజాలం ఉపయోగించలేదు. ఒకరు లేదా ఇద్దరు ఎంపీలు ఆందోళన వ్యక్తం చేశారు. ప్రోత్సహించాననడం శుద్ధ అబద్ధం. తాను మౌనంగా కూర్చున్నా. చివరికి, తాను స్పీకర్‌కు శాంతియుతంగా కొన్ని విషయాలు చెప్పాను.' అని ప్రియాంక గాంధీ వివరించారు.

# రాజ్ కెసిరెడ్డికి సుప్రీంలో చుక్కెదురు

**బెయిల్ పిటిషన్ విచారించేందుకు నిరాకరణ**

విజయవాడ, ఫిబ్రవరి 12 ప్రభాతవార్త ప్రతినిధి: మద్యం కుంభకోణం కేసులో రాజ్ కెసిరెడ్డికి రెగ్యూలర్ బెయిల్ పిటిషన్‌ను ఉపసంహరించుకోవడానికి ధర్మాసనం అనుమతించింది. ఈ క్రమంలో ఏపీ మద్యం కుంభకోణం కేసులో కసిరెడ్డి పాత్రపై సుప్రీం కోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. మొత్తం వ్యవహారానికి ఆర్కిటెక్ట్ రాజ్ కెసిరెడ్డి అని సుప్రీంకోర్టు పేర్కొంది. ఏపీ మద్యం కుంభకోణం చాలా పెద్దదని సీజేఐ జస్టిస్ సూర్యకాంత్ వ్యాఖ్యానించారు. అధికారులు కుమ్మక్కు కాకపోతే ఇలాంటి పెద్ద స్కామ్‌లు జరగవని, కుమ్మక్కైన అధికారులను అరెస్టు చేయకపోవడం దురదృష్టకరమని సీజేఐ అన్నారు. కెసిరెడ్డి తరపు న్యాయవాది వాదిస్తూ కెసిరెడ్డి ప్రభుత్వానికి సలహాదారు మాత్రనేనని అన్నారు. ఈ వాదనలను సీజేఐ ధర్మాసనం తోసిపుచ్చింది. కెసిరెడ్డిసలహాదారు కాదని, మొత్తం స్కామ్‌కు ఆయనే ఆర్కిటెక్ట్ అని ధర్మాసనం పేర్కొంది. పదవిలో ఉన్నవారి అండ లేకుంటే అధికారులు ఇలా చేయలేదని, ఈ కుంభకోణంలో ప్రధాన సూత్రదారుడు రాజ్ కెసిరెడ్డేనని ధర్మాసనం తేల్చి చెప్పింది. ఇప్పటికే 10 నెలలుగా కెసిరెడ్డి జైలులో ఉన్నారని, సప్లిమెంటరీ ఛార్జిషీట్లు కూడా దాఖలు చేశామని ఆయన తరపు న్యాయవాది తెలపగా, ఏం కాదు మరికొంతకాలం జైలులో ఉండనీయండని సీజేఐ జస్టిస్ సూర్యకాంత్ పేర్కొన్నారు. కెసిరెడ్డికి రెగ్యులర్ బెయిల్ ఇచ్చేది లేదంటూ రాజ్ కెసిరెడ్డి పిటిషన్‌ను డిస్మిస్ చేసేందుకు సీజేఐ ధర్మాసనం సిద్ధమైంది. ఈ నేపథ్యంలో పిటిషన్‌ను ఉపసంహరించుకుంటామని రాజ్ కెసిరెడ్డి తరపు న్యాయవాది తెలిపారు. దీంతో రాజ్ కెసిరెడ్డి పిటిషన్‌ను ఉపసంహరించుకోవడానికి ధర్మాసనం అనుమతించింది.

# విడాకుల తర్వాత భర్త ఇంట్లోకి వెళ్లే హక్కు భార్యకు లేదు!

## ఢిల్లీ హైకోర్టు స్పష్టమైన తీర్పు

**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 12:** గృహహింస నిరోధక చట్టం కింద మహిళలకు కల్పించిన హక్కులపై ఢిల్లీ హైకోర్టు స్పష్టమైనవివరణ ఇచ్చింది. ఒక మహిళ భర్తతో విడాకులు తీసుకుని స్వచ్ఛందంగా అత్తారింటిని విడిచి పెట్టి ఆ తర్వాత తిరిగి అతడి ఇంట్లోకి ప్రవేశం కల్పించాలని కోరే హక్కు ఉండదని స్పష్టం చేసింది. అలాగే నివసించడానికి ప్రత్యామ్నాయ వసతి ఉన్నప్పుడు అత్తా రింటిపై పట్టుబట్టడం చట్ట విరుద్ధమని కూడా కోర్టు పేర్కొంది. ముఖ్యంగా 81 ఏళ్ల వయసు కల్గిన ఓ వృద్ధురాలు మాజీ భర్త ఇంట్లో ఉండడానికి అవకాశం కల్పించాలంటూ వేసిన పిటిషన్‌ను నిర్మొహమాటంగా కొట్టేసింది. 81 ఏళ్ల వయసున్న ఒక మహిళ గతంలోనే తన భర్తతో విడాకులు తీసుకుంది. అయినప్పటికీ అతడి ఇంట్లోనే ఉంటూ వచ్చింది. అతడికి వేరే ఇళ్లు ఉండగా అతనక్కడికి వెళ్లిపోయాడు. అయితే దాదాపు 60 ఏళ్లుగా ఆ ఇంట్లోనే ఉన్న వృద్ధురాలు 2023 ఏప్రిల్‌లో కేవలం వైద్య చికిత్స కోసం తన కుమార్తె ఇంటికి వెళ్లింది. మళ్లీ ఇప్పుడు తిరిగి తన ఇంటికి రాగా భర్త లోపలికి రానివ్వకుండా అడ్డుకున్నాడు. దీనివల్ల తాను ఆశ్రయం లేనిదాన్ని అయ్యానని చెబుతూ ఆమె ట్రయల్ కోర్టుకు వెళ్లారు. విచారణ జరిపిన సదరు న్యాయస్థానం ఆమె అభ్యర్థనను తిరస్కరించింది. దీంతో ఆమె హైకోర్టును ఆశ్రయించారు. ఈక్రమంలోనే విచారణ జరిపిన న్యాయస్థానం సంచలన తీర్పు వెలువరించింది. సదరు మహిళ తన ఇష్ట పూర్వకంగానే ఏప్రిల్ 2023లో రెండో ఇంటికి మారారని కోర్టు గుర్తించింది. ఇంటి బయట ఆమె పేరుతో ఉన్న నేమ్ ప్లేట్ కూడా ఉందని, ఇది తాత్కాలిక మార్పు కాదని, శాశ్వత నివాసమేనని కోర్టు ధృవీకరించింది. అయితే ఇప్పుడు ఆమె వెళ్లాలనుకుంటున్న ఇంటికి భర్త రానివ్వకపోవడం వల్ల ఆమె ఏమీ రోడ్డున పడలేదని చెప్పింది. మొన్నటి వరకు కుమార్తెతో కలిసి ఉన్న ఇళ్లు కూడా ఆమె భర్తదే అని గుర్తించింది. అక్కడితో ఆగకుండా న్యాయస్థానం.. ఈ పిటిషన్ వెనుక ఆస్తి వివాదం దాగి ఉందని చెప్పింది. కుమార్తెకు ఆస్తిలో వాటా ఇప్పించడానికే వృద్ధురాలు ఈ చట్టాన్ని వాడుకుంటున్నట్లు భర్త తరపు లాయర్ చేసిన వాదనను కోర్టు పరిగణనలోకి తీసుకుంది. ఒకసారి స్వచ్ఛందంగా నివాసం మార్చిన తర్వాత ప్రస్తుతం ఆ ఇంట్లో ఉంటున్న వారిని ఇబ్బంది పెడుతూ రీఎంట్రీ ఇవ్వడం చట్టం పరిధి దాటడమే అవుతుందని స్పష్టం చేసింది. అలాగే గృహహింస చట్టంలోని సెక్షన్ 19 ప్రకారం ఒక మహిళ నిరాశ్రయురాలు కాకుండా చూడటమే మెజిస్ట్రేట్ బాధ్యత అని తేల్చి చెప్పింది. ఇది విచక్షణాధికారం మీద ఆధారపడి ఉంటుందని బాధితురాలికి సమాన స్థాయి కలిగిన ప్రత్యామ్నాయ వసతి ఉన్నప్పుడు, ఒక నిర్దిష్ట ఆస్తిలోనే ఉండాలని కోరే హక్కు ఆమెకు ఉండదని జస్టిస్ దుదేజా స్పష్టం చేశారు. గృహహింస చట్టం అనేది నిజమైన బాధితుల కోస మాత్రమే అని.. దుర్వినియోగం చేసే వారి కోసం కాదని స్పష్టం చేసింది.

# రంగంలోకి కొత్త 'రాఫెల్' విమానాలు!



### రూ.3.25 లక్షల కోట్లతో 114 జెట్ ఫైటర్స్ కొనుగోలుకు కేంద్రం గ్రీన్ సిగ్నల్

### 17న ఫ్రాన్స్ అధ్యక్షుడు మెక్రాన్ రాక

### 8 డోర్నియర్ విమానాల కోసం హెచ్ఎఎల్‌తో ఎంఒయు

**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 12:** భారత వైమానిక దళం కోసం ఫ్రాన్స్ నుంచి 114 రాఫెల్ యుద్ధ విమానాలను కొనుగోలు చేయాలనే రూ.3.25 లక్షల కోట్ల ప్రతిపాదనకు రక్షణ మంత్రిత్వ శాఖ గురువారం ఆమోదం తెలిపింది. రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ అధ్యక్షతన నిర్వహించిన రక్షణ సముపార్జన మండలి (డిఎసి) రాఫెల్ జెట్ విమానాల కొనుగోలుకు అనుమతి ఇచ్చింది. ఫ్రెంచ్ అధ్యక్షుడు ఇమ్మాన్యుయేల్ మెక్రాన్ రాబోయే ఢిల్లీ అధికారిక పర్యటనకు ముందు ఈ అనుమతి లభించింది. మెక్రాన్ ఈ నెల 17న భారత పర్యటనకు వస్తున్న విషయం తెలిసిందే. రక్షణ మంత్రిత్వ శాఖ ఆమోదం పొందిన తర్వాత, ఈ ఒప్పందానికి చివరికి ప్రధానమంత్రి నరేంద్ర మోడీ అధ్యక్షతన జరిగే భద్రతా వ్యవహారాల కేబినెట్ కమిటీ నుండి అనుమతి అవసరం. ప్రతిపాదన ప్రకారం, భారత్, ఫ్రెంచ్ రక్షణ దిగ్గజం డసాల్ట్ ఏవియేషన్ నుండి 18 ఆఫ్‌దిషెల్ఫ్ రాఫెల్ యుద్ధ విమానాలను కొనుగోలు చేస్తుంది. మిగిలిన 96 యుద్ధ విమానాలు భారతదేశంలో తయారు చేయబడతాయి. ఇంకా, ఈ జెట్‌లలో కొన్ని శిక్షణ కోసం ఉపయోగించబడే జంటసీట్ల విమానాలు. ఈ ఒప్పందంలో అత్యాధునిక యుద్ధ జెట్ సాంకేతికతను బదిలీ చేయడం, 'మేక్ ఇన్ ఇండియా' కార్యక్రమానికి పూరకంగా వ్యూహాత్మక భాగస్వామ్యం ఉంటుంది. భారత వైమానిక దళం ఇప్పటికే రెండు స్క్వాడ్రన్‌లను కలిగి ఉన్న 36 రాఫెల్‌లను కలిగి ఉంది, 'సి' వేరియంట్ చివరి డెలివరీ డిసెంబర్ 2024లో జరిగింది. అయితే, 'ఎం' వెర్షన్ మరో 26 రాఫెల్ జెట్‌లను కూడా భారత నౌకాదళం కోసం రూ. 63,000 కోట్ల విలువైన ఒప్పందంలో ఆర్డర్ చేశారు. నావికా వేరియంట్‌లను విమాన వాహక నౌకలు ఐఎన్ఎస్ విక్రాంత్. ఐఎన్ఎస్ విక్రమాదిత్య నుండి నిర్వహిస్తారు. ఆ ఒప్పందంలో ఎంఆర్ఓ (నిర్వహణ, మరమ్మత్తు, సమగ్ర పరిశీలన) ఒప్పందం కింద విమానాల నిర్వహణ, లాజిస్టిక్స్ మద్దతు, సిబ్బంది శిక్షణను సులభతరం చేయనుంది.

**ఆపరేషన్ సిందూర్‌లో రాఫెల్ జెట్ల వినియోగం**

మే 2025లో పహల్గామ్ ఉగ్రవాద దాడికి భారత్ సైనికచర్యలో భాగంగా పాకిస్తాన్‌లోని ఖచ్చితమైన లక్ష్యాలను ఛేదించడానికి ఆపరేషన్ సిందూర్‌లో రాఫెల్ జెట్‌లను విజయవంతంగా ఉపయోగించారు. 250 కి.మీ కంటే ఎక్కువ దూరంలోని నిర్దేశిత లక్ష్యాలను అత్యంత ఖచ్చితత్వంతో ఛేదించగల ఎస్‌సిఎఎల్‌పి అనే వాయుప్రయోగ క్రూయిజ్ క్షి పణిని ప్రయోగించడానికి వీటిని ఉపయోగించారు. అత్యాధునిక యుద్ధ విమానం, రాఫెల్, మెటియోర్ లాంగ్‌రేంజ్ గగనతలం నుంచి గగనతలం క్షి పణులు, స్టాండ్‌ఆఫ్ స్ట్రైక్ ఆయుధం హామర్, అధునాతన ఇవార్‌ఫేర్ సూట్ అయిన స్పెక్ట్రా, అలాగే అధునాతన రాడార్, లక్ష్య వ్యవస్థలను కూడా మోసుకెళ్లగలదు.

**8 డోర్నియర్ 228 విమానాల కోసం కేంద్రం హెచ్ఎఎల్‌తో ఒప్పందం**

ఇండియన్ కోస్ట్ గార్డ్ (ఐసిజి) కోసం ఎనిమిది డోర్నియర్ 228 విమానాలను, ఆపరేషనల్ రోల్ పరికరాలను రూ.2,312 కోట్లకు కొనుగోలు చేయడానికి హిందుస్తాన్ ఏరోనాటిక్స్ లిమిటెడ్ (హెచ్ఎఎల్)తో ఒప్పందంపై సంతకం చేసినట్లు రక్షణ మంత్రిత్వ శాఖ గురువారం తెలిపింది. ఈ ఆర్డర్ హెచ్ఎఎల్ ఉత్పత్తి పర్యావరణ వ్యవస్థను బలోపేతం చేయడం, ఎంఎస్ఎంఇలు, అనుబంధ పరిశ్రమల విస్తృత నెట్‌వర్క్‌కు మద్దతు ఇవ్వడం ద్వారా గణనీయమైన ప్రత్యక్ష, పరోక్ష ఉపాధిని సృష్టిస్తుందని భావిస్తున్నారు. ఇది నిర్వహణ, మరమ్మత్తు, ఓవర్‌హాల్, లైఫ్ సైకిల్ సాంకేతిక మద్దతులో స్థిరమైన అవకాశాలను కూడా సృష్టిస్తుందని అధికారిక ప్రకటన తెలిపింది. రక్షణ కార్యదర్శి రాజేష్ కుమార్ సింగ్ సమక్షంలో బై (ఇండియన్) కేటగిరీ కింద ఒప్పందంపై సంతకం చేశారు.



### బంగ్లా ఎన్నికల్లో బిఎన్పీ కూటమి క్లీన్‌స్వీప్!

# ప్రధాని రేసులో తారిక్ రెహమాన్

**ఢాకా, ఫిబ్రవరి 12:** బంగ్లాదేశ్‌లో అత్యంత కీలక ఎన్నికలు జరుగుతున్నాయి. ఆ దేశ దశ దిశను మార్చే ఎన్నికలుగా ఇవి ఉండబోతున్నాయి. షేక్ హసీనా 2024లో జరిగిన హింసాత్మక ఘర్షణల తర్వాత, తన ప్రధాని పదవికి రాజీనామా చేసి భారత్‌లో ఆశ్రయం పొందుతున్నారు. మరోవైపు, తాత్కాలిక పాలకుడిగా వచ్చిన మహ్మద్ యూనస్ పచ్చి భారత వ్యతిరేక వైఖరిని అవలంభించాడు. భారత్‌ను వ్యతిరేకిస్తూ, పాకిస్తాన్‌తో సంబంధాలు మెరుగుపరుచుకున్నాడు. గతంలో ఎప్పుడూ లేని విధంగా బంగ్లా వ్యాప్తంగా ఇస్లామిస్టులు రాజ్యమేలుతున్నారు. మతోన్మాద దాడులు, హిందువులపై అకృత్యాలు నిత్యకృత్యంగా ఉన్నాయి. ఇలాంటి తరుణంలో జరుగుతున్న ఈ ఎన్నికలకు చాలా ప్రధాన్యత ఏర్పడింది. ఈసారి ఎన్నికల్లో బంగ్లాదేశ్ నేషనలిస్ట్ పార్టీ(బీఎన్‌పీ), జమాతే ఇస్లామీ కూటమికి మధ్య తీవ్ర పోటీ ఉంటుందని సర్వేలు చెబుతున్నాయి. ఇక షేక్ హసీనాకు చెందిన అవామీ లీగ్‌ను యూనస్ సర్కార్ నిషేధించింది. జమాత్ నేతృత్వంలో 11 పార్టీలు కూటమిగా ఏర్పడి పోటీ చేస్తున్నాయి. 17 ఏళ్ల ప్రవాసం తర్వాత బంగ్లాదేశ్ వచ్చిన మాజీ ప్రధాని ఖలీదా జియా కుమారుడు తారిక్ రెహ్మాన్ బంగ్లాదేశ్ ప్రధాని రేసులో ముందు వరసలో ఉన్నాడు. ఈసారి డబుల్ బ్యాలెట్ పద్ధతిలో ఎన్నికలు జరుగనున్నాయి. దీంట్లో ఒక ఓటు ఎంపీకి, మరో ఓటు జులై చార్టర్ రిఫరెండం కోసం. ఈ రిఫరెండం ద్వారా ప్రధాని అధికారాలపై ఆంక్షలు, జ్యుడీషియరీ స్వాతంత్రంపై ప్రజాభిప్రాయాన్ని కోరుతారు. బంగ్లాదేశ్‌లో 350 సీట్లు ఉండగా, ఇందులో 299 స్థానాలకు పోలింగ్ జరిగింది. 50 స్థానాలు మహిళలకు కేటాయించారు. వీటికి పరోక్షంగా ఎన్నికలు జరుగుతాయి. ఢాకా ట్రిబ్యూన్ రిపోర్ట్ ప్రకారం బీఎన్‌పీ అలయన్స్ 208 సీట్లు సాధించి, క్లీన్ స్వీప్ చేస్తుందని చెబుతోంది. జమాత్ అలయన్స్‌కు 46 సీట్లు, జాతియా పార్టీకి 3 సీట్లు వస్తాయని అంచనా వేసింది. ఓట్ షేర్ ప్రకారం చూస్తే బీఎన్‌పీకి 66.3 శాతం, జమాత్‌కు 11.9 శాతం ఓట్లు సాధించే ఛాన్స్ ఉందని చెప్పింది. ఎన్ఆర్‌సీ సర్వే ప్రకారం బీఎన్‌పీ 77 శాతం ఓట్ షేర్‌తో 220 సీట్లు గెలుస్తుందని, జమాత్ 57 సీట్లతో సరిపెట్టుకోవాల్సి వస్తుందని వెల్లడించింది. ప్రోథోం ఆలో రిపోర్ట్ మాత్రం బీఎన్‌పీ, జమాత్ మధ్య తీవ్రమైన పోటీ ఉంటుందని చెప్పింది. జమాత్ అలయన్స్ 105 సీట్లు, బీఎన్‌పీ అలయన్స్ 101 సీట్లు గెలుస్తుందని చెప్పింది. ఓట్ షేర్ బీఎన్‌పీకి 44.1 శాతం, జమాత్ అలయన్స్ 43.9 శాతం వస్తుందని అంచనా వేసింది. 77 సీట్లలో ఇద్దరి మధ్య టఫ్ ఫైట్ ఉంటుందని చెప్పింది.



## టర్కీ పార్లమెంట్‌లో ఫైటింగ్..

### కొట్టుకున్న అధికార-విపక్ష ఎంపిలు

**అంకారా, ఫిబ్రవరి 12:** టర్కీ పార్లమెంట్ రణరంగంగా మారింది. ప్రజాప్రతినిధులు వీధి రౌడీల్లా కొట్టుకున్నారు. పిడిగుద్దులు గుద్దుకుంటూ.. తన్నుకుంటూ నానా రభస చేశారు. ప్రస్తుతం ఇందుకు సంబంధించిన విడియో వైరల్ అవుతోంది. ఇస్తాంబుల్ చీఫ్ ప్రాసిక్యూటర్ అకిన్ గుర్లెక్ పార్లమెంట్‌లో న్యాయ శాఖ మంత్రిగా ప్రమాణస్వీకారం చేయబోతుండగా ప్రతిపక్ష ఎంపీలు అడ్డుకునే ప్రయత్నం చేశారు. దీంతో అధికార-ప్రతిపక్ష ఎంపీలు ఒకరినొకరు కొట్టుకోవడం.. తన్నుకుంటూ కనిపించారు. చాలాసేపు ముష్టి యుద్ధం జరిగింది. ఇస్తాంబుల్ చీఫ్ ప్రాసిక్యూటర్‌గా గుర్లెక్.. ప్రధాన ప్రతిపక్ష పార్టీ అయిన రిపబ్లికన్ పీపుల్స్ పార్టీకి చెందిన అనేకమంది సభ్యులపై ఉన్నతస్థాయి విచారణలకు అధ్యక్షు వహించారు. ప్రతిపక్షం చాలాకాలంగా ఈ విచారణలను రాజకీయంగా ప్రేరేపించబడ్డాయని విమర్శిస్తోంది. ఇప్పుడు టర్కీ అధ్యక్షుడు రెసెప్ తయ్యిప్ ఎర్డోగన్.. అకిన్ గుర్లెక్‌ను న్యాయమంత్రిగా నియమించింది. బుధవారం ఆయన ప్రమాణస్వీకారం చేస్తుండగా ప్రతిపక్షాలకు ఆగ్రహం తెప్పించింది. ప్రతిపక్ష రిపబ్లికన్ పీపుల్స్ పార్టీ నియంత్రణలో ఉన్న మునిసిపాలిటీలకు చెందిన వందలాది మంది అధికారులను అవినీతి దర్యాప్తులో అరెస్టు చేశారు. వీరిలో ఇస్తాంబులక్ష మేయర్ ఎక్రెమ్ ఇమామోగ్లు కూడా ఉన్నారు. ఆయనను గత సంవత్సరం అరెస్టు చేశారు. ఈ నేపథ్యంలో ప్రతిపక్షాలకు కోపం తెప్పించింది.

# ట్రంప్-నెతన్యాహు కీలక భేటీ

### ఇరాన్ అణు ఒప్పందంపై రహస్య చర్చలు



**వాషింగ్టన్, ఫిబ్రవరి 12:** ఇరాన్-అమెరికా మధ్య ఉద్రిక్తతలు కొనసాగుతున్న వేళ ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహు అగ్రరాజ్యంలో పర్యటన ఆసక్తి రేపుతోంది. బుధవారం వైట్‌హౌస్‌లో మూడు గంటలపాటు ట్రంప్- నెతన్యాహు రహస్యంగా సమావేశం అయ్యారు. పలు కీలక అంశాలపై చర్చించినట్లుగా తెలుస్తోంది. ఇక ఇద్దరి సమావేశం తర్వాత ట్రంప్ ట్రూత్ సోషల్ మీడియాలో కీలక వ్యాఖ్యలు చేశారు. టెహ్రాన్‌తో చర్చలు జరుగు తున్నాయని.. దౌత్యం అనిశ్చితంగానే ఉందని తెలిపారు. చర్చలు విఫలమైతే సమన్వయం కొనసాగుతుందని సంకే తాలు ఇచ్చారు. ఇరాన్‌తో నిరంతర చర్చలకు ఒత్తిడి తెచ్చానని.. ఇప్పటికీ చర్చలకు తలుపులు తెరిచే ఉన్నాయని పేర్కొన్నారు. మొత్తానికి వార్నింగ్‌ల దగ్గర నుంచి చర్చలకు ట్రంప్ తెరలేపారు. డిసెంబరు 28 నుంచి ఇరాన్‌లో ఉద్రిక్తత పరిస్థితులు కొనసాగుతున్నాయి. ఖమేనీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా ప్రజలు తిరుగుబాటు చేశారు. పెద్ద ఎత్తున హింస చెలరేగింది. ఇక భద్రతా దళాల కాల్పుల్లో 30 వేల మంది చనిపోయారు. దీంతో ట్రంప్ రంగంలోకి దిగి.. నిరసన కారులను చంపితే సైనిక చర్యకు దిగుతామని హెచ్చరించారు. అన్నట్టుగానే యుఎస్ఎస్ అబ్రహం లింకన్ నౌక అరేబియా సముద్రానికి వచ్చి మోహరించింది. తక్షణమే అణు ఒప్పందం చేసుకోవాలని ఇరాన్‌పై ట్రంప్ తీవ్ర ఒత్తిడి చేశారు. ప్రస్తుతం రెండు దేశాల మధ్య చర్చలు జరుగుతున్నాయి. ఇలాంటి తరుణంలో ట్రంప్-నెతన్యాహు భేటీ ప్రాధాన్యత సంతరించుకుంది. ఇదిలా ఉంటే అమెరికా నేతృత్వంలో ఏర్పడిన బోర్డ్ ఆఫ్ పీస్‌లో ఇజ్రాయెల్ చేరింది. చాలా రోజుల తర్జన భర్జన తర్వాత నెతన్యాహు సంతకం చేశారు. ఈ ఫోరమ్‌లో పాశ్చాత్య భాగస్వాములతో పాటు టర్కీ, ఖతార్ కూడా ఉన్నాయి. గతంలో గాజాలో వారి పాత్రపై ఇజ్రాయెల్ విమర్శలు చేసింది. మొత్తానికి శాంతి మండలిలో ఇజ్రాయెల్ చేరింది.

## రాహుల్‌గాంధీ సభ్యత్వం రద్దు చేయాలి

### బిజెపి ఎంపి నిశికాంత్ దూబె




**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 12:** కాంగ్రెస్ ఎంపి రాహుల్‌గాంధీ సభ్యత్వాన్ని రద్దు చేయాలని బిజెపి ఎంపి నిషికాంత్ దూబె డిమాండ్ చేశారు. ఈ మేరకు అతని సభ్యత్వాన్ని రద్దు చేసే ప్రక్రియను ప్రారంభించాలని కోరుతూ నోటీసు ఇచ్చారు. ఇంకా ప్రచురితం కాని భారత సైన్యం మాజీ అధిపతి జనరల్ ఎంఎం నరవణె పుస్తకం సహా పలు వివాదాస్పద అంశాలపైనా రాహుల్‌గాంధీ, బిజెపి ఎంపిల మధ్య తీవ్ర వాగ్వాదం నడిచిన సంగతి తెలిసిందే. రాహుల్ గాంధీకి ఎవరు నిధులు ఇస్తున్నారు? ఆయన చేతికి ప్రచురితం కాని పుస్తకం ఎలా వచ్చింది? భారత వ్యతిరేక శక్తులతో ఆయన సంబంధాల గురించి ఆ నోటీసులో ప్రస్తావించారు. లోక్‌సభలో రాహుల్ సభ్యత్వాన్ని రద్దు చేయాలి అని దూబె అన్నారు. అయితే ఆయనపై సభా హక్కుల తీర్మానం తీసుకురావడం లేదని చెప్పారు. బడ్జెట్ ప్రసంగం సందర్భంగా రాహుల్ గాంధీ ఎప్‌స్టీన్ ఫైల్స్ ప్రస్తావన తీసుకువచ్చారు. అదానీ, అనిల్ అంబానీ, హార్దీప్‌సింగ్ పురీ పేర్లను పేర్కొన్నారు. ఆ వ్యాఖ్యలను అధికారపక్షం నేతలు తీవ్రంగా ఖండిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఆ పదాలను తొలగించే అవకాశం ఉందని సంబంధిత వర్గాలు వెల్లడించాయి. ఆయన చేసిన ఆరోపణలకు ఎలాంటి ధృవీకరణ లేదని పేర్కొన్నాయి.

## సేవాతీర్థ్ కాంప్లెక్స్‌కు మారుతున్న నార్త్,సౌత్ బ్లాకులు!

**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 12:** దేశ రాజధాని ఢిల్లీలోని బ్రిటీష్ కాలం నాటి ఆఫీసు బిల్డింగ్‌లు ఉన్న నార్త్, సౌత్ బ్లాకులను శుక్రవారం పూర్తిగా ఖాళీ చేయనున్నారు. ప్రధానమంత్రి కార్యాలయం కూడా కొత్తగా నిర్మించిన సేవా తీర్థ్ కాంప్లెక్స్‌కు మారనున్నది. ఆఫీసును మార్చడానికి ముందు శుక్రవారం ప్రధాని మోదీ చివరిసారి క్యాబినెట్ భేటీ ఏర్పాటు చేయనున్నారు. రేపు సాయంత్రం 4 గంటలకు పాత ఆఫీసులో ఆ భేటీ ఉండనున్నది. ఢిల్లీలోని ల్యూటెన్స్ రైసినా హిల్స్‌లో ఉన్న సౌత్ బ్లాకులో చివరిసారి కేంద్ర క్యాబినెట్ భేటీ జరగనున్నది. నార్త్ బ్లాక్ నుంచి కేంద్ర హోంశాఖ కార్యాలయాన్ని పూర్తిగా షిఫ్ట్ చేశారు. కామన్ సెంట్రల్ సెక్రటేరియేట్‌లోని 347 రూమ్ కాంప్లెక్స్‌కు హోంశాఖను తరలించారు. ఒక్క పీఎంవో మినహా ఆ కాంప్లెక్స్‌లో అన్ని ప్రభుత్వ మంత్రులు, శాఖల ఆఫీసులు ఉన్నాయి. సెంట్రల్ ఢిల్లీలోని ప్రత్యేక కాంప్లెక్స్‌లో పీఎంవోను నిర్మించారు. పీఎంవోను ఇక నుంచి సేవాతీర్థ్ అని పిలవనున్న విషయం తెలిసిందే. ఫిబ్రవరి 13వ తేదీన జరిగే కార్యక్రమంలో ప్రధాని మోదీ సేవాతీర్థ్, కర్తవ్యభవన్1,2లను ఆవిష్కరిస్తారని ప్రభుత్వం గురువారం ఓ ప్రకటన రిలీజ్ చేసింది. కొత్త ఆఫీసు బిల్డింగ్‌ను ప్రారంభించడంతో భారతీయ అధికార పరిపాలనా విభాగంలో కొత్త మైలురాయి చేరు కున్నట్లు అవుతుంది. ఆధునిక, పటిష్టమైన, సౌకర్యవంతమైన పరి పాలనా వ్యవస్థను అందిచే ఉద్దేశంతో కొత్త బిల్డింగ్ లను నిర్మించినట్లు అధి కారులు పేర్కొన్నారు. గతంలో దూరం దూరం గా ఉన్న వివిధ శాఖల ఆఫీసులను ఇప్పుడు ఒకే దగ్గరికి తీసుకువచ్చారు. పరిపాలనను మరింత సులభం చేయాలన్న ఉద్దేశంతో ఈ చర్యలు చేపట్టినట్లు వెల్లడించారు. సేవా తీర్థ్‌లో ప్రధానమంత్రి కార్యాలయం, నేషనల్ సెక్యూర్టీ కౌన్సిల్ సెక్రటేరియేట్, క్యాబినెట్ సెక్రటేరియేట్ ఉంటాయి. గతంలో ఇవన్నీ వేర్వేరు ప్రాంతాలను నుంచి ఆపరేట్ అయ్యేవి. ఇక కర్తవ్య భవన్ 1,2లో కీలక మంత్రిత్వశాఖల ఆఫీసులు ఉంటాయి. ఆర్థిక, రక్షణ, ఆరోగ్య, కార్పొరేట్ సర్వీసెస్, విద్య, సంస్కృతి, న్యాయ, సమాచార ప్రసార, వ్యవసాయ, రసాయనిక, గిరిజన శాఖ ఆఫీసులు ఉంటాయి. అన్ని ఆఫీసుల మధ్య డిజిటల్ ఇంటిగ్రేషన్ ఉంటుంది. ప్రస్తుత నార్త్, సౌత్ బ్లాకుల వద్ద ప్రపంచ స్థాయి మ్యూజియంను నిర్మించనున్నారు. యుగే యుగే భారత్ మ్యూజియంలో భారతీయ నాగరికత ప్రయాణాన్ని చిత్రీకరించనున్నారు. అయితే ఇప్పటికే నార్త్ బ్లాక్ వద్ద మ్యూజియం పనులు ప్రారంభమైనట్లు తెలుస్తున్నది.


## భూమి దిశగా దూసుకొచ్చిన స్విఫ్ట్ అబ్జర్వేటరీని ఆపిన నాసా



**వాషింగ్టన్, ఫిబ్రవరి 12:** నాసా టెలిస్కోప్ 'నీల్ గెహ్రెల్స్ స్విఫ్ట్ అబ్జర్వేటరీ' భూమి దిశగా దూసుకొచ్చింది. వాతావరణ రాపిడి వల్ల ఇది తన కక్ష్య నుంచి భూమి వైపు కదిలింది. 585 కిలోమీటర్ల ఎత్తు నుంచి ఇది 400 కి.మీ. కిందికి చేరింది. దీంతో అట్మాస్పెరిక్ డ్రాగ్ (స్పేస్‌క్రాఫ్ట్ శక్తిని కోల్పోయేలా చేస్తుంది)ను తగ్గించేందుకు తాత్కాలికంగా సైన్స్ ఆపరేషన్లను నిలిపివేశారు. అలాగే మళ్లీ దానిని యథాస్థితికి చేర్చేందుకు నాసా రీబూస్ట్ మిషన్‌ను చేపట్టింది. విశ్వంలో చోటుచేసుకునే గామా కిరణాల పేలుళ్లను గుర్తించి, అధ్యయనం చేసేందుకు నీల్ గెహ్రెల్స్ స్విఫ్ట్ అబ్జర్వేటరీని నాసా 2004లో దీన్ని ప్రయోగించింది. సోలార్ యాక్టివిటీ వల్ల భూ ఎగువ వాతావరణం వేడెక్కి, ఈ అబ్జర్వేటరీ కక్ష్య నుంచి కిందికి రావడం ప్రారంభమైంది. దీనిని అలాగే వదిలేస్తే.. 2026 చివరి నాటికి భూవాతావరణంలోకి ప్రవేశించి కాలిపోయేది. దాని వల్ల ఎలాంటి ప్రమాదం ఉండదు. అయితే దాని సేవల్ని సాధ్యమైనంత ఎక్కువకాలం కొనసాగించాలని నాసా భావిస్తోంది. రీబూస్ట్ మిషన్‌ను చేపట్టే వరకు ఆ టెలిస్కోప్‌ను 300 కి.మీ. ఎత్తులో ఉంచేందుకు.. అట్మాస్పెరిక్ డ్రాగ్‌ను తగ్గించేలా చర్యలు తీసుకుంటోంది. కాగా.. రీబూస్ట్ మిషన్ కోసం అరిజోనాకు చెందిన కాటలిస్ట్ స్పేస్ టెక్నాలజీస్‌తో నాసా ఒప్పందం కుదుర్చుకుంది. ఈ జూన్‌లో 30 మిలియన్ డాలర్లతో రోబోటిక్ లింక్ స్పేస్‌క్రాఫ్ట్ (కక్ష్యలో సర్వీసింగ్ కోసం, ఉపగ్రహ మరమ్మతు, డాకింగ్ కోసం రూపొందించిన ఒక రోబో వ్యవస్థ)ను పంపించనుంది. ఇది స్విఫ్ట్‌ను 600 కి.మీ. ఎత్తులో స్థిరమైన కక్ష్యలోకి చేరుస్తుంది. దాంతో అది మళ్లీ మరో పదేళ్ల సేవలు అందించడానికి వీలు కలుగుతుంది. ఈ ప్రయత్నం విజయవంతమైతే.. ఇప్పటివరకు సంగ్రహించిన డేటాను కాపాడుకునే వీలు కలుగుతుంది.

# ఎర్రకోట దాడి వెనుక జైషే హస్తం

### ఐక్యరాజ్యసమితి సంచలన నివేదిక



**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 12:** గతేడాది ఢిల్లీలోని ఎర్రకోట వద్ద జరిగిన పేలుడు ఘటనపై ఐక్యరాజ్యసమితి కీలక నివేదిక ఇచ్చింది. ఈ పేలుడుకు పాకిస్తాన్ కేంద్రంగా పనిచేస్తోన్న జైషే మహ్మద్ ఉగ్ర ముఠాతో సంబంధం ఉందని పేర్కొంది. ఆర్థిక ఆంక్షలు, అంతర్జాతీయ ఒత్తిడి ఉన్నప్పటికీ జైషే సహా పలు ఉగ్ర ముఠాలు దక్షిణాసియాలో క్రియాశీలకంగా తమ నేర కార్యకలాపాలు సాగిస్తున్నాయని వెల్లడించింది. ఈ మేరకు ఐక్యరాజ్య సమితి భద్రతా మండలికి సమర్పించిన నివేదికలో ఈ విషయాలు ప్రస్తావించింది. ఆంక్షలు ఉన్నప్పటికీ జైషేముఠా పలు ఉగ్రదాడులకు పాల్పడినట్లు తెలుస్తోంది. అందులో ఒకటి 2025 నవంబరు 10న ఢిల్లీలోని ఎర్రకోట వద్ద జరిగిన దాడి అని ఐక్య రాజ్యసమితి సభ్య దేశం ఒకటి ఆరోపించింది. ఇక అంతర్జాతీయ నిఘా నుంచి తప్పించుకునేందుకు జైషే కొత్త పన్నాగాలు పన్నుతోంది. గతేడాది జమాత్ ఉల్ ముమినత్ పేరుతో మహిళా వింగ్‌ను ఏర్పాటు చేసుకుంది. ఇలా చాలా ఆందోళనకర పరిణామం అని ఐక్యరాజ్య సమితి తమ నివేదికలో పేర్కొంది. ఈ సందర్భంగా జమ్మూకశ్మీర్‌లో జరిగిన పహల్గాం ఘటనను కూడా ఐక్యరాజ్య సమితి తన నివేదికలో ప్రస్తావించింది. ఆ దాడికి పాల్పడిన ముగ్గురు వ్యక్తులు హతమైనట్లు తెలిపింది. జైషే, లష్కరే తోయిబా వంటి ఉగ్ర ముఠాలు ఉనికిలో లేవని గత కొంతకాలంగా పాకిస్తాన్ పదే పదే వాదిస్తూ వస్తోంది. ఈ క్రమంలోనే తాజాగా ఐక్యరాజ్యసమితి ఇచ్చిన నివేదిక ప్రాధాన్యం సంతరించుకుంది. ఈ నివేదికతో దాయాది పాక్ వక్రబుద్ధి మరోసారి బయటపడినట్లయింది. ఎర్ర కోట వద్ద పేలుడు ఘటనపై ఎన్ఐఎ దర్యాప్తులో కీలక విషయాలు వెలుగులో వచ్చాయి.

## సైబర్ మాఫియా గుట్టురట్టు చేసిన కాంబోడియా

**నాంఫే, (కాంబోడియా), ఫిబ్రవరి12:** సినిమా తెరపై కనిపించే భయానక సామ్రాజ్యాలను తలపించేలా కంబోడియా సరిహద్దుల్లో సాగుతున్న ఒక భారీ సైబర్ నేర సామ్రాజ్యాన్ని థాయ్‌లాండ్ పోలీసులు రట్టు చేశారు. కేజీఎఫ్ సినిమాలోని గనుల మాదిరిగా, వందల మంది యువతను బంధించి, ప్రైవేటు సైన్యంతో కాపలా పెట్టి, రోజుకు 18 గంటల పాటు బలవంతంగా పని చేయిస్తున్న తీరు అంతర్జాతీయంగా సంచలనం సృష్టిస్తోంది. ఒస్మాచ్ పట్టణంపై థాయ్ సైన్యం చేపట్టిన వ్యూహాత్మక దాడిలో ఆరు అంతస్తుల భారీ భవన సముదాయం బయటపడింది. బయటకు ఐటీ కంపెనీలా కనిపించే ఈ భవనం లోపల అసలుసిసలు సైబర్ మోసాల కర్మాగారం నడుస్తోందని అధికారులు గుర్తించారు. ఉద్యోగాల పేరుతో మానవ అక్రమ రవాణా ముఠాల ద్వారా వివిధ దేశాల యువతను అక్కడికి రప్పించి, వారి పాస్‌పోర్టులను లాక్కుని బాహ్య ప్రపంచంతో సంబంధాలు తెంచేశారు. వారిని నిర్బంధించి డిజిటల్ అరెస్టులు, బ్యాంకు మోసాలు, ఫేక్ పోలీసు కాల్స్ వంటి ఆన్లైన్ స్కామ్‌లు చేయించేవారు. ఈ బందీల్లో భారతీయులు, ముఖ్యంగా తెలుగు వారు కూడా ఉన్నట్లు సమాచారం. నిర్దేశించిన టార్గెట్ పూర్తి చేయకపోతే తీవ్రమైన హింసకు గురిచేసేవారని, కనీసం సూర్యుడిని చూసే అవకాశం కూడా లేని గదుల్లో వారిని బంధించేవారని బాధితులు వాపోతున్నారు. ఆ భవనంలో భారత్, చైనా, ఆస్ట్రేలియా వంటి దేశాల పోలీస్ స్టేషన్లను తలపించే సెట్లు, ఆయా దేశాల పోలీసు దుస్తులు, జాతీయ జెండాలను ఏర్పాటు చేసి మరీ ఈ మోసాలకు పాల్పడేవారు. ఈ గదుల్లో వందలాది కంప్యూటర్లు, హార్డ్ డిస్క్‌లు, వేల సంఖ్యలో సిమ్ కార్డులను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. అక్కడ పనిచేస్తున్న వారు ఎదురు తిరిగితే శిక్షించేందుకు ప్రత్యేక రక్షణ సిబ్బందిని కూడా ఏర్పాటు చేసుకున్నారు. ఇలాంటి సైబర్ నేరాల ద్వారా ఏటా సుమారు 12.5 బిలియన్ డాలర్లు కంబోడియాకు చేరుతున్నట్లు అంచనా వేస్తున్నారు. అయితే ఈ అంతర్జాతీయ ముఠాల ప్రభావం భారతీయ పల్లెలకు కూడా పాకి ప్రాణాలు తీస్తోంది. ములుగు జిల్లాకు చెందిన ఒక కూలీ, సైబర్ నేరగాళ్ల బెదిరింపులకు భయపడి ఆత్మహత్యకు పాల్పడటం పరిస్థితి తీవ్రతకు అద్దం పడుతోంది. అపరిచిత వ్యక్తుల నుంచి వచ్చే వీడియో కాల్స్, పోలీసుల పేరుతో వచ్చే బెదిరింపుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు.

## సంక్షిప్తంగా..

### 3వ తరగతి నుంచే విద్యార్థులకు ఎఐ యాక్సెస్: కేంద్రమంత్రి ధర్మేంద్రప్రధాన్



**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 12 :** ప్రపంచవ్యాప్తంగా అన్ని రంగాల్లో మాదిరి విద్యారంగంలోను కృత్రిమ మేధ విస్తరిస్తుంది. ఈ కొత్త ఎఐ విధానాన్ని భారత్‌లోని విద్యార్థులందరికీ చేరువ చేస్తామని కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ పేర్కొన్నారు. దేశంలో 30 కోట్ల మంది విద్యార్థులు ఉన్నారని, 3వ తరగతి నుంచి అధునాతన పరిశోధనలు నిర్వహించే విద్యార్థుల వరకు ఈ కృత్రిమ మేధ అందుబాటులో ఉంటుందన్నారు. గురువారం ఢిల్లీలో జరిగిన ఎఐ కాంక్లేవ్ - 2026 సదస్సులో ఆయన పాల్గొని మాట్లాడారు. ఎఐ రంగంలో భారత్ అభివృద్ధి చెందుతుందన్నారు. ఇక్కడ మేధో సామర్థ్యానికి లోటు లేదని, కృత్రిమ మేధకు సంబంధించి పలు పరిశోధనలు జరుగుతున్నాయని వెల్లడించారు. భారత్‌లో గణనీయమైన యువశక్తి ఉందన్నారు.

### తొలితరం న్యూస్ యాంకర్ సరళామహేశ్వరి కన్నుమూత



**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 12:** భారత టెలివిజన్ రంగంలో సుపరిచితురాలు, దూరదర్శన్ సీనియర్ న్యూస్ యాంకర్ సరళా మహేశ్వరి (71) కన్నుమూశారు. ఆమె మృతి పట్ల దూరదర్శన్ నేషనల్ చానల్ సోషల్ మీడియా వేదికగా తీవ్ర సంతాపం వ్యక్తం చేసింది. ఆమె సౌమ్యమైన స్వరం, స్పష్టమైన ఉచ్చారణ, వార్తలను హుందాగా అందించే తీరుతో భారతీయ వార్తా ప్రపంచంలో ప్రత్యేక స్థానం సంపాదించుకున్నారని నివాళి అర్పించింది. దూరదర్శన్ కుటుంబం తరఫున సరళా మహేశ్వ రికి హృదయపూర్వక నివాళులు. ఆమె తన సరళత, హుందాతనంతో వీక్షకులలో చెరగని ముద్ర వేశారు" అని డీడీ తన ఎక్స్ ఖాతాలో పోస్ట్ చేసింది. సరళాతో కలిసి పనిచేసిన సీనియర్ యాంకర్ షమ్మీ నారంగ్ కూడా ఆమె మృతిపై విచారం వ్యక్తం చేశారు.

### డికె సిఎం కావాలంటున్న 90 మంది ఎమ్మెల్యేలు!



**బెంగళూరు, ఫిబ్రవరి 12:** డీకే శివకుమార్ ముఖ్యమంత్రి కావాలని 80 నుంచి 90 మంది ఎమ్మెల్యేలు కోరుకుంటు న్నారని కర్ణాటక కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే ఇక్బాల్ హుస్సేన్ పునరుద్ఘాటించారు. కర్ణాటకలో గత కొన్ని నెలలుగా ముఖ్యమంత్రి మార్పు అంశంపై చర్చ సాగుతోంది. ఈరోజు ఇక్బాల్ హుస్సేన్ మీడియాతో మాట్లాడుతూ, కాంగ్రెస్ పార్టీ కోసం శివకుమార్ చేసిన కృషికి ఆయన ముఖ్యమంత్రి పీఠంపై కూర్చోవాలని చాలామంది ఎమ్మెల్యేలు ఆశిస్తున్నారని అన్నారు. కర్ణాటకలో రానున్న అసెంబ్లీ ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని శివకుమార్‌కు ముఖ్యమంత్రి పదవి ఇవ్వాలని తాము డిమాండ్ చేస్తున్నామని అన్నారు. 140 మంది ఎమ్మెల్యేలు మార్పును ఆశిస్తున్నారని, 80 నుంచి 90 వరకు ఎమ్మెల్యేలు ఈ అంశంపై చర్చించుకుంటున్నారని, తామంతా మద్దతిస్తున్నామని అన్నారు.

### వారసురాలిగా కూతురు కిమ్‌జ్యూయే!



**ప్యాంగ్యాంగ్, ఫిబ్రవరి 12:** ఉత్తర కొరియా అధ్యక్షుడు కిమ్ జోంగ్ ఉన్ వారసురాలిగా ఆయన కూతురు కిమ్ జు యే ను ఎంపిక చేసినట్లు దక్షిణ కొరియా వెల్లడించింది. ఈ విషయాన్ని కిమ్ ఇంకా అధికారికంగా ప్రకటించకపోయినా, కిమ్ తన కుమార్తెనే దేశాధినేతగా నిర్ణయించారని దక్షిణ కొరియాకు చెందిన నిఘా సంస్థ నేషనల్ ఇంటెలిజెన్స్ సర్వీస్ ప్రకటించింది. ఈ అంశాన్ని దక్షిణ కొరియా తన దేశంలోని చట్టసభల నేతలకు తెలిపింది. ఉత్తర కొరియాలో ప్రతి ఐదేళ్లకోసారి నిర్వహించే కాంగ్రెస్ సమావేశం ఈ నెల చివరిలో జరగనుంది. ఈ నేపథ్యంలో దేశానికి కొత్త నాయకత్వం ఎవరూ అనే అంశంపై చర్చ జరుగుతుండగా అనేక పేర్లను పరిశీలించిన కిమ్ తన కూతురును భవిష్యత్ నాయకురాలిగా ఎంపిక చేసినట్లు తెలుస్తోంది. ఇప్పటికే ఆమెకు ఈ అంశంపై తగిన శిక్షణ, అవగాహన కల్పిస్తున్నట్లు సమాచారం.



సూర్యప్రభపై స్వామి, చప్పరం వాహనంలో అమ్మవారు

## సూర్యప్రభ వాహనంపై శివయ్య

### చప్పరంలో జ్ఞాన ప్రసూనాంబ దివ్యదర్శనం

శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 12 ప్రభాతవార్త: శ్రీకాళహస్తీశ్వరాలయంలో నిర్వహిస్తున్న మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం ఉదయం స్వామి వారిని సూర్యప్రభ వాహనంపై దేవేరి జ్ఞాన ప్రసూనాంబ అమ్మవారిని సప్పర వాహనంపై ప్రతిష్టించి గ్రామోత్సవం నిర్వహించారు. ఉదయం స్వామి అమ్మవార్లను చక్కగా అలంకార మండపంలో రాజేష్, సూరి గురుకుల్స్ ముస్తాబు చేసారు. ఇక్కడ స్వామి అమ్మవార్ల ఉత్సవర్లకు ఆలయ చైర్మన్ కొట్టైన సాయిప్రసాద్, ఇఒ డి.బాపిరెడ్డి పూజలు జరపగా సంప్రదాయ బద్దంగా అర్చకులు హారతులిచ్చి స్వామి అమ్మవార్లను గ్రామోత్సవాలకు తరలించారు. పంచమూర్తులను శివయ్య గోపురం, రాజగోపురం గుండా అలంకార మండపం వద్దకు చేర్చారు. అక్కడ సోమస్కందమూర్తి శ్రీకాళహస్తీశ్వరుని సూర్యప్రభ వాహనంపై, దేవేరి జ్ఞాన ప్రసూనాంబ అమ్మవారిని సప్పర వాహనంలో ప్రతిష్టించారు. స్వామి అమ్మవార్లకు దిష్టి తీసి గ్రామోత్సవానికి శ్రీకారం చుట్టారు. కోలాటాల కళాకారులు సంప్రదాయ బద్ధంగా కోలాటాల నృత్యాలు చేస్తుండగా మేళ తాళాలు మంగళవాయిద్యాలతో ఉభయదారులు వెంటరాగా ఉత్సవం నాలుగుమాఢ వీధులతో పాటు బాబూఅగ్రహారం కోనేరు చుట్టూ ఉత్సవం నిర్వహించారు. ఉత్సవంతో ఆలయ ఇన్‌స్పెక్టర్, ఉత్సవాల ఇన్‌చార్జిలు వెంకటస్వామి, నాగభూషణం యాదవ్ వెంటరాగా వైభవంగా ఉత్సవం సాగింది. ఉత్సవాల సందర్భంగా ట్రాఫిక్ ఎఎస్ఐ గోవిందు, ప్రత్యేక విధులపై వచ్చిన సిబ్బంది ఎలాంటి ఇబ్బంది లేకుండా పర్యవేక్షించారు.

## సిఎం చంద్రబాబుతో బండ్ల గణేష్ భేటీ




విజయవాడ, ఫిబ్రవరి 12 ప్రభాతవార్త ప్రతినిధి: ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుని అసెంబ్లీలోని ఆయన ఛాంబర్‌లో బండ్ల గణేష్ గురువారం కలిశారు. వైసిపి ప్రభుత్వం చంద్రబాబుపై 2023లో అక్రమ కేసులు బనాయించి జైలుకు పంపింది. సిఎం చంద్రబాబు జైలు నుంచి విడుదలై ముఖ్యమంత్రి అయితే తిరుమలకు పాదయాత్రగా వస్తానని బండ్ల గణేష్ మొక్కుకున్నారు. 2024లో జరిగిన ఎన్నికల్లో కూటమి విజయం సాధించి చంద్రబాబు 4వసారి సిఎం అయ్యారు. సంకల్ప యాత్ర పేరుతో షాద్‌నగర్ ఇంటి నుంచి జనవరి 19న పాదయాత్ర చేపట్టి ఈ నెల 10వ తేదీన తిరుమలకు చేరుకున్నారు. 23 రోజుల పాటు 535 కి.మీ మేర బండ్ల గణేష్ పాదయాత్ర సాగింది. రెండ్రోజుల క్రితం తిరుమల శ్రీ వేంకటేశ్వర స్వామివారిని దర్శించుకుని బండ్ల గణేష్ తన మొక్కును చెల్లించుకున్నారు. ఈ నేపథ్యంలో గురువారం అమరావతిలో సీఎం చంద్రబాబును కలిశారు. తిరుమల నుండి తీసుకువచ్చిన శ్రీవారి ప్రసాదాన్ని ముఖ్యమంత్రికి అందజేశారు. బండ్ల గణేష్‌ను సీఎం చంద్రబాబు ఆత్మీయంగా పలకరించి ఆలింగనం చేసుకున్నారు.



## నిరూపయోగంగా ప్రభుత్వ భవనం

నెల్లూరు అగ్రికల్చర్, ఫిబ్రవరి 12 ప్రభాతవార్త: నెల్లూరు రూరల్ మండలం తహసీల్దార్ కార్యాలయం వద్ద ఓ రెండంతస్తుల భవనం నిరూపయోగంగా మారింది. నెల్లూరు చెరువు దర్గా ప్రాంతంలో ఉన్న పినాకిని గెస్ట్ హౌస్‌కు సంబంధించిన ఈ ప్రభుత్వ భవనం అధికారుల నిర్లక్ష్యం కారణంగా ఉపయోగంలో లేకుండాపోయింది. నగరంలో అనేక కార్యాలయాలు అద్దె భవనాల్లో నడుస్తున్నప్పటికి ప్రభుత్వ భవనంగా ఉన్న ఈ కార్యాలయం గత కొంతకాలంగా నిరూపయోగంగా దర్శనమిస్తోంది. 2019కి ముందు కొంత మంది ట్రైనీ డిప్యూటీ కలెక్టర్లకు ఆశ్రయం కల్పించిన ఈ భవనం ఆ తర్వాత ఉపయోగంలో లేకుండా పోయింది. అద్దె భవనాల్లో నడుస్తున్న ఏదో ఒక కార్యాలయాన్ని ఈ భవనంలోకి తరలించే సదుపాయం ఉన్నప్పటికీ, ఆ దిశగా ఉపయోగించుకునే సూచనలు కనిపిస్తున్న దాఖలాలు లేవు. ఇది ఖాళీగా ఉండడంతో రాత్రి వేళల్లో కొంత మంది తలుపు గొళ్ళెం పగలగొట్టి లోపలకు ప్రవేశిస్తున్న సందర్భాలు ఉన్నాయి. కొంత మంది ప్రైవేటు వ్యక్తులు చీకటి కార్యకలాపాలకు కూడా వాడుకుంటున్నట్లు సమాచారం. ఏది ఏమైనా అద్దె చెల్లిస్తున్న బీసీ కార్పొరేషన్ లాంటి ప్రభుత్వ శాఖలు ఇలాంటి నిరూపయోగ భవనాలను ఉపయోగించుకోవాల్సిన అవసరం ఉంది. ఈ భవనం ఉపయోగంలోకి వస్తే అద్దె చెల్లింపుల్లో కొంత వరకైనా ప్రభుత్వానికి ఊరట లభిస్తుందన్నది ప్రజల అభిప్రాయం.

# గోవిందా గోవిందా! గోవింద

## గరుడ వాహనంపై శ్రీనివాసుడి స్వైరవిహారం

### పోటెత్తిన భక్తజన సందోహం... పోలీసుల పటిష్ట భద్రత



చంద్రగిరి, ఫిబ్రవరి 12 ప్రభాతవార్త: ఏడుకొండలవాడా వెంకటరమణా గోవిందా గోవిందా గోవింద అంటూ భక్తజనుల గోవింద నామస్మరణల నడుమ శ్రీనివాసుడి నిత్య వాహనమైన గరుడ వాహన సేవ గురువారం అంగరంగ వైభవంగా జరిగింది. శ్రీనివాస మంగాపురంలో వెలసియున్న శ్రీ కళ్యాణ వెంకటేశ్వర స్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాలను అంగరంగ వైభవంగా నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా గురువారం రాత్రి 7 గంటలకు స్వామివారి ఉత్సవమూర్తిని మండపానికి వేంచేపు చేశారు. శ్రీనివాసుడి బ్రహ్మోత్సవాలలో అత్యంత ప్రధానమైన గరుడ వాహన సేవలో స్వామివారిని వీక్షించడం ద్వారా మోక్షం సిద్ధిస్తుందని భక్తుల విశ్వాసం. శ్రీవారి నిత్యవాహనమైన గరుడుడిని వాహనంగా చేసుకుని శ్రీనివాసుడు తిరుమాడవీధులలో విహరిస్తుండగా దర్శించుకోవడం ద్వారా సకల పాపహరణ, మోక్షప్రాప్తి లభిస్తుందని శాస్త్రాలు వివరిస్తున్నాయి. ఈ కార్యక్రమంలో ఆలయ స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ ఈఓ వరలక్ష్మి, ఏఈఓ యం.గోపినాథ్, సూపరింటెండెంట్స్ వల్లంశెట్టి రమేష్‌బాబు, రాజ్‌కుమార్, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ డి.మునికుమార్, ఆర్జితం ఇన్‌స్పెక్టర్ అనుం బట్టు ధనశేఖర్, ఆలయ కంకణ భట్టార్ బాలాజీ రంగకుమార్, ప్రధాన అర్చకులు పార్థసారధి నారాయణాచార్యులు పాల్గొన్నారు.

**మోహినీ అవతారంలో కళ్యాణ వెంకన్న**

శ్రీనివాస మంగాపురంలో వెలసిన శ్రీ కళ్యాణ వెంకటేశ్వరస్వామి వారి బ్రహ్మోత్సవాలలో 5వ రోజు ఉదయం స్వామివారు మోహినీ అవతారంలో పల్లకిపై విహరించగా, తిరుచ్చిపై చిన్నికృష్ణుడి అలంకరణలో ఊరేగుతూ భక్తులకు దర్శనమిచ్చారు. మోహినీ అవతారంలో స్వామివారిని దర్శించుకోవడం ద్వారా మోహాలు తొలగి సర్వం శ్రీహరి మయం కాగలదని పురాణాలు తెలియజేస్తున్నాయి.

**వైభవంగా ఆండాళ్ అమ్మవారి మాలలు ఊరేగింపు**

కళ్యాణ వెంకన్న వార్షిక బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని గురువారం తిరుపతి గోవిందరాజస్వామి వారి ఆలయం నుండి ఆండాళ్ అమ్మవారి మాలలను ఊరేగింపుగా ఆలయానికి తీసుకువచ్చారు. ఇందులో భాగంగా అశేష భక్తులతో ప్రారంభమైన గోదా కళ్యాణయాత్ర అంబారీపై మాలలను తీసుకుని ఆలయానికి చేరుకున్నారు. ఆలయ అర్చకులు స్వామివారి సన్నిధిలో విశేష పూజలు జరిపించి అలంకరించారు. ఈ కార్యక్రమంలో తిరుమల పెద్దజియ్యర్ స్వామి, చిన్న జియ్యర్ స్వామి, ఆలయ అధికారులు పాల్గొన్నారు.

**అంగరంగ వైభవంగా శోభాయాత్ర**

కళ్యాణ వెంకన్న బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని సంప్రదాయానుసారం లక్ష్మీకాసుల హారం టిటిడి అదనపు ఈఓ సిహెచ్ వెంకయ్య చౌదరి ఆలయ అర్చకులకు అందజేశారు.

## ఏరియా ఆస్పత్రి నిర్వహణ శ్రీకాళహస్తి దేవస్థానంకు అప్పగించండి

### ● 22ఏ చట్టాన్ని సడలించండి ● ట్రాఫిక్ స్టేషన్ మంజూరు చేయండి ● అసెంబ్లీలో ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి అభ్యర్థన



శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 12 ప్రభాతవార్త: శాసనసభ సమావేశాల ప్రశ్నోత్తరాల సమయంలో శ్రీకాళహస్తి శాసనసభ్యుడు బొజ్జల వెంకట సుధీర్‌రెడ్డి తన నియోజకవర్గానికి సంబంధించిన సమస్యలపై గళం విప్పారు. తన అభ్యర్థనను స్పీకర్ దృష్టికి అలాగే సంబంధిత మంత్రులకు మొరబెట్టుకున్నారు. గురువారం సమావేశంలో పలు కీలక అంశాలను ప్రస్తావించారు. ముఖ్యంగా శ్రీకాళహస్తిలో 1999లో ముఖ్యమంత్రి చంద్రబాబు 11 ఎకరాల విస్తీర్ణంలో ఏరియా ఆస్పత్రిని నిర్మింపజేసి ప్రారంభించారు. తిరుమల, శ్రీశైలం దేవాలయాలు ఆస్పత్రులను నిర్వహిస్తున్నాయి. కాబట్టి ఆస్పత్రిని దేవాలయంలో అనుసంధానం చేయాలని కోరారు. ఈ ఆసుపత్రిలో గత ప్రభుత్వ హయాంలో రూ.12 కోట్లతో రెండవ అంతస్తును నిర్మించారు. ప్రారంభించనే లేదు. ఉరుస్తుంది. పూర్తి స్థాయిలో పని చేయలేదని అసెంబ్లీలో ప్రస్తావించారు. అందుకే ఆలయ ఆదాయంతో ఆస్పత్రిని అభివృద్ధి చేస్తే సామాన్య రోగులకు మెరుగైన సేవలందించుటకు అవకాశం ఉంటుందని సభ దృష్టికి తెచ్చారు. కాగా 22ఏ చట్టం కారణంగా శ్రీకాళహస్తి నియోజరకవర్గంలోని పేదలు, రైతులు, పట్టాదారులు తమ సొంత భూములపై హక్కులు వినియోగించుకోలేక పోతున్నారని శాసనసభ్యుడు బొజ్జల వెంకటసుధీర్‌రెడ్డి ఆవేదన వ్యక్తం చేసారు. ఈ చట్టాన్ని సడలించి రైతులను ఆదుకోవాలని కోరారు. 22ఏ చట్టాన్ని సవరించి అర్హులైన వారికి ఇంటినివేశన స్థలాలు,పట్టాలు అందేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత రెవెన్యూశాఖ మంత్రిని కోరారు.

**టెంపుల్ సిటిగా అభివృద్ధికి ప్రత్యేక నిధులివ్వండి:** శ్రీకాళహస్తీశ్వరాలయానికి ప్రతి నిత్యం తిరుమలకు వచ్చేభక్తులు 75శాతం వస్తున్నారు. ఈ ప్రాంతాన్ని టెంపుల్ సిటిగా అభివృద్ధి చేయటానికి ప్రత్యేక నిధులు మంజూరు చేయాలని శాసనసభ్యుడు బొజ్జల వెంకటసుధీర్‌రెడ్డి కోరారు. అయితే రాజుల కాలం నాటి పట్టణం కాబట్టి ఆనాటి అవసరాలకు తగ్గట్లు పట్టణాన్ని రూపకల్పన చేసారు. నేడు జనాభా పెరిగింది. పట్టణ స్వరూపం మారింది. వాహనాల సంఖ్య గణనీయంగా పెరిగింది. ఆలయానికి వచ్చే భక్తులు పెరిగారు. కానీ ట్రాఫిక్ సమస్య జటిలంగా ఉంది. నిత్యం ట్రాఫిక్ చిత్తడిలో పట్టణ ప్రజలే కాకుండా దూరం నుంచి వచ్చే భక్తులు sకూడా ట్రాఫిక్ సమస్యతో సతమతమౌతున్నారు. ఇక్కడ 'ట్రాఫిక్ పోలీసు' స్టేషన్‌తో పాటు సిబ్బందిని ఇవ్వాలని సంబంధిత హోంశాఖ మంత్రిని కోరారు. గతంలో కూడా మూడు సార్లు ఈ సమస్యను విన్నవించాను.

**కాంటాక్టు ఔట్ సోర్సింగ్ సిబ్బందికి న్యాయం చేయండి:** శ్రీకాళహస్తీశ్వరాలయంలో సుమారు 1100 మంది కాంటాక్టు, ఔట్ సోర్సింగ్ సిబ్బంది చాలా మంది పని చేస్తున్నారని వారికి చాలీ చాలనీ వేతనాలతో కుటుంబాలు గడుపులేక తల్లడిల్లుతున్నారు. వారికి న్యాయం చేయాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని శాసనసభ్యుడు బొజ్జల వెంకటసుధీర్‌రెడ్డి సభలో ప్రస్తావించారు. ఆయన అభ్యర్థనలకు సంబంధిత మంత్రులు సానుకూలంగా స్పందించారు.

# నేటి నుండి మహాశివరాత్రి ఉత్సవాలు

### - కలశ స్థాపన, ధ్వజారోహణం



ఇంద్రకీలాద్రి, ఫిబ్రవరి 12, ప్రభాతవార్త : విజయవాడ ఇంద్రకీలాద్రిపై వేంచేసి ఉన్న శ్రీ కనకదుర్గమ్మ ఆలయంలో నేటి నుండి శివరాత్రి మహోత్సవాలు ప్రారంభం కానున్నాయి. శుక్రవారం కలశ స్థాపన, ధ్వజారోహణం, అగ్ని ప్రతిష్టాపనలతో ప్రారంభం అవుతాయి. శుక్రవారం ఉదయం శ్రీ గంగా పార్వతి సమేత మల్లేశ్వర స్వామివార్లకు మంగళస్నానములు నిర్వహించి నూతన వధూవరులుగా అలంకరిస్తారని, మూల హవనములు, బలిహరణ, హారతి మంత్రపుష్పం, జరిపి భక్తులకు తీర్థప్రసాద వితరణ చేస్తామని ఇఓ వికె శీనా నాయక్ తెలిపారు. సాయంత్రం 4 గంటలకు ఉత్సవాలకు శాస్త్రోక్తంగా గణపతి పూజ, మండపారాధన, కలశస్థాపన, ధ్వజారోహణ, అగ్ని ప్రతిష్టాపన, మూలమంత్ర హవనములు, బలిహరణ, హారతి, మంత్రపుష్పం జరుగుతాయన్నారు.

**నిత్యాన్నదాన పథకానికి విరాళాలు:** శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానంలో అన్నదాన పథకానికి గురువారం హైదరాబాద్‌కు చెందిన వి సుబ్బలక్ష్మి, వి గున్నేశ్వరరావు కుటుంబసభ్యులు రూ.1లక్షను విరాళంగా అందించారు.

అలాగే పశ్చిమగోదావరి జిల్లా బీమవరంకు చెందిన గుప్త దాతలు (వారిపేర్లు నమోదు చెయ్యలేదు) రు. 1,01,116ల విరాళం నిత్యాన్నదాన పథకానికి అందించారు. దాతలకు దుర్గమ్మవారి ఏర్పాటు చేసి, దుర్గమ్మవారి చిత్రపటం, ప్రసాదం, మెమొంటో అందించారు. వేదపండితులు వేదాశీర్వచనం పలికారు.

## గాంధీ ఆశయాలకు మోడీ తూట్లు

### రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల



కావలి (నెల్లూరు), ఫిబ్రవరి 12 ప్రభాతవార్త : గాంధీజీని గాడ్జే ఖూనీ చేస్తే ప్రధాని నరేంద్రమోడీ గాంధీజీ పేరు మీద ఉన్న జాతీయ ఉపాధి హామీ పథకానికి పేరు మార్చి ఆయన ఆశయాలను ఖూనీ చేస్తున్నారని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు వైఎస్.షర్మిలరెడ్డి తెలియజేశారు. ఉపాధి హామీ పరిరక్షణ యాత్రలో భాగంగా కావలి రూరల్ మడలం అముదాలదిన్నె గ్రామంలో కావలి నియోజకవర్గం కాంగ్రెస్‌పార్టీ ఇన్‌చార్జ్ పొదలకూరి కళ్యాణ్ ఆధ్వర్యంలో గురువారం ఉపాధిహామీ కూలీలతో ముఖాముఖి కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో షర్మిలకు మహిళల చేత సారెను అందజేయడం జరిగింది. ఈ సందర్భంగా వైఎస్ షర్మిల మాట్లాడారు. రాష్ట్ర ముఖ్యమంత్రిగా వైఎస్ఆర్ ఉన్నప్పుడు అనేక సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టడంతో రాష్ట్రం సుభిక్షంగా ఉందన్నారు. పనికి ఆహార పథకానికి వందరోజులు పని దినాలుగా కేటాయించడం జరిగిందని తెలిపారు. బిజెపి ప్రభుత్వం ఈ ఆర్థిక సంవత్సరంలో 52 పనిదినాలను కల్పించి 125రోజులు పనిదినాలను కల్పిస్తామని చెప్పడం పచ్చి బూటకం అని తెలిపారు. రానున్న రోజుల్లో 12గంటలు పనిచేయాల్సి వస్తుందని తెలిపారు. అందరిలో చైతన్యం వచ్చి నిలదీయాలన్నారు. నూతన చట్టం ద్వారా ఆహార పథకానికి కేంద్ర ప్రభుత్వం 60శాతం నిదులు ఇస్తే రాష్ట్ర ప్రభుత్వం 40శాతం నిధులను కేటాయించాలని అన్నారు. ప్రస్తుత రాష్ట్ర ప్రభుత్వం 40శాతం నిధులు కేటాయించే పరిస్థితిలో లేనందున కేంద్రం ఇచ్చే 60శాతం నిదులు కూడా ఇవ్వరనితెలిపారు. రాష్ట్రంలో 18లక్షల జాబ్‌కార్డులను తొలగించడం జరిగిందన్నారు. కేంద్రంలోని బిజెపి పార్టీకి కూటమి పార్టీలు,వైఎస్ఆర్ సిపి పార్టీ అమ్ముడు పోయిబానిసలుగా తయారైనరన్నారు. ఈ పథకాన్ని నిర్వీర్యం చేస్తున్న కూడా వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి బిజెపికి మోడీకి వ్యతిరేకంగా మాట్లాడడం లేదంటే ప్రజల పక్షాన ఉన్నట్టా లేనట్టా ఆలోచించుకోవాలన్నారు. రానున్న రోజుల్లో కాంగ్రెస్ పార్టీని ఆదరించాలని రాహుల్‌గాంధీని ప్రధానమంత్రిగా చేసుకుటే రాష్ట్ర విభజన హామీలన్నింటిని నెరవేర్చుకోవడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు మాంగాటి గోపాల్‌రెడ్డి, ఉదయగిరి నియోజకవర్గ కోఆర్డినేటర్ అనిల్‌కుమార్‌రెడ్డి, జిల్లా ఓబిసి ఉపాధ్యక్షులు కలవకూరి శ్రీనివాసులుగౌడ్, కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## వైసిపికి ప్రతిపక్ష హోదా రాదు

### జనసేన ఎమ్మెల్యేలు లోకం మాధవి, సుందరపు విజయ్‌కుమార్

విజయవాడ, ఫిబ్రవరి 12 ప్రభాతవార్త ప్రతినిధి: ప్రతిపక్ష నాయకుడుగా జగన్‌ను చూడాలంటే ప్లకార్డులు ప్రదర్శించి, ఆందోళనలు చేసినా ప్రయోజనం లేదని జనసేన ఎమ్మెల్యేలు లోకం మాధవి, సుందరపు విజయ్ కుమార్ వ్యాఖ్యానించారు. తాడేపల్లి ఇంట్లోనే అసెంబ్లీ సెట్ వేసుకోండి... బొత్సను స్పీకర్‌గా పెట్టుకోండి అంటూ మండిపడ్డారు. జీతాల కోసమే వైసిపి నాయకులు సభకు వచ్చారు. 10 నిమిషాల్లో హాజరు వేసుకొని 11వ నిమిషంలో వెళ్లిపోయారన్నారు. వాళ్లకు ప్రజా సమస్యలు కంటే ప్రతిపక్ష హోదానే ముఖ్యమన్నారు. అసెంబ్లీ మీడియా పాయింట్‌లో జనసేన ఎమ్మెల్యేలు లోకం మాధవి, సుందరపు విజయ్ కుమార్ మాట్లాడుతూ, "జగన్ అండ్ కోకి చట్టసభలు అన్నా, మన సంప్రదాయాలు అన్నా కనీస గౌరవం లేదు. గవర్నర్ అబ్దుల్ నజీర్ ఉభయసభలను ఉద్దేశించి ప్రసంగిస్తుండగా ఆందోళనలు చేపట్టి సభా మర్యాదను మంటగలిపారు. కాసులకు కక్కుర్తిపడి శ్రీవారి దివ్య ప్రసాదాన్ని కల్తీ నెయ్యితో తయారు చేసి కోట్లాది భక్తుల మనోభావాలను దెబ్బతీశారు" అని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రతిపక్ష హోదా ఇస్తేనే సభకు వస్తానని చెబుతున్న జగన్, ఇంట్లోనే అసెంబ్లీ సెట్ వేసుకొని బొత్స సత్యనారాయణని స్పీకర్‌గా పెట్టుకోవాలని హితవు పలికారు.

### మంత్రి ఫ్లెక్సీ సాక్షిగా అర్ధరాత్రి దాటిన తరువాత

# మట్టి దోపిడి గ్యాంగ్ దందా



సాలూరు (పార్వతీపురం మన్యం జిల్లా), ఫిబ్రవరి 12 ప్రభాతవార్త: సాలూరు పట్టణంలో మట్టి మాఫీయా దోపిడి రోజు రోజుకి మితిమీరిపోతోంది. ఇంత జరుగుతున్నా రెవిన్యూ, మైనింగ్, పోలీస్ డిపార్ట్‌మెంట్ అధికారులు దీనిపై చర్యలు తీసుకోకపోవడం అనుమానాలకు తావిస్తోంది. ప్రభుత్వ ఆదాయాన్ని కొల్లగొడుతున్న వారిపై ఎటువంటి చర్యలు తీసుకోకపోవంతో అమ్ముడై పోయారనే ఆరోపణలు కూడా వినిపిస్తున్నాయి. ఇది ఇలా ఉంచితే రూరల్‌లో ఉన్న సర్కార్ భూముల్లో నుంచి గత నాలుగు రోజులుగా అర్ధరాత్రి 12 గంటల తరువాత లారీలలో మట్టిని దొంగతనంగా ఎమ్మార్వో ఆఫీస్, జాతీయ రహదారి మీదుగా మంత్రి ఫ్లెక్సీ సాక్షిగా తీసుకెళ్లడం హైలెట్ అనే చెప్పకోవచ్చు. అలాగే గుట్టుగా సాగుతున్న మట్టి మాఫీయా గ్యాంగ్ దోపిడీ ఫోటోస్, వీడియోస్ సాలూరు పలు చరవాణి గ్రూపుల్లో హల్ చల్ చేస్తున్నా ఆఫీసర్స్ ఇంతవరకు యాక్షన్ లోకి దిగకపోవడం గమనార్హం. ఈ మట్టి దోపిడీ చేస్తున్న వారిని పర్మిషన్ ఉన్నదా అని ప్రశ్నిస్తే ఉన్నాయని చెపుతున్నారని వినికిడి. అయితే అర్ధరాత్రి ఎందుకు దొంగతనంగా తీసుకెళ్లడం అనే ప్రశ్న అందరిలో వ్యక్తమవుతోంది.

**మట్టి మాఫియాకి ఎమ్మార్వో వార్నింగ్ :**
విలేజీల్లో గవర్నమెంట్ కు సంబంధించిన చెరువులు, చెరువు పోరంబోకు, అలాగే గెడ్డ పోరంబోకు నుండి మట్టిని అక్రమంగా తరలించడం నేరమని తాసిల్దార్ నీలకంతరావు మట్టిదోపిడి గ్యాంగ్ ను హెచ్చరించారు. అలాగే ప్రైవేట్ జిరాయితీ ల్యాండ్ మట్టిని అనుమతి లేకుండా తరలిస్తే చట్టపరంగా చర్యలు ఉంటాయని స్పష్టం చేసారు. ఎవరికి ఇంతవరకు ఎటువంటి పర్మిషన్ ఇవ్వలేదని అర్ధరాత్రి మట్టిలోడు తీసుకువెళ్లే లారీలపై చర్యలు తీసుకోవాలని టౌన్ పోలీస్ వారికి ఇన్ఫర్మేషన్ ఇచ్చామని విలేకరులు అడిగిన ప్రశ్నకు గురువారం ఉదయం క్లారిటీ ఇచ్చారు.

## సైబర్ నేరగాళ్ల ఉచ్చులో టీచర్

అమలాపురం, ఫిబ్రవరి 12 ప్రభాతవార్త: సైబర్ నేరాలపై అవగాహన కల్పిస్తున్నా నిత్యం ఎక్కడో చోట సైబర్ నేరగాళ్లలో చిక్కుతూనే ఉన్నారు. తాజాగా డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా మగటపల్లిలో ప్రభుత్వ పాఠశాలలో టీచర్ కొనుకు శ్రీనివాస్ నేరగాళ్లకు చిక్కి రూ.24.50లక్షలు పోగొట్టుకున్నారు. ఫేస్‌బుక్‌లో లింకును క్లిక్ చేయడంతో కేంద్ర ప్రభుత్వ స్కీం పేరుతో సైబర్ వలవిసిరారు. రూ.10 లక్షల విలువైన ఎరువులు పంపిస్తున్నామని లాభాలు పొందవచ్చునని సైబర్ నేరగాళ్ల నమ్మించారు. లారీ ద్వారా సరుకు వస్తుందని అది అమ్మితే భారీ మొత్తంలో లాభాలు వస్తాయని సొల్లు కబుర్లు చెప్పారు. అది నమ్మిన శ్రీనివాస్ ఫోన్ పే ద్వారా పలుమార్లు నేరగాళ్లకు రూ.24.50 లక్షలు బదిలీ చేశారు.అయినా ఇంకా డబ్బులు పంపించమనడంతో అప్పటికి శ్రీనివాస్ అనుమానంతో సైబర్ క్రైం1930 నెంబర్‌కి సమాచారం ఇచ్చారు. వెంటనే స్పందించిన బ్యాంక్ అధికారులు రూ.9 లక్షలు ఫ్రీజ్ చేశారు. దీనిపై నగరం ఎస్ఐ చైతన్యకుమార్ కేసు నమోదు చేసినట్లు తెలిపారు. దీనిపై సిఐ రుద్రరాజు దర్యాప్తు చేపట్టారు



## పాతకారులో మృతదేహం

విజయవాడ, ఫిబ్రవరి 12 ప్రభాతవార్త ప్రతినిధి: ఎన్టీఆర్ జిల్లా విజయవాడలోని గుణదలలో ఓ పాత కారులో వ్యక్తి మృతదేహం కలకలం రేపింది. గుణదల రామవరప్పాడు రింగ్ నుంచి విజయవాడ వైపునకు వచ్చే రహదారి వెంబడి నిలిపి ఉంచిన పాత కారులో ఓ మృతదేహం ఉండటాన్ని స్థానికులు గుర్తించారు. సమాచారం అందుకున్న పోలీసులు, క్లూస్ టీం ఘటనాస్థలికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. మృతుడు మంగళగిరి ప్రాంతానికి చెందిన వాడుగా గుర్తించారు. గుణదల మేరీ మాత తిరునాళ్లకు వచ్చి కారులో నిద్రలోనే మృతి చెందినట్లు సమాచారం. ఈ ఘటనపై పోలీసులు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

## దొంగతనం నింద తట్టుకోలేక పదో తరగతి విద్యార్థి బలవన్మరణం



తోటపల్లి గూడూరు (నెల్లూరు), ఫిబ్రవరి 12 ప్రభాతవార్త: మండల పరిధిలోని ఓ ప్రైవేట్ పాఠశాలలో చదువుతున్న పదో తరగతి విద్యార్థి సుదీప్ బలవన్మరణానికి పాల్పడిన ఘటన స్థానికంగా తీవ్ర కలకలం రేపింది. పెదూరు పంచాయతీకి చెందిన సుదీప్, తనపై వచ్చిన దొంగతనం ఆరోపణలను తట్టుకోలేక ఇంట్లో ఉరివేసుకున్నట్లు సమాచారం. పాఠశాలలో ఓ విద్యార్థికి చెందిన నగదు పోవడంతో, ఆ దొంగతనం సుదీప్ చేశాడని తోటి విద్యార్థులు, కొందరు సిబ్బంది ఆరోపించినట్లు తెలుస్తోంది. అందరి ముందూ తనను దొంగగా ముద్రవేయడంతో తీవ్ర మనస్తాపానికి గురైన సుదీప్ పాఠశాల నుంచి ఇంటికి వచ్చి ఎవరూ లేని సమయంలో ఆత్మహత్యకు పాల్పడినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. సుదీప్ మృతితో తల్లిదండ్రులు, బంధువులు, గ్రామస్తులు పెద్దఎత్తున పాఠశాల వద్దకు చేరుకుని ఆందోళనకు దిగారు. పాఠశాల యాజమాన్యం నిర్లక్ష్యమే ఈ విషాదానికి కారణమని ఆరోపిస్తూ గేటు ముందు బైఠాయించారు. విద్యార్థి మృతదేహాన్ని చూసి తల్లిదండ్రులు కన్నీరు మున్నీర య్యారు. పరిస్థితి ఉద్రిక్తంగా మారడంతో పోలీసులు భారీగా మోహరించారు. ఘటనపై సమాచారం అందుకున్న రూరల్ డిఎస్పి ఘట్టమనేని శ్రీనివాసరావు సంఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

## మహిళా టీచర్‌పై దాడి, దోపిడీ

### మూడు గంటల్లో ముద్దాయిని పట్టుకున్న పోలీసులు



గూడూరు (నెల్లూరు), ఫిబ్రవరి 12, ప్రభాతవార్త: గూడూరు రూరల్ మండల పరిధిలో సంచలనం రేపిన మహిళా ఉపాధ్యాయురాలిపై దాడి చేసి దోపిడీ చేసిన ఘటనలో పోలీసులు సత్వరమే స్పందించి మూడు గంటల్లోనే నిందితుడిని అదుపులోకి తీసుకున్నట్లు ఏఎస్పి సిహెచ్ సౌజన్య తెలిపారు. దాడి ఘటనలో గాయపడి చికిత్స పొందుతున్న టీచర్‌ను ఏ.ఎస్.పి గురువారం పరామర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దాడి సమాచారం అందిన ఎస్పీ అజిత వేజెండ్ల ఆదేశాలతో వెంటనే క్రైమ్ టీమ్స్ స్పందించడం, ఎస్పీ సమన్వయం చేసుకుంటూ సూచనలు చేయడం వంటి చర్యలతో ముద్దయిని అదుపులోకి తీసుకొని విచారణ చేస్తునన్నట్లు ఆమె తెలిపారు. బాలాయపల్లిలో టీచర్‌గా పనిచేస్తున్న మహిళ గూడూరు టౌన్‌లో ఆటో ఎక్కి వెళుతుండగా, గూడూరు రూరల్ పరిధిలోని చీమర్తి దగ్గర మహిళపై ఆటో డ్రైవర్ దాడి చేసి మెడలోని బంగారు సరుడును లాక్కొని వెళ్లాడని పేర్కొన్నారు. బాధిత మహిళ కూడా నిందితున్ని ధైర్యంగా ఎదుర్కొని గాయపరిచిందని చెప్పారు. బాధిత మహిళ ఇచ్చిన ఫిర్యాదు మేరకు, జిల్లా యస్.పి. ఆదేశాలతో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి గంటల వ్యవధిలో ముద్దాయిని, ఆటోను గూడూరు రూరల్ పోలీసులు స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించారు. ప్రస్తుతం బాధిత మహిళను మెరుగైన చికిత్స కోసం నెల్లూరు కిమ్స్ హాస్పిటల్లో చేర్చామని, చికిత్స జరుగుతున్నట్లు ఆమె తెలిపారు.

## భర్త గొంతు కోసిన భార్య



మదనపల్లెక్రైమ్, ఫిబ్రవరి 12 ప్రభాతవార్త: మద్యం తాగి ఇంటికి వచ్చాడనే కోపంతో ఓ భార్య తన భర్తపై కొడవలితో దాడి చేసి హత్యాయత్నానికి పాల్పడిన సంఘటన గురువారం మదనపల్లిలో చోటుచేసుకుంది. బాధితుని కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి.
మదనపల్లి మండలం, వలసపల్లి గ్రామ పంచాయతీ నాయుని వారిపల్లికి చెందిన మల్లూరి సుబ్రహ్మణ్యం రెడ్డి(43), భార్య శ్యామల వ్యవసాయం చేస్తూ జీవనం సాగిస్తున్నారు. గురువారం ఉదయం సుబ్రహ్మణ్యం రెడ్డి మద్యం తాగి ఇంటికి వచ్చి భోజనం సరిగ్గా లేదని భార్యను మందలించడంతో ఇద్దరి మధ్య తీవ్ర వాగ్వాదం చోటుచేసుకుంది. ఆ సమయంలో శ్యామల, ఇంట్లో ఉన్న కొడవలిని తీసుకుని సుబ్రహ్మణ్యం రెడ్డి మెడపై బలంగా నరికింది. తీవ్ర రక్తస్రావమై ప్రాణాపాయ స్థితిలో ఉన్న బాధితుడిని గమనించిన స్థానికులు వెంటనే స్పందించి 108 వాహనం ద్వారా మదనపల్లి జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం ఆయన పరిస్థితి విషమంగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు. ఈ ఘటనపై సమాచారం అందుకున్న మదనపల్లి రూరల్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# అనంత వినాయకుడు గ్రంథ ఆవిష్కరణ






# అసెంబ్లీలో అరుదైన దృశ్యం

## స్పీకర్‌ను కారు వరకు సాగనంపిన మంత్రి లోకేష్



అమరావతి, ప్రభాతవార్త

ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ ప్రాంగణంలో గురువారం ఒక ఆసక్తికర సంఘటన చోటుచేసుకుంది. సభా కార్యక్రమాలు ముగించుకుని స్పీకర్ అయ్యన్నపాత్రుడు గారు వెళ్తున్న క్రమంలో, లాబీలో మంత్రి నారా లోకేష్ ఆయనకు ఎదురయ్యారు. ఈ సందర్భంగా స్పీకర్ పట్ల లోకేష్ గారు ఎంతో మర్యాదగా వ్యవహరించారు. ?అయ్యన్నపాత్రుడు గారు వారించినప్పటికీ, లోకేష్ గారు ఆయన వెంటే కారు వరకు వెళ్లారు. స్వయంగా స్పీకర్‌ను కారెక్కించి, ఆయన వెళ్లే వరకు అక్కడే ఉండి గౌరవంగా వీడ్కోలు పలికారు. రాజకీయాల్లో పదవుల కంటే వ్యక్తిగత సంబంధాలు, పెద్దల పట్ల గౌరవం ముఖ్యమని ఈ ఘటన ద్వారా మరోసారి నిరూపితమైంది.

# ఏపీఈపీడీసీఎల్‌కు పీఎం సూర్య ఘర్ కింద రూ. 27.76 కోట్ల కేంద్ర ప్రోత్సాహకం



## 148.7 మెగావాట్ల రూఫ్‌టాప్ సోలార్ ప్లాంట్ల ఏర్పాటు -రూఫ్‌టాప్ సోలార్ ఏర్పాటు లో విశేష ప్రగతికి జాతీయ స్థాయి గుర్తింపు : ఏపీఈపీడీసీఎల్ సీఎండి పృథ్వీతేజ్ ఇమ్మడి

విశాఖపట్నం, ఫిబ్రవరి 12, ప్రభాతవార్త

ప్రధానమంత్రి సూర్య ఘర్ ముఫ్త్ బిజ్లీ యోజన పథకం కింద 2024-25 ఆర్థిక సంవత్సరంలో గ్రిడ్ కనెక్టెడ్ రూఫ్‌టాప్ సౌర ప్లాంట్ల ఏర్పాటులో విశేష పురోగతి సాధించినందుకు ఆంధ్రప్రదేశ్ తూర్పు ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ (ఏపీఈపీడీసీఎల్) కు కేంద్ర ప్రభుత్వం రూ. 27.76 కోట్ల ప్రోత్సాహకాన్ని మంజూరు చేసినట్లు సంస్థ చైర్మన్ ఢ మేనేజింగ్ డైరెక్టర్ పృథ్వీతేజ్ ఇమ్మడి తెలిపారు. నూతన మరియు పునరుత్పాదక శక్తి మంత్రిత్వ శాఖ (ఎంఎన్ఆర్ఈ), భారత ప్రభుత్వం దేశవ్యాప్తంగా 14 విద్యుత్ పంపిణీ సంస్థలకు కలిపి రూ. 1,422 కోట్లకు పైగా ప్రోత్సాహకాలు విడుదల చేయగా, అందులో ఏపీఈపీడీసీఎల్ ఒక ప్రధాన లబ్ధిదారుగా నిలిచిందని తెలిపారు. మహారాష్ట్రకు చెందిన ఎంఎస్ఈడీసీఎల్ , గుజరాత్ కు చెందిన పీజీవీసీఎల్, యూజీవీసీఎల్, డీజీవీసీఎల్, ఎంజీవీసీఎల్, టాటా పవర్-ఢిల్లీ, టీపీఎల్-అహ్మదాబాద్, టీపీఎల్- సూరత్, బీఎస్ఈఎస్ యమునా పవర్ లిమిటెడ్, కేరళ స్టేట్ ఎలక్ట్రిసిటీ బోర్డ్, 8వ పేజీలో

# ఐఎఫ్ఆర్ నిర్వహణలో మిగిలిన ఏర్పాట్లు త్వరితగతిన పూర్తి చేయండి

## సమీక్షా సమావేశంలో జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్




# అంతర్జాతీయ నౌకల సమీక్ష సందర్భంగా వీఎంఆర్డీఏ చేపట్టిన పనుల పురోగతి సమీక్ష

## త్వరితగతిని పూర్తిచేయాలంటూ ఛైర్‌పర్సన్ ప్రణవ్‌గోపాల్ ఆదేశం




విశాఖపట్నం, ఫిబ్రవరి 12, ప్రభాతవార్త

ఈనెల 18, 19వ తేదీల్లో జరగనున్న అంతర్జాతీయ నౌకల సమీక్ష(ఐఎఫ్ఆర్) సందర్భంగా చేపడుతున్న వివిధ పనులను త్వరితగతిన పూర్తిచేయాలని వీఎంఆర్డీఏ చైర్‌పర్సన్ ఎంవీ ప్రణవ్‌గోపాల్ ఆదేశించారు. గురువారం వీఎంఆర్డీఏ సమావేశ మందిరంలో మెట్రోపాలిటన్ కమిషనర్ ఎన్.తేజ్‌భరత్‌తో కలిసి ప్రణాళిక, సాంకేతిక, గణాంక, ఎస్టేట్ విభాగాధిపతులతో పనుల పురోగతిపై సమీక్షించారు. ఎన్ఎడి ఫ్లైఓవర్ నిర్మాణంలో భాగమైన రైలు ఓవర్ బ్రిడ్జి (ఆర్ఓబి), కైలాసగిరిపై అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న త్రిశూల్, డమరుకం నిర్మాణం ప్రాజెక్టుల ప్రగతిని అదేవిధంగా బృహత్తర ప్రణాళిక సవరణ తదితర అంశాలపై విస్తృత స్థాయిలో సమీక్షించారు. ఈ సందర్భంగా వీఎంఆర్డీఏ ఛైర్‌పర్సన్ ప్రణవ్‌గోపాల్ మాట్లాడుతూ, మ్యూజియంల్లో పనులు ఇప్పటికే దాదాపు 90 నుంచి 95 శాతం పనులు పూర్తయ్యాయని, ఐఎఫ్ఆర్ నిర్వహణ వ్యవధి దగ్గర పడుతున్నందున సంబంధిత పనులను వేగవంతం చేసి ముగించాలని అధికారులను ఆదేశించారు. మెట్రోపాలిటన్ కమిషనర్ తేజ్ భరత్ ఐఎఫ్ఆర్ మాట్లాడుతూ, వీఎంఆర్డీఏ నిర్వహిస్తున్న పర్యాటక ప్రదేశాల్లో అంతర్జాతీయ పర్యాటకుల సందర్శించే సందర్భంగా వారికి వీఎంఆర్డీఏ తరపున ఆత్మీయ ఆతిథ్యం అందేవిధంగా చర్యలుచేపట్టాలన్నారు. తగినంత విధంగా త్రాగునీరు అందుబాటులో ఉండే విధంగా కూడా చర్యలు తీసుకోవాలని సూచించారు. అనంతరం చైర్మన్, కమిషనర్ ఇరువురు ఇటీవల మరణించిన ఇరువురు తోటమాలీల కుటుంబ సభ్యులకు చెరో రూ 3.00 లక్షల చొప్పున నగదును చెక్కు రూపంలో అందించారు. ఈ సమీక్షా సమావేశంలో సంయుక్త కమిషనర్ రమేష్, ప్రధాన ఇంజనీర్ వినయ్ కుమార్, ప్రధాన గణాంకాధికారి హరిప్రసాద్, ఎస్టేట్ అధికారి దయానిధి, పర్యవేక్షక ఇంజనీర్లు భవానీ శంకర్, మధుసూదన రావు, ప్లానింగ్ అధికారులు, కార్యనిర్వాహక ఇంజనీర్లు, పరిపాలనాధికారులు తదితరులు పాల్గొన్నారు.

# హక్కులకై కదం తొక్కిన కార్మికులు




## కొత్త లేబర్ కోడ్‌పై దేశవ్యాప్త సార్వత్రిక సమ్మె -నాలుగు లేబర్ కోడ్లు రద్దు చేయాలి -రైతాంగ సమస్యలు పరిష్కరించాలి -మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కొనసాగించాలి -విశాఖలో భారీ ర్యాలీలు, ప్రదర్శనలు

# గీతంపై వైసీపీవి దిగజారుడు రాజకీయాలు: గంటా




# 13 నుంచి జాతీయ విద్యా విధానం-2020- వికసిత భారత్ 2047 దిశగా ప్రయాణం సవాళ్లు, అవకాశాలపై జాతీయ సదస్సు

విశాఖపట్నం, ప్రభాతవార్త

గాయత్రి విద్యా పరిషత్ డిగ్రీ మరియు పీజీ కోర్సుల కళాశాల (ఏ), మేనేజ్‌మెంట్ స్టడీస్ విభాగం ఆధ్వర్యంలో "జాతీయ విద్యా విధానం--2020 - వికసిత భారత్ 2047 దిశగా ప్రయాణం -సవాళ్లు మరియు అవకాశాలు" అనే అంశంపై రెండు రోజుల జాతీయ సదస్సు ఫిబ్రవరి 13, 14 తేదీలలో రుషికొండ సెంట్రల్ ఆడిటోరియంలో నిర్వహించబడనుంది. ఈ సదస్సును రాజీవ్ గాంధీ యూనివర్సిటీ ఆఫ్ నాలెడ్జ్ టెక్నాలజీస్ వ్యవస్థాపక ఉపకులపతి, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉన్నత విద్యా మండలి మాజీ ఛైర్మన్ ఆచార్య కె.సి. రెడ్డి ప్రారంభించనున్నారు. జాతీయ విద్యా విధానం-2020 అమలు, పాఠ్య సంస్కరణలు, బహుశాఖ విద్య, సాంకేతిక ఆధారిత బోధన, సమగ్ర మూల్యాంకనం వంటి అంశాలపై ప్రముఖ విద్యావేత్తలు తమ అభిప్రాయాలు వెల్లడించనున్నారు. దేశవ్యాప్తంగా ఉన్న అధ్యాపకులు, పరిశోధకులు మరియు విద్యార్థులు ఈ సదస్సులో పాల్గొననున్నారు.

# జీవీఎంసీని సందర్శించిన ఇండోర్ మున్సిపల్ కార్పొరేషన్ కౌన్సిలర్లు

## విశాఖ నగర అందాలు ఆకట్టుకుంటున్నాయి -జీవీఎంసీ వేస్ట్ టు ఎనర్జీ ప్లాంట్, సోలార్ ప్లాంట్, నీటి శుద్ధి ప్లాంట్ నిర్వహణలు ప్రశంసనీయం

విశాఖపట్నం, ఫిబ్రవరి 12, ప్రభాతవార్త:

మహా విశాఖపట్నం నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయాన్ని ఇండోర్ మున్సిపల్ కార్పొరేషన్ 25 మంది కౌన్సిలర్లు గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా జీవీఎంసీ అదనపు కమిషనర్లు పీఎం సత్యవేణి, పి.నల్లనయ్య, డివి రమణమూర్తి,ప్రధాన వైద్యాధికారి డాక్టర్ ఈ ఎన్ వి నరేష్ కుమార్ లు ఇండోర్ మున్సిపల్ కౌన్సిలర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో జీవీఎంసీ అదనపు కమిషనర్లు,అధికారులు విశాఖ నగర పరిశుభ్రత దిశగా జీవీఎంసీ చేపట్టిన పారిశుద్ధ్య విభాగం పారిశుద్ధ్య కార్మికుల పనితీరును , వ్యర్థాల సేకరణ, తరలింపు, క్లోజ్డ్ కాంపాక్టర్ సిస్టం 8వ పేజీలో



# రాష్ట్ర మంత్రి లోకేష్ కృషితో విద్యార్థులకు మేలు

## ఫీజు రియింబర్స్‌మెంట్ కింద రూ.1200 కోట్లు విడుదల చేయడం అభినందనీయం: టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కర్రి సాయికృష్ణ



విశాఖపట్నం, ఫిబ్రవరి 11, ప్రభాతవార్త:

విద్యార్థులకు ఇచ్చిన మాటను నిలబెట్టుకుంటూ రాష్ట్ర ప్రభుత్వం మరో కీలక నిర్ణయం తీసుకుందని, రాష్ట్ర విద్య, ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్ చొరవతో ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిల కింద మొత్తం రూ.1200 కోట్లు విడుదల చేస్తూ ప్రభుత్వం అధికారిక ఉత్తర్వులు జారీచేయడం అభినందనీయమని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కర్రి సాయికృష్ణ పేర్కొన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న పేద, మధ్యతరగతి కుటుంబాలకు చెందిన విద్యార్థులు గత కొంతకాలంగా ఎదుర్కొంటున్న ఆర్థిక ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని 8వ పేజీలో

# పన్ను బకాయి.. కంపెనీ సీజ్!



గాజువాక,ఫిబ్రవరి 12,ప్రభాతవార్త :

నగరపాలక సంస్థకు చెల్లించాల్సిన ఆస్తి పన్ను బకాయిల విషయంలో అధికారులు ఉక్కుపాదం మోపారు. గాజువాక జోన్ పరిధిలోని 76వ వార్డులో ఉన్న ఓ ప్రైవేటు సంస్థ పన్ను చెల్లింపులో మొండికేయడంతో జీవీఎంసీ అధికారులు చర్యలకు ఉపక్రమించారు. సర్వార్ నెస్ట్ రోడ్డులో ఉన్న ఇగ్లో రోజెస్ ఫుడ్స్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ సుమారు రూ. 8 లక్షల మేర పన్ను బకాయి 8వ పేజీలో

# అనాథకు గాజువాక పోలీసుల అభయం



# అనంత వినాయకుడు గ్రంథ ఆవిష్కరణ

విశాఖపట్నం - ప్రభాతవార్త

ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం పూర్వ వైస్ ఛాన్సలర్ ఆచార్య వి . బాల మోహన్ దాస్ రచించిన 'అనంత వినాయకుడు ' నాలుగవ ఎడిషన్ గ్రంథం ఆంధ్ర విశ్వ కళాపరిషత్ అలుమ్ని అసోసియేషన్ జి. ఎం. ఆర్ .సెమినార్ హాల్ లో 12న విశాఖ నగర ప్రముఖుల ఆధ్వర్యం లో ఘనంగా ఆవిష్కరణ జరిగింది. 2010 లో మాస్కో నగరంలో మూడు నెలలు నివాసమున్న బాల మోహన్ దాస్ గారు తన ఇష్ట దైవం వినాయకుడి మీద కాలంకషమైన పరిశోధన చేసి అనేక విషయాలు సేకరించి ఇంతవరకు ఎంతోమందికి తెలియని సమాచారం పొందుపరచి 2010 సెప్టెంబర్ మాసంలో అప్పటి ముఖ్య మంత్రి డాక్టర్ కొణిజేటి రోశయ్య గారికి అంకిత మిస్తూ ఆ నాటి వుడా చిల్డ్రన్ థియేటర్ లో విడుదల చేశారు. ఇప్పటికి మూడు ఎడిషన్ లు దాదాపు 7000 గ్రంథాలు ప్రజా బాహుళ్యం లోనికి వెళ్ళాయి. ఈ గ్రంథ ప్రచురణకు అవసరమైన ధన సాయం డాక్టర్ కె. కుమార్ రాజా అందచేశారు. వినాయకుడి జన్మ వృత్తాంతం నుండి ప్రారంభం ప్రపంచ వినాయక దేవాలయాల వివరాలు (మనదేశంలో , ఇతర దేశాలలో). ప్రత్యేకతలు, పూజ లోని నిగూఢ అర్థాలు, ఔషధ గుణాలు కలిగిన పత్రిపూజ, వినాయకుడి నాయకత్వ లక్షణాలు మొదలగు అనేక విషయాలు పుస్తకం లో చొప్పించారు. దేశంలో అనేక చోట్ల ఉపన్యాసాలు ఇచ్చారు. పత్రికలు , రేడియో , టెలివిజన్ మాధ్యమంలో విషయాలు తెలియ చేశారు. ఈ గ్రంథం ఇప్పటికే , ఆంగ్లం, తమిళ, హిందీ, పంజాబీ, మరాఠీ, కన్నడ, మలయాళ భాషల్లో తర్జుమా చేయబడి బహుళ ప్రచారం పొందింది. ఒడియా , బెంగాలీ భాషలలో అనువాదం జరుగుచున్నది. తెలుగు నాలుగవ ఎడిషన్ గ్రంథాన్ని నగర ప్రముఖులు - (శ్రావణ్ షిప్పింగ్ మేనేజింగ్ డైరెక్టర్ జి. సాంబశివరావు , ప్రముఖ పైడా విద్యాసంస్థల అధినేత శ్రీ పైడా క్రిష్ణ ప్రసాద్, కుమార్ రాజా ప్రాజెక్ట్స్ మేనేజింగ్ డైరెక్టర్ , డాక్టర్ కె.కుమార్ రాజా, సింబియాసిస్ టెక్నాలజీస్ మేనేజింగ్ డైరెక్టర్ ,డాక్టర్ ఓ.నరేష్ కుమార్, మరియు స్నేహ సంధ్య ఏజ్ కేర్ ఫౌండేషన్ మేనేజింగ్ ట్రస్టీ డాక్టర్ ఎన్. ఎస్.రాజు ఆవిష్కరించి అధ్యక్షత వహించిన రచయిత ఆచార్య బాల మోహన్ దాస్ ను అభినందించారు. ఈ సమావేశంలో నగర ప్రముఖులు అనేకులు పాల్గొన్నారు. డాక్టర్ కె. వి.ఎస్ మూర్తి ఆహ్వానం పలుకగా , డాక్టర్ కె. రాజ శేఖర్ వందన సమర్పణ చేశారు.

# రాష్ట్ర మంత్రి లోకేష్ కృషితో విద్యార్థులకు మేలు

7వ పేజీ తరువాయి ..

ఈ నిర్ణయం తీసుకోవడం అభినందనీయమని వివరించారు. రూ.1200 కోట్ల నిధుల రాష్ట్రవ్యాప్తంగా వేలాది మంది విద్యార్థులు ఎదుర్కొంటున్న ఫీజుల సమస్యకు గణనీయమైన ఊరట లభించనుందన్నారు. ఉన్నత విద్యను అభ్యసిస్తున్న విద్యార్థులు తమ చదువులను మధ్యలో ఆపకుండా, కొనసాగించేందుకు ఇది పెద్ద తోడ్పాటుగా నిలుస్తుందన్నారు. ఫీజు రీయింబర్స్మెంట్‌ను సమయానికి అందించడం ద్వారా విద్యార్థుల్లో ప్రభుత్వంపై నమ్మకం పెంపొందుతుందని, ఉన్నత విద్యను ప్రోత్సహించే దిశగా ఇది బలమైన సంకేతమని ఆయన వివరించారు. విద్యార్థుల సమస్యలను సున్నితంగా గుర్తించి, తక్షణ చర్యలు తీసుకుంటున్న మంత్రి నారా లోకేష్ కి ఈ సందర్భంగా హృదయపూర్వక అభినందనలు తెలిపారు. రాష్ట్ర అభివృద్ధిలో విద్య కీలక పాత్ర పోషిస్తుందని, ఆర్థిక ఇబ్బందులు ఏ విద్యార్థి భవిష్యత్తుకూ అడ్డంకిగా మారకూడదనే సంకల్పంతో ప్రభుత్వం ముందుకు సాగుతోందని ఆయన స్పష్టం చేశారు. విద్యార్థుల సంక్షేమం, ఉన్నత విద్యా అవకాశాల విస్తరణ, పారదర్శక పాలన, ఈ మూడు లక్ష్యాలకు ప్రభుత్వం కట్టుబడి ఉందని కర్రి సాయికృష్ణ అన్నారు.

# ఏపీఈపీడీసీఎల్‌కు పీఎం సూర్య ఘర్ కింద..

7వ పేజీ తరువాయి ..

టీజీఎస్పీడీసీఎల్, జేవీవీఎన్ఎల్- జైపూర్, నోయిడా పవర్ కంపెనీ లిమిటెడ్ సంస్థలకు ప్రోత్సాహకాలు లభించాయన్నారు. ఏపీఈపీడీసీఎల్ పరిధిలో గృహ వినియోగదారుల వద్ద రూఫ్‌టాప్ సోలార్ ప్లాంట్ల స్థాపనలో గణనీయమైన వృద్ధి నమోదవడం వల్లే ఈ ప్రోత్సాహకం లభించిందని తెలిపారు. ఇప్పటివరకు 46,603 మంది గృహ వినియోగదారులకు 148.7 మెగావాట్ల సామర్థ్యంతో రూఫ్‌టాప్ సోలార్ ప్లాంట్లను ఏర్పాటు చేసామన్నారు. ఈ ప్రోత్సాహక నిధులు కేంద్ర ప్రభుత్వ మార్గదర్శకాలకనుగుణంగా రాష్ట్రంలో పునరుత్పాదక శక్తి వినియోగాన్ని మరింతగా పెంపొందించడంలో, వినియోగదారులకు నాణ్యమైన మరియు తక్కువ వ్యయంతో విద్యుత్ సరఫరా చేయడంలో కీలక పాత్ర పోషించనున్నాయని పేర్కొన్నారు. సంస్థ పరిధిలో మరిన్ని గృహాలకు రూఫ్‌టాప్ సోలార్ వ్యవస్థలను ప్రోత్సహించేందుకు అవగాహన కార్యక్రమాలను విస్తృతంగా నిర్వహిస్తున్నామని వెల్లడించారు. ప్రధానమంత్రి సూర్య ఘర్ యోజన అమలులో ఏపీఈపీడీసీఎల్ సమర్థవంతంగా పనిచేసి ఈ కేంద్ర ప్రోత్సాహకాన్ని సాధించడం సంస్థకు గర్వకారణమన్నారు. రాష్ట్రంలో రూఫ్‌టాప్ సోలార్ వ్యవస్థల విస్తరణను మరింత వేగవంతం చేస్తూ, వినియోగదారులకు పారదర్శకమైన, సులభమైన సేవలను అందించడానికి సంస్థ సిబ్బంది నిరంతరం కృషి చేస్తున్నారని తెలిపారు. పునరుత్పాదక శక్తి వినియోగాన్ని పెంపొందిస్తూ రాష్ట్రాన్ని గ్రీన్ ఎనర్జీ దిశగా ముందుకు తీసుకెళ్లడమే ఏపీఈపీడీసీఎల్ లక్ష్యమని సీఎండి తెలిపారు. ఈ సందర్భంగా రూఫ్‌టాప్ సోలార్ వ్యవస్థల ఏర్పాటులో అనుకున్న లక్ష్యాలను సాధించడంలో సహకరిస్తున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు, ప్రజా ప్రతినిధులకు, అధికారులకు, ఎంఎన్ఆర్ఈ, ఎన్ఆర్ఏడిసిఏపి అధికారులకు, వినియోగదారులకు సీఎండి పృథ్వీతేజ్ కృతజ్ఞతలు తెలిపారు.

# జీవీఎంసీని సందర్శించిన ఇండోర్ మున్సిపల్ ..

7వ పేజీ తరువాయి ..

ట్రాన్స్ఫర్టేషన్, గార్బేజ్ ట్రాన్స్ఫర్ స్టేషనులు, వేస్ట్ ఎనర్జీ ప్లాంట్ నిర్వహణ, ప్రజలకు అందించు నీటి సరఫరా వ్యవస్థ, నిర్వహణ, స్వర్ణ ఆంధ్ర స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమాలు, ట్రిబుల్ ఆర్ సెంటర్ లు, సచివాలయాల వ్యవస్థ ద్వారా ప్రజలకు అందించే సేవలు, సోలార్ ప్లాంట్లు, నీటి శుద్ధి కేంద్రాల ద్వారా పరిశ్రమలకు అందించే నీటి సరఫరా , నగరంలో రోడ్ల విస్తరణ ,అభివృద్ధి, ఎల్ఆర్ఎస్, బి పి ఎస్ పథకాల అమలు తదితర అంశాలపై ఇండోర్ మున్సిపల్ కార్పొరేషన్ కౌన్సిలర్లకు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. ఇండోర్లో ఇంటింటి నుండి వ్యర్థాలు సేకరించే విధానంలో చెత్త సేకరణకు వీలుగా కంపార్ట్మెంట్ కలిగిన వాహనాలను రూపొందించడం అన్ని రాష్ట్రాలకు ఆదర్శనీయంగా ఇండోర్ మున్సిపల్ కార్పొరేషన్ నిలిచిందని జీవీఎంసీ అదనపు కమిషనర్ పి నల్లనయ్య ప్రశంసించారు. అనంతరం ఇండోర్ మున్సిపల్ కార్పొరేషన్ సీనియర్ కౌన్సిలర్లు సురేష్ తక్కల్కర్, కాంచన గిద్వానీ మాట్లాడుతూ విశాఖ నగర అందాలు, పరిశుభ్రత ఆకట్టుకున్నాయన్నారు. విశాఖ నగరంలో అతి తక్కువ సమయంలో వేస్ట్ టు ఎనర్జీ ప్లాంట్ నిర్వహణ అద్భుతంగా చేపడుతున్నారని, ల్యాండ్ బేస్డ్, ఫ్లోటింగ్ సోలార్ పవర్ ప్లాంట్ లు ఆదర్శనీయంగా ఉన్నాయన్నారు. మురుగునీరును శుద్ధిచేసి పరిశ్రమలకు నీటిని సరఫరా చేసే ప్రక్రియ మరింత స్ఫూర్తిదాయకంగా ఉందని , విశాఖ నగరం ఎప్పుడు అన్ని రాష్ట్రాలకు సుందరీకరణతో ఆకట్టుకుంటుందని కొనియాడారు. అనంతరం జీవీఎంసీ అధికారులు, ఇండోర్ మున్సిపల్ కార్పొరేషన్ కౌన్సిలర్లు పరస్పరం జ్ఞాపికలను బహుకరించుకొని సత్కరించుకున్నారు.


## CLASSIFIEDS

### CHANGE OF NAME

★ I, ROHANI PRASAD RATHOUR S/O BUDHDHU RAM RATHOUR, previously called R ROHINI PRASAD R/O WARD NO.05, PATAN, GORSI, ANUPPUR, MADHYAPRADESH, PIN: 484330, now changed my name from R ROHINI PRASAD to ROHANI PRASAD RATHOUR. Henceforth I will be called as **ROHANI PRASAD RATHOUR** for all purposes.
(Ro.No.42834)

★ **I, NAUMAT BAI RATHOUR** W/O ROHANI PRASAD RATHOUR previously called R NAVMATH BAI R/O WARD NO.05, PATAN, GORSI, ANUPPUR, MADHYAPRADESH, PIN: 484330, now changed my name from R NAVMATH BAI to NAUMAT BAI RATHOUR.Hence forth I will be called as **NAUMAT BAI RATHOUR** for all purposes.
(Ro.No.42839)

### FOR SALE

★ గజపతి నగరం 100 చ.గజాల భూమి - - ఫ్రూట్ ప్రాఫిట్ షేరింగ్‌తో 80 నెలల పాటు ప్రతి నెల ₹ 5,000 ఆదాయం సంపాదించండి. **6304674818.**
(Ro.No.42745)

### గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగినరీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో "వార్త" దినపత్రికకు ఏ విధమైన సంబంధం లేదు.


# అనాథకు గాజువాక పోలీసుల అభయం

గాజువాక, ఫిబ్రవరి 12,ప్రభాతవార్త

గత ఎనిమిదేళ్లుగా వీధుల్లోనే కాలం వెళ్లదీస్తున్న ఒక అనాథకు గాజువాక పోలీసులు అండగా నిలిచారు. మానసిక స్థితి సరిగ్గా లేక షీలానగర్ పరిసరాల్లో తిరుగుతున్న కండవెల్లి వెంకట రమణ (40)ను పోలీసులు రక్షించి మానవత్వాన్ని చాటుకున్నారు. వివరాల్లోకి వెళ్తే.. తండ్రి మరణంతో తీవ్ర మనస్తాపానికి గురైన వెంకట రమణ, గత ఎనిమిది ఏళ్లుగా మతిస్థిమితం కోల్పోయి వీధుల్లో సంచరిస్తున్నారు. ఇతని పరిస్థితిని గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. స్థానికుల ఫిర్యాదుపై గాజువాక సీఐ పార్థసారథి తక్షణమే స్పందించారు. రెడ్ క్రాస్ సిబ్బంది సహాయంతో ఆ వ్యక్తిని సురక్షితంగా స్వాధీనం చేసుకున్నారు. అనంతరం అతడికి కౌన్సెలింగ్ ఇచ్చి, మెరుగైన సంరక్షణ కోసం రెడ్ క్రాస్ షెల్టర్ హోమ్కు తరలించారు. ఆపదలో ఉన్న వ్యక్తికి సకాలంలో స్పందించి ఆశ్రయం కల్పించిన పోలీసులను, రెడ్ క్రాస్ ప్రతినిధులను స్థానికులు అభినందించారు.

# పన్ను బకాయి.. కంపెనీ సీజ్!

7వ పేజీ తరువాయి ..

పడింది. పలుమార్లు నోటీసులు జారీ చేసినా యాజమాన్యం నుంచి స్పందన లేకపోవడంతో.. గురువారం గాజువాక జోనల్ కమిషనర్ శేషాద్రి, రెవెన్యూ అధికారి (ఆర్వో) రామ్ నారాయణ పర్యవేక్షణలో సిబ్బంది కంపెనీ ప్రధాన ద్వారానికి తాళాలు వేసి సీజ్ చేశారు. రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు శివ, రెడ్డి మోహన్ తదితరులు పాల్గొన్నారు. పన్ను బకాయిలు ఉన్న వారు తక్షణమే స్పందించాలని, లేనిపక్షంలో కఠిన చర్యలు తప్పవని అధికారులు హెచ్చరించారు.

# గీతంపై వైసీపీవి దిగజారుడు రాజకీయాలు: గంటా

విశాఖపట్నం, ఫిబ్రవరి 12,ప్రభాతవార్త

రాష్ట్రంలో అనేక ఉత్తమ విద్యాసంస్థల ఏర్పాటుకు భూములిచ్చిన ప్రభుత్వం.. కొత్తగా ప్రముఖ సంస్థలేవైనా కోరితే ఇవ్వడానికి సిద్ధంగా ఉందని విద్యా శాఖ మాజీ మంత్రి, భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు అన్నారు. ఎమ్మెల్యేలు పల్లా శ్రీనివాసరావు, పి.జి.వి.ఆర్. నాయుడు (గణబాబు), పి. విష్ణుకుమార్ రాజులతో కలిసి గురువారం అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద మాట్లాడుతూ విశాఖలో గీతం యూనివర్సిటీ భూముల క్రమబద్ధీకరణ ప్రతిపాదనపై వైసీపీ దిగజారుడు రాజకీయాలు చేస్తోందని విమర్శించారు. ప్రభుత్వం నిర్ణయించిన ధరకు క్రమబద్ధీకరించుకోవడానికి సిద్ధంగా ఉన్నామని గీతం యాజమాన్యం స్పష్టీకరిస్తూ ప్రభుత్వానికి లేఖ రాసిందని చెప్పారు. ఎస్.ఆర్.ఎం., విట్, అమృత, సెంచూరియన్, ఎకార్డ్ వంటి ప్రతిష్టాకరమైన విద్యా సంస్థలకు అమరావతి, విశాఖలలో ప్రభుత్వం ధర నిర్ణయించి భూములివ్వడం జరిగిందని గుర్తు చేశారు. టీడీపీ సీనియర్ నాయకుడు ఎం.వి.వి.ఎస్. మూర్తి గీతం వ్యవస్థాపకుడు కావడం.. విశాఖ ఎంపీ, మంత్రి లోకేష్ తోడల్లుడు ఎం.శ్రీభరత్ ఆ యూనివర్సిటీకి ప్రస్తుత చైర్మన్ గా ఉన్న కారణంగానే వైసీపీ గీతం యూనివర్సిటీ భూముల క్రమబద్ధీకరణ అంశంపై అనవసర రాద్ధాంతం చేస్తోందన్నారు.

# ఐఎఫ్ఆర్ నిర్వహణలో మిగిలిన ఏర్పాట్లు

7వ పేజీ తరువాయి ..

విశాఖపట్టణం, ఫిబ్రవరి 12 ః ఐఎఫ్ఆర్ -2026 నిర్వహణలో భాగంగా మిగిలిన ఏర్పాట్లను త్వరితగతిన పూర్తి చేయాలని సంబంధిత అధికారులను జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్ ఆదేశించారు. అందరూ సమన్వయంతో వ్యవహరించాలని, విజయవంతం చేసేందుకు కృషి చేయాలని సూచించారు. అంతర్జాతీయ ఫ్లీట్ రివ్యూలో భాగంగా 17 నుంచి 20వ తేదీ వరకు జరగనున్న మిలాన్, ఐయాన్స్ కానక్లేవ్, సిటీ పరేడ్ తదితర కార్యక్రమాల నిర్వహణ ఏర్పాట్లపై పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చీతో కలిసి కలెక్టరేట్ మీటింగు హాలులో గురువారం సమీక్ష నిర్వహించిన ఆయన పలు అంశాలపై చర్చించారు. ఇప్పటి వరకు ఆయా విభాగాల ఆధ్వర్యంలో చేపట్టిన చర్యల గురించి ఆరా తీశారు. అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ఈ కార్యక్రమ విజయవంతానికి ప్రతి ఒక్కా అంకితభావంతో పని చేయాలని, సమన్వయ లోపం రాకుండా జాగ్రత్త వహించాలని కలెక్టర్ సూచించారు. భారత రాష్ట్రపతి, కేంద్ర రక్షణ శాఖ మంత్రి, రాష్ట్ర గవర్నర్, ముఖ్యమంత్రి ఇతర ప్రముఖుల పర్యటనలకు సంబంధించిన ఏర్పాట్లు, గ్రీన్ రూమ్లు, ఇతర ప్రోటోకాల్ వ్యవహారాల్లో జాగ్రత్తగా వ్యవహరించాలని చెప్పారు. ఐఎఫ్ఆర్, మిలాన్, సిటీ పరేడ్ నిర్వహణ కార్యకలాపాలు, భద్రతా దృష్ట్యా ఫిషింగ్ బోట్ జెట్టీలోని బోట్లను తాత్కాలికంగా వేరే ప్రాంతానికి తరలించాలని మత్స్యశాఖ జేడీని కలెక్టర్ ఆదేశించారు. కోస్ట్ గార్డు, మెరైన పోలీసు తీర భద్రత, ఇతర వ్యవహారాలను పర్యవేక్షించాలన్నారు. మిలాన్ విలేజ్ లో స్టాళ్ల ఏర్పాటు, సిటీ పరేడ్ రోజు సాంస్కృతిక కార్యక్రమాలు, శకటాల ప్రదర్శన వంటి అంశాల్లో టూరిజం శాఖ తగిన చర్యలు తీసుకోవాలన్నారు. 18వ తేదీన జరిగే ఫుల్ డ్రెస్ రిహార్సల్స్ నాటికి అన్ని ఏర్పాట్లు పూర్తి కావాలని నిర్దేశించారు. విద్యుత్ సరఫరాలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని విద్యుత్ శాఖ ఎస్ఈకి సూచించారు. పటిష్టమైన బారికేడింగ్ వేయాలని ఆర్‌డబి ఎస్ఈని, సరిపడా బస్సులు నడపాలని, జన తాకిడిని బట్టి హోల్డింగ్ పాయింట్లను పెట్టుకోవాలని, పోలీసులతో సమన్వయం చేసుకొని ప్రజలకు ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకోవాలని ఆర్టీసీ అధికారులను ఆదేశించారు. వుడా పార్కు, సెంట్రల్ పార్కు, గురజాడ కళాక్షేత్రం, తెన్నేటి పార్కు, సమతా హాస్టల్ ప్రాంగణాల్లోని హోల్డింగ్ పాయింట్ల వద్ద ఎల్.ఈ.డి. స్క్రీన్లను పెట్టాలని వీఎంఆర్డీఏ అధికారులకు చెప్పారు. అన్ని చోట్లా విరివిగా సీసీ టీవీ కెమెరాలు, బీచ్ వైపు వేసే ఎనక్లోజర్లలో ప్రజలు వీక్షించేందుకు అనువుగా ఎల్ఈడీలు పెట్టాలని జీవీఎంసీ అధికారులకు సూచించారు. సరిపడా మెడికల్ క్యాంపులు, అంబులెన్సులను ఏర్పాటు చేయాలని, కంటింజెంట్ ఆసుపత్రులను గుర్తించి తదుపరి చర్యలు తీసుకోవాలని వైద్యాధికారులకు చెప్పారు. ఐఎన్ఎస్ డేగా నుంచి మారుతీ జంక్షన్ వరకు జరుగుతున్న వంతెన, రోడ్ల పనులను త్వరితగతిన పూర్తి చేయాలని, అగ్నిమాపక శాఖ ఆధ్వర్యంలో అవసరమైన చోట్ల అగ్నిమాపక యంత్రాలను అందుబాటులో ఉంచాలని, హెచ్పీసీఎల్ పరిధిలో కూడా అగ్నిమాపక యంత్రాలను సిద్ధంగా ఉంచాలని సూచించారు. ప్రజలకు సరిపడా టాయిలెట్లను సమకూర్చాలని, తాగునీరు ఏర్పాటు చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఎయిర్ పోర్టు వద్ద రిసెప్షన్ డెస్కు ఏర్పాటు చేయాలని, విశ్వప్రియ ఫంక్షన్ హాలు వద్ద జాయింట్ కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేయాలని చెప్పారు. సమావేశంలో పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చీ, జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్, జాయింట్ కలెక్టర్ గొబ్బిళ్ల విద్యాధరి, డీసీపీలు మేరీ ప్రశాంతి, మణికంఠ, నేవీ కమాండర్ వైకే కిశోర్, ఇన్చార్జి డీఆర్వో సత్తిబాబు, విశాఖపట్టణం ఆర్డీవో సుధాసాగర్, ఏడీసీపీలు, ఎస్.డి.సి.లు, ఇతర విభాగాల జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు.

# హక్కులకై కదం తొక్కిన కార్మికులు

(ప్రభాతవార్త-విశాఖపట్నం)

44 కార్మిక చట్టాల స్థానే తెచ్చిన నాలుగు లేబర్ కోడ్లు రద్దు చేసి కార్మిక హక్కులు కాపాడాలని, రైతాంగ సమస్యలు పరిష్కరించాలని, మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కొన సాగించాలని కోరుతూ జరుగుతున్న దేశవ్యాప్త సమ్మెలో భాగంగా విశాఖలి కూడా కొనసాగింది. ఈ సందర్భంగా రైతు, కార్మిక సంఘాల ఆధ్వర్యంలో భారీ ర్యాలీలు, ప్రదర్శ నలు చేపట్టారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా అఖిల భారత కార్మికుల సమ్మె విజయవంతమైంది. కొత్త లేబర్ కోడ్లను రద్దు చేయాలని, కార్పొరేట్ శక్తులను అనుకూలంగా ఉండే నిర్ణయాలను నిరసిస్తూ నిరసనలు జరిగాయి. కోడ్లను రద్దు చేయాలంటూ మంది కార్మికులు నిరసన వ్యక్తం చేశారు. విజయవంతమైంది. కొత్త లేబర్ కోడ్లను రద్దు చేయాలని, కార్పొరేట్ శక్తులను అనుకూలంగా ఉండే నిర్ణయాలను నిరసిస్తూ నిరసనలు జరిగాయి. కోడ్లను రద్దు చేయాలంటూ మంది కార్మికులు నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో పలువురు కార్మిక నాయకులు పాల్గొన్నారు.

# ఉచిత హెచ్ఎల్ఏ పరీక్ష శిబిరానికి అనూహ్య స్పందన

ఆరిలోవ, ఫిబ్రవరి 12, ప్రభాతవార్త




డీకేఎంఎస్ ఫౌండేషన్ ఇండియా, చెన్నైలోని ఎంజీఎం క్యాన్సర్ ఇన్స్టిట్యూట్, సప్త ఫౌండేషన్ సంయుక్తంగా కింగ్ జార్జ్ జనరల్ హాస్పిటల్ (కేజీహెచ్) లో థలసేమియా, సికిల్ సెల్ వ్యాధితో బాధపడుతున్న చిన్నారుల కోసం ప్రత్యేక వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ వైద్య శిబిరానికి అనూహ్య స్పందన లభించింది. విశాఖ జిల్లాలోనే కాక, విజయనగరం, పాడేరు శ్రీకాకుళం, పార్వతిపురం ప్రాంతాల నుండి 55కు పైగా కుటుంబాలు హాజరయ్యారు. రోగులు వారి కుటుంబ సభ్యుల నుంచి చెంప స్వాబ్ ద్వారా 200 కు పైగా నమూనాలను సేకరించి ఉచిత హై - రిజల్యూషన్ హెచ్ఎల్ఏ టైపింగ్ పరీక్షలు నిర్వహించి అదనంగా నిపుణ వైద్యుల ద్వారా భవిష్యత్తు చికిత్స మార్గాలపై సలహాలు అందించారు. ఈ శిబిరం చెన్నై ఎంజీఎం క్యాన్సర్ ఇన్స్టిట్యూట్ శిశు ట్రాన్స్ ప్లాంట్ నిపుణుడు డాక్టర్ దీన దయాళన్ మునిరత్నం, సప్త ఫౌండేషన్ వ్యవస్థాపకులు చైర్మన్ శరత్ బాబు వోగ్గు, డీకేఎంఎస్ ఫౌండేషన్ ఇండియా ఎగ్జిక్యూటివ్ చైర్మన్ ప్యాట్రిక్ పాల్ మరియు కేజీహెచ్ బాల వైద్య విభాగం మద్దతుతో నిర్వహించారు. వైద్య ఆర్థిక మౌలిక సదుపాయాలు సమస్యలను ఎదుర్కొంటున్న రోగులకు ప్రాణ రక్షక స్టెమ్ సెల్ మార్పిడి చికిత్స అందుబాటులోకి తేవడమే మా లక్ష్యం అని వారు తెలిపారు.

# ఆరిలోవలో విద్యుత్ సరఫరాకు అంతరాయం

ఆరిలోవ, ఫిబ్రవరి 12, ప్రభాతవార్త

33/11కేవీ సబ్‌స్టేషన్ పైనాపిల్ కాలనీ సబ్‌స్టేషన్ పరిధిలో సబ్‌స్టేషన్ పెయింటింగ్ ,11 కేవీ దుర్గా నగర్, అంబేద్కర్ నగర్ ఫీడర్ నిర్వహణ, 33/11కేవీ ఆరిలోవ సబ్స్టిట్యూషన్ పరిధి లో బాలాజీ నగర్ ఫీడర్,11కేవీ ఆరిలోవ ఫీడర్కి సంబంధించిన పనిని చేపట్టడంతో శుక్రవారం ఉదయం 10 గంటల నుండి సాయంత్రం 4గంటల వరకు ఈ కింది ప్రాంతాలైన పాండురంగ పురం, ఆరిలోవకాలనీ, దుర్గాబజార్ ఏరియా, నెహ్రూ నగర్, శ్రీకాంత్ నగర్ లే ఔట్, ప్రగతి నగర్, జై భీమ్ నగర్ , భగత్ సింగ్ నగర్, లీలా సుందరయ్య నగర్, ఎస్ కె ఎం ఎల్ నగర్, జె ఎన్ ఎన్ యు అర్ ఎం బ్లాక్స్, శివాజీ నగర్, పార్వతినగర్, బి టీ అర్ నగర్, అంబేద్కర్ జంక్షన్, ముస్తఫా కాలనీ, బాలాజినగర్ జంక్షన్, డ్రైవర్స్ కాలనీ ప్రియదర్శిని కాలనీ, అన్నా నగర్, శ్రీహరి నగర్, దుర్గాలమ్మ టెంపుల్ ,రవీంద్ర నగర్ మొదలైన ప్రాంతాలకు విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నట్లు జోన్ -3, ఎక్జిక్యూటివ్ ఇంజినీర్ ఆపరేషన్ బి. సింహాచలం నాయుడు తెలిపారు.



# 62వ వార్డులో రూ. 16 లక్షలతో రక్షణ గోడ పనులు ప్రారంభం

గాజువాక,ఫిబ్రవరి 12,ప్రభాతవార్త

జీవీఎంసీ 62వ వార్డు పరిధిలోని అల్లూరి సీతారామరాజు కాలనీలో రక్షణ గోడ (రిటైనింగ్ వాల్) నిర్మాణ పనులు గురువారం లాంఛనంగా ప్రారంభమయ్యాయి. ప్రభుత్వ విప్, విశాఖ పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే పి.జి.వి.ఆర్. నాయుడు (గణబాబు) ఆదేశాల మేరకు రూ. 16 లక్షల వ్యయంతో ఈ పనులను చేపట్టారు. వార్డు టీడీపీ అధ్యక్షుడు మజ్జి మాలినాయుడు ముఖ్య అతిథిగా హాజరై కొబ్బరికాయ కొట్టి పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పారిశ్రామిక ప్రాంతమైన ఈ వార్డులో ప్రజల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని ఎమ్మెల్యే గణబాబు నిధులు మంజూరు చేయించారని తెలిపారు. రక్షణ గోడ నిర్మాణంతో కాలనీవాసులకు ఎంతో మేలు జరుగుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బూత్ ఇంచార్జ్ దిలీప్, గంగాధర్, పిలక వాసు, సీ.పీ సింగ్, రమణ, కృష్ణవేణి, మైలపిల్లి శ్రీను, జీవన్, ఇంద్రజిత్, కూటమి నాయకులు,స్థానికులు పాల్గొన్నారు.

# ప్రసాద్' స్కీం పనులపై ఈఓ సమీక్ష

సింహాచలం ఫిబ్రవరి 12 ప్రభాత వార్త



శ్రీ వరాహ లక్ష్మీ నరసింహస్వామి దేవస్థానంలో కేంద్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'ప్రసాద్' పథకం పనుల పురోగతిపై ఆలయ కార్యనిర్వహణాధికారి జె. వెంకటరావు గురువారం సమీక్షా సమావేశం నిర్వహించారు. తన కార్యాలయంలో జరిగిన ఈ సమావేశంలో ఏపీ టూరిజం మరియు దేవస్థాన ఇంజనీరింగ్ అధికారులతో కలిసి పనుల స్థితిగతులపై ఆయన సమగ్రంగా చర్చించారు. ప్రసాద్ స్కీం కింద ఇప్పటివరకు పూర్తయిన పనులు, ప్రస్తుతం కొనసాగుతున్న పనులు మరియు ఇంకా ప్రారంభించాల్సిన పనుల వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. ప్రతి పనికి సంబంధించిన టైమ్‌లైన్, నాణ్యతా ప్రమాణాలను పరిశీలించారు. ఇప్పటికే వంద శాతం పూర్తయిన పనులను ఆలయ వినియోగం కోసం తక్షణమే దేవస్థానానికి అప్పగించాలని టూరిజం అధికారులను ఈఓ ఆదేశించారు. పెండింగ్‌లో ఉన్న మిగిలిన పనులను యుద్ధ ప్రాతిపదికన చేపట్టి, నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని స్పష్టం చేశారు. భక్తుల సౌకర్యార్థం చేపడుతున్న ఈ పనుల్లో ఎటువంటి జాప్యం జరగకూడదని, అధికారులు పూర్తి బాధ్యతతో పని చేయాలని సూచించారు. క్షేత్రానికి వచ్చే వేలాది మంది భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా భద్రతా చర్యలు చేపడుతూ పనులు వేగవంతం చేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో టూరిజం ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కె. విజయ భాస్కర్ రెడ్డి, డిప్యూటీ ఈ. ఈ. జి.ఎస్.వి.వి. సత్యనారాయణ, ఏ.ఈ.ఈ. పి.ఎస్. రామారావు పాల్గొన్నారు. దేవస్థానం ఇంజనీరింగ్ విభాగం నుండి ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు రమణ, వి. రామకృష్ణ, బి. రాంబాబు, ఎస్. సన్యాసి రావు, డి.వి.ఎస్. రామ రాజు, తదితరులు పాల్గొన్నారు.

**YELAMANCHILI MUNICIPALITY**
**TENDER NOTICE**

Yelamanchili Municipality invited following tenders via 'e'-procurement Platform for taking up Water supply works under General Funds.

| | |
|---|---|
| Total No of Works | : 02 Works |
| Total Estimates value | : Rs. 3.00 Lakhs |
| Total ECV | : Rs. 2.41 Lakhs |
| BID Starting Date & Time | : 12-02-2026 by 11:00 AM |
| BID Ending Date & Time | : 27-02-2026 by 03:30 PM |

If any details logon to www.apeprocurement.gov.in, Contact Ph.No. 7989149962, 9618496973.

Sd/-BJSP Raju
COMMISSIONER
YELAMANCHILI MUNICIPALITY

**Paper Publication**
[Substituted Service]

**OFFICE OF THE RECOVERY OFFICER-I**
**DEBTS RECOVERY TRIBUNAL**
(Ministry of Finance, Government of India)
Ground & 1st Floor, 31-31-21, Narayana Bhavanam, Sai Baba Street, Dabagardens, Visakhapatnam-530020, A.P.

**FORM No. I.T.C.P 17**
(See Rule 52 & 53 of the Second Schedule to the Income Tax Act, 1961)

**NOTICE FOR SETTLING A SALE PROCLAMATION**
R.P. No. 85 of 2020 in OA No. 70 of 2019

Bank of Baroda, Asilmettta Branch, Dwaraka Nagar, Visakhapatnam.
*Versus*
Mr. Bandaru Narayana Murthy & another

To
(CD 1) **Sri. Bandaru Narayana Murthy, S/o Sri. Venkateswara Rao,** Flat No. FF-5, 4th Floor, Krishnaji Towers, D No. 8-1-7, Siripuram, Visakhapatnam-530003.
OR
**Sri. Bandaru Narayana Murthy, s/o Sri. Venkateswara Rao,** Plot No. 199, Sector 3, MVP Colony, Visakhaptnam-530017.
(CD-2) **Sri. Bandaru Veera Venkata Satyanarayana Murthy, S/o Sri. Dharmaraju,** D.No. 6-93, KM Street, Kothapeta, East Godavari District-533223.
OR
**Sri. Bandaru Veera Venkata Satyanarayana Murthy, S/o Sri. Dharmaraju,** Flat No. 403, Royal Homes, D No. 9-15-16(14), CBM Compound, VIP Road, Visakhapatnam-530003.

Whereas in execution of Recovery Certificate dated 02.09.2020 in O.A No. 70/2019 for **Rs. 50,60,316.58 Ps (Rupees fifty lakhs sixty thousand three hundred sixteen and fifty eight paisa only)** along with pendentellite and future interest @ 8.35% p.a compounded with monthly rests from 24.04.2019 till realization / date of payment and the cost of **Rs. 87,000/- (Rupees eighty seven thousand only)** has become due against you forwarded by the Hon'ble Presiding Officer, Debts Recovery Tribunal, Visakhapatnam, the undersigned has ordered the sale of the under mentioned immovable properties.

You, the Certificate Debtors/ Defendants above named, are hereby informed that on or after fifteenth day from the date of service of this notice has been fixed for drawing up the *proclamation of sale* and settling the terms thereof. *You are requested to bring to the notice of the undersigned any encumbrances, charges, claims or liabilities attaching to the said properties or any portion thereof.*

It is ordered that you, the said Certificate Debtors, are hereby prohibited and restrained until further order of the undersigned, from transferring or charging the under mentioned properties in any way and that all persons be, and that they are hereby prohibited from taking any benfit under such transfer or charge.

**SPECIFICATION OF PROPERTY**

**SCHEDULE-A: (Property covered under Sale Deed bearing Document No. 7108/2014 dated 01.11.2014 registered at SRO-Visakhapatnam (R.O), belonging to 1st Defendant i.e Sri. Bandaru Narayana Murthy)**

All that site measuring an extent of 30 Sq.yds or 25.083 Sq.mtrs being undivided and unspecified share out of the total extent of 1212.75 Sq.yds together with Flat No. FF-4 with a plinth area 1390 Sft (inclusive common areas and balconies) in the First Floor bearing D No. 8-1-7, Assessment No. 100002/80351 with electricity connection of Krishnanjali Towers situated on the western side of the road leading from Peda Waltair via Andhra University Registrar's Office to Siripuram Junction covered by Block No. 6, T.S No. 62 of Waltair Ward within the limits of Greater Visakhapatnam Municipal Corporation area and Joint SRO of Visakhapatnam and **Bounded by: East:** Vacant Site 20 Ft wide in S.N No. 62 left by the estate for the purpose of Road (presently 20 feet road). **South:** S.N No. 63- Karakachettu Road (presently road from Peda Waltair to Siripuram Junction via Andhra University Registrar's Office). **West:** Vacant site and existing Outhouse D.No. 8-1-4 (presently D.N No. 8-1-7 with Aakrithi Apartment Complex). **North:** Vacant site of forming part of S.N No. 62 purchased by Zamindar of Andhra from Bobbilisetty Kamaraju (Presently D.No. 9-42-9/1 with house and site belonging to Smt. A Rajeswari).

**(Given under my hand and seal of this Tribunal at Visakhapatnam on the 18th February, 2025)**

**(Avasarala Anil), Recovery Officer-I**
**Debts Recovery Tribunal, Visakhapatnam**

बैंक ऑफ बड़ौदा Bank of Baroda **బ్యాంక్ ఆఫ్ బరోడా**
ఎం.వి.పి.కాలనీ బ్రాంచ్, విశాఖపట్నం-530017. ఫోన్:7995565147

**(సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్ 2002 యొక్క 8 (6) రూలు SARFAESI చట్టం 2002 నందు నిర్ధారించిన పరిధిలో 30 రోజుల నోటీసు.**

బ్యాంక్ ఆఫ్ బరోడా, ఎమ్‌విపి కాలనీ, విశాఖపట్నం బ్రాంచ్ తరపున ఈ దిగువ తెలిపిన సంబంధిత రుణఖాతాలకు సంబంధించి సంబంధిత ఋణగ్రహీతలు, హామీదారులు, తనఖాదారులకు క్రింద తెలియజేసిన మొత్తములు చెల్లించవలసినదిగా దిగువ ఇవ్వబడిన తేదీలలో **ఎమ్‌విపి కాలనీ, విశాఖపట్నం బ్రాంచ్** యొక్క అధీకృత అధికారి డిమాండ్ నోటీసు జారీ చేసినారని మీ అందరూ గమనించగలరు.

అటు తర్వాత, **బ్యాంక్ ఆఫ్ బరోడా, ఎమ్‌విపి కాలనీ, విశాఖపట్నం బ్రాంచ్** కు చెల్లించవలసిన బకాయిలకు సంబంధించి చట్టంనకు లోబడి 13(4) విభాగం నియమావళి పరిధిలో సెక్యూర్డ్ ఆస్తులను **బ్యాంక్ ఆఫ్ బరోడా** యొక్క అధీకృత అధికారి **లాంఛనాత్మక స్వాధీనత** తీసుకోవటమైనది మరియు **SARFAESI** చట్టం పరిధిలో ప్రాంతీయ భాష మరియు ఇంగ్లీషు వార్తా పత్రికలలో ఆయా తేదీలలో సదరు స్వాధీనతా ప్రకటన కూడా ప్రచురించటమైనది.

కనుక, చట్టంనకు లోబడి మరియు అందలి రూల్సు యొక్క నియమావళి ననుసరించి, అమ్మకమునకు ముందుగా దిగువ వివరించిన సంబంధిత తేదీలలో పూర్తి బకాయి మొత్తములు చెల్లించవలసినదిగా సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్సు-2002 యొక్క 8(6) నిబంధన క్రింద నేను 30 రోజుల నోటీసు కూడా పంపటమైనది.

మీ అందరికి ఈ నోటీసు తేదీ నుండి 30 దినములలోగా దిగువ తెలిపిన పూర్తి బకాయి మొత్తమును + తదుపరి వడ్డీ, ఖర్చులు మరియు వ్యయాలు చెల్లించి, బ్యాంకు స్వాధీనంలో నున్న ఆస్తులను విడిపించుకోవలసినదిగా చిట్ట చివరి అవకాశం ఇవ్వటమైనది. అట్లు చేయుటలో విఫలమైనచో, SARFAESI చట్టం ప్రకారం ఏదైన ఈ క్రింది పద్ధతి ద్వారా ఆస్తులు విక్రయించబడతాయి. (ఎ) ఇటువంటి సెక్యూర్డ్ ఆస్తులతో లావాదేవీలు చేస్తున్న వ్యక్తులు లేదా ఆస్తులు కొనుగోలు చేయుటలో ఇతరత్రా ఆసక్తి కల వ్యక్తులు నుండి కొటేషన్లు పొందుట ద్వారా లేదా (బి) పబ్లిక్ నుండి టెండర్లు కోరుట ద్వారా లేదా (సి) ఇ-వేలం పద్ధతి ద్వారాతో పాటు బహిరంగ వేలం నిర్వహించుట ద్వారా లేదా (డి) ప్రైవేటు ఒప్పందం ద్వారా.

చట్టం నందు / అమలులోనున్న ఏదైన ఇతర న్యాయ పరిధిలో బ్యాంకునకు ఎలాంటి ఇతర హక్కులకు భంగంవాటిల్లకుండా పక్షపాతం లేకుండా ఈ నోటీసు జారీ చేయటమైనది.

**ఋణగ్రహీతల వివరములు : 1. శ్రీ కోట్ల ముకుందరావు,** తండ్రి : శ్రీ కోట్ల చిన్న అప్పల స్వామి, నివాసం : (ఎ) 6-343, రవీంద్ర నగర్ -2, దుర్గ సాయి గుడి దగ్గర, ఆరిలోవ, విశాఖపట్నం, ఆంధ్రప్రదేశ్ - 530040. వేరొక చిరునామా: (బి) డోర్ నెం.9-165/7/7, ఫ్లాట్ నెం.401, వైష్ణోస్ హరి ప్రియ అపార్ట్‌మెంట్స్, అన్నంరాజు నగర్, కొమ్మాది, విశాఖపట్నం, ఆంధ్రప్రదేశ్ - 530048. **2. శ్రీమతి కోట్ల సత్య నాగమణి,** భర్త : కోట్ల ముకుందరావు, నివాసం : (ఎ) 6-343, రవీంద్ర నగర్ -2, దుర్గ సాయి గుడి దగ్గర, ఆరిలోవ, విశాఖపట్నం, ఆంధ్రప్రదేశ్ - 530040. వేరొక చిరునామా: (బి) డోర్ నెం.9-165/7/7, ఫ్లాట్ నెం.401, వైష్ణోస్ హరి ప్రియ అపార్ట్‌మెంట్స్, అన్నంరాజు నగర్, కొమ్మాది, విశాఖపట్నం, ఆంధ్రప్రదేశ్ - 530048.

**(1) HOUSING LOAN under Baroda Home Loan Scheme, bearing A/c No.26170600027831 & (2)Top -UP Loan under Scheme Baroda Home Loan bearing A/c No.26170600028012.**

| డిమాండ్ నోటీసు తేది: | స్వాధీనత నోటీసు తేది: | స్వాధీనత నోటీసు ప్రచురించిన తేది: |
|---|---|---|
| 24-07-2025 | 29-10-2025 | 04-11-2025 |

చెల్లించవలసిన మొత్తం: **తేది.20.07.2025** నాటికి **రూ.41,93,228.28** పై (అక్షరాల నలభై ఒక్క లక్షల తొంభై మూడు వేల రెండు వందల ఇరవై ఎనిమిది రూపాయల ఇరవై ఎనిమిది పైసలు మాత్రమే) + **తేది.21-07-2025** నుండి వర్తించని వడ్డీ ప్లస్ లీగల్ మరియు ఇతర ఛార్జీలతో సహా.

**స్థిరాస్తి వివరములు:**

షెడ్యూలు-ఎ: విశాఖపట్నం జిల్లా, మధురవాడ సబ్ రిజిస్ట్రార్స్ ఆఫీస్ అధికార పరిధి, గ్రేటర్ విశాఖపట్నం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో, మధురవాడ గ్రామం సర్వే నెం.లు 2&4 లోని ఎల్.పి.నెం.34/88 ప్రకారం వుడా ఆమోదం ప్రకారం గల శ్రీ అన్నంరాజు నగర్ లే అవుట్ నందు ఫ్లాట్ నెం.79 వద్ద 657.77 చ॥గ॥లు లేదా 550 చ॥మీ॥ల విస్తీర్ణం గల స్థలం యావత్తు ఆస్తి. **హద్దులు : తూర్పు:** ఫ్లాట్ నెం.78, **దక్షిణం :** 60 అ॥ల వెడల్పు రోడ్డు, **పడమర :** 33 అ॥ల వెడల్పు రోడ్డు, **ఉత్తరం :** ఫ్లాట్ నెం.80. **కొలతలు: తూర్పు:** 65'-0" లేదా 19.81 మీ॥లు, **దక్షిణం :** 78'-0" లేదా 23.78 మీ॥లు **పడమర:** 95'-0" లేదా 28.96 మీ॥లు, **ఉత్తరం :** 70'-0" లేదా 21.34 మీ॥లు., విశాఖపట్నం జిల్లా, మధురవాడ సబ్ రిజిస్ట్రార్స్ ఆఫీస్ అధికార పరిధి, గ్రేటర్ విశాఖపట్నం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో, మధురవాడ గ్రామం సర్వే నెం.లు 2&4 లోని పైన తెలిపిన మొత్తంలో 65.77 చ॥గ॥లు లేదా 54.99 చ॥మీ॥ల అవిభాజ్యపు మరియు అనిర్దేశ్యపు వాటా స్థల విస్తీర్ణంతో "వైష్ణోస్ హరిప్రియ" బహుళ అంతస్తుల అపార్ట్‌మెంట్ మూడవ అంతస్తు నందు 1315 చ॥అ॥లు బిల్టప్ ఏరియా (కామన్ ఏరియాలతో సహా) మరియు స్టిల్ట్ ఫ్లోర్ నందు 100 చ॥అ॥ల ఒక కార్ పార్కింగ్ విస్తీర్ణంతో గల ఫ్లాట్ నెం.401 (ఎస్/ఎఫ్). **మూడవ అంతస్తు నందు గల ఫ్లాట్ నెం.401కు హద్దులు: తూర్పు:** కామన్ కారిడార్, మెట్లు & లిఫ్ట్, **దక్షిణం :** ఓపెన్ టు స్కై, **పడమర :** ఓపెన్ టు స్కై, **ఉత్తరం :** ఓపెన్ టు స్కై. **సేల్ డీడ్ డాక్యుమెంట్ నెం.4463/2019, తేది.14.08.2019** ప్రకారం **శ్రీ కోట్ల ముకుందరావు & శ్రీమతి కోట్ల సత్య నాగమణి గార్ల పేరున కలదు.**

**తేది : 11-02-2026**
ప్రదేశం : ఎమ్‌విపి కాలనీ, విశాఖపట్నం

సం/- అధీకృత అధికారి
బ్యాంక్ ఆఫ్ బరోడా

## బోధ్‌గయ విముక్తికై బౌద్ధ సంఘాల దీక్ష



గాజువాక,ఫిబ్రవరి 12,ప్రభాతవార్త:

బీహార్‌లోని పవిత్ర బౌద్ధ క్షేత్రం బోధ్‌గయ విముక్తి కోరుతూ విశాఖ బౌద్ధ సంఘాల సమైక్య ఆధ్వర్యంలో గురువారం సాయంత్రం కూర్మన్నపాలెం జంక్షన్ వద్ద నిరసన దీక్ష చేపట్టారు. 1947 నాటి బి.టి. యాక్ట్‌ను రద్దు చేయాలని, ఆలయ నిర్వహణ కమిటీలో కేవలం బౌద్ధులనే నియమించాలని ఈ సందర్భంగా నాయకులు డిమాండ్ చేశారు. బౌద్ధ సంఘాల వర్కింగ్ ప్రెసిడెంట్ బోర వేణుగోపాల్ గౌతమ్ మాట్లాడుతూ.. బోధ్‌గయ ఆలయ నిర్వహణ బాధ్యతలను పూర్తిగా బౌద్ధ సమాజానికే అప్పగించాలని, భిక్షువులపై జరుగుతున్న దాడులను అరికట్టాలని కోరారు. కార్యక్రమంలో బత్తుల గౌతం బాబు, కర్రి సత్యనారాయణ, కొత్తపల్లి వెంకటరమణ, మట్టా కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## సైబర్ సెక్యూరిటీ అవగాహన సదస్సు

(విశాఖ క్రైమ్ - ప్రభాతవార్త)



నగర పోలీసు కమిషనర్ డా. శంఖబ్రత బాగ్చి ఆదేశాలతో విశాఖపట్నం సిటీ సెక్యూరిటీ కౌన్సిల్ ఆధ్వర్యంలో గురువారం సైబర్ సెక్యూరిటీ అవగాహన సదస్సు నిర్వహించారు. సైబర్ ఫోరం జాయింట్ సెక్రటరీ కిషోర్ దాసరి మార్గదర్శకత్వంలో జరిగిన ఈ కార్యక్రమాన్ని వీసీఎస్సీ సభ్యులు సీమ సిక్రి, నవీన్ కుమార్ జగ్గుమంత్రి నిర్వహించారు.కంచరపాలెం ఆర్‌పి పేటలోని జీవీఎంసీ పాఠశాలలో జరిగిన ఈ సదస్సులో 6 నుంచి 9వ తరగతి విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. సోషల్ మీడియా మోసాలు, ఓటీపీ స్కామ్‌లు, ఆన్‌లైన్ గేమింగ్ వల్ల కలిగే ప్రమాదాలు, ఏపీకే లింకుల ద్వారా వచ్చే ముప్పులు వంటి పలు అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. అలాగే పిల్లలు ఏ వయస్సు నుంచి సోషల్ మీడియా యాప్‌లను వినియోగించాలో నిపుణులు వివరించారు. విద్యార్థులు అడిగిన ఆలోచనాత్మక ప్రశ్నలకు నిపుణులు సమగ్ర సమాధానాలు ఇచ్చారు. డిజిటల్ ప్రపంచంలో జాగ్రత్తలు పాటించడం ద్వారా సైబర్ మోసాలకు దూరంగా ఉండవచ్చని వారు సూచించారు.

## కేంద్ర చట్టాలకు వ్యతిరేకంగా ఆశా వర్కర్ల సమరభేరి



గాజువాక,ఫిబ్రవరి 12,ప్రభాతవార్త

కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన నూతన కార్మిక చట్టాలను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ రాష్ట్రవ్యాప్త సమ్మెలో భాగంగా గురువారం విశాఖలో ఆశా వర్కర్లు భారీ నిరసన చేపట్టారు. నగరంలోని జీవీఎంసీ కార్యాలయం సమీపంలోని గాంధీ విగ్రహం వద్ద కార్మికులు పెద్ద సంఖ్యలో గుమిగూడి ధర్నా నిర్వహించారు. మోదీ ప్రభుత్వం తీసుకొచ్చిన నల్ల చట్టాలను వెనక్కి తీసుకోవాలని ప్లకార్డులు ప్రదర్శిస్తూ నినదించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఆశా వర్కర్ల శ్రమను దోచుకునే విధంగా కేంద్ర చట్టాలు ఉన్నాయని మండిపడ్డారు. కనీస వేతనం అమలు చేయాలని, పని భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. రాష్ట్రవ్యాప్తంగా ఆసుపత్రుల వద్ద సేవలు నిలిపివేసి కార్మికులు ఈ పోరాటంలో పాల్గొంటున్నారని, ప్రభుత్వం స్పందించకుంటే సమ్మెను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో విశాఖ నగర మరియు పరిసర ప్రాంతాల ఆశా కార్యకర్తలు, యూనియన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

## రిషికొండలో పిల్లలకు సముద్రపు కాయకింగ్ శిక్షణ

(విశాఖపట్నం - ప్రభాత వార్త)



జిల్లా క్రీడా అభివృద్ధి సంస్థ (డిస్ట్రిక్ట్ స్పోర్ట్స్ అథారిటీ) ఆధ్వర్యంలో రిషికొండ బీచ్‌లో పిల్లలకు సముద్రపు కాయకింగ్ (సీ కాయకింగ్) శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తున్నారు. ఈ శిక్షణ ప్రతిరోజూ ఉదయం 6 గంటల నుంచి 8 గంటల వరకు జరుగుతోంది.ముందుగా బీచ్‌పై ప్రాథమిక ప్యాడిల్ విధానాలను నేర్పించి, అనంతరం సముద్రంలో సురక్షితంగా లాంచింగ్ చేయడం, సమతుల్యత పాటించడం వంటి అంశాల్లో ప్రాయోగిక శిక్షణ అందిస్తున్నారు. అనుభవజ్ఞులైన కోచ్‌ల పర్యవేక్షణలో, లైఫ్ జాకెట్లు వంటి భద్రతా సామగ్రితో పూర్తిస్థాయి భద్రతా ప్రమాణాలు పాటిస్తూ శిక్షణ కొనసాగుతోంది.ఈ కార్యక్రమం ద్వారా పిల్లల్లో భద్రతా అవగాహన, క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం, శారీరక దృఢత్వం పెంపొందించడం ప్రధాన లక్ష్యమని జిల్లా క్రీడా అభివృద్ధి అధికారి (డీఎస్డీఓ) జూన్ తెలిపారు. క్రీడలపై ఆసక్తి ఉన్న విద్యార్థులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని సూచించారు.శిక్షణలో చేరదలచిన వారు వాటర్ స్పోర్ట్స్ కోచ్ వి. దాస్‌ను 9440012049 నంబర్‌లో సంప్రదించవచ్చని తెలిపారు.

## మహాశివరాత్రి బందోబస్తుపై విశాఖ రేంజ్ ఐజీ గోపీనాథ్ జట్టి సమీక్ష

### గంజాయి రవాణాపై కఠిన చర్యలు -సైబర్ మోసాలపై అప్రమత్తతకు ఆదేశాలు

(విశాఖ క్రైమ్ - ప్రభాతవార్త)



మహాశివరాత్రి సందర్భంగా శైవక్షేత్రాల్లో పటిష్ట బందోబస్తు ఏర్పాట్లు చేయాలని విశాఖ రేంజ్ ఐజీ గోపీనాథ్ జట్టి ఆదేశించారు. విశాఖపట్నంలోని ఐజీ కార్యాలయం నుంచి గురువారం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో అల్లూరి సీతారామరాజు, అనకాపల్లి, విజయనగరం, పార్వతీపురం మన్యం, శ్రీకాకుళం జిల్లాల ఎస్పీలు, అదనపు ఎస్పీలు, డీఎస్పీలతో కలిసి మహాశివరాత్రి భద్రత, ఎన్‌డీపీఎస్ చట్టం అమలు, సైబర్ నేరాలు, సోషల్ మీడియా, లా అండ్ ఆర్డర్ అంశాలపై సమగ్ర సమీక్ష నిర్వహించారు.

### మహాశివరాత్రి బందోబస్తు

శైవక్షేత్రాల్లో భక్తుల రద్దీ దృష్ట్యా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా ప్రత్యేక చర్యలు చేపట్టాలని సూచించారు. క్యూ లైన్లలో ప్రవేశ, నిష్క్రమణ మార్గాలు, అత్యవసర ఎగ్జిట్‌లు, పార్కింగ్ సదుపాయాలు ముందుగానే గుర్తించి ఇతర శాఖలతో సమన్వయంతో ఏర్పాట్లు చేయాలని చెప్పారు. ప్రత్యేక కంట్రోల్ రూమ్‌ల ద్వారా సీసీ కెమెరాలు, డ్రోన్ కెమెరాలతో నిరంతర పర్యవేక్షణ చేయాలని ఆదేశించారు. వృద్ధులు, మహిళలు, పిల్లలు, దివ్యాంగులకు ప్రత్యేక క్యూ లైన్లు ఏర్పాటు చేయాలని సూచించారు.

### ఎన్‌డీపీఎస్ చట్టం అమలు

ఒడిశా సరిహద్దు జిల్లాల గుండా జరుగుతున్న గంజాయి అక్రమ రవాణాను అరికట్టేందుకు పటిష్ట కార్యాచరణ చేపట్టాలని ఐజీ స్పష్టం చేశారు. అంతర్రాష్ట్ర ముఠాలను ఛేదించేందుకు సమగ్ర ప్రణాళిక రూపొందించాలని ఆదేశించారు. జూన్ 2024 నుంచి ఇప్పటివరకు 52 కేసుల్లో 98 మందికి శిక్షలు పడినట్లు వెల్లడించారు. దర్యాప్తు అధికారులకు గుడ్ సర్వీస్ ఎంట్రీలతో ప్రోత్సాహం అందించారు.గంజాయి అక్రమ రవాణాకు పాల్పడుతున్న 14 మంది నిందితులకు చెందిన రూ.9.19 కోట్లకు పైగా ఆస్తులను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. 1602 మంది నేరస్తుల కదలికలపై నిఘా కోసం హిస్టరీ షీట్లు తెరిచినట్లు, 92 మందిపై పిట్ ఎన్‌డీపీఎస్ చట్టం ప్రయోగానికి ప్రతిపాదనలు పంపినట్లు వెల్లడించారు. 64 ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేసి 447 మంది పరారీలో ఉన్న నిందితులను, 332 నాన్-బెయిలబుల్ వారెంట్లు పెండింగ్‌లో ఉన్న ముద్దాయిలను పట్టుకుని కోర్టులో హాజరుపరిచినట్లు తెలిపారు.

### సైబర్ నేరాలు -- సోషల్ మీడియా


సైబర్ మోసాల బాధితులకు బ్యాంకుల్లో ఫ్రీజ్ అయిన నగదును కోర్టుల అనుమతితో త్వరితగతిన అందేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. డిజిటల్ అరెస్ట్, ఇన్వెస్ట్‌మెంట్ ఫ్రాడ్స్, ట్రాఫిక్ చలానా, ఎస్‌బీఐ యోనో, వాలంటైన్స్ డే సర్ప్రైజ్ పేర్లతో ఏపీకే ఫైళ్ల ద్వారా జరుగుతున్న మోసాలపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాలని సూచించారు. మోసాలకు గురైతే వెంటనే 1930 హెల్ప్‌లైన్ లేదా సైబర్ పోర్టల్‌లో ఫిర్యాదు చేయాలని ప్రజలకు తెలియజేయాలని పేర్కొన్నారు.సోషల్ మీడియాలో అసభ్య, అభ్యంతరకర పోస్టులు చేసే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని, ఇప్పటికే 11 మందిని గుర్తించి కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. నలుగురిపై హిస్టరీ షీట్లు తెరిచినట్లు వెల్లడించారు.

### రోడ్డు భద్రత -- ఇతర నేరాలు

రోడ్డు ప్రమాదాల నివారణకు ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని, డ్రంకెన్ డ్రైవ్‌పై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఆదేశించారు. దొంగతనాల నివారణకు రాత్రి గస్తీ పెంచడంతో పాటు అంతర్రాష్ట్ర ముఠాల కదలికలపై నిఘా ఉంచాలని సూచించారు. ఈవ్‌టీజింగ్, పబ్లిక్ డ్రింకింగ్ వంటి నేరాలను సీసీ, డ్రోన్ కెమెరాల సహాయంతో గుర్తించి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

## బర్మా కాలనీ ప్రభుత్వ పాఠశాలకు ఐరన్ సెల్ఫ్ అందజేసిన అమెజాన్ ఇండియా గ్రూపు

మాధవధార,ఫిబ్రవరి 12, ప్రభాతవార్త



బర్మా కాలనీలో గల జీవీఎంసీ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు ఉపయోగార్థం అమెజాన్ గ్రూప్ ప్రతినిధులు ఐరన్ సెల్ఫ్ లను అందించారు.ఈ ఐరన్ సెల్ఫ్ లను పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు వసంత కుమారి కు గురువారం ఉదయం పాఠశాలలో అమెజాన్ ఇండియా గ్రూపు ప్రతినిధులు అందజేశారు.ఈ ఐరన్ సెల్ఫ్ లు విద్యార్థుల వర్క్ బుక్స్,నోట్ బుక్స్,ఇతర పుస్తకాలను భద్రపరచుకోవటానికి ఎంతగానో ఉపయోగపడుతుందని విద్యార్థులకు సహాయం అందించిన అమెజాన్ ఇండియా గ్రూపు ప్రతినిధులకు పాఠశాల సిబ్బంది అభినందనలు తెలిపారు. విద్యార్థులు ఉపాధ్యాయుల సూచనల మేరకు తల్లిదండ్రుల పరిరక్షణలో సక్రమంగా నడుచుకొని ఉన్నత విద్యను అభ్యసించి ఉన్నత శిఖరాలను చేరుకోవాలని వారు సూచించారు. కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది, విద్యార్థులు ఉన్నారు.

## గాజువాకలో కార్మికుల గర్జన.. సమ్మె విజయవంతం



గాజువాక,ఫిబ్రవరి 12,ప్రభాతవార్త :

కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం తీసుకువచ్చిన లేబర్ కోడ్స్‌కు వ్యతిరేకంగా అఖిలపక్ష ట్రేడ్ యూనియన్ల ఆధ్వర్యంలో చేపట్టిన అఖిల భారత సమ్మె గాజువాకలో విజయవంతమైంది. జీవీఎంసీ గాజువాక జోన్‌కు చెందిన శాశ్వత, కాంట్రాక్టు కార్మికులు, ముఖ్యంగా మహిళా కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొని తమ నిరసనను తెలియజేశారు. కొత్త గాజువాక నుంచి పాత గాజువాక జంక్షన్ మీదుగా సిఐటియు జెండా పార్క్ వరకు భారీ ర్యాలీ నిర్వహించి, అనంతరం బహిరంగ సభను ఏర్పాటు చేశారు. యూనియన్ నాయకులు గొలగాని అప్పారావు, ఎం. రాంబాబు, కె.ఎం. శ్రీనివాస్ మాట్లాడుతూ.. మోదీ ప్రభుత్వం కార్మిక చట్టాలను మారుస్తూ కార్మికుల పొట్ట కొడుతోందని ధ్వజమెత్తారు. 8 గంటల పనిని 12 గంటలకు పెంచడం, కొత్త వేతన ఫార్ములాతో జీతాలు తగ్గించడం వంటి చర్యలు కార్మికులను బానిసలుగా మార్చే కుట్రని విమర్శించారు. సమ్మె చేసే హక్కును కూడా కాలరాయడం ప్రజాస్వామ్యానికి గొడ్డలిపెట్టు అని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సమ్మె ప్రభావంతో ఆటోనగర్ కంపెనీలు, రైల్వే వ్యాగన్ షాపులు, భవన నిర్మాణ అసంఘటిత రంగ పనులు నిలిచిపోయాయి. ఆటో, ముఠా కార్మికులు స్వచ్ఛందంగా పాల్గొని సమ్మెకు మద్దతు తెలిపారు. ఈ కార్యక్రమంలో సత్యనారాయణ, గొలగాని నాయుడు ఇతర కార్మిక సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

## మహాశివరాత్రికి ముస్తాబవుతున్న పద్మనాభం పార్వతీ నారాయణేశ్వరాలయం.

పద్మనాభం, ఫిబ్రవరి 12, ప్రభాతవార్త



అనంతపద్మనాభస్వామి గిరి మెట్లవద్ద వేంచేసియున్న అనంతుని క్షేత్రపాలకులైన పార్వతీ నారాయణేశ్వర ఆలయం మహాశివరాత్రి పర్వదినానికి భక్తుల సహకారంతో ముస్తాబవుతుంది.మద్దిగ్రామానికి చెందిన మునసబు గారి శ్రీను కుమారుడు రాజేష్ జ్ఞాపకార్థం సుమారు రెండు లక్షల రూపాయలతో ఆలయంలో స్వామివారి కళ్యాణం వేదిక, ఆలయ ప్రాంగణంలో గచ్చులు,సున్నాలు, రంగులు వేసి ఆకర్షణీయంగా తీర్చిదిద్దుతున్నారు. అయితే శివభక్తితో ఎంపీపీ రాంబాబు చొరవతో తాము ఆలయాన్ని అన్నివిధాలా ముస్తాబు చేసినట్లు శ్రీను అన్నారు.అలాగే ఆదివారం రాత్రి లింగోద్భవ కాలంలో స్వామివారికి అభిషేకాలు,కుంకుమ పూజ 12 మధ్యాహ్నం అన్నదానం జరుగుతాయని ఆలయ అర్చకులు తెలిపారు.

## పారిశ్రామిక ప్రాంతంలో 'సమ్మె' సక్సెస్



గాజువాక,ఫిబ్రవరి 12,ప్రభాతవార్త

అఖిల భారత కార్మిక సంఘాల పిలుపు మేరకు గురువారం మల్కాపురం పారిశ్రామిక ప్రాంతంలో సమ్మె ప్రశాంతంగా, విజయవంతంగా జరిగింది. తెల్లవారు జామున 4 గంటల నుంచే సీఐటీయూ, వైఆర్టీయూసీ, ఐఎన్‌టీయూసీ, ఏఐటీయూసీ నాయకులు హెచ్‌పీసీఎల్, షిప్‌యార్డ్ గేట్ల వద్ద కార్మికులకు అవగాహన కల్పించి సమ్మెలో భాగస్వాములను చేశారు. హెచ్‌పీసీఎల్ రిఫైనరీలో 90 శాతం మంది కాంట్రాక్టు కార్మికులు విధులకు దూరంగా ఉండగా.. ఐపీఎల్, బోత్రా, శరత్ చటర్జీ, జీవీఎంసీ ముఠా కార్మికులు పూర్తిస్థాయిలో సమ్మెలో పాల్గొన్నారు. హెచ్‌పీసీఎల్ 'సి' గేట్ వద్ద జరిగిన సభలో నాయకులు ఆర్.లక్ష్మణమూర్తి, బోగవెల్లి నాగభూషణం, ఆర్.అనిల్ కుమార్ మాట్లాడుతూ.. కార్మికులను బానిసలుగా మార్చే లేబర్ కోడ్స్‌ను తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. పని గంటలను 12 గంటలకు పెంచడం దుర్మార్గమన్నారు. కాంట్రాక్టు కార్మికులకు కనీస వేతనం ఇవ్వాలని, 75 శాతం స్థానికులకు ఉపాధి కల్పించాలని నినదించారు. ఈ నిరసనలో ఐద్వా నాయకురాళ్లు విమల, మమత ఆధ్వర్యంలో మహిళా కార్మికులు పాల్గొని సంఘీభావం తెలిపారు. కార్యక్రమంలో వివిధ కార్మిక సంఘాల ప్రతినిధులు జి.నరేష్, కాటమరాజు, రమణ పాల్గొన్నారు.

## పారిశ్రామిక ప్రాంతంలో 'భారత్ బంద్' సక్సెస్

గాజువాక,ఫిబ్రవరి 12,ప్రభాతవార్త :



కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన కార్మిక వ్యతిరేక చట్టాలకు నిరసనగా గురువారం చేపట్టిన 'భారత్ బంద్' పారిశ్రామిక ప్రాంతంలో విజయవంతమైంది. సీఐటీయూ, ఏఐటీయూసీ, ఐఎన్‌టీయూసీ, హెచ్ఎంఎస్ సహా 14 ట్రేడ్ యూనియన్ల ఆధ్వర్యంలో గురువారం కార్మికులు భారీ ఎత్తున నిరసనలు చేపట్టారు. హెచ్‌పీసీఎల్ లేబర్ గేట్, మెయిన్ గేట్, రఫ్ గేట్లతో పాటు హిందుస్థాన్ షిప్‌యార్డ్, కోరమండల్ గేట్ల వద్ద తెల్లవారుజాము నుంచే నాయకులు, కార్యకర్తలు ధర్నా నిర్వహించి సమ్మెను విజయవంతం చేశారు. స్థానికులకు 75 శాతం ఉపాధి కల్పించాలి: ఈ సందర్భంగా ఏఐటీయూసీ రాష్ట్ర నాయకులు కాండ్రేగుల సత్యాంజనేయ, సీఐటీయూ నాయకులు లక్ష్మణమూర్తి మాట్లాడుతూ.. కార్మికులకు నష్టం కలిగించే నాలుగు లేబర్ కోడ్స్‌ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణను ఆపాలని, హెచ్‌పీసీఎల్‌లో స్థానికులకే 75 శాతం ఉపాధి కల్పించాలని నినదించారు. కాంట్రాక్టు కార్మికులకు నెలకు రూ. 26 వేల కనీస వేతనం అందించాలని, ఈఎస్ఐ, పీఎఫ్ సౌకర్యాలపై స్పష్టమైన చట్టం చేయాలని కోరారు. కార్మికులకు మద్దతుగా ఆటో కార్మికులు, వీధి వ్యాపారులు స్వచ్ఛందంగా బంద్‌లో పాల్గొన్నారు. కార్యక్రమంలో నాయకులు గుడాల రాంబాబు, గండి అప్పారావు, శ్రీనివాస్, సత్యనారాయణ రెడ్డి, అజయ్, కొండబాబు, పైడ్రాజు, అచ్చారావు, అనిల్ కుమార్, సత్యారావు తదితరులు పాల్గొన్నారు.

## చీటీల పేరుతో డబ్బులు సేకరణపై జాగ్రత్తలు

### - హమాలీలకు పెందుర్తి పోలీసుల అవగాహన



(విశాఖ క్రైమ్ - ప్రభాత వార్త)

చీటీల పేరుతో లేదా అనుమతి లేని ఆర్థిక పథకాల పేరిట డబ్బులు సేకరించే వారిపై అప్రమత్తంగా ఉండాలని పెందుర్తి పోలీసులు హెచ్చరించారు. గురువారం పెందుర్తి పోలీస్ స్టేషన్ పరిధిలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. పెందుర్తి పోలీస్ స్టేషన్ ఇన్స్పెక్టర్ కె.వి. సతీష్ కుమార్ సూచనల మేరకు జెర్రిపోతులపాలెంలోని ఆంధ్రప్రదేశ్ స్టేట్ బేవరేజెస్ కార్పొరేషన్ లిమిటెడ్ (ఏపీఎస్‌బీసీఎల్) వద్ద పనిచేస్తున్న హమాలీలకు ప్రత్యేకంగా అవగాహన కల్పించారు. చట్టబద్ధ అనుమతులు లేని చీటీలు, డబ్బు చలామణి పథకాల పేరుతో మోసాలు జరుగుతున్న నేపథ్యంలో కష్టార్జిత సంపాదనను అలాంటి పథకాలలో పెట్టుబడి పెట్టే ముందు పూర్తిస్థాయిలో నిజస్వరూపం తెలుసుకోవాలని సూచించారు.అనుమానాస్పద ఆర్థిక కార్యకలాపాలు గమనించినా, ఎవరైనా మోసం చేయడానికి ప్రయత్నించినా వెంటనే సమీప పోలీస్ స్టేషన్‌ను సంప్రదించాలని కోరారు. ప్రజల ఆర్థిక భద్రతే తమ ప్రధాన లక్ష్యమని పోలీసులు తెలిపారు.

## 2026 మార్చ్ 14న జాతీయ లోక్ అదాలత్


### జిల్లా కోర్టు ప్రధాన న్యాయమూర్తి చిన్నంశెట్టి రాజు

(విశాఖ క్రైమ్ - ప్రభాత వార్త)

జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో, ఉమ్మడి విశాఖపట్నం జిల్లా పరిధిలోని అన్ని న్యాయ స్థానాలలో 2026మార్చ్ 14వ తేదీన జాతీయ లోక్ అదాలత్ నిర్వహించబడుతుందని జిల్లా కోర్టు ప్రధాన న్యాయమూర్తి చిన్నంశెట్టి రాజు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు.ఈ లోక్ అదాలత్‌లో న్యాయస్థానాల్లో పెండింగ్‌లో ఉన్న సివిల్, చెక్ బౌన్స్, బ్యాంకింగ్, మోటార్ ప్రమాదాల నష్ట పరిహారాలు, సెక్షన్ 138 నెగోషియబుల్ ఇన్‌స్ట్రుమెంట్స్ చట్టం కింద కేసులు, బ్యాంకు ఒ మనీ రికవరీ కేసులు, ల్యాండ్ అక్విజిషన్ కేసులు, కార్మిక ఒ కుటుంబ తగాదాలు (విడాకులు మినహా), పారిశ్రామిక వివాదాలు, రాజీ పడదగ్గ క్రిమినల్ కేసులు పరిష్కరించుకోవచ్చని ఆయన వివరించారు.కక్షిదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని, తమ కేసులను పరస్పర అంగీకారంతో పరిష్కరించుకోవాలని సూచించారు.మరిన్ని వివరాలకు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ, న్యాయ సేవా సదన్, విశాఖపట్నంలో లేదా ఫోన్: 0891-2560414, 2575046, ఇమెయిల్: జంనజూనశ్రీయిఏఘ్రుఫ్త్రశీశీ.ఏశీఎ, నశ్రీయి.జంజూఏస్త్రఘ్రుఅశ్రీ.ఏశీఎ, అలాగే మండల న్యాయ సేవా సంఘాలు (భీమిలి, గాజువాక, అనకాపల్లి, నర్సీపట్నం, ఎలమంచిలి, చోడవరం, మాడుగుల, అరకు, చింతపల్లి, పాడేరు)లో సంప్రదించవచ్చని తెలిపారు.

## విద్యార్థినిపై లైంగిక వేధింపుల కేసులో నిందితుడికి 20 ఏళ్ల కఠిన శిక్ష

(విశాఖ క్రైమ్ - ప్రభాత వార్త)



2015లో చోడవరం పోలీస్ స్టేషన్‌లో నమోదు అయిన విద్యార్థినిపై లైంగిక వేధింపుల కేసులో నిందితుడు కొయ్యన తిరుపతిరావు (ఫిజిక్స్ టీచర్) లైంగిక హింసకు పాల్పడ్డట్లు కోర్టు నిర్ధారించింది. విశాఖపట్నం పోక్సో ప్రత్యేక కోర్టు నిందితుడికి 20 సంవత్సరాల కఠిన శిక్ష , రూ.71 వేలు జరిమానా విధిస్తూ తీర్పు వెలువరించింది. బాధితురాలికి పరిహారంగా రూ.70 వేలు చెల్లించాలని కూడా ఆదేశించింది. తిరుపతిరావు, 8వ తరగతి చదువుతున్న మైనర్ విద్యార్థిని మాయమాటలతో ప్రలోభపెట్టి రాజస్థాన్‌కు తరలించి లైంగిక దాడికి పాల్పడిన విషయం గుర్తించబడింది. కేసు నమోదు తరువాత పోలీసులు దర్యాప్తు చేసి, నిందితుడిపై చార్జ్‌షీట్ దాఖలు చేశారు. అనకాపల్లి జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా దర్యాప్తు జరిపిన పోలీసులను ప్రత్యేకంగా అభినందిస్తూ, మహిళల భద్రత విషయంలో పోలీసులు నిరంతరం అప్రమత్తంగా ఉంటారని తెలిపారు.

## మహిళల భద్రత, మత్తు పదార్థాలపై విద్యార్థులకు అవగాహన



(విశాఖ క్రైమ్ - ప్రభాతవార్త)

విశాఖపట్నం సిటీ, ఫిబ్రవరి 12: మహిళల భద్రత, మత్తు పదార్థాల నిరోధంపై పెందుర్తి పోలీసులు విద్యార్థులకు అవగాహన కల్పించారు. గురువారం పెందుర్తి పోలీస్ స్టేషన్ పరిధిలోని అమృత నర్సింగ్ కాలేజీలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. స్టేషన్ ఇన్స్పెక్టర్ కె.వి. సతీష్ కుమార్ సూచనల మేరకు సబ్‌ఇన్స్పెక్టర్ పి. లక్ష్మి సిబ్బందితో కలిసి విద్యార్థులతో సమావేశమయ్యారు. మహిళలపై జరిగే నేరాల నివారణ, చట్టపరమైన రక్షణ చర్యలు, పోలీసుల సహకారం వంటి అంశాలపై విపులంగా వివరించారు. వేధింపులు లేదా అనుమానాస్పద ఘటనలు ఎదురైతే వెంటనే తల్లిదండ్రులు, పోలీసులకు తెలియజేయాలని సూచించారు. ఫిర్యాదుదారుల వివరాలు గోప్యంగా ఉంచి బాధితులకు న్యాయం చేయడం పోలీసుల బాధ్యత అని హామీ ఇచ్చారు. అత్యవసర పరిస్థితుల్లో ఉపయోగపడే 'పోలీస్ శక్తి యాప్' వినియోగంపై ప్రాయోగికంగా వివరణ ఇచ్చారు. ప్రమాద సమయంలో యాప్‌ను ఎలా వినియోగించాలో విద్యార్థులకు చూపించారు. మత్తు పదార్థాల దుష్ప్రభావాలపై అవగాహన కల్పిస్తూ, గంజాయి వంటి మాదకద్రవ్యాల కలిగి ఉండటం, రవాణా చేయడం, వినియోగించడం చట్టవిరుద్ధమని హెచ్చరించారు. ఇటువంటి కార్యకలాపాలపై సమాచారం ఉన్నా వెంటనే పోలీసులకు తెలియజేయాలని, సమాచారాన్ని గోప్యంగా ఉంచుతామని తెలిపారు. సమాజ శ్రేయస్సు కోసం విద్యార్థులు చట్టబద్ధమైన జీవన విధానాన్ని అనుసరించాలని, పోలీసులకు సహకరించాలని కోరారు.

## నేడు ఏపీ బార్ కౌన్సిల్ ఎన్నికలు

### - విశాఖలో 3,513 మంది న్యాయవాదులు ఓటింగ్‌కు సిద్ధం

(విశాఖ క్రైమ్ - ప్రభాతవార్త)

రాష్ట్రవ్యాప్తంగా అత్యంత ప్రతిష్టాత్మకంగా భావిస్తున్న ఆంధ్రప్రదేశ్ బార్ కౌన్సిల్ ఎన్నికలు ఈ నెల 13న జరగనున్నాయి. ఈ సందర్భంగా విశాఖ బార్ అసోసియేషన్ కార్యాలయంలో ఏర్పాట్లను పూర్తి చేసినట్లు అధ్యక్షుడు ఎం.కే. శ్రీనివాస్, జనరల్ సెక్రటరీ ఎల్.పి. నాయుడు తెలిపారు.విశాఖలో 3,513 మంది న్యాయవాదులు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. పోలింగ్ నిర్వహణ కోసం ఏడు బూత్‌లు ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. ఎన్నికల ప్రక్రియ సజావుగా సాగేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేపట్టినట్లు పేర్కొన్నారు.ఈ ఎన్నికల్లో అప్పారావు గొలగాని, దుర్గా నాగశ్రీ కే, హబీబ్ సుల్తాన్ అలీ, ఇమామ్ మోహిద్దీన్ అహ్మద్, కృష్ణమోహన్ ఎస్, మధుసూదన్ యదువంశి ఈగల, మహేష్ రెడ్డి గొరుసు, మంజులత ధోని, నాగరాజు పుచ్చల, నర్సింగరావు పి, నీలిమ బుస్సా, పద్మజ పూసపాటి, పృథ్విరాజ్ జనపరెడ్డి, రామ జోగేశ్వరరావు కిరీటి, రాంబాబు చింతపల్లి, రమేష్ బి, సత్యసాయి బాబా జనపరెడ్డి, సత్యనారాయణ బెవరా, శేషుకుమార్ నాలి, శ్రీనివాసరావు కోడి, సుశీల గార, వెంకటరమణమూర్తి బందారు, వెంకటరమణ నర్రా, విజయలక్ష్మి పైడా అభ్యర్థులుగా పోటీ చేస్తున్నారు.ఈ ఎన్నికలకు ప్రత్యేకత సంతరించుకుంది. సాధారణంగా పురుషులే అధికంగా పోటీ చేసే బార్ కౌన్సిల్ ఎన్నికల్లో ఈసారి సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు 30 శాతం రిజర్వేషన్ అమలులోకి రావడంతో విశాఖ బార్ అసోసియేషన్ నుంచి ఆరుగురు మహిళా అభ్యర్థులు పోటీలో నిలిచారు. ఇది న్యాయవాద వర్గాల్లో సానుకూల పరిణామంగా భావిస్తున్నట్లు పలువురు అభిప్రాయపడ్డారు.

## కాంట్రాక్ట్ క్యారేజ్ వాహనాలపై రవాణా శాఖ అధికారులు ప్రత్యేక తనిఖీలు

మాధవధార :ఫిబ్రవరి 12, ప్రభాతవార్త




ప్రయాణికుల భద్రత దృష్ట్యా,నిబంధనల ఉల్లంఘనలను అరికట్టుటకు రవాణా శాఖ ఆధ్వర్యంలో ఫిబ్రవరి 11 నుంచి 28 వరకు కాంట్రాక్ట్ క్యారేజ్ వాహనాలపై ప్రత్యేక తనిఖీలు నిర్వహించనున్నట్లు ఉప రవాణా కమిషనర్ ఆర్సీహెచ్ శ్రీనివాస్ తెలిపారు.ఈ ప్రత్యేక తనిఖీలలో భాగంగా గురువారం పలు చోట్ల తనిఖీలు చేపట్టారు.ప్రయాణికుల వాహనాలలో అక్రమంగా వాణిజ్య సరుకులు రవాణా చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.పర్మిట్ నిబంధనలు ఉల్లంఘించిన వాహనాలపై మోటార్ వాహన చట్టం ప్రకారం కేసులు నమోదు చేస్తామన్నారు.ముఖ్య కూడళ్లు,జాతీయ రహదారులు ప్రమాదప్రధాన ప్రదేశాలలో అకస్మిక తనిఖీలు నిర్వహించనున్నట్టు తెలిపారు.పదే పదే నిబంధనలు ఉల్లంఘించిన వాహన యజమానులు/డ్రైవర్లపై భారీ జరిమానాలు విధించడం జరుగుతుందని,అవసరమైతే వాహనాల స్వాధీనం లేదా పర్మిట్ రద్దు చేస్తామని హెచ్చరించారు.వాహన యజమానులు,డ్రైవర్లు నిబంధనలు పాటించి రోడ్డు భద్రతకు మరియు ప్రయాణికుల భద్రతకు సహకరించాలని సూచించారు.

## జీవీఎంసీ లో పలు విభాగాలను ఆకస్మిక తనిఖీ చేసిన కమిషనర్

విశాఖపట్నం, ఫిబ్రవరి 12, ప్రభాతవార్త:



జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలో పరిపాలన విభాగం, పలు విభాగాలను జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్, అదనపు కమిషనర్ ఎస్ఎస్ వర్మతో కలిసి గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ ఆకస్మిక తనిఖీలో ముందుగా పరిపాలన విభాగం లో ఉద్యోగుల పనితీరును కమిషనర్ పరిశీలించి ఉద్యోగుల విధి విధానాలను అడిగి తెలుసుకున్నారు. ఉద్యోగులు పొందుపరుస్తున్న ఫైళ్లను కంప్యూటర్ ద్వారా పరిశీలించారు. వారి యొక్క విధులకు సంబంధించిన ప్రతి అంశాన్ని క్షుణ్ణంగా పరిశీలించారు. డిస్పాచ్ విధానం ఎలా ఉంది, ఏ ఏ అంశాలపై డ్రాఫ్ నోట్లను పొందుపరుస్తున్నారు,తపాళ్ల రిజిస్టర్లో ఇన్ వార్డ్,ఔట్ వార్డు అంశాలను ఎలా నమోదు చేస్తున్నారు, నిర్ణీత కాలంలో ఫైళ్లను పొందుపరుస్తున్నారా లేదా అనే అంశాలను పరిశీలిస్తూ పలుచోట్ల అధికంగా ఉన్న ఉద్యోగులను గమనించి పనులు అధికంగా ఉన్న సీట్ల వద్దకు మార్చాలని అదనపు కమిషనర్ కు కమిషనర్ ఆదేశించారు. విధి నిర్వహణలో ఉద్యోగులు చిత్తశుద్ధితో విధులు నిర్వహించాలని ,అలసత్వం వహిస్తే సహించేది లేదని ఉద్యోగులకు కమిషనర్ ఆదేశించారు.

## శ్రీహరిపురం ఎఫ్ ఆర్ యు ఆసుపత్రి కమిషనర్ ఆకస్మిక తనిఖీ

### -వారం రోజులలో ఎఫ్ ఆర్ యు నిర్వహణలో లోపాలు సరిదిద్ది ప్రజలకు ఆరోగ్య సేవలు అందించాలి :జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్




విశాఖపట్నం, ఫిబ్రవరి 12, ప్రభాతవార్త:

శ్రీహరిపురం ఫస్ట్ రెఫరల్ యూనిట్ ఆసుపత్రి నిర్వహణలో లోపాలు కనిపిస్తున్నాయని, వాటిని వారం రోజుల్లోగా నిర్వాహకులు సరిదిద్దేలా చర్యలు చేపట్టి ప్రజలకు మెరుగైన ఆరోగ్య సేవలు అందించాలని జీవీఎంసీ ప్రజారోగ్య అధికారులకు, బెహరా సొసైటీ ఎఫ్ ఆర్ యు ఆసుపత్రి నిర్వాహకులకు జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్ ఆదేశించారు. బుధవారం ఆయన రాత్రి జీవీఎంసీ వెస్ట్ జోన్ లో గల శ్రీహరిపురం ఎఫ్ ఆర్ యు ఆసుపత్రిని జీవీఎంసీ అదనపు కమిషనర్ పి.నల్లనయ్య, ప్రధాన వైద్యాధికారి డాక్టర్ ఇ ఎన్ వి నరేష్ కుమార్, జిల్లా వైద్య ఆరోగ్య అధికారి డాక్టర్ జగదీశ్వరరావు, జోనల్ కమిషనర్ బి హేమావతి తో కలిసి ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. కమిషనర్ ఎఫ్ ఆర్ యు ఆసుపత్రి అంతా కలియతిరిగి ఆసుపత్రి పరిశుభ్రత, ఆసుపత్రి నిర్వహణ పట్ల అసహనం వ్యక్తం చేశారు . అక్కడ డాక్టర్లు,మెడికల్ సిబ్బందితో మాట్లాడుతూ ఎంతమంది ప్రజలు ఓపి కి వస్తున్నారని, ఎన్ని ల్యాబ్ టెస్ట్ లు జరుగుతున్నాయని, మందులు సరఫరా, ఆపరేషన్ థియేటర్ నిర్వహణ పట్ల ఆరా తీశారు. ఎఫ్ ఆర్ యు ఆసుపత్రి బెహరా సొసైటీ నిర్వహిస్తున్నారని, సిబ్బందికి జీతాలు కూడా సరిగా ఇవ్వటం లేదని వారు కమిషనర్ కు తెలుపగా.., బెహరా సొసైటీ నిర్వాహక ప్రతినిధి డాక్టర్ రవితేజ తో కమిషనర్ ఫోన్లో మాట్లాడుతూ ఆయన పర్యవేక్షణ పట్ల , ప్రజలకు ఆరోగ్య పరీక్షల రీత్యా డాక్టర్లు అందుబాటు లో లేకపోవడం, ల్యాబ్ టెస్టులు, మందులు, ఆపరేషన్ థియేటర్ నిర్వహణ, అవుట్ పేషెంట్ల సేవలు సరిగా నిర్వహించడం లేదని , నిర్వహణ పట్ల ఆగ్రహం వ్యక్తం చేశారు. తల్లి, బిడ్డల సంరక్షణ దిశగా ఆసుపత్రి నిర్వహణ చేపట్టాలని, ప్రజల కోసమే ఎఫ్ ఆర్ యు ఆసుపత్రి జీవీఎంసీ ఏర్పాటు చేసిందని, వీటి నిర్వహణలో లోపాలుంటే సహించేది లేదని , వారం రోజుల్లోగా ఆసుపత్రిలో లోపాలను బెహరా సొసైటీ నిర్వాహకులు సరిదిద్ది ప్రజల ఆరోగ్య రీత్యా ఎఫ్ ఆర్ యు ఆసుపత్రి నిర్వహణ చేపట్టేలా కార్యాచరణ చేయాలని , నిర్వాహకులు స్పందించకపోతే తదుపరి చర్యలు చేపట్టాలని అదనపు కమిషనర్ కు, జిల్లా వైద్య ఆరోగ్య అధికారికి , ప్రధాన వైద్యాధికారికి కమిషనర్ ఆదేశించారు.

ఈ కార్యక్రమంలో సహాయక వైద్యాధికారి డాక్టర్ కృష్ణంరాజు, ఎన్ యు హెచ్ ఎం కోఆర్డినేటర్ శశిభూషణ్, బెహరా సొసైటీ ఎఫ్ ఆర్ యు నిర్వాహకులు ఇతర అధికారులు పాల్గొన్నారు.

## 600 మంది రోగులకు వైద్య సేవలు

ఆనందపురం, ఫిబ్రవరి 12, ప్రభాతవార్త:



మండలంలోని గుడిలోవ విజ్ఞాన విహార ఆవాస విద్యాలయంలోని డాక్టర్ హెడ్గేవర్ ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో విద్యాలయంలో ఉచిత మెగా వైద్య శిబిరం బుధవారం నిర్వహించారు. ఈ మేరకు వివిధ గ్రామాల నుంచి వచ్చిన 600 మంది రోగులకు చెవి, ముక్కు, గొంతు, ఎముకల చర్మం, నేత్ర, గుండె సంబంధిత వైద్యులతో పాటు స్త్రీ, చిన్నపిల్లల వైద్యులు రోగులకు పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. గ్రామాల్లోకి బస్సులు వేయడంతో 600 మంది వైద్య శిబిరానికి తరలివచ్చారని నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ ఎడ్గేవర్ ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ జై గౌతమ్, విజ్ఞాన్ విహార

## పారిశ్రామిక యూనిట్ల ఏర్పాటుకు ప్రోత్సాహకాలను అందించాలి : జిల్లా కలెక్టరు విజయ కృష్ణన్



అనకాపల్లి, ఫిబ్రవరి 12 (ప్రభాతవార్త)

జిల్లాలో పరిశ్రమలు, పారిశ్రామిక యూనిట్ల ఏర్పాటుకు అవసరమైన ప్రోత్సహకాలు, అనుమతులు త్వరితగతిన మంజూరుచేసి ప్రోత్సహించాలని జిల్లా కలెక్టరు విజయ కృష్ణన్ తెలిపారు. గురువారం కలెక్టరు కార్యాలయ సమావేశ మందిరంలో జిల్లా కలెక్టరు అధ్యక్షతన జిల్లా పారిశ్రామిక, ఎగుమతుల ప్రోత్సాహక కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో గత కమిటీ సమావేశంలో చర్చించిన అంశాలపై తీసుకున్న చర్యలు, పారిశ్రామిక అనుమతులు, ఏర్పాటుచేసిన యూనిట్లకు అందించవలసిన ప్రోత్సాహకాలు తదితర అంశాలపై సమీక్ష నిర్వహించారు. కమిటీ సమావేశంలో జిల్లా కలెక్టరు విజయ కృష్ణన్ మాట్లాడుతూ పారిశ్రామిక అనుమతులు కొరకు సింగిల్ డెస్క్ పాలసీలో వివిధ శాఖల వద్ద పెండింగులో గల ధరఖాస్తులపై త్వరితగతిన చర్యలు తీసుకోవాలని తెలిపారు. పరిశ్రమలు స్థాపనకు వచ్చిన ధరఖాస్తులు పరిశీలించి అర్హత, ఆశక్తి గల వారికి వెంటనే అనుమతులు, మౌళిక సదుపాయాలు కల్పించాలని, రుణసదుపాయం పొందేందుకు సహకారం అందించాలని తెలిపారు. అనుమతులు మంజూరు చేసిన యూనిట్ల నిర్మాణపనులు త్వరగా పూర్తిచేసి, ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లాలో మంజూరై ప్రారంభించిన యూనిట్లకు సబ్సిడీ ప్రోత్సాహకాలు కొరకు వచ్చిన 36 ధరఖాస్తులపై వెంటనే చర్యలు తీసుకొని సబ్సిడీలు అందించాలన్నారు. పరవాడ నోటిఫైడ్ ఇండస్ట్రియల్ ఎస్టేట్ ఏరియాలో అవసరమైన అనుమతులు పొందకుండానే బొగ్గు ప్రాసెసింగ్ చేస్తూ కాలుష్యం సృష్టిస్తూ, పరిసర పరిశ్రమలకు యిబ్బంది కలిగిస్తున్న మెస్సర్స్ ఎస్. సుధాకర్, మెస్సర్స్ వేద ప్రియ రిసోర్సెస్ పరిశ్రమలపై విచారణ నిర్వహించి ఎపిఐఐసి నియమాలు, పర్యావరణ చట్టాలు ప్రకారం చర్యలు తీసుకోవాలని కాలుష్య నియంత్రణ, పరిశ్రమల శాఖల అధికారులను జిల్లా కలెక్టరు ఆదేశించారు. పరిశ్రమలు జనరల్ మేనేజరు పి.కె.పి. ప్రసాద్, ఎల్.డి.ఎం.కె. సత్యనారాయణ, కమిటీ సభ్యులు, మైనింగు, విద్యుత్, జిఎస్టీ, ఎపిఐఐసి తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

## మిషన్ పునర్వ వనం గురించి ప్రజలకు తెలియజేయాలి :జిల్లా కలెక్టరు విజయ కృష్ణన్



అనకాపల్లి ఫిబ్రవరి 12 (ప్రభాత వార్త)

రోడ్డు విస్తరణలో తొలగిస్తున్న వందల సంవత్సరాల వయస్సు కలిగిన చెట్లకు పునర్ జీవం కలిగించే మిషన్ పునర్వ వనం కార్యక్రమాలను భావితరాలకు తెలియజేయవలసిన అవసరం ఉందని జిల్లా కలెక్టరు విజయ కృష్ణన్ తెలిపారు. అనకాపల్లి నుండి అచ్చుతాపురం రోడ్డు విస్తరణలో భాగంగా హరిపాలెం గ్రామంలో 100 సంవత్సరాల పైబడి ఉన్న రావి చెట్టును ఎలమంచిలి శాసనసభ్యులు సుందరపు విజయకుమార్ సహకారంతో తొలగించి జిల్లా కలెక్టర్ క్యాంప్ కార్యాలయంలో ఒక ప్రదేశాన్ని కేటాయించి పునర్వ వనం కల్పించారు. ఈ సంధర్భంగా జిల్లా కలెక్టరు మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణకు ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తూ రోడ్డు విస్తరణలో తొలగించాలనే ఆలోచన వచ్చినప్పుడు చెట్లకు జీవం పోయాలనే ఆలోచనతో రూపొందించిన మిషన్ పునర్వ వనం మంచి ఆలోచన అని, ఈ కార్యక్రమం గూర్చి ప్రజలలో అవగాహన కలిగించి గ్రీనరీ పెంచాలని జిల్లా కలెక్టర్ పిలుపునిచ్చారు.

## సిసి రోడ్ల నిర్మాణ పనులు ప్రారంభం

అనకాపల్లి రూరల్ ఫిబ్రవరి 12 (ప్రభాత వార్త)



మాజీ మంత్రి స్థానిక శాసనసభ్యులు కొణతాల రామ కృష్ణ, అనకాపల్లి పార్లమెంటు సభ్యులు సీఎం రమేష్, అర్బన్ ఫైనాన్స్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ డెవలప్మెంట్ చైర్మన్, అనకాపల్లి టిడిపి ఇన్చార్జ్ పీలా గోవింద సత్య నారాయణ, అనకాపల్లి జనసేన పార్టీ ఇంచార్జ్ భీమర శెట్టి రాంకీ చొరవతో కొత్తూరు మేజర్ పంచాయతీలో గల కొత్తూరు గ్రామంలో 14 లక్షలుతో సిసి రోడ్లు, శారద నగర్ 13వ వీధి లో 15 లక్షలతో మంజూరైన సిసి రోడ్లు నిర్మాణ పనులను గురువారం స్థానిక కూటమి నాయకులు ప్రారంభించారు. కొత్తూరు ప్రజలు కూటమి ప్రభుత్వంలో జరుగుతున్న అభివృద్ధికి సంతోషం వ్యక్తం చేశారు. గౌరవ శాసనసభ్యులు కొణతాల రామకృష్ణకి ధన్యవాదాలు తెలియజేశారు. కొత్తూరు కూటమి నాయకులు పందల సత్య గోవిందు, జ్యోతుల గణేష్, మేడిశెట్టి సత్తిబాబు, మేడిశెట్టి నూకరాజు, కోన శ్రీనివాసరావు, బర్ల నాగరాజు, నీటిపల్లి రాజు, వేపాడ సత్తిబాబు, పందల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ పాఠశాలకి స్వామి వివేకానంద విగ్రహ వితరణ



ఎలమంచిలి ఫిబ్రవరి 12 ప్రభాతవార్త

పట్టణంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల కొత్తపేట నందు గొలుసు పూడి శ్రీనివాస బుజ్జి, శ్యామల దంపతులు సమకూర్చిన స్వామి వివేకా నంద విగ్రహం ఆవిష్కరణ కార్యక్రమం హెచ్ఎం వై రమణ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు వై వి రమణ మాట్లాడుతూ (వెజిటబుల్) బుజ్జి పాఠశాలలో స్వామి వివేకానంద విగ్రహం ఏర్పాటు చేయడం శుభ పరిణామం అన్నారు. విద్యార్థుల్లో క్రమశిక్షణ ఆధ్యాత్మిక భావాలు పెంపొందాయని ఈ సందర్భంగా తెలియజేశారు. వ్యాయామ ఉపాధ్యాయులు కుందురు రాజు, కిషోర్ కుమార్, ఉపాధ్యాయులు చంద్రశేఖర్ మంగపతి శ్రీనివాసరావు అమరావతి రామలక్ష్మి పాల్గొన్నారు.

## దేశవ్యాప్త సమ్మెలో భాగంగా పట్టణంలో ర్యాలీ నిర్వహిస్తున్న కార్మికులు...

ఎలమంచిలి, ఫిబ్రవరి 12, ప్రభాతవార్త




కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కార్మిక వ్యతిరేక విధానాలను విడనాడాలని కార్మిక కోడ్ ను రద్దు చేయాలని ఏఐటీయూసీ రాష్ట్ర సమితి సభ్యులు గనిశెట్టి ఏసుదాసు డిమాండ్ చేశారు. గురువారం దేశవ్యాప్త కార్మిక సమ్మెలో భాగంగా అఖిలపక్ష కార్మిక సంఘాలు ఏఐటీయూసీ ఆధ్వర్యంలో ఆర్టీసీ కాంప్లెక్స్ నుండి దిమిలి రోడ్డు వరకు భారీ ర్యాలీ అనంతరం ఎమ్మార్వో ఆఫీస్ ముందు ధర్నా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఏసుదాస్ మాట్లాడుతూ స్వాతంత్రం వచ్చిన తర్వాత 29 కార్మిక చట్టాలను ప్రవేశ పెట్టడం జరిగిందని కాగా ప్రస్తుత అధికారులు ఉన్న మోడీ ప్రభుత్వం వాటి స్థానంలో నాలుగు లేబర్ కోడ్ లను ప్రవేశపెట్టి కార్మిక హక్కులను కాలరాసేందుకు చర్యలు చేపట్టిందని.పాత ఎనిమిది గంటల పని విధానాన్ని కొనసాగించాలని కాంట్రాక్ట్ కార్మికుల ను పర్మనెంట్ చేసి కనీస వేతనాలు అమలు చేయాలని మోటార్,ఆటో.ముఠా తదితర కార్మికులకు సమగ్ర చట్టం చేసి కార్మిక సంక్షేమ బోర్డులను ఏర్పాటు చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో తాలూకా ఎన్నికో నాయకులు, అప్పలనాయుడు, రఘు,, తాలూకా పెన్షనర్స్ యూనియన్ అధ్యక్షులు సిహెచ్ సోమేశ్వరరావు కార్యదర్శి జి సాంబమూర్తి సంఘీభావం తెలిపారు ఈ కార్యక్రమంలో అఖిలపక్ష కార్మిక నాయకులు అల్లిమల్ల నాగ పై నూకరాజు సిహెచ్ వెంకటరమణ పి సూరిబాబు,సోంబాబు, పవన్, వీసం వెంకటరమణ డి మహేష్ తదితరులు పాల్గొన్నారు.

## కొత్తపేట ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు ఎన్జిసి దుస్తులు పంపిణి..



ఎలమంచిలి, ఫిబ్రవరి 12, ప్రభాతవార్త

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సమగ్ర శిక్ష అందించిన ఎన్జిసి (నేషనల్ గ్రీన్ కార్ప్స్) దుస్తులను జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల కొత్తపేట గురువారం పాఠశాల ప్రధానోపాధ్యాయులు వై వి రమణ విద్యార్థులకు అందజేశారు. పాఠశాలలో ఏర్పాటు చేసినటువంటి ప్రత్యేక కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు వైవి రమణ మాట్లాడుతూ విద్యార్థుల్లో పర్యావరణం పట్ల ప్రత్యేక శ్రద్ధ, పరిశుభ్రత పచ్చదనంపై అవగాహన, మొక్కలు పెంపకం వాటి సంరక్షణ,నీటి సంరక్షణ, ప్లాస్టిక్ నిర్మూలన, కాలుష్యం నియంత్రణ తదితర వాటి పట్ల పిల్లల్లో చైతన్యం కలిగించి ఇలాంటి కార్యక్రమాల్లో భాగస్వాములను చేసి, వారిని సమాజ హితులుగా తయారు చేయడమే ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశం అని అన్నారు. పాఠశాలలో వివిధ గ్రూపులుగా ఏర్పడి వీరి బాధ్యతలను నిర్వర్తిస్తారని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయులు కుందురురాజు, కిరణ్ కుమార్, చంద్రశేఖర్, రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

## క్రికెట్ పోటీలు ప్రారంభం.!

(నక్కపల్లి రూరల్ /అడ్డు రోడ్డు, ప్రభాతవార్త)



ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర హోం శాఖ మంత్రి వంగలపూడి అనిత ఆదేశాల మేరకు రాజయ్యపేట టిడిపి సీనియర్ నాయకులు ఆధ్వర్యంలో మహాశివరాత్రి, శ్రీ సూకతాత జాతర మహోత్సవములు సందర్భంగా నూతన సంగా ఏర్పాటు చేసిన క్రికెట్ గ్రౌండ్లో రాజయ్య పేట గ్రామ యువకులు క్రికెట్ పోటీలు ఆడేందుకు సిద్ధమయ్యారు. ఈ పోటీల్లో పాల్గొనే యువకులకు రాజయ్యపేట తెలుగుదేశం పార్టీ నాయకుల ఆధ్వర్యంలో జెర్సీ, బ్యాట్స్ లను తెలుగుదేశం పార్టీ నాయకులు సొంత నిధులతో అందజేశారు. పోటీల అనంతరం రాష్ట్ర హోంమంత్రి వంగలపూడి అనిత చేతుల మీదుగా బహుమతులు అందజేస్తామని ఎంపీటీసీ పిక్కి సత్తియ్య, టిడిపి గ్రామ శాఖ అధ్యక్షులు పిక్కి గంగరాజు, సొసైటీ అధ్యక్షులు పిక్కి కోదండరావు, గ్రామ పూజారి పిక్కి దేముడు, చేపల రామకృష్ణ తెలిపారు.

## ఆయుర్వేద ఆస్పత్రికి అదనపు హంగులు -యోగా, పంచకర్మ షెడ్ల నిర్మాణం

### -దాతల సహకారంతో మొదలైన పనులు



(నక్కపల్లి, ప్రభాతవార్త)

మండలంలోని వేంపాడు ఆయుర్వేద ఆస్పత్రిలో దాతల సహకారంతో యోగా, పంచకర్మ షెడ్ల నిర్మాణ పనులు జరుగుతున్నాయి. ఈ గ్రామ పెద్దలు అయినం పూడి మణిరాజు, అయినంపూడి చినపేర్రాజు (బాబు) ల ఆధ్వర్యంలో సుమారు రూ.3లక్షలు వ్యయంతో ఈ షెడ్ల నిర్మాణ పనులు జరుగుతున్నాయి. వేంపాడుకు చెందిన అయినంపూడి అప్పలరాజు, ద్రాక్షారామంకు చెందిన సత్తి సూర్యనారాయణరెడ్డి (పెదబాబు) ఆర్థిక సహకారంతో ఈ షెడ్ల నిర్మాణం చేస్తున్నట్టు మణిరాజు, బాబు చెప్పారు. గురువారం ఈ పనులను వారు పరిశీలించారు. ఫార్మసిస్ట్ భీశెట్టి రామకృష్ణ, యోగా టీచర్లు డి.రాంబాబు, డీఎన్ వీ సాయి ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## గ్రావెల్ రోడ్డు నిర్మాణ పనులను పరిశీలించిన ఏ.ఈ నానాజీ

### జనసేన నాయకులు కొటారు శ్రీను

ఎలమంచిలి,ఫిబ్రవరి 12, ప్రభాతవార్త



మున్సిపాలిటీ పరిధిలోని పట్టణంలోని రామ్ నగర్ వీధిలో కొత్తగా నిర్మాణం చేపట్టుచున్న గ్రావెల్ రోడ్డు నిర్మాణ పనులను మున్సిపల్ ఏఈ నానాజీ, జనసేన నాయకులు కొటారు శ్రీను గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా రామ్ నగర్ ప్రాంతంలో మరిన్ని రోడ్లు డ్రైనేజీలు నిర్మించాలని మున్సిపల్ ఏ ఈ నానాజీ ని కోరారు. ఈ కార్యక్రమంలో పడాల శ్రీను,శ్రీమంతుల శ్రీను, ఉదయ్ కుమార్, పెంటయ్య, పాల్గొన్నారు.

## వైభవంగా మరిడిమాంబ అమ్మవారి జాతర మహోత్సవం

### అమ్మవారిని దర్శించుకున్న ప్రముఖులు



అనకాపల్లి ఫిబ్రవరి 12 (ప్రభాత వార్త)

స్థానిక విజయరామరాజుపేట గ్రామంలో 119 ఏళ్ల చరిత్ర కలిగిన గ్రామదేవత శ్రీ మరిడిమాంబ అమ్మవారి జాతర మహోత్సవం గురువారం ఘనంగా జరిగింది. తెల్లవారు నుండి విజయరామరాజుపేట పరిసర ప్రాంతాల భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కలు చెల్లించుకునేందుకు క్యూలైన్‌లలో బారులు తీరారు. ఈ జాతర సందర్భంగా అమ్మవారిని దర్శించుకోవడానికి రాష్ట్ర అర్బన్ ఫైనాన్స్, ఇన్ఫ్రాస్ట్రాక్చర్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్, పీలా గోవింద సత్యనారాయణ, మాజీ పార్లమెంటు సభ్యులు బివి సత్యవతి విష్ణుమూర్తి దంపతులు, మాజీ ఎమ్మెల్సీ బుద్ధ నాగ జగదీశ్వర్ రావు, అనకాపల్లి నియోజకవర్గ జనసేన పార్టీ ఇన్చార్జి భీమర శెట్టి రామ్ కి, వైసిపి అనకాపల్లి నియోజకవర్గ ఇన్చార్జి మలసాల భరత్ కుమార్, కార్పొరేటర్లు మందపాటి జానకిరామరాజు, జాజుల లక్ష్మీ ప్రసన్న రమేష్, కొణతాల నీలిమ భాస్కర్, మాదంశెట్టి చిన్న తల్లి నీలి బాబు, డీసీఎంఎస్ చైర్మన్ కోట్ని బాలాజీ తదితరులు అమ్మవారిని దర్శించుకున్నారు. వీరికి ఆలయ కమిటీ సభ్యులు ఘనంగా సత్కరించి అమ్మవారి చిత్రపటాన్ని అందజేశారు.

## ఇంటి పన్ను బకాయిలపై స్పెషల్ డ్రైవ్

గొలుగొండ ఫిబ్రవరి 12, ప్రభాతవార్త



ఇంటి పన్ను బకాయిలు వసూలు పై ప్రత్యేక డ్రైవ్ ఏ ఎల్ పురంలో ఎంపీడీవో ఉలబాల శ్రీనివాసరావు పరిశీలించారు. పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసరావు తో కలిసి షాపులు వద్ద యజమానులతో మాట్లాడారు. పంచాయతీలో 2025-26 సంవత్సరం ఇంటి పన్నులు బకాయిలు 14 లక్షలు వసూలు కావలసి ఉందని తెలిపారు. ఇప్పటివరకు 21 వేయి 995 రూపాయలు ఒదన్నారు. పంచాయతీరాజ్ కమిషనర్ ఆదేశముల మేరకు స్పెషల్ డ్రైవ్ ఇంకా చేపట్టి మండలంలో గల గ్రామ ప్రజలందరికీ విజ్ఞప్తి చేశారు. బకాయి ఉన్న ఇంటి పన్ను మొత్తము 15వ తేదీకి గ్రామపంచాయతీనకు స్వర్ణ పంచాయతీకి ఆన్ లైన్ ద్వారా చెల్లించాలన్నారు. ఇంటి పన్ను బకాయి ఉన్న ఇంటి యజమానులు అందరూ సంబంధిత గ్రామపంచాయతీల కు వెంటనే చెల్లించాలని కోరారు. ప్రస్తుతం మండలంలో 5 శాతం పనులు వసూలు చేసామన్నారు. ఇంటి పన్ను సకాలంలో చెల్లించడం ద్వారా గ్రామ పంచాయతీలకు ఆదాయం ఏర్పడి వచ్చే వేసవి ప్రజల అవసరాలకు అనుగుణంగా వినియోగించుకోనందుకు అవకాశం ఉంటుందన్నారు. ఉన్న ఇంటి బకాయి ఉన్న ఇంటి యజమానులు అధికారులకు సహకరించి పన్నులు చెల్లించాలని ఈ సందర్భంగా సూచించారు.

## ఆకట్టుకున్న ఓపెన్ హౌస్..

### ప్రశంసలు అందుకున్న డిగ్రీ కళాశాల విద్యార్థులు.. తిలకించిన ఉపాధ్యాయులు, అధ్యాపకులు!




(నక్కపల్లి, ప్రభాతవార్త )

నక్కపల్లి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కళాశాల విద్యార్థులు కళాశాల ప్రాంగణంలో గురువారం అట్ట హాసంగా నిర్వహించిన ఓపెన్ హౌస్ కార్యక్రమం విశేషంగా ఆకట్టుకుంది. కళాశాల విద్యార్థులు ప్రదర్శించిన పలు రకాల మోడల్స్ స్థానిక జూనియర్ కళాశాల, ప్రభుత్వ హైస్కూల్ ఉపాధ్యాయులు, అధ్యాపకులు, విద్యార్థులు తిలకించి ఆసక్తి కనబరిచారు. ప్రదర్శనలో ముఖ్యంగా ప్రత్యేకంగా తయారు చేసిన రోబోట్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచి విద్యార్థులు సెల్ఫీలు తీసుకునేందుకు ఎగబడ్డారు. ఆ సందర్భంలో ఆరడు గుల ఎత్తులో ఉన్న క్యూబ్ ప్రధానాకర్షణగా నిలిచింది. ఆర్ట్స్ విద్యార్థులు తయారుచేసిన ప్రపంచంలోని ఏడు వింతలు కూడా అందర్నీ మనసులను దోచుకుంది. ఈ ఓపెన్ హౌస్ కార్యక్రమాన్ని ఘనంగా తీర్చిదిద్దిన జువాలజీ అధ్యాపకులు జాన్ కిరణ్ని కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎం. శివయ్య అభినందించారు. ఎన్నడూ ఊహించని విధంగా ప్రస్తుత టెక్నాలజీ రంగంలో ఇటువంటి ప్రదర్శనలు చాలా ముఖ్యమని చెప్పవచ్చు.. ప్రధానంగా వాటి విశిష్టతను తెలుసుకోవడం ద్వారా భవిష్యత్తు తరం ఏ విధంగా ఉంటుంది అనేది అర్థమవుతుంది. ముఖ్యంగా ఆరడుగుల రోబో, ఆరడుగుల క్యూబ్, క్యూ ఆర్ కోడ్, చంద్రయాన్ 3 ఉపగ్రహం, రాకెట్ లాంచింగ్ సెషన్, 7 వండర్స్, మానవుని జీవ కణనిర్మాణం, కంప్యూటర్ మదర్ బోర్డ్ , ప్రత్యేక జీవవైవిధ్యం కలిగిన మొక్కలు మొదలైన అంశాలు ఎన్నో అటు అధ్యాపకులు ఇటు ఉపాధ్యాయులు మరోపక్క విద్యార్థులు మధ్య డిగ్రీ కళాశాల విద్యార్థులు ప్రదర్శించడం నేరుగా వాటి యొక్క ప్రాముఖ్యత వివరించడం ఎన్నడూ ఇటువంటి కార్యక్రమం చూడలేదని ఆశ్చర్యపోయారు. కళాశాలంతా ఒక పండగ వాతావరణం కనిపించింది. ఈ కార్యక్రమంలో పలువురు అధ్యాపకులు కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

## దారమఠంలో శివరాత్రి ఏర్పాటుపై..డిఎస్ పి శ్రీనివాసరావు పరిశీలన

గొలుగొండ ఫిబ్రవరి 12, ప్రభాతవార్త



ఈ నెల 15 నుండి ప్రారంభం ప్రారం భమయ్యే మహాశివరాత్రి ఉత్సవాల్లో దార మఠం శివాలయం వద్ద ఏర్పాట్లను డిఎస్పి శ్రీనివాసరావు రూరల్ సీఐ రేవతమ్మతో కలిసి పరిశీలించారు. దారమఠం గ్రామం లోని వేంచేసి ఉన్న శ్రీ ఉమాదారమల్లేశ్వర స్వామి దేవస్థానంలో మహాశివరాత్రి సంద ర్భంగా ఈ నెల 15, 16 తేదీలలో శివరాత్రి ఉత్సవాల్లో భక్తులకు కల్పించే సౌకర్యాలు పై పరిశీలించే వాళ్ళు సూచనలు చేశారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా కల్పించే సౌకర్యాలు, భద్రత దృష్ట్యా పోలీస్ శాఖ తరపున విస్తృత ఏర్పాట్లును పరిశీలించారు. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని క్యూలైన్‌ల ఏర్పాట్లు, పార్కింగ్ ప్రదేశాల గుర్తింపు, ట్రాఫిక్ నియంత్రణ, భక్తులకు తాగునీరు మరియు ఇతర మౌలిక సదుపాయాలపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ఆలయం పరిసర ప్రాంతాలలో భద్రతను మరింత బలోపేతం చేయడానికి ఐదు సీసీ కెమెరాలు ఏర్పాటు చేశామన్నారు. గొలుగొండ ఎస్సై వి రామారావు స్థానిక పరిస్థితులపై డి. ఎస్. పి సీఐలకు వివరించారు. ఉత్సవాల సందర్భంగా భక్తులు పోలీస్ శాఖ సూచనలను పాటించి సహకరించాలని ఈ సందర్భంగా కోరారు. కార్యక్రమంలో ఆలయ పూజారి మణి, సర్పంచ్ గడ్డం ఆనంద్ ఇబ్బంది పాల్గొన్నారు.

## జీడి తోటలకు నష్టపరిహారం చెల్లించాలి.. దళిత సంఘాలు ఆందోళన



(నక్కపల్లి, ప్రభాతవార్త)

మండలంలోని డి ఎల్ పురంలో గల సర్వేనెంబర్ 85 /6లో ఉన్న జీడి తోటలకు నష్ట పరిహారం తక్షణమే చెల్లించాలని కోరుతూ గురువారం తేజ చారిటబుల్ ట్రస్ట్ డైరెక్టర్ దూలపల్లి నాగేశ్వరరావు ఆధ్వర్యంలో గ్రామానికి చెందిన దళితులు కుందేటి సింహాచలం, ఆరుగుల ప్రకాష్, దేవుడు, ఏడిద వీరన్న, దూలపల్లి రమణ, కుందేటి సత్యనారాయణ, తదితరులు, మహిళలతో కలిసి తాసిల్దార్ కార్యాలయం ఎదుట ఆందోళన చేపట్టారు. తక్షణమే ఏపీఐఐసీ అధికారులు భూసేకరణలో భాగంగా ఈ సర్వే నెంబర్‌లో ఉన్న జీడి తోటలకు పరిహారం ప్రకటించాలని డిమాండ్ చేశారు. 75 మంది వరకు రైతులు ఎన్నో సంవత్సరాల నుంచి ఈ జీడి తోట మీద ఆధారపడి జీవిస్తున్నారని, అటువంటి తోటను స్టీల్ ప్లాంట్ నిర్మాణం కోసం ఫెన్సింగ్ చేసే విషయంలో తొలగిస్తున్నారని ,ఆ తొలగించిన జీడి తోటలకు పరిహారం ప్రకటించాలని డిమాండ్ చేశారు. అనంతరం ఉప తాసిల్దార్ నారాయణ రావు కు వినతిపత్రం అందజేశారు.




## చోడవరంలో దేశ వ్యాప్తంగా సమ్మె విజయవంతం

చోడవరం, ఫిబ్రవరి 12, ప్రభాతవార్త




కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న రైతాంగ, కార్మిక,ప్రజా వ్యతిరేక విధానాలకు నిరసనగా గురువారం చోడవరంలో నిర్వహించిన దేశవ్యాప్త సమ్మె చోడవరంలో విజయవంతమైంది. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమానికి రైతుకూలీ సంఘం, ఏఐఎఫ్టీ యూ(న్యూ) ఆధ్వర్యం వహించాయి. చోడవరం పాత బస్టాండ్ సెంటర్ నుండి కొత్తూరు జంక్షన్ వరకు ర్యాలీ నిర్వహించి, మానవహారం చేపట్టారు. ఏఐఎఫ్టి యూ(న్యూ) జిల్లా నాయకులు అయితిరెడ్డి అప్పలనాయుడు, నవ యువ సమాఖ్య జిల్లా కన్వీనర్ నందారపు భాస్కర్ రావు,రైతు కూలీ సంఘం (ఆంధ్రప్రదేశ్) జిల్లా ఉపాధ్యక్షుడు పైలి రమేష్,స్త్రీ విముక్తి సంఘటన జిల్లా కన్వీనర్ ఓ లక్ష్మీ కుమారి, క్వారీ కార్మిక సంఘం నాయకులు చింతల రమేష్ ,రైతు కూలీ సంఘం సభ్యులు కిళ్ళి దేముడు, కె.కోటేశ్వరరావు,గండి సత్యం,బలిన అమ్మినాయుడు,నమ్మి అప్పలరాజు,కెంబూరి కల్పన, ఆర్ కుమారి, రాజాం, చౌడువాడ, పాచిలవానిపాలెం చోడవరం తదితరు గ్రామాల నుంచి రైతులు కార్మికులు పాల్గొన్నారు.

## ఆలయాల వద్ద పటిష్టమైన భద్రత చర్యలకు గ్రామస్తులు సహకరించాలి: సిఐ "మురళి"



(నక్కపల్లి రూరల్, ప్రభాతవార్త )

జిల్లా పరిధిలో ఉన్న ఆలయాల్లో చోరీలు జరిగే అవకాశం ఉన్నందున జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు బుధవారం నక్కపల్లి దత్తత గ్రామ పోలీస్ సిబ్బంది మండలం లోని రాజయ్యపేట, గుల్లిపాడు, రేబాక ఉద్దండపురం గ్రామాల్లో ఉన్న పలు ఆలయాలను సందర్శించారు. ఆలయాలను పరిశీలించి కమిటీ సభ్యులతో సమావేశమై, తప్పనిసరిగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని, రాత్రి వేళల్లో సరైన లైటింగ్ సౌకర్యం కల్పించాలని, భద్రతా పరంగా నైట్ వాచ్ ఏర్పాటు చేయాలని గ్రామస్తులతో పాటు ఆలయ నిర్వాహకులకు సూచించారు. ఆలయానికి చెందిన విలువైన ఆభరణాలను భద్రంగా సంరక్షించాలని, హుండీ డబ్బును సమయానుకూలంగా సేకరించి భద్రపరచాలని కమిటీ సభ్యులకు అవగాహన కల్పించారు. భవిష్యత్తులో ఆలయ చోరీలను నివారించడానికి ఈ చర్యలు తీసుకోవడం అవసరమని సీఐ మురళి వారికి తెలియజేశారు.

## మునిసిపాలిటీలో అభివృద్ధి కొన్ని ప్రాంతాలకే పరిమితం..

### కుమ్మరి వీధి, ఎన్టీఆర్ కాలనీలో దెబ్బతిన్న కలవర్టు పట్టించుకోని మున్సిపల్ అధికారులు

ఎలమంచిలి, ఫిబ్రవరి 12, ప్రభాతవార్త



మున్సిపాలిటీ పరిధిలోని మున్సిపల్ అధికారులు పాలకులు కొన్ని ప్రాంతాలకు అభివృద్ధి పనులను చేస్తున్నారే తప్ప కొన్ని వార్డులను పూర్తిగా నిర్లక్ష్యంగా వదిలేసారు. పట్టణంలోని ఎన్టీఆర్ కాలనీ, కుమ్మర వీధి పలు ప్రాంతాలలో కల్వర్టులు దెబ్బతిన్న ప్రమాదకరంగా మారాయి. పట్టణం లోని జలాలు వీధి, ఉల్లక్ పేట, వాగ్దేవి ప్రైవేట్ కాలేజ్ రోడ్డు ప్రాంతాలలో కాలంలో లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఇప్పటికైనా అధికారులు తక్షణం స్పందించి మరమ్మతుల గురైన కల్వర్టులను పునర్ నిర్మించాలని ఆ ప్రాంత ప్రజలు కోరుచున్నారు.

## సి.సి.రోడ్లు శంకుస్థాపన చేసిన చింతకాయల రాజేష్



మాకవరపాలెం ఫిబ్రవరి 12 ప్రభాతవార్త

మాకవరపాలెం ఎగువ కాలనీలో సిమ్మెంట్ రోడ్లు ప్రారంభించిన కౌన్సిలర్ చింతకాయల రాజేష్. ఈ మేరకు గురువారం మండల కేంద్రం మాకవరపాలెం ఎగువ (మీద)కాలనీలో రూ,30 లక్షలతో సిమెంట్ రోడ్లకు రాజేష్ శంకుస్థాపన చేశారు. మాకవరపాలెం తెలుగుదేశం పార్టీ నాయకులు రుత్తల నాని ఆధ్వర్యంలో జరుగుతున్న అభివృద్ధి పనులకు నర్సీపట్నం మున్సిపాలిటీ కౌన్సిలర్ రాజేష్ శంకుస్థాపన చేశారు. కాలనీ సందర్శనకు వచ్చిన రాజేష్ కు కాలనీవాసులు మహిళలు,భారీ స్థాయిలో స్వాగతం పలికారు. కాలనీలో మంచినీటి ఎద్దడి ఉందని మహిళలు రాజేష్ దృష్టికి తీసుకువచ్చారు. దీనిపై స్పందించిన కౌన్సిలర్ రాజేష్ ప్రస్తుతం వేసవి వస్తున్న తరుణంలో మంచినీటి అతను లేకుండా చర్యలు చేపడతామని మహిళలకు తెలిపారు. ఈ సందర్భంగా ఎగువ కాలనీలో ఉన్న కృష్ణుని ఆలయం వద్ద రాజేష్ ప్రత్యేక, ఆలయ అర్చకులు కౌన్సిలర్ రాజేష్‌కు కృష్ణుని ఆలయం వద్ద వేదమంత్రాలతో ఆశీర్వచనం చేశారు. ఈ సందర్భంగా రాజేష్ మాట్లాడుతూ ఎగువు కాలనీలో అవసరమైన అభివృద్ధికి స్పీకర్ అయ్యన్నపాత్రుడు సహకారంతో తాను పూర్తిస్థాయిలో సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు.రూ,30 లక్షల వ్యయంతో రోడ్లు డ్రైనేజీ నిర్మించడం జరుగుతుందని, పనులు పూర్తయితే, కాలనీవాసులకు మరింత సౌకర్యం మెరుగుపడుతుందని రాజేష్ అభిప్రాయం వ్యక్తపరిచారు. సిమెంట్ రోడ్లు శంకుస్థాపనకు విచ్చేసిన రాజేష్ కు స్థానిక నాయకులు రుత్తల నాని కాలనీ సమస్యలను వివరించారు. కాలనీలో పూర్తిస్థాయిలో డ్రైనేజీ నిర్మించాలని తాగునీటి సమస్య లేకుండా చూడాలని నాని కోరారు. మాకోరుపాలెం సర్పంచ్ అల్లంపల్లి శిరీష, టిడిపి సీనియర్ నాయకులు రామునాయుడు, అల్లంపల్లి వెంకటరమణ, రుత్తల చిన రాంబాబు,రుత్తల రమేష్, జోగిపాత్రుడు, సిద్దా బత్తుల వెంకటరమణ అడిగర్ల శ్రీనివాసరావు, లగుడు శ్రీను, మండల బిజెపి నాయకులు జమ్మీలు,అధిక సంఖ్యలో టిడిపి కార్యకర్తలు కాలనీవాసులు మహిళలు పాల్గొన్నారు.

## డిగ్రీ కళాశాలలో పేరెంట్స్, టీచర్స్ సమావేశం

చోడవరం, ఫిబ్రవరి 12, ప్రభాతవార్త



స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గురువారం తల్లిదండ్రులు టీచర్స్ సమావేశం నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి కిరణ్ కుమార్ అధ్యక్షత వహించగా, పేరెంట్స్ కమిటీ కోఆర్డినేటర్ ఐవివి సత్యవతి ప్రారంభించారు. ఈ సమావేశాన్ని ఉద్దేశించి ప్రిన్సిపాల్ డాక్టర్ పి కిరణ్ మాట్లాడుతూ ప్రతి తల్లి, ప్రతి తండ్రి వారి పిల్లల చదువు, నడవడిక, ప్రవర్తనపై కనీసం10 నిమిషాలు దృష్టి పెట్టాలని విజ్ఞప్తి చేశారు. అలాగే పిల్లల చదువు గురించి ఎల్లప్పుడూ కళాశాలలో ఉన్న అధ్యాపకులు అందుబాటులో ఉంటారని ఎప్పుడైనా వచ్చి వారి ప్రగతిని గురించి తెలుసుకోవచ్చునీ సూచించారు. సత్యవతి మాట్లాడుతూ ఇలాంటి సమావేశాలు వల్ల మీ పిల్లల భవిష్యత్తుల గురించి పరిశీలించడానికి అవకాశం కలుగుతుందన్నారు. జాతీయ ఎన్ ఎస్ ఎస్ పి ఓ లు డి.మాల్యాద్రి, బి.పిచ్చమ్మ,కళాశాల అధ్యాపకులు సమన్వయకర్త డాక్టర్ నారాయణ మూర్తి,వి.అప్పలనాయుడు, సిహెచ్ సుధీర్,డాక్టర్ జ్యోతి,డాక్టర్ సంధ్యశ్రీ,డాక్టర్ కృష్ణారావు,డాక్టర్ రాధాకృష్ణ,డాక్టర్ మల్లీబాబు,శ్రీవెంకటేష్, ఆఫీస్ సూపర్డెంట్ శ్రీనివాసరావు, సరస్వతీ,రామలక్ష్మి,కోమల, కామర్స్ శ్రీనివాసు తదితరులు పాల్గొన్నారు.

## ఉత్తరాంధ్ర సుజల స్రవంతికి ఊపిరి పోయండి ..

### వ్యవసాయ ఆధారిత ప్రాంతాలను ఆదుకోండి..అసెంబ్లీలో ఎమ్మెల్యే విజ్ఞప్తి

చోడవరం, ఫిబ్రవరి 12, ప్రభాతవార్త:



ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సంకల్పంగా మిగిలిన బాబు జగ్జీవన్ రామ్ ఉత్తరాంధ్ర సుజల స్రవంతి పథకానికి ఊపిరి పోయాలని చోడవరం ఎమ్మెల్యే కే ఎస్ ఎన్ ఎస్ రాజు ప్రభుత్వాన్ని కోరారు. గురువారం అయన అసెంబ్లీలో జరిగిన చర్చలో మాట్లాడుతూ అనకాపల్లి జిల్లాలో చోడవరం మాడుగుల నర్సీపట్నం వ్యవసాయ ఆధారిత ప్రాంతాలని ఇక్కడ పారిశ్రామిక ప్రగతి లేదని చెప్పారు. అదే పాయకరావుపేట ఎలమంచిలి పెందుర్తి అనకాపల్లి ప్రాంతాలు పారిశ్రామికంగా అభివృద్ధి చెందుతున్నాయని చెప్పారు. ఈ నేపథ్యంలో వ్యవసాయ ఆధారిత ప్రాంతాలను ఆదుకునేందుకు 2017లో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు చోడవరంలో సుజల స్రవంతి పథకానికి శంకుస్థాపన చేశారన్నారు తదుపరి వచ్చిన ప్రభుత్వాలు ఆ పథకాన్ని నిర్లక్ష్యం చేసేయన్నారు. దీంతో మా ప్రాంతాలు సాగునీటికి ఇబ్బంది పడుతున్నాయని వివరించారు. ఈ నేపథ్యంలో గోదావరి ప్రాంతాలలో మా ప్రాంతాల్లో మూడు పంటలు పండాలంటే పోలవరం లాంటి ఉత్తరాంధ్ర సుజల స్రవంతికి ఊపిరి పోసి ఈ ఏడాది పనులు ప్రారంభించాలని కోరారు. ఫలితంగా 2029 నాటికి ప్రాజెక్టు పూర్తయ్యే అవకాశం ఉంటది అన్నారు. శ్రీకాకుళం వరకు మూడు ఫేజ్ లలో గల ఈ ప్రాజెక్టు అనకాపల్లి జిల్లా తొలి ఫేజ్ లో ఉందని తెలిపారు. అలాగే రైతాంగానికి అండగా ఉండే గోవాడ తుంపాల ఏటికొప్పాక తాండవ చక్కెర కర్మ గారాలను తిరిగి తెరిపించాలని రైతులకు చేదోడుగా నిలవాలని కోరారు.

## యుటిఎఫ్ ఆధ్వర్యంలో పోస్ట్ కార్డ్ క్యాంపెయిన్..



ముంచంగిపుట్టు ఫిబ్రవరి 12 (ప్రభాతవార్త)

11వ పిఆర్సి లో జరిగిన ఆర్థిక నష్టానికి న్యాయం చేయాలని కోరుతూ ముంచింగి పుట్ యుటిఎఫ్ మండల శాఖ ఆధ్వర్యంలో గురువారం రాష్ట్ర ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబు నాయుడు కి పోస్ట్ కార్డ్ క్యాంపెయిన్ నిర్వహించారు. ఈ సందర్భంగా మండల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు, కార్యవర్గం పిఆర్సి తదితర ఆర్థిక సమస్యలపై తమ డిమాండ్లను తెలియజేశారు. 1.7.2023 నుంచి అమలు కావలసిన పీఆర్సి కమిషన్ ను ఇప్పటివరకు నియమించక పోవడం పట్ల ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే పిఆర్సి కమిషన్ చైర్మన్ నియమించి 29% ఐఆర్ ప్రకటించాలని కోరారు. అదేవిధంగా ఉద్యోగులు, పెన్షనర్లకు పెండింగ్ లో ఉన్న బకాయిల చెల్లింపు కు స్పష్టమైన రూట్ మ్యాప్ ప్రకటించాలని డిమాండ్ చేశారు. సిపిఎస్ రద్దుచేసి మెమో నెంబర్ 57 ప్రకారం 2004 కు ముందు నియామక ప్రక్రియ పూర్తి అయిన వారికి పాత పెన్షన్ అమలు చేయాలని విజ్ఞప్తి చేశారు. హెల్త్ కార్డులు, మెడికల్ బిల్లుల సమస్యలను కూడా తక్షణమే పరిష్కరించాలని కోరారు. ఈ బడ్జెట్ సమావేశాల్లో పై సమస్యల పరిష్కారానికి అవసరమైన చర్యలు చేపట్టాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ మండల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు సమరెడ్డి రాజు, సీసా గోపి, జిల్లా కోశాధికారి మొశ్యా. ధర్మారావు, కార్యవర్గ సభ్యులు ఎ.గాసన్న, ఆర్.పుండరీ, తదితరులు పాల్గొన్నారు.

## కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన నూతన లేబర్ కోడ్స్ రద్దుచేయాలీ.!

### పాత కార్మిక చట్టాలను పునరుద్ధరించి,యధాతథంగా అమలు చేయాలీ -సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలి

హుకుంపేట, ఫిబ్రవరి,ప్రభాతవార్త



మండల కేంద్రంలో గురు వారం సీఐటీయూ మండల కమిటీ ఆధ్వర్యంలో దేశవ్యాప్త కార్మిక సమ్మెను విజయవంతం చేయాలని కోరుతూ భారీ ర్యాలీ కార్యక్రమం నిర్వహించారూ. స్తానిక పెట్రోల బ్యాంకు నుండి ప్రభుత్వ పాఠశాల వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. నాలుగు రోడ్ల కూడలిలో మానవహారం చేపట్టారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన నూతన లేబర్ కోడ్స్ రద్దుచేయాలీ.కార్మికులకు కనిసవేతనం 26 వేలు ఇవ్వాలని.సమానపానికి సమాన వేతనం ఇవ్వాలి. పెట్టుబడి దారులకు దోచిపెట్టే లేబర్ కోడ్స్ ఓద్దె,ఒద్దు. అంటూ నినాదాలు చేశారు. సమ్మెను ఉద్దేశించి నాయకులు వి లక్ష్మణరావు, టి క్రిష్ణ రావు ఎస్ హైమావతి మాట్లాడుతూ, కేంద్రప్రభుత్వం 2025 నవంబర్21 కార్మిక చట్టాలను రద్దుచేసి, లేబర్ కోడ్స్ అమల్లోకి తీసుకువచ్చింది అన్నారు.వీటివల్ల అన్ని వర్గాల కార్మికులకు తీవ్రమైన అన్యాయం జరుగుతుందన్నారు. నాయకులు టి అప్పాలకొండ పడాలు కే అప్పారావు, బి దేవరాజు,డి క్రిష్ణమూర్తి కె మోహన్ సీఐటీయూ అనుబంధ సంస్థలు ఐనా అంగన్వాడీ, ఆశా,మిడ్డమిల్,వి ఓ ఏ సంఘాల నాయకులు కొండమ్మ, పోతురాజు, కుమారి తోపాటు ఆయా రాగాల కార్మికులు పాల్గొన్నారు.

## కార్మికుల సమ్మె విజయవంతం..మూతబడిన పర్యాటక కేంద్రం



డంబ్రిగుడఫిబ్రవరి: 12 (ప్రభాతవార్త)

కార్మిక సంఘాలు పిలుపునిచ్చిన. సమ్మె స్థానిక సి ఐ టి యు ఆధ్వర్యంలో గురువారం మండలంలో విజయవంతమైంది. ప్రముఖ పర్యాటక కేంద్రం చాపరాయి కార్మికులు సమ్మెలో పాల్గొనడంతో చాపరాయి జలపాతం మూతబడింది.అంగన్వాడీ కార్మికులు,ఆశ కార్యకర్తలు,యానిమేటర్లు,టూరిజం,మెడికల్,వివిధ ప్రభుత్వాశాకల్లో కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్తో పనిచేస్తున్న కార్మికులు పర్యాటక ప్రాంతం చాపరాయి జలపాతం నుంచి మండల కేంద్రం మూడు రోడ్లు జంక్షన్ మీదుగా. తహసీల్దార్ కార్యాలయం వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. తహసిల్దార్ కు వినతి పత్రం అందజేశారు.సిఐటియు జిల్లా ఉపాధ్యకుడు ఎస్ బి పోతురాజు మాట్లాడుతూ కార్మిక వ్యతిరేక చట్టాలను రద్దు చేయక పోతే ఆందోళన ఉధృతం చేస్తామన్నారు.ఈ కార్యక్రమంలో సి ఐ టి యు నాయకులు పి సురేష్,సత్యనారాయణ, టీ సూర్యనారాయణ,అంగన్ వాడి సంఘం జిల్లా నాయకులు కె కొండమ్మ,మండల అధ్యక్షురాలు పవిత్ర, యానిమేటర్ల సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు భాస్కర్, ఆశాకార్యకర్తలు, పాల్గొన్నారు

## చింతూరులో సార్వత్రిక సమ్మె విజయవంతం.. చింతూరులో కదం తొక్కిన కార్మికులు

చింతూరు ఫిబ్రవరి 12 ప్రభాతవార్త



సార్వత్రిక సమ్మె చింతూరులో విజయవంతం అయింది గిరిన సంఘం జిల్లా నాయకులు సీసం సురేష్ సమ్మెను ఉద్దేశించి మాట్లాడినారు. ప్రధానంగా నాలుగు లేబర్ కోడ్లు ప్రవేశపెట్టి కార్మికుల శ్రమను దోచుకునేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తుందన్నారు. పని గంటల విధానాన్ని మార్చివేసి దోపిడీ వ్యవస్థను ప్రవేశ పెట్టేందుకే లేబర్ కోడ్లను ముందుకు తెస్తుందన్నారు. అదేవిధంగా ఉపాధి హామీ పేరు మార్చుతూ జి రామ్ జి పేరుతో ఉపాధి పథకాన్ని ఆర్ఎస్ఎస్ కబంధహస్తాల్లో బంధించే ప్రయత్నం చేస్తుందని దీనికి ప్రతి ఒక్కరు వ్యతిరేకించి ప్రజా పోరాటాలు చేయాలని పిలుపునిచ్చారు. యూటీఎఫ్ జిల్లా నాయకులు పండా కృష్ణయ్య మాట్లాడుతూ రైతుల పంటలకు గిట్టుబాటు ధర కల్పించకుండా ఎరువుల సబ్సిడీ కూడా నామమాత్రం గానే ఇచ్చిందని ప్రైవేటీకరణ పేరుతో నేడు విద్యారంగాన్ని భ్రష్టు పట్టించిందన్నారు. పిల్లలను ప్రభుత్వ బడిలోనే చదివించాలని యు టి ఎఫ్ ఏర్పాటు చేసిన ప్రభుత్వ బడిలోనే చదవాలి విద్యలో ఎదగాలని కార్యక్రమం ప్రారంభించిందని ప్రతి ఒక్కరూ ప్రభుత్వ పాఠశాలలోనే తమ పిల్లలను చదివిస్తూ పాఠశాలలో మధ్యాహ్న భోజనం విద్యాభ్యాసం ఎలా జరుగుతుందో తల్లిదండ్రులు బాధ్యతగా వ్యవహరిస్తూ పాఠశాలలలో తరచూ వెళ్లి పరిశీలించాలన్నారు. అనంతరం ఎర్రంపేట ఆర్టీసీ బస్టాండ్ నుండి పోలీస్ స్టేషన్, అంబేద్కర్ సెంటర్ ఇందిరా , రాజీవ్ సెంటర్ వరకు 400 మంది మహిళలు సిఐటియు జెండాలు పట్టుకొని నినాదాలు చేస్తూ భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నాయకులు మొట్టం రాజయ్య, మడకం చిన్నయ్య, మహిళా సంఘం నాయకులు మంగ సుబ్బమ్మ, అంగనవాడీ రంగం, ఆశ వర్కర్స్ రంగం, వెలుగు వివో ఏ రంగం, హ్యూల్ శానిటేషన్, ఫీల్డ్ అసిస్టెంట్ సంఘం, విఆర్ఏ రంగం, జిసిసి రంగం నుండి నాయకులు సోడి దుర్గారావు, నూక రత్నం, రవ్వ వీరమ్మ, పుష్ప, సురేష్, రాములమ్మ, కుంజ రామయ్య, సోడి సుబ్బయ్య, స్వామి పాల్గొన్నారు.

## చింతూరు ఐటీడీఏ ఆధ్వర్యంలో ఉచిత స్వయం ఉపాధి శిక్షణ

చింతూరు ఫిబ్రవరి 12 ప్రభాతవార్త



నిరుద్యోగ గిరిజన యువతీ యువకులకు శుభవార్త చింతూరు ఐ టి డి ఏ ఆధ్వర్యంలో 45 రోజుల పాటు ఉచిత నైపుణ్య శిక్షణ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి శుభం నొక్వాల్ ఒక ప్రకటనలో తెలిపారు. వాటిలో వెల్డింగ్ -45 రోజులు ఎమర్జెన్సీ మెడికల్ టెక్నీషియన్ (ఇఎమ్) 45 రోజులు. హోటల్ మేనేజ్మెంట్ 45 రోజుల హ్యాండ్లూమ్ వీవింగ్ శిక్షణ (తస్సార్ సిల్క్ యూనిట్) శిక్షణ ప్రదేశాలు పాత ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ స్కూల్, కుందులూరు వి ఆర్ పురం మండలం, తస్సార్ సిల్క్ యూనిట్, పైడిగూడెం నిర్వహించడం జరుగుతుంది. ప్రత్యేక సౌకర్యాలు, ఉచిత భోజనం ఉచిత వసతి అభ్యర్థులు తమ దరఖాస్తులను 18-02-2026 సాయంత్రం 5:00 గంటల లోపు చింతూరు ఐటీడీఏ కార్యాలయంలో అందజేయాలి. ఆసక్తి గల గిరిజన అభ్యర్థులు కార్యాలయ పనివేళలలో పథక నిర్వహణ అధికారి, ఐటీడీఏ, చింతూరు వారికి స్వయంగా దరఖాస్తు సమర్పించవచ్చు. అదనపు వివరాల కోసం ఈ క్రింది నెంబర్కు 7702876833 ను సంప్రదించాలని ప్రాజెక్ట్ అధికారి కోరారు.

## మహాశివరాత్రికి సిద్ధమైన కుంతీ లింగేశ్వరస్వామి ఆలయం

### పాండవులు సంచరించిన ప్రాంతంగా ఆలయచరిత్ర



రాజవొమ్మంగి, ఫిబ్రవరి 12, ప్రభాతవార్త

రాజవొమ్మంగి మండలం వంచంగి పంచాయితీ నాగుల కొండ పర్వతంను చేరి సెలయేరు ప్రక్కనే ఉన్న కుంతీలింగేశ్వర స్వామి ఆలయం మహాశివరాత్రికి సిద్ధమైంది. 15 తేదీన ఆలయం వద్ద ఉదయం నుండే పూజలు చేయడానికి భక్తులు సుదూర ప్రాంతాలు నుండి వస్తారు. 15 తేదీ ఆదివారం వంచంగి, చికిలింత, మారేడుబాక పంచాయితీల్లోల్లో గల గ్రామస్తులు ఐక్యంగా అన్నసంతర్పణ చేయనున్నారు. ఇదే రోజున దాకోడు గ్రామానికి చెందిన దాకమ్మ తల్లి కోలాట బృందంచే కోలాట ప్రదర్శనను ఏర్పాటు చేశారు. 16, 17 తేదీల్లో కూడా కార్యక్రమాలను ఏర్పాటు చేశారు. ఈ ఆలయం ద్వాపరయుగం నాటి చరిత్ర ఉండని పూర్వీకులు అంటున్నారు. పాండవులు ఈ గుడి ప్రాంతంలో ఉన్నట్లు పూర్వీకులు అన్నారు. ఇక్కడ ఉన్న వాగులో కుంతీదేవి స్నానాలను చేసే ప్రక్కనే ఉన్న రాయి పై కూర్చొన్న ప్రాంతంలో రెండు పెద్ద రంధ్రాలు ఉన్నాయి. భీముడు నిద్రించిన పల్లకీ రాయి, పాము సు చాల గుర్తులుతో ఆ ప్రాంతం ఉంటుంది. గిరిజన ప్రజానీకం ఈ ప్రాంతంలో పాండవులు సంచార ప్రాంతంగా భావించి కుంతీ లింగేశ్వరస్వామి ఆలయం కూడా ఉంది. కాకినాడ జిల్లా ప్రతిపాదన సబ్ ప్లాన్ ప్రాంతం, అడ్డతీగల, ఏలేశ్వరం మండలాలకు ఈ ఆలయం దగ్గరలో ఉంది. వంచంగి, బలిజపాడు, మారేడు బాక, మంగంపాడు, రత్నంపేట, కొండలింగం పర్తి, జి.కొత్తపల్లి, కురుడేపాడు, చికిలింత, గర్గంగి, మాలయపాకలు, గొంటు వానిపాలెం, కిమ్మూరు, పులిగోగులపాడు గ్రామాలతో బాటు అనేక గ్రామల భక్తులు మహాశివరాత్రి రోజున పూజలకు వస్తారు. మూడు పంచాయితీల వారు ఐక్యంగా మహాశివరాత్రి ఉత్సవాలను చేస్తారు.

## ఊర్లకులపాడులో సంచార వైద్య శిబిరం

రాజవొమ్మంగి, ఫిబ్రవరి 12, ప్రభాతవార్త



మారేడుబాక పంచాయితీ ఊర్లకులపాడు గ్రామం లో గురువారం ప్రభుత్వ సంచార వైద్య శిభిరాన్ని నిర్వహించారు. 25 మంది రోగులకు వైద్య పరీక్షలు ను నిర్వహించి మందులను ఇచ్చారు. ఈకార్య క్రమంలో హెచ్.వి. భూమలు వెంకటరమణ, ఏ. ఎన్ యం లు శేషారత్నం, కన్నయమ్మ, హెల్త్ అసిస్టెంట్ కొన్ల రాజబాబు, 104 డి.ఇ. ఓ శ్రీనివాస్, పైలెట్ శివకనకరాజు, ఆశ వర్కర్ పవరులు రాజులమ్మ పాల్గొన్నారు.

## 50 కుటుంబాలకు కూరగాయలు విత్తనాలు పంపిణీ



రాజవొమ్మంగి, ఫిబ్రవరి 12, ప్రభాత వార్త

మారేడుబాక పంచాయితీ ఊర్లకులపాడు గ్రామంలో గురువారం ఏ.గిరిబాబు చర్చిలో జరిగిన కార్యక్రమంలో రంప చోడవరం రీజినల్ ఎగ్జిక్యూటివ్ మెంబర్ కే నవీన్ కుమార్ 50 కుటుంబాలకు ఆకుకూరలు, కూరగాయలు విత్తనాలను పంపిణీ చేసారు. పోషక విలువలు గల ఆహారాన్ని తీసుకోవడం వల్ల అనారోగ్య సమస్యలు రావని నవీన్ కుమార్ అన్నారు. ప్రతీ ఒక్కరూ వారు ఇంటి ఆవరణలో ఆకుకూరలు, కూర గాయలను పెంచుకోవాలన్నారు. వాటి ఫలాలను ఆహార పదార్థాల్లో వినియోగించుకొని ప్రతీ ఒక్కరూ ఆరోగ్యంగా ఉండాలని విత్తనాలను ఇచ్చామని నవీన్ కుమార్ అన్నారు. ఈకార్యక్రమంలో జి. వి. రావు ( సామర్లకోట సేవాభారత్ కో ఆర్డినేటర్ ),, ప్రవేటు వైద్యులు పరాత్పరరావు, పాస్టర్లు సంగీతం, వేమగిరి ఇమ్మానియేలు, స్థానికులు పాల్గొన్నారు.

## కార్మికులకు హాని కలిగించే లేబర్ కోడ్స్ రద్దు చేయాలి

అడ్డతీగల, ఫిబ్రవరి 12, ప్రభాతవార్త




కార్మికులకు హాని కలిగించే లేబర్ కోడ్స్ రద్దు చేయాలి అంటూ దేశవ్యాప్త సమ్మెలో భాగంగా అడ్డతీగల మండలంలో సివిల్ సప్లై హమాలీలు నిరసనకు దిగారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ హమాలి యూనియన్ నాయకుడు ఎం. రాజబాబు మాట్లాడుతూ, కార్మికులకు నష్టం కలిగించే నాలుగు లేబర్ కోడ్స్ను రద్దు చేసి, రద్దైన 29 కార్మిక చట్టాలను తిరిగి అమలు చేయాలని డిమాండ్ చేశారు. అలాగే హమాలీలకు ఈఎస్ఐ సదుపాయం, ప్రతి హమాలీకి మూడు జతల దుస్తులు, 58 ఏళ్లు నిండిన వారికి పిఎఫ్ ద్వారా పెన్షన్, మృతి చెందిన హమాలీల కుటుంబాలకు పిఎఫ్ ద్వారా భార్య, పిల్లలకు పెన్షన్ మంజూరు చేయాలని, పిఎఫ్ కనీస పెన్షన్ రూ.9,000 ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ నిరసనలో హమాలీలు పెద్ద సంఖ్యలో పాల్గొనగా, విద్యాసాగర్, రాజశేఖర్, ఎం. వెంకటేష్, పి. ప్రసాద్, ఎం. నరేష్ తదితరులు హాజరయ్యారు.

## అడ్డతీగలలో రెండో బ్రాందీ షాపుకు నోటిఫికేషన్

అడ్డతీగల, ఫిబ్రవరి 12, ప్రభాతవార్త

అడ్డతీగల మండలంలో గతంలో రద్దైన జి.ఎస్.ఎల్ నెం.ఏఎస్ఆర్ /28 వైన్ షాపులకు తిరిగి నోటిఫికేషన్ జారీ చేసినట్లు జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు https://oc.hpf-sproiect.com/ ద్వారా ఆన్లైన్లో లేదా రంపచోడవరం ఎక్సైజ్ స్టేషన్లో ఆఫ్లైన్గా దరఖాస్తు చేసుకోవచ్చు. ప్రతి అప్లికేషన్కు రూ.2 లక్షల ఫీజు ప్రభుత్వానికి చెల్లించాల్సి ఉంటుంది అని షాపు రాకపోయినా ఫీజు తిరిగి ఇవ్వబడదు. 21.02.2026 సాయంత్రం 5 గంటలలోపు దరఖాస్తులు స్వీకరించగా, 23.02.2026న జిల్లా కలెక్టర్ కార్యాలయంలో లాటరీ నిర్వహించనున్నట్లు అధికారులు తెలిపారు.

## నేటి భారత్ బంద్ సంపూర్ణం ప్రశాంతం



అడ్డతీగల, ఫిబ్రవరి 12, ప్రభాతవార్త

కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక ప్రజా రైతు వ్యతిరేక విధానాలను వ్యతిరేకిస్తూ సిఐటియు పోలవరం జిల్లా సహాయ కార్యదర్శి పి.రామరాజు ఆధ్వర్యంలో అడ్డతీగల మండల కేంద్రం లో గురువారం చేపట్టిన దేశవ్యాప్త సార్వత్రిక సమ్మె విజయవంత మైందని సిఐటియు పోలవరం జిల్లా సహాయ కార్యదర్శి పి.రామరాజు తెలిపారు. లేబర్ కోడులు రద్దు చేయాలని అలాగే విద్యుత్ సవరణ బిల్లును రద్దు చెయ్యాలని అలాగే నాలుగు లేబర్ కోర్డ్ లను రద్దు చేయాలని ఉపాధి హామీలో పాత చట్టాన్ని కొనసాగించాలని కనీస వేతనం 25వేలు చెల్లించాలని స్కీం కార్మికులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని అలాగే కార్మికులకు 8 గంటల పని విధానాన్ని అమలు చేయాలని ఔట్సోర్సింగ్ ఉద్యోగులను పర్మినెంట్ చేయాలని కనీస పెన్షన్ విధానాన్ని 10వేలు చేయాలని అలాగే భవన కార్మికులకు సంక్షేమ పథకాలు అమలు చేయాలని ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటీకరణ చేయడం నిలుపుదల చేయాలని డిమాండ్ చేస్తూ అడ్డతీగల దేవి గుడి సెంటర్లో మానవ ర్యాలీ నిర్వహించారు. సిఐటియు జిల్లా నాయకులు రామరాజు భవన కార్మికులు అంగన్వాడి వర్కర్లు ఆశా వర్కర్లు ఆయాలు ఉపాధి హామీ కార్మికులు వెలుగు వివోఏ సభ్యులు కార్మిక సంఘాల నాయకులు ఆదినారాయణ పెద్దకాపు చందు రాజబాబు ఆదిలక్ష్మి సూరమ్మ సత్యవతి రాజన్న కార్యకర్తలు రంగ కార్మికులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## రోడ్డు భద్రతా నియమాలను పాటించాలి: ఎస్. ఐ. చినబాబు

రాజవొమ్మంగి, ఫిబ్రవరి 12, ప్రభాతవార్త



రోడ్డుభద్రతా నియమాలను ప్రతీ ఒక్కరూ పాటించాలని జడ్డంగి ఎస్.ఐ చినబాబు వాహనదారులకు అవగాహనను కల్పించారు. గురువారం జడ్డంగి పోలీస్ స్టేషన్ ఎదురుగా వాహన తనిఖీలను నిర్వహించారు. వాహనదారులకు ఎస్.ఐ అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ను దరించాలన్నారు. డ్రైవింగ్ లైసెన్స్ లేకపోవడం, వాహన రిజిస్ట్రేషన్, ఇన్సూరెన్స్ పత్రాలు లేకపోవడం, ట్రిపుల్ రైడింగ్, మద్యం సేవించి వాహనం నడపరాదని అన్నారు. ఓవర్ స్పీడ్ వంటి మోటార్ వెహికల్ చట్ట ఉల్లంఘనలను గుర్తించి, సంబంధిత వాహనదారులపై మోటార్ వెహికల్ చట్టం ప్రకారం ఎంవీ చలాన్లు వాట్సాప్ గవర్నన్స్ ద్వారా విధించబడినని అన్నారు. ఎస్. ఐ చినబాబు, కానిస్టేబుల్ ప్రసాద్ రెడ్డి, ఏ.పి.ఎస్. పి. సిబ్బంది పాల్గొన్నారు.

## శివరాత్రి ఉత్సవ ఏర్పాట్లు పరిశీలిస్తున్న ఐటిడిఏ పీవో



రంపచోడవరం ఫిబ్రవరి 11 ప్రభాతవార్త

ఈనెల 15న జరుగు మహాశివరాత్రికి భక్తులకు ఎటువంటి అసౌకర్యం లేకుండా ఎక్కడికక్కడ ఏర్పాట్లు చేయాలని రంప చోడవరం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి, పోలవరం జిల్లా జాయింట్ కలెక్టర్ బచ్చు స్మరణ్ రాజ్ సంబంధిత అధికారులను ఆదేశించారు. బుధవారం సాయంకాలం రంపచోడవరం మండలం రంప గ్రామం లోని భ్రమరాంబ మల్లికార్జున స్వామి ఆలయంలో భక్తులకు సంబంధించిన ఏర్పాట్లను జాయింట్ కలెక్టర్ స్మరణ్ రాజ్ పరిశీలించారు. పోలవరం జిల్లా జాయింట్ కలెక్టర్ బచ్చు స్మరణ్ రాజ్ మాట్లాడుతూ మాట్లాడుతూ ఈనెల 15వ తారీకు నుండి ఈనెల 19 వ తారీఖు వరకు రంప గ్రామంలోని భ్రమరాంబ మల్లికార్జున స్వామి ఆలయంలో మహాశివరాత్రి ఉత్సవాలకు సంబంధించిన ఏర్పాట్లు చేయాలని సంబంధిత అధికారుల ను ఆదేశించారు. ఈనెల 15వ తారీకు నుండి ఈనెల 19వ తారీకు వరకు మహాశివరాత్రి ఉత్సవాలలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ప్రతిష్టాత్మకమైన భద్రత ఏర్పాటు చేయాలని అదేవిధంగా ప్రత్యేక మెడికల్ క్యాంప్ ఏర్పాటు చేయాలని, వచ్చిన భక్తులకు త్రాగునీరు ఏర్పాటు చేయాలని అదేవిధంగా కొండపైన స్థానాలకు వచ్చే భక్తులకు ప్రత్యేక ఏర్పాటు చేయాలని సంబంధిత అధికారులను ఆయన ఆదేశించారు. ఈ ఐదు రోజులపాటు పారిశుధ్య కార్యక్రమాలు పక్కాగా నిర్వహించాలని అదేవిధంగా ఎక్కడ పడితే అక్కడ చెత్త వేయకుండా తగు చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులను ఆయన ఆదేశించారు. జాయింట్ కలెక్టర్ వారి వెంట తాసిల్దార్ పీ బాలాజీ, సర్కిల్ ఇన్స్పెక్టర్ సన్యాసినాయుడు నాయుడు, సచివాలయ సిబ్బంది టి. దేవరత్నం, ఆలయ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే సొంతనిధులుతో బస్సు షెల్టర్.. మరుగుదొడ్లు నిర్మాణానికి స్థల పరిశీలన

రాజవొమ్మంగి, ఫిబ్రవరి 12, ప్రభాతవార్త



జాతీయ రహదారి విస్తరణ పనుల్లో భాగంగా రాజవొమ్మంగి ప్రధాన సెంటర్ వద్ద బస్సు షెల్టర్, మరుగుదొడ్లు లేవు. ఈపరిస్థితులను తెలుసుకొన్న రంపచోడవరం ఎమ్మెల్యే మిరియాల శిరీషాదేవి తమ సొంత నిధులుతో వీటిని నిర్మించడం జరుగుతుందని ఎమ్మెల్యే భర్త, నియోజకవర్గ తెలుగు యువత అధ్యక్షులు మఠం విజయ్ భాస్కర్ అన్నారు. గురువారం రాజవొమ్మంగి సెంటర్ వద్ద స్థలంను పరిశీలన చేశారు. ప్రయాణికులు, ప్రజలు, మహిళలు పడే ఇబ్బందులు వల్ల ఈపనులను చేయిస్తున్నట్లు విజయ్ భాస్కర్ తెలిపారు.

## రైతులకు చేరువగా ఆధునిక సాంకేతికత

### రైతులకు అందుబాటులో క్యాబ్ బుకింగ్ తరహాలో డ్రోన్ సేవలు : జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్

పాడేరు,ఫిబ్రవరి12,ప్రభాతవార్త:



వ్యవసాయ రంగంలో విప్లవాత్మక మార్పులు తీసు కువస్తూ, రైతులకు డ్రోన్ సేవలను అందుబాటులోకి తీసుకువస్తున్నట్లు జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్ ప్రకటించారు. గురువారం ఉదయం తన ఛాంబర్లో వ్యవసాయ, ఉద్యానవన, ఇందుకు సంబంధించిన శాఖ అధికారంతో కలిసి పోస్టర్ను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ డ్రోన్ ద్వారా రైతులు వ్యవసాయ ఇతర కార్యక్రమాలకు సంబంధించి తమ పొలాల్లో ఎరువులు, పురుగుమందులను డ్రోన్ల ద్వారా అతి తక్కువ సమయంలో, సమానంగా పిచికారి చేసుకోవచ్చునాని,ఇది నేరుగా మొక్కలపై పడటం వల్ల మందు వృధా కాదని, రైతులకు పని సమయము వృధా కాకుండా పారదర్శకత ఉంటుందని పేర్కొన్నారు. రైతులు సులభమైన బుకింగ్ ఫోన్ ద్వారా చేసుకోవచ్చు అన్నారు. ఫోన్ ద్వారా క్యాబ్లను ఎలా బుక్ చేసుకుంటామో, అదే విధంగా రైతులు తమ మొబైల్ యాప్ లేదా కాల్ సెంటర్ ద్వారా డ్రోన్ సేవలను తమకు కావలసిన సమయానికి బుక్ చేసుకోవచ్చునాని, ఇందుకు సమయం, కూలీల ఆదా అవుతుందని, ప్రస్తుతం వ్యవసాయ రంగంలో ఎదురవుతున్న కూలీల కొరతను అధిగమించేందుకు ఈ సాంకేతికత ఎంతగానో దోహదపడుతుంది. తక్కువ సమయంలో ఎక్కువ విస్తీర్ణంలో పని పూర్తి చేయడం ద్వారా రైతులకు సమయం, శ్రమ రెండు ఆదా అవుతుందని తెలిపారు. జిల్లా వ్యవసాయ అధికారిఎస్ బి ఎస్ నందు, ఉద్యానవన శాఖ అధికారి కే బాలకర్ణ, స్పైసెస్ బోర్డు అధికారి కళ్యాణి, అసిస్టెంట్ డైరెక్టర్ కాఫీ విభాగ అధికారి బూంజు బాబు, సాంకేతిక నిపుణులు, ఇతర అధికారులు పాల్గొన్నారు.




## అరకులోయలో కార్మికుల దేశవ్యాప్త సమ్మె ప్రశాంతం - విజయవంతం

### మూతపడిన దుకాణాలు - సందర్శిత ప్రాంతాలు




అరకులోయ, ఫిబ్రవరి 12, ప్రభాతవార్త

కార్మికులను ఇబ్బందులకు గురి చేసే నాలుగు లేబర్ కోడ్స్ను తక్షణమే రద్దు చేయాలని, పాత కార్మిక చట్టాలను కొనసాగించాలని డిమాండ్ చేస్తూ కార్మిక సంఘాల నేతృత్వంలో కార్మికులు చేపట్టిన దేశవ్యాప్త సమ్మెలో భాగంగా గురువారం అరకులోయలో సిఐటియు ఆధ్వర్యంలో జరిగిన సమ్మె ప్రశాంతంగా, విజయవంతంగా ముగిసింది. దీనిలో భాగంగా సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి వి ఉమామహేశ్వరరావు నేతృత్వంలో స్థానిక గిరిజన మ్యూజియం ఎదురుగా వివిధ కార్మిక సంఘాల నాయకులు, కార్మికులు సమ్మెను చేపట్టారు. కార్మికుల సమ్మెకు గిరిజన సంఘం, సిపిఎం, ఏపీయూడబ్ల్యూజే అరకులోయ ప్రెస్ క్లబ్ అధ్యక్షులు ఎల్బీ వెంకటేశ్వరరావు నేతృత్వంలో సభ్యులు, యుటిఎఫ్ సంఘాలు తమ సంఘీభావాన్ని తెలిపాయి. కార్మికుల సమ్మె సందర్భంగా అరకలోయలో దుకాణాలు ను వ్యాపారులు స్వచ్ఛందంగా మూసివేసి తమ మద్దతును తెలియజేశారు. అలాగే స్థానిక ప్రముఖ సందర్శిత ప్రాంతాలు మూతపడ్డాయి. సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఉమా మహేశ్వరరావు, గిరిజన సంఘం నాయకుడు పొద్దు బాలదేవ్లు మాట్లాడుతూ కేంద్రం కొత్తగా తీసుకు వచ్చిన నాలుగు లేబర్ కోడ్స్ కార్మికులను బానిసలుగా చేస్తాయని, కార్పొరేట్లకు, పెట్టుబడిదారులకు లాభం కోసం కార్మికులను పణంగా పెట్టి మోడీ ప్రభుత్వం ఏ నిర్ణయం తీసుకుందని పేర్కొన్నారు. కొత్తగా తీసుకువచ్చిన లేబర్ కోడ్స్ ను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ చేపట్టిన దేశవ్యాప్త సమ్మెలో 500 సంఘాలు పాల్గొన్నాయని తెలిపారు. కొత్తగా లేబర్ కోడ్స్ దేశవ్యాప్తం గా అమలులోకి వచ్చాయని, 29 కార్మిక చట్టాలు రద్దు అయ్యాయని తెలియజేశారు. కార్పొరేట్ల ఒత్తిడితోనే పాలకవర్గం లేబర్ కోడ్స్ ను అమల్లోకి తెచ్చిందన్నారు. పని గంటలు 8 నుండి 12కు మార్చారని చెప్పారు. కార్మికులు అరకులోయ ప్రధాన రహదారిలో ర్యాలీ కార్యక్రమాలు చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఐటీడీఏ వర్కర్స్ యూనియన్ నాయకులు దాడి రాజు, ఆదివాసీ గిరిజన సంఘం నాయకులు కిండంగి రామారావు, రామన్న, నాని బాబు , సిఐటియు మండల నాయకులు మగ్గన్న, రమేష్, నాగేంద్ర, సంఘాల నాయకులు చినబాబు , యుటిఎఫ్ నాయకులు రఘునాథ్ తదితరులు పాల్గొన్నారు.

## నిబంధనలు పాటించకపోతే చర్యలు తప్పవు : సీఐ బి. నరసింహమూర్తి

అడ్డతీగల, ఫిబ్రవరి12, ప్రభాతవార్త



వాహనదారులు నిబంధనలు పాటించాలని, తప్పనిసరిగా రికార్డులు కలిగి ఉండాలని లేనియెడల వారిపైశాఖాపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని అడ్డతీగల సీఐ. నరసింహ మూర్తి హెచ్చరించారు. సీతపల్లి సెంటర్ సమీపంలో సీఐ తమ సిబ్బందితో ముమ్మర వాహన తనిఖీలు చేపట్టారు. దీనిలో భాగం గా రికార్డులు లేని వాహనదారులకు, అలాగే నిబంధనలు పాటించని వాహనదారులపై జరిమానాలు విధించారు. సీఐ నరసింహుమూర్తి మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ నిబంధనలు పాటించాలని, అలా లేనియెడల వారిపై చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలియజేశారు. అలాగే నిబంధనలు పాటించకపోవడం వలన కలిగే ప్రమాదాల గురించి వాహనదారులకు, పలువురు తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. రోడ్డు ప్రమాదాల నివారణకు పోలీస్ శాఖ ప్రత్యేకంగా చర్యలు తీసుకుంటుందని, ప్రజల కూడా సహకరించాలని కోరారు.

## మాజీ సీఎం వైయస్ జగన్ మోహన్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసిన వైసీపీ నేత అంజి



గూడెం కొత్తవీధి,ఫిబ్రవరి 12(ప్రభాతవార్త)

గూడెం కొత్త వీధి మండలం జీ.కే వీధి పంచాయతీకి చెందిన ఉప సర్పంచ్,సీనియర్ వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకుడు అరికట్ల ఆంజనేయులు (అంజి) గురువారం రాష్ట్ర మాజీ ముఖ్య మంత్రి, వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత వైఎస్ జగన్మోహన్ రెడ్డి ని తాడేపల్లి పార్టీ కార్యాలయంలో అల్లూరి సీతారామరాజు జిల్లా వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు,పాడేరు ఎమ్మెల్యే మత్యరాస విశ్వేశ్వర రాజు తో మర్యాదపూర్వకంగా కలిశారు.ఈ సందర్భంగా మండల ప్రజా సమస్యలను ఆయన దృష్టికి తెలియపరిచారు.ఈ కార్యక్రమంలో వైసిపి పార్టీ ముఖ్య నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

## కార్మికుల చట్టభద్రతను కల్పించాలంటూ ర్యాలీ.. మానవహారం

రాజవొమ్మంగి, ఫిబ్రవరి 12, ప్రభాతవార్త



కార్మికులకు చట్టభద్రతను కల్పించాలంటూ నినాదాలుతో అన్నిరంగాల కార్మికులు భారీ ర్యాలీ, మానవహారాన్ని రాజవొమ్మంగిలో నిర్వహించారు. గురువారం రాజవొమ్మంగి మండలకేంద్రంలో చేపట్టిన దేశ వ్యాప్త సార్వత్రిక సమ్మె విజయవంతం అయ్యింది. ఆర్ అండ్ బి అతిథి గృహం నుండి ర్యాలీ ప్రారంభమై అల్లూరి జంక్షన్ కు చేరుకొని అక్కడ మానవహారంను నిర్వహించారు. అక్కడ నుండి ర్యాలీ గాంధీ బొమ్మసెంటర్ కు చేరుకోవడం జరిగింది. అనంతరం సి. ఐ. టి. యు. మండల కన్వీనర్ తాటితూరి శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన సభలో గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్షులు లోతా రామారావు మాట్లాడుతూ 29 కార్మిక చట్టాలను రద్దు చేయడం జరిగిందన్నారు. ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు కనీస వేతనం అమలు చేయాలని అన్నారు. కె.వెంకటలక్ష్మీ మాట్లాడుతూ ఉపాధిహామీ పనుల కల్పనలో రోజులు పెంచిన ప్రభుత్వం కనీస వేతనం రూ. 600 ఇవ్వాలని అన్నారు. మిడ్డే మీల్స్, ఆశ, వెలుగు వి. ఓ ఏ లకు ఉద్యోగ భద్రతను కల్పించాలని సింగిరెడ్డి అచ్చారావు అన్నారు. కార్మికులు చట్టాలు, హక్కులు పరిరక్షణకు భవిష్యత్ ఉద్యమాల కు కార్మికులు సిద్ధం కావాలని కొన్ల సూరిబాబు పిలుపు నిచ్చారు. సి. ఐ. టి. యు. మండల కన్వీనర్ తాటితూరి శ్రీనివాస్, గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్షులు లోతా రామారావు, ఇతర సంఘాలు నాయకులు కలింకోట వెంకటలక్ష్మీ, అశోక్, కొన్ల సూరిబాబు, యం. రమేష్, సింగిరెడ్డి అచ్చారావు, కె. అమ్మిరాజు, రాజ్య లక్ష్మీ, అంగన్వాడీ, ఆశలు, మిడ్డే మీల్స్ వర్కర్స్, వెలుగు వి. ఓ ఏ లు,, అన్ని రంగాల కార్మికులు పాల్గొన్నారు. రాజవొమ్మంగి ఇన్ ఛార్జి ఎస్. ఐ చినబాబు ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు విధులను నిర్వహించారు.

## 24 కేజీల గంజాయి పట్టివేత, యువకుడి అరెస్ట్

గూడెం కొత్తవీధి,ఫిబ్రవరి 12 (ప్రభాతవార్త



ద్విచక్ర వాహనంతో 24 కేజీల గంజాయి తరలిస్తున్న రాజమండ్రి కి చెందిన తేజ అనే యువకుడ్ని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. మండలంలోని పూజారి పాకలు వద్ద వాహన తనిఖీల్లో గూడెం కొత్త వీధి పోలీసులకు దొరికాడు.ఇతడు ఒరిస్సా నుండి 24 కేజీల గంజాయిని ద్విచక్ర వాహనంపై తీసుకు వస్తున్నాడని ఆ సమయంలో వాహన తనిఖీలు చేస్తున్న ఎస్సై సిబ్బంది పట్టుకున్నామని ఇతని సీఐ సుధాకర్ ఆధ్వర్యంలో కేసు నమోదు చేసి రిమాండ్ కి తరలిస్తున్నామని ముద్దాయి నుండి పూర్తి వివరాలను సేకరించే దిశగా చర్యలు తీసుకుంటున్నామని ఎస్సై కే సురేష్ తెలిపారు.గంజాయి రవాణా చేసిన, గంజాయి జోలికి వెళ్లిన కఠిన చర్యలు తీసుకుంటామని, గంజాయి జోలికి వెళ్లొద్దని మీ జీవితాలు నాశనం చేసుకోవద్దని సిఐ సుధాకర్,ఎస్ఐ సురేష్ ప్రజలకు తెలియజేశారు.

## జిల్లా పోలీసుల విస్తృత తనిఖీలు: అక్రమ కార్యకలాపాలపై నిఘా

పాడేరు,ఫిబ్రవరి12, ప్రభాతవార్త:



అల్లూరి జిల్లా ఎస్పీ అమిత్ బర్దర్ ఆదేశాలు మేరకు ఈ రోజు గురువారం జిల్లా వ్యాప్తంగా ఇంటెన్సివ్ వెహికల్ చెకింగ్స్ ,నిఘా కార్యక్రమాలు అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. జిల్లా వ్యాప్తంగా గ్రామ శివార్లలో డ్రోన్స్ సహాయంతో నిఘా ఏర్పాటు చేసారు. ఈ కార్యక్రమంలో ఎలాంటి అక్రమ కార్యకలాపాలు జరగకుండా పోలీసులు కట్టుదిట్టమైన చర్యలు తీసుకున్నారు. అలాగే డాగ్ స్క్వాడ్ ను ఉపయోగించి అనుమానాస్పద ప్రాంతాలను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. గంజాయి సాగు, రవాణా, ఇతర మాదక ద్రవ్యాల అక్రమ రవాణాను అరికట్టేందుకు ప్రత్యేక నిఘా పెట్టారు. పోలీసులచే గంజాయి మరియు ట్రాఫిక్ నియమాలపై అవగాహనా కార్యక్రమాలు నిర్వహించారు. స్థానిక ప్రజలకు, వాహనదారులకు ట్రాఫిక్ నిబంధనలు, గంజాయి వల్ల కలిగే నష్టాలు,ఇతర చట్టపరమైన అంశాలపై ప్రజల్లో అవగాహన కల్పించారు. అల్లూరి సీతారామరాజు జిల్లాను “నేర రహిత” సమాజంగా మార్చాలనే లక్ష్యంతో పోలీస్శాఖ నిరంతరం కృషి చేస్తుందని, ఎలాంటి అక్రమాల కు పాల్పడినా, తప్పించుకునే అవకాశం లేదని ఎస్పీ అమిత్ బర్దర్ స్పష్టం చేశారు. ప్రజలు సహకరించి, ఏవైనా అనుమానాస్పద కార్యకలాపాలను గమనించిన వెంటనే సమీప పోలీస్ స్టేషన్కు సమాచారం అందించాలని ఎస్పీ కోరారు.

## తహసీల్దార్ వెంకటరమణను సత్కరించిన టిడిపి నాయకులు



మాకవరపాలెం ఫిబ్రవరి 12 ప్రభాతవార్త

మాకవరపాలెం తహసిల్దార్ బాణం వెంకటరమణ ను టిడిపి నాయకులు ఘనంగా సత్కరించారు. ఈమేరకు గురువారం రెవెన్యూ కార్యాలయంలో తాసిల్దార్ బాణం వెంకటరమణను సాలువతో సత్కరించి పుష్పగుచ్చాలు అందజేశారు. రిపబ్లిక్ డే సందర్భంగా ఉత్తమ తాసిల్దారిగా జిల్లాకలెక్టర్ విజయ కృష్ణన్ చేతుల మీదుగా తాసిల్దార్ బాణం వెంకటరమణ అవార్డును స్వీకరించారు. రైతులకు సంబంధించిన రెవిన్యూ సమస్యలు సత్వరమే పరిష్కరిస్తున్న వెంకటరమణ టిడిపి నాయకులు ఈసందర్భంగా సత్కరించారు. మాకవరపాలెం సర్పంచ్ అల్లంపల్లి శిరీష,టీడీపీ నాయకులు రుత్తల నాని,ఆధ్వర్యంలో తాసిల్దారును సత్కరించారు. కార్యక్రమంలో మండల టిడిపి కార్యదర్శి రుత్తల రమేష్, డీటీపీ నాయకులు అల్లంపల్లి వెంకటరమణ, టిడిపి నాయకులు కార్యకర్తలు హాజరయ్యారు.

## పారిశ్రామిక అభివృద్ధి కేంద్రంగా పురోగమిస్తున్న అనకాపల్లి జిల్లా

### స్టీల్ ప్లాంట్‌ను ఆదుకున్నది కూటమి ప్రభుత్వం... విశాఖపట్నంలో సబర్బన్ రైల్వే స్టేషన్ ఏర్పాటు చేయాలి..శాసనసభలో ఉత్తరాంధ్ర అభివృద్ధి కోసం మాట్లాడిన కొణతాల

అనకాపల్లి ఫిబ్రవరి12:( ప్రభాతవార్త)



కూటమి ప్రభుత్వ నేతృత్వంలో అనకాపల్లి జిల్లా పారి శ్రామికంగా పురోగమిస్తుందని, రానున్న కాలంలో ఈ ప్రాంత రూపురేఖలే అనూహ్యంగా మారిపోనున్నాయని మాజీ మంత్రి, అనకాపల్లి శాసన సభ్యులు కొణతాల రామకృష్ణ అన్నారు. గురువారం శాసనసభలో ఆయన మాట్లా డుతూ కేంద్ర ప్రభుత్వ సహకారంతో ఆంధ్రప్రదేశ్లో త్రిబుల్ ఇంజన్ సర్కార్ అనతి కాలంలోనే అద్భుత ఫలితా లను ప్రజలకు అందిస్తుందని కొనియాడారు. దేశంలోనే అత్యంత పెద్ద ఆర్సార్ మెట్టల్, ఆర్ఆర్ మెట్టల్ అండ్ నెప్పన్ స్టీల్ ప్లాంట్ నక్కపల్లి లో 60 వేల కోట్ల తో ఏర్పాటు కావడం అనకాపల్లి జిల్లాకే పెద్ద వరంగా పేర్కొన్నారు. ఈ స్టీల్ ప్లాంట్ తో సుమారు 60 వేల మందికి ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నారు. ఎలమంచిలి గ్రీన్ హైడ్రోజన్ సుమారు లక్ష50 వేల కోట్లతో ఏర్పాటు అవుతుంది అన్నారు.ఉత్తరాంధ్ర చాలా వెనుకబడి నటువంటి ప్రాంతం ఆర్థికంగా సామాజికంగా అదేవిధంగా విద్యాపరంగా వైద్యపరంగా అన్ని రకాలుగా వెనుకబడినటువంటి ప్రాంతం గా ఆయన పేర్కొన్నారు. ఆ ప్రాంతం వ్యవసాయ పరంగా ఇంకా అభివృద్ధి చెందవలసిన అవసరం ఉంది. పోలవారం లెఫ్ట్ కెనాలు వచ్చే ఏడాదికి పూర్తి చేసి వినియోగంలోకి తీసుకువచ్చేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రయత్నం చేస్తున్నారని తెలిపారు. దీంతో పాటు ఉత్తరాంధ్ర సుజల శ్రవంతి కనీసం ఫస్ట్ ఫేజ్ అయినా సరే 2600 కోట్ల రూపాయలతో 1, 30వేల ఎకరాలు సాగులోకి వస్తుందని రామకృష్ణ పేర్కొన్నారు.

## మంత్రి బీసీ జనార్దన్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసిన ప్రగడ



ఎలమంచిలి ఫిబ్రవరి 12 ప్రభాతవార్త

అమరావతి సచివాలయంలో గురువారం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రహదారులు, భవనాల శాఖ మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి ని రాష్ట్ర రహదారుల అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్, నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇన్చార్జి ప్రగడ నాగేశ్వరరావు, డైరెక్టర్లు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో ఏపీఆర్ డిసి ఆధ్వర్యంలో జరుగుతున్న రహదారులు నిర్మాణం, చేపట్టబోవు రహదారుల కోసం చర్చించారు. అనంతరం అనకాపల్లి జిల్లాలో ఉన్న రహదారుల మరమ్మత్తుల పనుల కోసం ప్రత్యేకంగా చర్చించారు.

## కార్మికులకు కనీస వేతనం 26,000 ఇవ్వాలి

(రాంబిల్లి ఫిబ్రవరి 12 ప్రభాతవార్త)



దేశవ్యాప్త సమ్మె సందర్భంగా ఈరోజు రాంబిల్లి మండలంలో ఉదయం నేవీ గేట్ పరిసర ప్రాంతంలో అరగంట పాటు రాస్తారోకో చేసి కార్మికులకు నష్టం చేసే లేబర్ కోడ్ ను రద్దు చేయాలని, కనీస వేతనం 26,000 పెంచాలని, కార్మిక చట్టాలను పటిష్టంగా అమలు చేయాలని, స్కీం వర్కర్స్ ను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని, అసంఘటిత రంగ కార్మికులకు సమగ్ర చట్టం చేయాలని, రైతులు పండించే పంటకు గిట్టుబాటు ధర కల్పించాలని, మహాత్మ జాతీయ గ్రామీణ ఉపాధి పథకం అను పాత చట్టాన్ని కొనసాగించాలని, స్థానికులకు ఎస్ఈజెడ్, ఎన్ఏఓబి లలో మొదట ప్రాధాన్యతగా ఉపాధి కల్పించాలని, ఫార్మా కంపెనీలో ప్రమాదాలపై తగు చర్యలు తీసుకోవాలని పెద్ద ఎత్తున నినాదాలు చేశారు, సిఐటియు జిల్లా కార్యదర్శి జి. దేవుడు నాయుడు ఆధ్వర్యంలో రాంబిల్లి కూడలిలో గంటపాటు రాస్తారోకో మానవహారం చేసి అనంతరం స్థానిక తాసిల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు, ఈ కార్యక్రమంలో సిఐటియు మండల కన్వీనర్ చందక రామకృష్ణ, నాయకులు వై రాము, సిహెచ్ శివాజీ, బి భాస్కరరావు, ఐద్వా జిల్లా నాయకులు మండల కార్యదర్శి సిహెచ్. మంగతాయారు, రైతు నాయకుడు సమ్మెట్ల రాము, అంగన్వాడి, ఆశ కార్యకర్తలు, మధ్యాహ్న భోజనం శానిటేషన్ కార్మికులు, ముఠా, ఆటో, భవన నిర్మాణ, లారీ డ్రైవర్లు, ఎన్ఏఓబి మరియు సెజ్ కార్మికులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## ఘనంగా నల్లమారమ్మ పండుగ



మాకవరపాలెం, ఫిబ్రవరి 12 ప్రభాతవార్త

మాకవరపాలెం మండలం కొండల అగ్రహారంలో వేంచేసిన శ్రీ శ్రీ శ్రీ నల్లమారమ్మ పండుగను అత్యంత సాంప్రదాయ పద్ధతిలో జరుపుకున్నారు. ఈమేరకు సర్పానది సమీపంలో వెంచేసిన అమ్మవారి దేవాలయాన్ని రంగురంగుల పూలతో సర్వాంగ సుందరంగా అలంకరించారు. అమ్మవారి ఆలయం నుంచి కొండల అగ్రహారం పురవీధుల గుండా భారీ విద్యుత్ దీపాలతో అలంకరించారు. గురువారం తెల్లవారుజాము నుంచే అమ్మవారి ఆలయానికి మహిళలు తండోపతండాలుగా తరలి వచ్చి బారులు తీరి మరీ అమ్మవారికి పూజలు నిర్వహించారు. అమ్మవారు ఆలయానికి దర్శనానికి వచ్చే భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా అవసరమైన ఏర్పాట్లను నిర్వాహకులు గ్రామ పెద్దలు, సమకూర్చారు. తదనంతరం ఉదయం 10గంటల నుంచే ఆలయ ప్రాంగణంలో అమరావతి ట్రావెల్స్, గ్రామపెద్దలు సహకారంతో భారీ అన్న సమారాధన కార్యక్రమం నిర్వహించారు. మండల వైసీపీ అధ్యక్షులు చిటికెల వెంకటరమణ, స్థానిక సర్పంచ్ పోలిరెడ్డి అచ్చియ్యమ్మ, పోలిరెడ్డి రమణ, అమరావతి ట్రావెల్స్ యాజమాన్యం గ్రామపెద్దల సహకారంతో అమ్మవారి పండుగను ఘనంగా నిర్వహించారు.

## రోడ్డు ప్రమాదాల నివారణే ప్రధాన లక్ష్యం

### జాతీయ రహదారిలో క్షేత్రస్థాయిలో తనిఖీలు

అనకాపల్లి రూరల్ ఫిబ్రవరి 12 (ప్రభాతవార్త)



రోడ్డు ప్రమాదాల నివారణే లక్ష్యంగా అనకాపల్లి జాతీయ రహదారిపై ప్రమాదాలు జరిగే ప్రాంతాలను పోలీసు, రవాణా ఎన్.హెచ్.ఏ అధికారుల సంయుక్తంగా క్షేత్రస్థాయిలో గురువారం తనిఖీలు నిర్వహించారు. ట్రాఫిక్ సిఐ వెంకటనారాయణ మాట్లాడుతూ జిల్లా ఎస్పీ తుహిన్ సింహా, డి.ఎస్.పి ఎం శ్రావణి ఆదేశాల మేరకు రోడ్డు ప్రమాదాలను అరికట్టడమే ప్రధాన లక్ష్యంగా జాతీయ రహదారిపై గాజువాక రోడ్డు వై జంక్షన్, నూకాంబిక ఆర్చి జంక్షన్, ఉమ్మలాడ జంక్షన్, కొత్తూరు జంక్షన్ ఇలా తదితర ప్రాంతాల్లో సంబంధిత శాఖల అధికారులు తో తనిఖీలు నిర్వహించినట్లు తెలిపారు. అనకాపల్లి జిల్లా రవాణా శాఖ అధికారి జి మనోహర్, మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ గోపీకృష్ణ, ఆర్ అండ్ బి డి ఈ నరసింహమూర్తి, నేషనల్ హైవే అథారిటీస్ మేనేజర్ లక్ష్మణరావు, సీనియర్ ఇంజనీర్ వసంత సాయి, టోల్ ప్లాజా మేనేజర్ కృష్ణ ఇతర అధికారులు జాతీయ రహదారిపై విస్తృతంగా తనిఖీలు నిర్వహించి ప్రమాదాలు జరిగే ప్రాంతాలను గుర్తించి ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. ప్రమాదాల నివారణకు గాను అవసరమైన చోట స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయడం, ప్రమాద హెచ్చరిక బోర్డులు పెట్టడం జంక్షన్ల వద్ద అవసరమైన మెరుగుదల పనులు తక్షణమే చేపట్టాలని అధికారులను సూచించారు.

## శివరాత్రి ఏర్పాట్లపై రెవెన్యూ పోలీస్ పరిశీలన



గొలుగొండ ఫిబ్రవరి 12 (ప్రభాతవార్త)

మహాశివరాత్రి ఉత్సవాలకు ముస్తాబవుతున్న శ్రీ ఉమా దారం మల్లేశ్వర స్వామి ఆలయాన్ని రెవెన్యూ పోలీస్ శాఖ అధికారులు సంయుక్తంగా పరిశీలించారు. ఆలయ ప్రాంగణం మొత్తం తిరుగుతూ వసతి సౌకర్యాలు స్నానాల ఆచరించే ప్రదేశాలు జలపాతాల వద్ద కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేయాలని సూచించారు. అలాగే క్యూలైన్లో భక్తులకు తాగునీరు సౌకర్యం పరిసర ప్రాంతాల్లో ఉండే భక్తులకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా సిబ్బందిని ఎక్కడికక్కడ ఏర్పాటు చేయాలని వివిధ శాఖలు సమన్వయంతో పని చేయాలని అన్నారు. రెవెన్యూ పరమైన సహాయం అందుతుందని ఉంటాయని తహసీల్దార్ కాకర నూకరాజు తెలిపారు. టిడిపి అనకాపల్లి పార్లమెంట్ పార్టీ ఉపాధ్యక్షుడు అడిగర్ల అప్పలనాయుడు, స్థానిక సర్పంచ్ గడ్డం ఆనంద్, గొలుగొండ మాజీ సర్పంచ్ నాగేశ్వరరావు, ఆలయ అధికారి రామకృష్ణ పూజారి మని తో కలిసి ఆలయ పరిసరాలు సందర్శించారు. సైకిల్ స్టాండ్ బస్సులు నిలిపే స్థలం అన్నిటికీ తగిన ఏర్పాట్లు చేస్తున్నట్లు వివరించారు. మండలంలో ఈ నెల 15 16 17 తేదీల్లో నిర్వహించే మహాశివరాత్రి ఉత్సవాల ఏర్పాట్ల పై తాసిల్దార్ నూకరాజు, ఎస్సై రామారావు, జిల్లా టిడిపి ఉపాధ్యక్షులు ఎ. అప్పలనాయుడు, టిడిపి నాయకుడు గెడ్డం ఆనంద్, దేవాదాయ శాఖ అధికారులు గురువారం పరిశీలించారు. మూడు రోజులపాటు నిర్వహించే ఉత్సవాల్లో ఎక్కడ ఏవిధమైన విస్తృమైన భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు చేపట్టనున్నట్లు తాసిల్దార్ తెలిపారు.

## ఘనంగా శ్రీ షిరిడి సాయిబాబా 29వ వార్షికోత్సవం



( ఎస్ రాయవరం ఫిబ్రవరి 12 ప్రభాతవార్త)

మండల కేంద్రమైన ఎస్ రాయవరం గ్రామం లో వేంచేసి ఉన్న శ్రీ షిరిడి సాయిబాబా ఆలయం లో 29వ వార్షికోత్సవం గురువారం ఘనంగా నిర్వహించారు. ఉదయం సాయి బాబా మూల విరాట్‌కు పంచామృత అభిషేకములు ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు ప్రత్యేక పూజల్లో పాల్గొని స్వామివారి దర్శించుకున్నారు. అనంతరం అన్న సమాధాన కార్యక్రమంలో పాల్గొని తీర్థ ప్రసాదము స్వీకరించారు. నేమాని గోపాలకృష్ణ బ్రదర్స్ బత్తుల సోమయ్య. కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో నిర్వహించారు.

## కార్మిక వ్యతిరేక విధానాలను వెంటనే రద్దు చేయాలి

### సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్.శంకర్రావు

ఎస్.రాయవరం ఫిబ్రవరి 12 ప్రభాతవార్త



దేశవ్యాప్తంగా జరిగే సమ్మెలో భాగంగా గురువారం అడ్డరోడ్డు ఫ్లైఓవర్ బ్రిడ్జి నుంచి ఆర్డీవో కార్యాలయం వరకు భారీ ఎత్తున కార్మికులు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యవసాయ కార్మిక సంఘం సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్. శంకర్రావు మాట్లాడుతూ కార్మిక వ్యతిరేక విధానాలను వెంటనే రద్దు చేసి, కనీస వేతనం రూ.26,000 అమలు చేయాలని, కాంట్రాక్ట్ కార్మికులను పర్మినెంట్ చేయాలని, సమాన పనికి సమాన వేతనం చెల్లించాలని విద్యుత్ రంగంతో సహా ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటీకరించే ప్రయత్నాలను తక్షణమే నిలిపివేయాలని, రద్దు చేసిన మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని పాత పద్ధతి లో కొనసాగించాలని కార్మికులు ప్రభుత్వాన్ని గట్టిగా డిమాండ్ చేశారు. అంగన్‌వాడీ, ఆశా, మధ్యాహ్నం భోజన పథకం ఐకెపి, ఆర్డబ్ల్యూఎస్, ఆటో కార్మికులు వంటి వర్గాలకు సంక్షేమ పథకాలు పూర్తిగా వర్తింప జేయాలని కోరారు. ప్రభుత్వం కార్మికుల న్యాయమైన డిమాండ్లను తక్షణమే పరిష్కరించకపోతే ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని నాయకులు హెచ్చరించారు.వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు,ఎం. సత్యనారాయణ, రూపాదేవి, సిఐటియు జిల్లా కార్యదర్శి మనబాల రాజేష్, వెలుగుల అర్జున్ రావు పాల్గొన్నారు.



## సంపద కేంద్రానికి చేరని చెత్త

(రాంబిల్లి ఫిబ్రవరి 12 ప్రభాతవార్త)

రాంబిల్లి మండలం లాలం కోడూరు పంచాయతీలో రోడ్లపైనే చెత్త పడేస్తున్నారు, గ్రామంలో రూ.10 లక్షలతో నిర్మించిన సంపద తయారీ కేంద్రం ఉంది, అయినా గ్రామం చుట్టూ ఎక్కడబడితే అక్కడ చెత్తను పడేస్తున్నారు, సుమారు 3000 జనాభా ఉన్న ఈ గ్రామానికి చెత్తను తరలించేందుకు సెజ్‌లో సెయింట్ గోబెన్ కంపెనీ ఆటోను కూడా అందించింది, డ్రైవర్ తో పాటుగా ఇద్దరూ క్లాప్ మిత్రాలు ఉన్నారు, సర్పంచి లాలం రమణమూర్తి మృతితో చెక్ పవర్ అధికారం ఉపసర్పంచ్ కి ఇవ్వకపోవడంతో గత ఏడాది మే నెల నుంచి క్లాప్ మిత్రాలు, డ్రైవర్ కు జీతాలు చెల్లించలేదు, దీంతో వారు గ్రామంలో చెత్తను సంపద కేంద్రానికి తరలించకుండా ఉప్పరిగడ్డ, వాగులు, రహదారుల పక్కన పడేస్తున్నారు, ఈ విషయమై పంచాయతీ కార్యదర్శి సంతోష్ వద్ద ప్రస్తావించగా క్లాప్ మిత్రులకు జీతాలు చెల్లించకపోవడం వాస్తవమేనని చెప్పారు, ఇటీవల ఉపసర్పంచిగా ఎన్నికైన సభ్యురాలకి చెక్ పవర్ అధికారం ఇచ్చారని త్వరలో వారి జీతాలు చెల్లించి సంపద కేంద్రానికి చెత్తను తరలించేలా చర్యలు తీసుకుంటామన్నారు.

## మా పూర్వీకుల నుండి పూజిస్తున్న గ్రామదేవతల విగ్రహాలను కూల్చకండి

(నక్కపల్లి / ఫిబ్రవరి 12 ప్రభాతవార్త



పరిశ్రమల కారణంగా మా గ్రామానికి అవసరమైన అమ్మవార్ల దేవాలయాలు, స్మశాన వాటిక, మరుగుదొడ్లు తొలగించే సందర్భంలో వేరే చోట వాటి నిర్మాణాలకు స్థలం కేటాయించాలని కోరుతూ మాజీ ఎంపీటీసీ గింజల వెంకటరమణ ఆధ్వర్యంలో గురువారం మత్స్యకార సహకార సంఘ అధ్యక్షులు గంటిపల్లి చినకాసులు, పలువురు మత్స్యకారులు తాసిల్దార్ కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ డియల్ పురం మత్స్యకార కాలనీ నివాసముంటున్న సుమారు 1000 మంది నివసిస్తున్నారని. పూర్వీకులు నుండి గ్రామ దేవతలు నూకాలతల్లి. కనకమాలక్ష్మి తల్లి బంగారమ్మ.సత్తెమ్మ తల్లి. అమ్మవారు భూశక్తి అమ్మవారు జగన్నాథ స్వామి దేవతలవిగ్రహం లకు గ్రామస్తులు పూజలు నిర్వహించుకుంటున్నారు. వీటిని ఏపీ 11సి అధికారులు తొలగించుటకు ప్రయత్నిస్తున్నారని. దయచేసి వీటిని తొలగిస్తే వేరే ప్రదేశంలో వీటిని ఏర్పాటు చేసి అప్పుడు తొలగించాలని గ్రామస్తులు నాయకులు కోరుచున్నామన్నారు.

## అధిక పిల్లల్ని తరలిస్తున్న ఆటోపై కేసు నమోదు పోలీసులు..

ఎలమంచిలి ఫిబ్రవరి 12 ప్రభాతవార్త

వార్త ప్రభావం

వార్తకు స్పందనగా జిల్లా ఎస్పీ ఆదేశాలతో సర్కిల్ ఇన్స్పెక్టర్ ధనుంజయ్ రావు పర్యవేక్షణలో మున్సిపాలిటీ పరిధిలోని పట్టణ పోలీసులు వాహనాలు తనిఖీలు నిర్వహిస్తున్న సమయంలో ఆటోలో అధిక సంఖ్యలో స్కూలు పిల్లలను ఎక్కించుకొని అతివేగంగా నడుపుతున్న డ్రైవర్ను అదుపులోకి తీసుకుని., ఆటో డ్రైవర్‌కు అధిక సంఖ్యలో పిల్లలను ఎక్కించుకునే వేగంగా డ్రైవింగ్ చేయడం చట్ట విరుద్ధమని ఆటో డ్రైవర్ కు తెలియజేసి వాహనంపై కేసు నమోదు చేసినట్లు పట్టణ ఎస్సై సావిత్రి తెలిపారు. పట్టణ పోలీసులు ప్రజలకు విజ్ఞప్తి చేస్తూ చిన్నారుల భద్రత దృష్టిలో ఉంచుకొని వాహనాల్లో ప్రయాణికులను ఎక్కించకూడదని ట్రాఫిక్ నియమాలు తప్పిన సరిగా పాటించాలని కోరారు.

## మరిడిమాంబ అమ్మవారిని దర్శించుకున్న బుద్ద



అనకాపల్లి పిబ్రవరి8 (ప్రభాతవార్త)

స్తానిక విజయరామరాజుపేట మరిడిమాంబ జాతర మహోత్సవ సందర్భంగా గురువారం అమ్మవారిని ద మాజీ శాసన మండల సభ్యులు బుద్ధ నాగ జగదీశ్వరరావు తెలుగుదేశం పార్టీ నాయకులతో కలిసి వెళ్లి దర్శించుకున్నారు. మరిడిమాంబ కమిటీ సభ్యులు సాదరంగా ఆహ్వానించి అమ్మవారికి పూజలు నిర్వహించి అనంతరం మండపంలో నాగ జగదీష్ ను శాలువాతో సత్కరించి తెలుగుదేశం నాయకులకు కూడా కండువాలతో సత్కరించారు. ఈ సందర్భంగా భక్తులకు ప్రసాదాన్ని నాగ జగదీష్ చేతుల మీదుగా పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు బోడి వెంకటరావు కాంద్రేగుల సత్యనారాయణ, బొబ్బిలి సురేష్ ,కొయిలాడ గణేష్ పాల్గొన్నారు.

## పాడేరులో దేశవ్యాప్త సమ్మెతో కదం తొక్కిన కార్మికులు:పాడేరులో కార్మికులు భారీ ర్యాలీ


పాడేరు,ఫిబ్రవరి12,ప్రభాతవార్త



దేశ వ్యాప్త సార్వత్రిక సమ్మెలో భాగంగా అల్లూరి జిల్లా కేంద్రం పాడేరు పట్టణం సాయిబాబా గుడి నుంచి, మెయిన్ రోడ్డు అంబేద్కర్ సెంటర్ మీదుగా స్థానిక ఐటిడిఏ వరకు ర్యాలీ కొనసాగింది, అక్కడ ఐటీడీఏ గేట్ ముందుగ సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి, లింగేరి సుందర్రావు అధ్యక్షతన జరిగిన సభలో, సిఐటియు జిల్లా అధ్యక్షులు, బోనంగి చిన్నయ్య పడాల్, దేశంలో 40 కోట్ల మంది కార్మికులు ఉద్యోగులు కేంద్ర రాష్ట్ర అనుబంధ సంఘాల కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్ వర్కర్లు, బ్యాంకింగ్ ఎల్ఐసి రవాణా రంగాలకు చెందిన వారందరూ 4 లేబర్ కోడ్స్ రద్దు చేయాలని ఒకే నినాదంతో ముక్తకంఠంతో రోడ్ల మీదకు వచ్చి నినదిస్తున్న కనీసం దేశంలో పరిపాలి స్తున్న నరేంద్ర మోడీ కార్పొరేట్లకే కొమ్ముకాస్తున్నారు తప్ప ఈ దేశ కార్మిక వర్గం ఉద్యోగం ప్రజలకి ఏ మాత్రం చేయలేదని మండిపడ్డారు, కార్మిక వర్గం ఉద్యోగుల సహనాన్ని పరీక్షించవద్దని ప్రపంచ దేశాలు, బంగ్లాదేశ్, శ్రీలంక, దేశాలలో ఆ దేశ నాయకులు ఆ దేశ ప్రజల చేత ఏం చేయబడ్డారో మనం చూసామని కార్మికులకు అనుగుదొక్కే ప్రక్రియ విడనాడాల ని లేదంటే ప్రజల తిరుగుబాటు ఖాయమని అదే మన దేశానికి వర్తిస్తుందని అన్నారు. సమ్మెకు మద్దతు ఇచ్చిన గిరిజన సంఘం అఖిలభారత కమిటీ సభ్యులు, పి అప్పల నరస మాట్లాడుతూ, దేశంలో నరేంద్ర మోడీ 12 సంవత్సరాలు అధికారంలో ఉండి ఈ దేశ ప్రజలకు చేసిందేమీ లేదని ఉన్న చట్టాలు తీయడం తప్ప కొత్త చట్టాలు ప్రజలకు ఉపయోగపడేవి చేయలేదని మండిపడ్డారు.ఏఐటీయూసీ జిల్లా కన్వీనర్ అమర్, గిరిజన సమైక్య జిల్లా కార్యదర్శి రాధాకృష్ణ, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా పాడేరు మెయిన్ బ్రాంచ్ కోటేశ్వరరావు రఘు రమణ, ఏపీటీఎఫ్ వైఎస్ఆర్ జిల్లా అధ్యక్షుడు ఆర్ జగన్ మోహన్‌రావు శ్యామ్, కోశాధికారి చిన్నారి,అంబికా, వసంత కుమారి,బాగ్యా,దునిత,దేవి,విజయ,ఆశా కార్యకర్తల జిల్లా అధ్యక్షులు రేణుక,నాగరత్నం, మత్య కొండమ్మ, భవాని,దేవి,కాసులమ్మ,కాంతమ్మ,.మధ్యాన భోజన పథకం జిల్లా కార్యదర్శి సోందేవి,శాంత కుమారి, నవ్య,కుమారి,మెడికల్ శానిటేషన్ జిల్లా అధ్యక్షులు ముత్యాలమ్మ, రత్నాలమ్మ, సుజాత,భూషణ్, చిట్టిబాబు, ప్రసాద్,స్కూల్ శానిటేషన్ కార్మికులు,దేవి, వరాలక్ష్మి,పంచాయితీ వసంత్,అర్జున్, ముఠా వర్కర్స్ సూరిబాబు, కొండబాబు,ఉపాధి హామీ పథకం కొర్ర.శంకరరావు,సింహాచలం, వెలుగు వివో ఏలు పాల్గొన్నారు.

## ఆటో డ్రైవర్లు ఆటోలో పరిమితికి మించి ప్రయాణికులను, విద్యార్థులను ఎక్కించుకోరాదు: సర్కిల్ ఇన్స్పెక్టర్ ధనుంజయ రావు

ఎలమంచిలి, ఫిబ్రవరి 12, ప్రభాతవార్త




పట్టణంలోని నూకాంబిక అమ్మవారి ఆలయ ప్రాంగణంలో ఆటో యూనియన్ నాయకులు డ్రైవర్లతో సర్కిల్ ఇన్స్పెక్టర్ ధనుంజయ రావు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సర్కిల్ ఇన్స్పెక్టర్ ధనుంజయరావు మాట్లాడుతూ ఆటో డ్రైవర్లు కచ్చితంగా భద్రత నియమాలు పాటించాలని స్కూలు పిల్లలను పరిమితికి మించి ఎక్కించుకోరాదని, నీ మనిబంధనలను తప్పకుండా పాటించాలని అట్లా పాటించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ ఎస్ఐ రామకృష్ణ ,పట్టణ ఎస్సై సావిత్రి, సిబ్బంది, ఆటో యూనియన్ నాయకులు డ్రైవర్లు సిబ్బంది

## గుత్తులపుట్టులో అర్హత లేని ఆర్.ఎం.పి క్లినిక్ సీజ్: జాయింట్ కలెక్టర్ తిరుమణి శ్రీ పూజ తనిఖీ

### అర్హత లేని వ్యక్తుల వద్ద చికిత్స పొంది ప్రాణాల మీదకు తెచ్చుకోవద్దు ..పి.ఓ మరియు జాయింట్ కలెక్టర్ తిరుమణి శ్రీపూజ

పాడేరు,ఫిబ్రవరి12, ప్రభాతవార్త:



పాడేరు మండలం గూటులపుట్టు గ్రామంలో నిబంధనలకు విరుద్ధంగా నడుస్తున్న ఒక ఆర్.ఎం.పి క్లినిక్‌ను పి.ఓ మరియు జాయింట్ కలెక్టర్ తిరుమణి శ్రీపూజ గురువారం తనిఖీ చేశారు. ఈ తనిఖీలో భాగంగా క్లినిక్‌లోని మందులు, రిజిస్ట్రేషన్ పత్రాలు, వైద్యుని అర్హతలను అధికారులు క్షుణ్ణంగా పరిశీలించారు. కనీస వైద్య అర్హతలు లేకుండా, చెల్లుబాటు అయ్యే లైసెన్స్ లేకుండా రోగులకు చికిత్స అందిస్తున్నట్లు తనిఖీలో తేలింది. ప్రజల ఆరోగ్యంతో చెలగాట మాడుతున్న ఇలాంటి నకిలీ క్లినిక్‌లపై కఠిన చర్యలు తీసుకోవాలని జాయింట్ కలెక్టర్ ఆదేశించారు. ఈ మేరకు సదరు క్లినిక్‌ను తక్షణమే సీజ్ చేసి, నిర్వాహకులపై చట్టపరమైన చర్యలు తీసుకున్నట్లు అధికారులు వెల్లడించారు. అర్హత లేని వ్యక్తుల వద్ద చికిత్స పొంది ప్రాణాల మీదకు తెచ్చుకోవద్దని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఈ సందర్భంగా అధికారులు సూచించారు.

## అల్లూరి జిల్లా కలెక్టరేట్ వద్ద భారీ నిరసన



పాడేరు,ఫిబ్రవరి12,ప్రభాతవార్త:

జాతీయ సార్వత్రిక సమ్మెకు సంఘీభావం తెలిపిన అల్లూరి సీతారామరాజు జిల్ల ఆంధ్రప్రదేశ్ నాన్-గెజిటెడ్ మరియు గెజిటెడ్ అధికారుల సంఘం అసోసియేషన్ జిల్లా కలెక్టరేట్ వద్ద భారీ నిరసన అఖిలభారత రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల సమాఖ్య పిలుపు మేరకు, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఏపీ ఎన్జీ జీవో అసోసియేషన్ అధ్యక్షులు ఆలపాటి విద్యాసాగర్, డి.వి. రమణ ప్రధాన కార్యదర్శి ఆదేశాల మేరకు గురువారం ఏపీఎన్జీ జీవో అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు, లకే బొంజయ్య వారి నేతృత్వం అల్లూరి సీతారామరాజు జిల్లా ఏపీఎన్జీ జీవో అసోసియేషన్ కార్యవర్గము మరియు సభ్యులు అందరూ కలిసి జాతీయ సార్వత్రిక సమ్మెకు సంఘీభావం తెలపడం జరిగింది. మధ్యాహ్నం 1.00 గంట నుండి 2.00 గంటల వరకు అల్లూరి సీతారామరాజు జిల్లా కలెక్టరేట్ కార్యాలయం ఎదుట సంఘీభావంగా మధ్యాహ్నం భోజన విరామ సమయపు నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎల్ ఆర్ బి పాత్రుడు, ఏపీఎన్జీ జీవో అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అమలులోకి తెచ్చినటువంటి కార్మిక వ్యతిరేక చట్టాలను రద్దు చేయాలని, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు వేతన సవరణ అమలు చేయుటకై పిఆర్సి కమిటీని ఈ శాసన సభ సమావేశాలలోనే ఏర్పాటు చేయాలని, పెండింగ్ డి ఎ బకాయిలను విడుదల చేయాలని, కాంట్రాక్ట్ ఉద్యోగులకు క్రమబద్ధీకరణ చేయుటకు చర్యలు తీసుకోవాలని, పెన్షనర్లకు అదనపు క్వాంటం అమలు చేయాలని, పబ్లిక్ సెక్టర్ యూనిట్లకు మరియు సొసైటీల ఉద్యోగులకు 62 సంవత్సరాలకు పదవి విరమణ అమలు చేయాలని, సిపిఎస్ ఉద్యోగుల కోసం చేసినటువంటి మెమో 57 ను తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేశారు. అల్లూరి సీతారామరాజు జిల్లా అసోసియేట్ అధ్యక్షులు గుల్లేలి సింహాద్రి, కృపారావు, జిల్లా ఉపాధ్యక్షులు, చిట్టి బాబు జిల్లా ఉపాధ్యక్షులు సుబ్రహ్మణ్యం జిల్లా కోశాధికారి,కె. సుబ్రహ్మణ్యం పాడేరు సిటీ యూనిట్ అధ్యక్షులు కుందూరు సురేష్ కుమార్ జిల్లా సహకార్యదర్శి కే రామకృష్ణ సిటీ యూనిట్ ఉపాధ్యక్షులు, వంతల శ్రీను రాష్ట్ర ఈసీ మెంబర్, జిల్లా కలెక్టర్ కార్యాలయం ప్రాంగణంలో ఉద్యోగులు, సంఘ సభ్యులు, పలువురు సీనియర్ కామ్రేడ్స్ పాల్గొన్నారు.

## పాడేరు గురుకుల పాఠశాలను ఆకస్మికతనికి చేసిన డిప్యూటీ సెక్రటరీ ఎన్జి ఎన్ జీ కిషోరీబాయి

### మెనూ పరకారమే విద్యార్థులకు నాణ్యమైన భోజన అందించాలి..గురుకుల డిప్యూటీ సెక్రెటరీ డాక్టర్ ఎన్ జి కిశోరీబాయి

పాడేరు,ఫిబ్రవరి12,ప్రభాతవార్త:



అల్లూరి జిల్లా పాడేరులో ఉన్న గురుకుల బాలికల పాఠశాలను డిప్యూటీ సెక్రటరీ డాక్టర్ ఎన్ జీ కిశోరీబాయి ఆకస్మిక తనిఖీ చేశారు. 10 వ తరగతి విద్యార్థులకు జరుగుతున్న 100 రోజుల కార్యచరణ ప్రణాళిక గురించి అడిగి తెలుసుకున్నారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులు బాగా చదివి పాఠశాలకు, తల్లిదండ్రులకు మంచిపేరు తీసుకురావాలన్నారు. ఇంటర్మీడియట్ కాలేజీను కూడా సందర్శించి 2025 పబ్లిక్ పరీక్షల నేపధ్యంలో విద్యార్థులను ఉద్దేశించి, తగిన సూచనలు ఇచ్చి పరీక్షలు బాగా రాయాలన్నారు.జరుగుతున్న కార్యక్రమాలను సరిగ్గా నిర్వహించాలని ఉపాధ్యాయులకు సూచనలిచ్చారు. ఆ తరువాత ఏకలవ్య రెసిజెన్షియల్ మోడల్ పాఠశాలను సందర్శించి విద్యార్థ్యాలను తగిన సూచనలు ఇచ్చారు. మేగా డిఎస్సీ 2025 ద్వారా నూతనంగా విధుల్లో చేరిన ఉపాధ్యాయులును అభినందించారు. అలాగే వంటగదులను పరిశీలించి స్టోర్ రూమ్‌లో స్టాక్‌ను చూస్తారు. విద్యార్థులకు మెనూపకరం భోజనాలు అందించాలని సూచించారు. ఈ కార్యక్రమం గురుకులం సెల్ సూపరింటెంట్ భవానీ కన్వీనర్ ప్రిన్సిపాల్ పి ఎస్ ఎన్ మ్షరీర్తి ఉపాధ్యాయ బృందం తదితరులు పాల్గొన్నారు.

## నేడు జోన్ 2 డివిజన్లో విద్యుత్ అంతరాయం

విశాఖపట్నం, ఫిబ్రవరి 12 ప్రభాతవార్త

జోన్ 2 డివిజన్ లో చెట్లు కొట్టే కార్యక్రమం ఉండడంతో పలు ప్రాంతాల్లో విద్యుత్తుకు అంతరాయం కలుగుతుందని జోన్ 2 ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ బి.కె నాయుడు తెలిపారు. గ్రీన్ సిటీ ఫిట్టర్ 33/11 కె.వి ఎఫ్ బ్లాక్ వద్ద చెట్లు ఏపుగా పెరిగిపోవడంతో వాటిని తొలగించే కార్యక్రమం చేపడుతున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా ఉడా ఫేస్ 2,5,7, ఫకీర్ తకియ ఏరియా, అల్ట్రా వాష్ హెచ్బి, వార్తా పబ్లికేషన్స్ ప్రాంతంలో విద్యుత్ కు అంతరాయం కలుగుతుందని చెప్పారు.

## ఏపీపీఎస్ హెచ్ఎం అసోసియేషన్ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడిగా రాజేశ్వరరావు

అనకాపల్లి పిబ్రవరి8 (ప్రభాత వార్త)



ఏపీపీఎస్ హెచ్ఎం అసోసియేషన్ రాష్ట్ర కమిటీ సమావేశం గురువారం జరిగింది. కమిటీ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులుగా అనకాపల్లి జిల్లాకు చెందిన రాజేశ్వరరావుని ఏకగ్రీవంగా నామినేట్ చేస్తూ ఎన్ను కోవడం జరిగింది. ఈ విషయాన్ని రాష్ట్రంలోని పిఎస్ హెచ్ఎంలు అందరికీ సమాచారం పంపారు. రాజే శ్వరరావు అనకాపల్లి జిల్లాలో ఏపీపీఎస్ హెచ్ఎం అసోసియేషన్‌ను బలోపేతం చేయాలని, రాష్ట్రంలోని పిఎస్ హెచ్ఎంల సమస్యల పరిష్కారం కోసం పోరాటం లో భాగమవుతారని ఆశిస్తున్నట్లు ఏపీపీఎస్ హెచ్ఎం అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు సివి ప్రసాద్ అభిప్రాయపడ్డారు.

## ప్రతీ రైతుకు ఒక యూనిక్ ఐడీ వ్యవసాయశాఖ ఏడీఏ టి.శ్రీదేవి



నర్సీపట్నం,ఫిబ్రవరి 12,ప్రభాతవార్త

ప్రతీ రైతుకు ఒక యూనిక్ ఐడీని ప్రభుత్వం అందించనుందని, దీని కోసం రైతులు విధిగా నమోదు చేసుకోవాలని వ్యవసాయశాఖ ఏడీఏ టీ.శ్రీదేవి అన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ యూనిక్ ఐడీ ఆధారంగానే రైతులకు ప్రభుత్వ పథకాలు మంజూరు చేస్తారన్నారు. రైతులకు ఏఏ ప్రాంతాల్లో ఎన్ని సర్వే నంబర్లలో భూములు ఉన్నా అన్నింటికీ ఒకే విశిష్ట సంఖ్యను కేటాయించనున్నారని చెప్పారు. రైతు సేవా కేంద్రాల్లో గ్రామ వ్యవసాయ సహాయకులు ఈ నమోదు కార్యక్రమాన్ని చేస్తున్నారన్నారు. సాగు భూమి ఉన్న ప్రతీ రైతు వివరాలు నమోదు చేసి 11 అంకెల విశిష్ట సంఖ్యను కేటాయిస్తున్నారని చెప్పారు. రైతులే స్వయంగా క్యూ ఆర్ కోడ్ ద్వారా కూడా స్కాన్ చేసి ఆధార్ నెబరు సాయంతో నమోదు చేసుకోవచ్చన్నారు. పీఎం కిసాన్తో పాటు బ్యాంకు రుణాలు పొందేందుకు ఈ నంబరు తప్పనిసరి చేయనున్నారని, పంట ఉత్పత్తుల క్రయవిక్రయాలు, రాయితీ, భీమా వర్తింపనకు కూడా ఈ సంఖ్యనే ప్రామాణికంగా తీసుకుంటారన్నారు.

## యుటిఎఫ్ పోస్ట్ కార్డు క్యాంపెయిన్

దుంబ్రిగుడ:: ఫిబ్రవరి:( ప్రభాతవార్త)



ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ రాష్ట్ర సంఘం పిలుపుమేరకు స్థానిక మండల యుటిఎఫ్ మండల శాఖ ఆధ్వర్యంలో గురువారం ఉద్యోగ, ఉపాధ్యాయుల సమక్షంలో పోస్ట్ కార్డు క్యాంపెయిన్ నిర్వహించారు. జిల్లా కార్యదర్శి ఎస్.కన్నయ్య ,మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎస్. బాలకృష్ణ, కే. రాజారావు లు సంయుక్తంగా మాట్లాడుతూ ప్రభుత్వం ఇప్పటివరకు ఉద్యోగ ఉపాధ్యాయుల పట్ల మొండి వైఖరితో ఆర్థిక బకాయిలను ఇవ్వడం లేదన్నారు. సమయం గడిచిపోయిన పిఆర్ సి కమిషన్ చైర్మన్ వేయడం లేదనివారు విమర్శించారు. సిపిఎస్ రద్దుచేసి, ఓ పి ఎస్ ని అమలు చేయడం లేదని, ఐ ఆర్ 29శాతం ప్రకటించ కుండా ఉద్యోగులు పెన్షనర్లకు బకాయిల చెల్లింపుకు రూట్ మ్యాప్ ప్రకటించడం లేదని చెప్పారు. తక్షణమే ప్రభుత్వం స్పందించి సమస్యలను పరిష్కరించకపోతే రాష్ట్ర సంఘం పిలుపుమేరకు ఆర్థిక బకాయిలు తీర్చేంతవరకు పోరాటం కొనసాగిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి మేఘనాథరాజు, రమేష్, ఎస్ లవకుశ, టి రాజ్ కుమార్ కార్యకర్తలు పాల్గొన్నారు.

## అక్షరాంధ్ర కేంద్రాలను సద్వినియోగం చేసుకోండి.. వేలిముద్రలకు స్వస్తి చెప్పండి

హుకుంపేట, ఫిబ్రవరి 12,ప్రభాత వార్త

నిరక్షరాస్యులుఅక్షరాస్యులుగా మారితే వారి జీవితంలో కొత్త వెలుగు వస్తుందని స్వర్ణ గ్రామ-స్వర్ణ వార్డు శాఖ జిల్లా నోడల్ అధికారి పి.యస్. కుమార్ అన్నారు. గురువారం రాత్రి హుకుంపేట మండలం లోని కొంతిలి గ్రామములో అక్షరాంధ్ర కేంధ్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. అక్షరాలు నేర్చుకుంటున్న మహిళలతో మాట్లాడారు.వారి అభ్యాసనా సామర్థ్యాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గిరిజన ప్రాంతంలో నిరక్షరాస్యత శాతం అధికంగా ఉందని వాటి నిర్మూలన కోసం ప్రభుత్వం బృహత్న కార్యక్రమాలు చేపడుతుందని వాటిలో భాగంగా అక్షరాంధ్ర కేంద్రాలను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. రోజంతా తమ పనులను చేసుకుంటూ రాత్రి వేళలో మహిళలు అక్షరాంధ్ర కేంద్రాలకు మహిళలందరూ వెళ్లి వాలంటీర్ ద్వారా అక్షరాలు నేర్చుకోవాలని కోరారు.అలాగే మహిళలుచదువుకొని వేలిముద్రలను విడిచిపెట్టాలని సూచించారు. అల్లూరి జిల్లా పరిధిలో ఎంపిక చేసిన 10 మండలాలలో సుమారు 85వేల మంది నిరక్ష్యరాస్యులను గుర్తించి, ప్రతీ 10 మందికి ఒక వాలంటీర్ ను జిల్లా కలెక్టర్ కేటాయించారని తెలియచేసారు. కావున గ్రామంలో ఉన్న మహిళలందరూ కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

## రామతీర్థంలో శివరాత్రి ఏర్పాట్లను పరిశీలించిన జిల్లా కలెక్టర్

### భక్తులకు ఇబ్బందులు కలగకుండా చూడాలని ఆదేశం



నెల్లిమర్ల, ఫిబ్రవరి 12, ప్రభాత వార్త

ప్రసిద్ధ పుణ్యక్షేత్రం రామతీర్థం శ్రీ సీతారామ స్వామి దేవస్థానంలో మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా జరుగుతున్న జాతర ఏర్పాట్లను జిల్లా కలెక్టర్ ఎస్. రాంసుందర్ రెడ్డి గురువారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణాన్ని, భక్తుల క్యూ లైన్లను పర్యవేక్షించిన ఆయన, అధికారులకు పలు కీలక సూచనలు చేశారు. ?శివరాత్రి నాడు ఆలయానికి పోటెత్తే సామాన్య భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ స్పష్టం చేశారు. తాగునీరు, నీడ, పారిశుధ్యం, పార్కింగ్, భద్రతా పరమైన అంశాల్లో ఎక్కడా రాజీ పడకూడదని అధికారులను ఆదేశించారు. శివాలయాన్ని కూడా సందర్శించి క్యూలైన్లను పరిశీలించారు. వేడుకలు ప్రశాంతంగా జరిగేలా అన్ని విభాగాల సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ దిశానిర్దేశం చేశారు. సందర్భంగా శ్రీ సీతారామస్వామి వారిని దర్శించుకొని పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ వెంట ఆర్డీవో డి. కీర్తి, దేవాదాయ శాఖ సహాయ కమిషనర్ శిరీష, ఆలయ ఈవో వై. శ్రీనివాసరావు, తహశీల్దార్ కె. శ్రీకాంత్, ఎంపీడీఓ కె.రామకృష్ణరాజు, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

### జాతీయ సమ్మె సందర్భంగా రామభద్రపురం ఆర్టీసీ కాంప్లెక్స్ నుంచి గాంధీ బొమ్మ వరకు భారీ ప్రదర్శన మరియు మానవహారం

## సిఐటియు జిల్లా నాయకులు



రామభద్రపురం, ఫిబ్రవరి 12, ప్రభాత వార్త

బలస .శ్రీను సిపిఐ జిల్లా సెక్రెటరీ ఒమ్మి. రమణ సహాయ కార్యదర్శి అలమండ. ఆనంద్, రైతు సంఘం జిల్లా నాయకులు లంక.ఈశ్వరరావు, వ్యవసాయ సంఘం జిల్లా నాయకులు ఎర్రం నాయుడు మాట్లాడుతూ కేంద్రంలో బిజెపి ప్రభుత్వం నాలుగు లేబర్ కోడ్స్ అమలు చేసి కార్మిక వర్గానికి తీవ్రమైన ద్రోహం చేస్తుందని అన్నారు. మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని రద్దుచేసి గ్రామాల్లో ఉపాధి దెబ్బతీసిందని అన్ని రకాల పద్ధతులకు నిరోధకాలు ఇచ్చి అమెరికాతో చేసుకున్న ట్రేడ్ డీల్ వలన దేశంలో రైతాంగం తీవ్రంగా నష్టపోతుందని అన్నారు. రష్యాతో ఒక బ్యారెల్ ఆయిల్ ధర 50 డాలర్లు కొంటె అమెరికాతో జరిగిన ట్రేడ్ డీల్ లో 66 డాలర్లకు ఒప్పందం వలన సంవత్సరానికి అదనంగా 72 వేల కోట్లకు పైగా భారత ఆర్థిక వ్యవస్థ మీద పడుతుందని అన్నారు. అంగన్వాడి, ఆశ, ఎం డి ఎం, గ్రీన్ అంబాసిడర్స్, తోపుడుబండ్లు, బల్ల రిక్షా వారు ,ఉపాధి కూలీలు, హమాలి, ఆటో కార్మికులు ,పంచాయతీ కార్మికులు అంగన్వాడి నుంచి రాధా, కళావతి, పండు. లక్ష్మి. ఆశల నుంచి డి. పోలమ్మ, గర్భాపు .కుమారి ,చిట్టి మధ్యాహ్న భోజనం వాళ్లు ఊళ్ళ. చిన్నమ్మలు ఆటో యూనియన్ ప్రెసిడెంట్ బి. సోములు, ఫీల్డ్ అసిస్టెంట్ యూనియన్ ప్రెసిడెంట్ గోపి ,వ్యవసాయ కార్మిక సంఘం నుండి ఎర్రం నాయుడు, ఈశ్వరరావు, ధర్మారావు, పంచాయతీ యూనియన్ ప్రెసిడెంట్ భవాని, వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

## ఆర్థిక బకాయిలు సాధనకై ఈ నెల 17 న చలో విజయవాడకార్యక్రమం ను విజయవంతం చేయండి



రామభద్రపురం, ఫిబ్రవరి 12, ప్రభాత వార్త

భోజన విరామ సమయంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, బుసాయవలసలో ఖుషీ రాష్ట్ర, జిల్లా శాఖల పిలుపుమేరకు పిఆర్సి కమిషన్ చైర్మన్ వెంటనే నియమించాలని, 29% × = ను ప్రకటించాలని, సిపిఎస్ రద్దు చేయాలని, హెల్త్ కార్డులు మెడికల్ బిల్లుల సమస్యలు పరిష్కరించి రానున్న బడ్జెట్ సమావేశాలలో ఈ సమస్యల పరిష్కారానికి అవసరమైన చర్యలు రాష్ట్ర ప్రభుత్వం చేపట్టాలని కోరుతూ గౌరవ ముఖ్యమంత్రి కి పోస్ట్ కార్డు క్యాంపెయిన్ చేయడం జరుగుతుందని అదే విధంగా పై సమస్యలు సాధనకై ఈ నెల 17న చలో విజయవాడ కార్యక్రమాన్ని విజయవంతం చేయ వలసిందిగా యుటియఫ్ జిల్లా సహాధ్యక్షులు ప్రసన్న కుమార్ కోరారు . ఈ కార్యక్రమం లో పాఠశాల ప్రధానోపాధ్యాయులు జు.. ప్రసాద రావు పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## కేంద్రంలో బిజెపి ప్రభుత్వం 4 లేబర్ కోడ్స్ వల్ల తీవ్ర అన్యాయం



బొబ్బిలి ఫిబ్రవరి 12 ప్రభాతవార్త

జాతీయ సమ్మె సందర్భంగా కార్మిక రైతు సంఘాలు భారీ ప్రదర్శన నిర్వహించారు. దేశవ్యాప్తంగా బిజెపి ప్రభుత్వం లేబర్ కోడ్స్ అమలు చేసి కార్మి వర్గానికి తీవ్ర విఘాతం కలిగించారని సిఐటియు నాయకులు పి శంకర్రావు ఐఎఫ్టియు జిల్లా నాయకులు జనరల్ సెక్రటరీ ఎం శ్రీనివాస్ రైతు కూలీ సంఘం రాష్ట్ర కార్యదర్శి డి వర్మ బ్యాంక్ ఫెడరేషన్ సంఘ నాయకులు జె చంద్రశేఖర్ అంగన్వాడి ప్రాజెక్టు అధ్యక్షురాలు బి నిర్మల జే కామేశ్వరి ఫీల్డ్ అసిస్టెంట్ ఫీల్డ్ అసిస్టెంట్లు సంఘం నాయకులు తిరుపతిరావు మాట్లాడుతూ మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని రద్దుచేసి గ్రామాల్లో ఉపాధికి దెబ్బతీసిందని అన్ని రకాల పద్ధతులకు నిరోధకాలుగా ఇచ్చి అమెరికా చేస్తున్న ట్రేడ్ డీల్ వలన దేశంలో రైతాంగం తీవ్రంగా నష్టపోయిందన్నారు. రష్యాతో ఒక బ్యారెల్ ఆయిల్ రేట్ లో 66 డాలర్లకు ఒప్పందం వలన సంవత్సరానికి అదనంగా 72 వేల కోట్లకు పైగా భారత ఆర్థిక వ్యవస్థ మా మీద పడుతుందని అన్నారు. నిత్యావసర నిత్యవసర వస్తువు ధరలు మరింత పెరిగే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. అమెరికా తో చేసుకున్న ఒప్పందం భారతదేశ ప్రధానికున్ని ముంచేస్తుందని అన్నారు. విద్యుత్ చట్టం ద్వారా దేశంలో విద్యుత్ రంగాన్ని ఆదానికి అమ్మేస్తున్నారన్నారు. ఈ ప్రభుత్వానికి రైతు సంఘాలు కార్మిక సంఘాలు బుద్ధి చెప్పే పరిస్థితి ఏర్పడిందన్నారు. కార్మిక అన్ని యూనియన్లు కలిసి వేణుగోపాలస్వామి సెంటర్ నుంచి మహా ప్రదర్శన బర్లిపేట రోడ్డు మీదుగా ఎన్టీఆర్ బొమ్మ సెంటర్ వద్ద మానవహారం జరిగిందన్నారు. అంగన్వాడి ఆశ ఎండిఎం కళాశాల తోపుడు బండ్లు మున్సిపల్ బ్యాంక్ ఎంప్లాయిస్ పెన్షనర్స్ కార్మిక సంఘాల నాయకులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## పదో తరగతి పరీక్ష కేంద్రాలు పరిశీలన



తెర్లాం ఫిబ్రవరి 12(ప్రభాత వార్త)

గురువారం మండలంలో గల 10వ తరగతి పబ్లిక్ పరీక్షల నిర్వహణ కేంద్రాలను పరీక్ష కేంద్రాల పరిశీలన కమిటీ సభ్యులు పరిశీలించడం జరిగినది ఈ కమిటీ లో బి.హేమంత్ కుమార్, మండల అభివృద్ధి అధికారి డి.వి.రమణ, మండల పోలీస్ స్టేషన్ అధికారి బి.సాగర్ బాబు సభ్యులుగా పరీక్షా కేంద్రాలను పరిశీలించడం జరిగినది. ఈ మూడు పరీక్ష కేంద్రాలలో గల మౌలిక సదుపాయాలు, బెంచీల సౌకర్యాలు, విద్యుత్, ఫ్యాన్స్, ప్రహరీ గోడ, త్రాగునీటి సౌకర్యం, మరుగుదొడ్ల సౌకర్యం మొదలగు అంశాలను పరిశీలించి సదరు పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు తగు సూచనలు జారీ చేయడం జరిగినది. 10వ తరగతి పబ్లిక్ పరీక్షల నిర్వహణలో ఏ విధమైన అసౌకర్యాలు కలగకుండా తగు ముందస్తు జాగ్రత్తలు వహించి పరీక్షలు సజావుగా నిర్వహణ జరిగేందుకు తగు చర్యలు తీసుకోవాలని ఆదేశించినారు. జడ్పీహెచ్ స్కూల్ పెరుమాలి, జడ్పీహెచ్ స్కూల్ తెర్లాం నందు పరీక్షలు రాసేందుకు కొంత దూరం ఉన్న కొన్ని బెంచీలను ముందుగానే సమీప పాఠశాలల నుండి సేకరించి సమకూర్చుకోవాలని ఆదేశించినారు. మార్చిలో జరగబోవు 10వ తరగతి పరీక్షలలో ఏపీ మోడల్ స్కూల్ కేంద్రం నుండి 100 మంది ,జడ్పీహెచ్ స్కూల్ పెరుమాలి కేంద్రం నుండి 170 ,మంది అదే విధంగా జడ్పీహెచ్ స్కూల్ తెర్లాం యందు 260 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కాబోతున్నారు. కనుక విద్యార్థులకు ఏ విధమైన అసౌకర్యాలు జరగకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని కమిటీ సభ్యులు ఆదేశించినారు ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారి జె త్రినాథరావు ఆయా పరీక్షల కేంద్రాల ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

## బలిజిపేటలో కదము తొక్కిన కార్మికులు



బలిజిపేట ఫిబ్రవరి 12 ప్రభాతవార్త

బలిజిపేట మండలంలో గురువారం కదము తొక్కిన కార్మిక సంఘం నాలుగు లేబర్ కోడ్లు రద్దు చేయాలి. విత్తన చట్టం రద్దు చేసి పాత ఉపాధి హామీ చట్టం కొనసాగించాలి రైతులకు నష్టం చేసే విత్తన చట్టం రద్దు చేయాలని విద్యుత్ సంస్కరణలు రద్దు చేయాలని కేంద్ర బిజెపి ప్రభుత్వం తీసుకువచ్చిన కార్మిక, రైతు, ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ గురువారం దేశవ్యాప్త సమ్మెలో భాగంగా కార్మికులు పెద్ద ఎత్తున నిరసించారు. బలిజిపేట తాసిల్దార్ కార్యాలయం నుండి బజార్ గుండా ఆర్టీసీ బస్టాండ్ వరకు కొత్త లేబర్ కోడ్లను వ్యతిరేకిస్తూ పెద్ద ఎత్తున ప్రదర్శన చేపట్టారు. ఆర్టీసీ బస్టాండ్ దగ్గర మానవహారం చేపట్టారు. అనంతరం మండల కన్వీనర్ కే కన్వీనర్ యం లక్ష్మి అధ్యక్షత జరిగిన ర్యాలీ ముగింపు సభలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు రెడ్డి వేణు మాట్లాడుతూ నరేంద్ర మోడీ ప్రభుత్వం తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్లు కార్మికులను నష్టపరిచేవిగా, కార్పొరేట్లకు లాభం చేకూర్చే విధంగా ఉన్నాయని వెంటనే వాటిని రద్దు చేయాలని కార్మిక సంఘాలు డిమాండ్ చేస్తున్నాయని అన్నారు. కనీస వేతనం రూ. 26 వేలు చెల్లించాలని, కొత్త ఉపాధి చట్టం ( జి రామ్ జి ) రద్దు చేసి 200 రోజులు పని కల్పించాలి, రూ. 600 వేతనం ఇవ్వాలని, కౌలు రైతులను గుర్తించి అన్నదాత సుఖీభవ రూ. 20 వేలు, పంట బీమా ఇవ్వాలని, అన్ని పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలని, అంగన్వాడీ లకు బడ్జెట్లో నిధులు కేటాయించి కనీస వేతనం 26,000 ఇవ్వాలి, ఆశా, మిడ్డేమీల్ కి, 26000 ఇవ్వాలి బిల్డింగ్, రైస్ మిల్లు,ముఠా, ఆటో, మ్యాక్స్ క్యాబ్ మొ. అసంఘటిత రంగ కార్మికులకు పీఎఫ్, ఈఎస్ఐ, ఇన్సూరెన్స్ కూడిన సమగ్ర చట్టం చేయాలని, విద్యుత్, విత్తనాల సవరణ బిల్లులను, స్మార్ట్ మీటర్లను రద్దు చేయాలని, సీపీఎస్ రద్దు - పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని, ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వ వత్తాసు పలుకుతూ రాష్ట్ర ప్రజా హక్కులను కాలరాస్తున్నారని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో రైస్ మిల్ యూనియన్ అధ్యక్షులు పాల అప్పారావు,సురేంద్ర ఆటో వర్కర్స్ యూనియన్ హరి, మోహన్ అంగన్వాడి, ఇందిరా సాయి కృష్ణ బ్యాంక్ వర్కర్స్ యూనియన్ లక్ష్మి అండ్ కృష్ణవేణి మధ్యాహ్న భోజన యూనియన్, స్కూల్ స్వీపర్ యూనియన్, రాంబయమ్మ , శ్రీదేవి, భవాని, రైతు సంఘం నాయకులు గంట్యాడ బలరాం,వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు పిసా వెంకటస్వామి, సిపిఎం పార్టీ నాయకులు భానుమూర్తి,తిర్పాడు, సాంబమూర్తి కార్మికులు పాల్గొన్నారు.

## శ్రీ ఉమా రామలింగేశ్వర స్వామి ఆలయంలో శివరాత్రికి ఏర్పాట్లు

### అంపోలు శ్రీనివాసరావు ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలు - శివ్వాంలో మహా శివరాత్రికి ఏర్పాట్లు -శివరాత్రి సందర్భంగా సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు



గరుగుబిల్లి, ఫిబ్రవరి 12, ప్రభాతవార్త

మండల పరిధిలోని శివ్వాం గ్రామం పవిత్ర నాగావళి నది ఒడ్డున ఉన్న శ్రీఉమా రామలింగేశ్వర స్వామి ఆలయంలో మహాశివరాత్రి సందర్భంగా ఈనెల 15వ తేదీ నుంచి 17వ తేదీ వరకు శ్రీఉమా రామలింగేశ్వర స్వామి త్రిరాత్రి మహోత్సవములతో పాటు ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించ నున్నారు. ఈమేరకు 15వ తేదీన మహాశివరాత్రి పర్వదినం సందర్భం గా ఉదయం 5 గంటల నుండి ప్రాతః కాలార్చనలు, నిత్యార్చనలు, అభి షేకములు, పంచామృతాభిషేకాలు తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని ఆలయ ప్రధాన అర్చకులు అంపోలు శ్రీనివాసశర్మ, అంపోలు జగన్నాథశాస్త్రిలు తెలిపారు. అదే విధంగా అదే రోజు సాయంకాలం 5:45 నిమిషా లకు శ్రీఉమా రామలింగేశ్వర స్వామి వారి కళ్యాణ మహోత్సవమును అంగరంగ వైభవంగా నిర్వహించను న్నామ న్నారు. రాత్రి 9 గంటల నుండి లింగోద్భవ కాలంలో స్వామివారి లింగోద్భావ అభిషేకంలు కార్యక్రమం జరుగుతుందన్నారు. 16వ తేదీన ఉదయం నిత్యార్చనలు రుద్రాభిషేకములు పంచామృత, ఏక వారాభిషేకము లతో పాటు సాయం కాలం సహస్ర కలశ ఘటాభిషేకం కార్యక్రమమును నిర్వహించడం జరుగుతుందని ఆలయ అర్చకులు అంపోలు శ్రీనివాసశర్మ పేర్కొన్నారు. 17వ తేదీన ఉదయం కాలార్చనలు నిత్యార్చనలు, పీఠార్చనలు, నిత్యార్చనలు, అభిషేకంలు నిర్వహించడం జరుగుతుందన్నారు. మహా శివరాత్రి సందర్భంగా భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామి వారి తీర్థ ప్రసాదములు స్వీకరిం చాలని కోరారు. మహాశివరాత్రి సందర్భంగా సాంస్కృతిక కార్యక్ర మాలను ఏర్పాటు చేశామని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

## డి వార్మింగ్ డే కార్యక్రమానికి ఏర్పాట్లు

### వైద్యాధికారి డాక్టర్ ఎన్ఎంకె తిరుమలప్రసాద్17న డీ వార్మింగ్ డే కార్యక్రమం వైద్య సిబ్బందికి తగు సూచనలు సలహాలు అందజేత



గరుగుబిల్లి, ఫిబ్రవరి 12, ప్రభాతవార్త

మండల కేంద్రంలోని ప్రాథ మిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని ఆయా గ్రామాల్లో ఈ నెల 17వ తేదీన నిర్వహించనున్న డి వార్మింగ్ డే కార్యక్రమానికి ఏర్పాటు చేస్తున్నా మని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ ఎన్ఎంకె తిరుమలప్రసాద్ తెలిపారు. ఈ మేరకు మండల కేంద్రంలోని ప్రాథ మిక ఆరోగ్య కేంద్రంలో బుధవారం స్థానిక విలేకరులతో మాట్లాడారు. పిల్లల్లో నులిపురుగుల నిర్మూలనకు ఆల్బెండజోల్ మాత్రలు వేయించడం జరుగుతుందన్నారు. జాతీయ నులి పురుగులు నిర్మూలన కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు తగు చర్యలు చేపడుతున్నామన్నారు. ఆయా శాఖల అధికారుల సమన్వ యంతో డి వార్మింగ్ డే కార్యక్రమాన్ని విజయవంతం చేయనున్నామని వైద్యాధికారి డాక్టర్ తిరుమల ప్రసాద్ చెప్పారు. ముఖ్యంగా సంవ త్సరంలు నుండి 19 సంవత్సరాల వయస్సు వరకు పిల్లలు, విద్యార్థులకు ఈనెల 17వ తేదీన అంగ న్వాడీ కేంద్రాలు ,పాఠశాలల్లో ఆల్బండజోల్ మాత్రలు వేయడం జరుగుతుందన్నారు.

## అబ్బురపరిచిన గిరిజన వనితల కోలాటం



గరివిడి ఫిబ్రవరి,12 ప్రభాత వార్త

శివరాత్రి ఉత్సవాలు పురస్కరించుకుని కొండ పాలెం గ్రామంలో గిరిజన వనితలు ప్రదర్శించిన కోలాటం అబ్బురపరిచింది. చిన్నారులు, ఆ గ్రామ పడతులు చేసిన చూడచక్కని ప్రదర్శనలు అక్కడివారిని మంత్రముగ్ధులను చేసింది. తమ హావభావాలతో వినసొంపైన పాటలకు లయ బద్దంగా వారు చేసిన నృత్యాలు తో కూడిన కోలాటం కోలాహలంగా సాగింది. కర్ర ధ్వని,చిడతల చప్పుడు మధ్య సాగే కోలాటం ఆహూతులను తన్మయత్వ పరిచింది. ఎంతో వెనుకబాటు తనం లో ఉంటూ సంస్కృతి సంప్రదాయాలకు దూరంగా నివసించే గిరిజన మహిళల్లో ఉత్సాహం నింపేందుకు గాను పాండు రంగడు అనే యువకుడు నడుంబిగించి గిరిజన యువతుల్లో కోలాటం నృత్యాన్ని నేర్పించి వారితో ప్రదర్శింప జేసి వారిలో దాగివున్న కళ ను వెతికి తీయడం ముదావహం. కళాకారులుగా గిరిజన పడతులను తీర్చిదిద్దడం అభినందనీయం.

## మన్యం మెప్మా పి.డి గా నాగభూషణరావు



కురుపాం, ఫిబ్రవరి 12ప్రభాతవార్త

పార్వతీ పురం మన్యం జిల్లా మెప్మా ప్రోజెక్టు డైరెక్టర్గా బి.వి నాగభూషణరావు పదవి బాధ్యతలు స్వీకరించారు. ఈయన కురు పాం మండల పరిషత్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్గా పనిచేస్తూ పదోన్నతి పై మెప్మా పి.డిగా బాధ్యత స్వీకరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టన పేదరిక నిర్మూలన సంస్థ సేవలు అందరికి సద్వినియోగం చేసుకునేందుకు ,కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు కల్పించే స్వయం ఉపాధి అవకాశాలు అర్హులైన వారందరికీ అందేలా తన వంతు కృషి చేస్తానని ఆయన తెలిపారు.

## నూనె గింజల పంటలపై రైతులు అవగాహన కలిగి ఉండాలి : సైంటిస్టు లక్ష్మణ



వేపాడ ,ఫిబ్రవరి 12, ప్రభాతవార్త

రైతులు నూనె గింజల పంటలపై అవగాహన కలిగి ఉండాలని సైంటిస్టు లక్ష్మణ కోరారు. మండలంలోని రాయుడుపేట గ్రామంలో గురు వారం నూనెగింజల పంటలలో యాజమాన్య పద్ధతులు పై శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. సైంటిస్ట్ కె లక్ష్మణ రైతుల నుద్దేశించి మాట్లాడారు. వేరుశెనగ విత్తన శుద్ధి, ఎరువుల యాజమాన్యంపై అవ గాహన కల్పించారు. వేరుశెనగ లో కాలర్ రాట్ తెగులుకు టేబుకానాజోలుతో విత్తన శుద్ధి లేదా మొక్కలు 20–25 రోజులు వయస్సులో ఉన్నప్పుడు పిచికారీ చేసినట్లయితే వ్యాధి వ్యాపించకుండా పంటను కాపాడు కోవచ్చునని సూచించారు. అదేవిదంగా మినుములు లో బంగారు తీగ అనే కలుపు కి యాజమాన్యం పద్ధతు లు రైతులు అడగగా దానికి ఇమేజీతపైర్ ని అపరాలు పంట కి 20–25 రోజుల వయస్సులో ఉన్నప్పుడు పిచికారీ చేసుకున్నట్లయితే ఆ కలుపు నివారించుకోవచ్చునని వివరించారు. ఈ కార్యక్రమం లో వ్యవసాయ శాఖ సహాయ సంచాలకులు బి భానులత మాట్లాడుతూ నూనె గింజల పంటలు సాగు పై దృష్టి సారించిన పుడే రైతులకు అదనపు ఆదాయం వస్తుందని సూచించారు. ఈ పంటలు రోజు రోజుకి తగ్గిపోతున్నందున అవగాహనా కల్పించటానికి ఈ శిక్షణ కార్యక్రమం ఏర్పాటు చేశామని రైతులు ఈ శిక్షణా కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వ్యవసాయాధికారిణి కే స్వాతి, వ్యవసాయ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

## భక్తులకు అన్ని రకాల సౌకర్యాలు కల్పించండి..

### భద్రత ఏర్పాట్లు పటిష్టంగా ఉండాలి.. అధికారులకు కలెక్టర్ ఆదేశాలు..

శృంగవరపుకోట,ఫిబ్రవరి12,ప్రభాతవార్త..



రానున్న మహా శివరాత్రి సందర్భంగా ఎస్.కోట పుణ్యగిరి, ధర్మవరం శ్రీసన్యాశేస్వర స్వామి ఆలయాలు వద్ద జరిగే జాతర మహో త్సవాలను పకడ్బందీగా నిర్వహించాలని భక్తులకు అన్ని సౌకర్యాలు కల్పించాలని కలెక్టర్ రామ్ సుందర్ రెడ్డి అధికారులను ఆదేశించారు. గురు వారం కలెక్టర్ ఎస్.కోట పుణ్యగిరి శ్రీఉమాకోటిలింగేశ్వర స్వామి ఆలయానికి చేరుకుని శివరాత్రి జాతర ఏర్పాట్లును పరిశీలించారు. జాతర ఉత్సవాల్లో ఎటువంటి అవాంతరాలు లేకుండా సంభందిత అధికారులు బాధ్యత వహించాలని తెలిపారు. స్వామి వారి దర్శనం విషయంలో ఆయా ఆలయాలు వద్ద ఎటువంటి తోపులాటలు జరగకుండా క్యూలైన్లో భారీ బారికేడ్లను ఏర్పాటు చేయాలని తెలిపారు. ముఖ్యంగా ఆలయాలు వద్ద ట్రాఫిక్ నియంత్రణ కోసం పోలీసులు తగు జాగ్రత్తలు తీసుకోవాలని భారీ పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయాలని తెలిపారు. అలాగే పారిశుద్ధ్య కార్యక్రమంలో లోటుపాట్లు ఉండకూడదని స్వామి వారిని దర్శించుకునే భక్తులు మెచ్చే విధంగా అధికారులందరూ తమ తమ బాధ్యతలు సక్రమంగా నిర్వహించాలని కలెక్టర్ సూచించారు. ఆర్డీవో దీప్తి,ఎండోమెంట్ అసిస్టెంట్ కమీషనర్, తహశీల్దార్ శ్రీనువాసరావు,సీఐ వీఎన్ మూర్తి,పుణ్యగిరి ఈఓ నాగేంద్ర,ధర్మవరం ఈఓ సాంబశివరావు,తదితరులు పాల్గొన్నారు.

## పంటలను పాడు చేస్తున్న గజరాజుల గుంపు



కొమరాడ ఫిబ్రవరి 12 ప్రభాత వార్త

గజరాజులు గుంపు మండలంలో పంటలను పాడు చేస్తున్నట్లు రైతులు లబోదిబోమంటున్నారు. గురువారం కుమ్మరిగుంట గంగ రేగివలస గ్రామాల మధ్య ఉన్న మొక్కజొన్న కూరగాయల పంటలను ఏనుగులు గుంపు పాడు చేసినట్లు రైతులు చెబుతున్నారు. గత కొన్ని నెలలుగా ఏనుగుల గుంపు ఈ ప్రాంతంలోనే సంచరించడంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నట్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తక్షణమే ఈ ప్రాంతం నుంచి ఏనుగులను తరలించాలని కోరుతున్నారు.

## ఊరు బడిని కాపాడుకుందాం



నెల్లిమర్ల, ఫిబ్రవరి 12 ప్రభాతవార్త

యు టి ఎఫ్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు రాష్ట్ర వ్యాప్తంగా చేపట్టిన 'ఊరు బడిని కాపాడుకుందాం' కార్యక్రమం లో భాగంగా గురువారం నెల్లిమర్ల విద్యా శాఖ కార్యాలయం దగ్గర పోస్టర్ ఆవిష్కరణ మండల విద్యాశాఖాధికారులు యు యస్ యన్ మూర్తి , యస్. త్రినాథరావు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మండల విద్యా శాఖాధికారులు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయులు సామాజిక బాధ్యత లో భాగంగా పాఠశాలల్లో విద్యార్థులను చేర్పించి ప్రభుత్వ బడులను కాపాడుకోవలసిన భాద్యత ఉందని అన్నారు. ఆ బాధ్యతను యు టి ఎఫ్ తీసుకోవడం అభినందనీయమని అన్నారు. యు టి ఎఫ్ జిల్లా కార్యదర్శి పతివాడ త్రినాథ్, మండల అధ్యక్షులు మద్దిల సత్యనారాయణ, కోశాధికారి సుంకరి చలపతి రావు, యు టి ఎఫ్ మండల ప్రతినిధులు పాల్గొన్నారు.

విజయనగరం పార్వతీపురం మన్యం 25 వార్త

## కేంద్ర,రాష్ట్ర సర్కార్లకు కనువిప్పు ఈ సార్వత్రిక సమ్మె : అజేయ్ శర్మ



సాలూరు ఫిబ్రవరి 12 ప్రభాతవార్త

లేబర్ కోడ్ రద్దు చేయకుంటే పోరాటం సార్వత్రిక సమ్మె తో ఆగదని మరింత ఉధృతంగా పోరాటాలు ముందుకు తీసుకు వెళ్తామని సిఐటియు మాజీ రాష్ట్ర ఉపాధ్యక్షులు అజయ్ శర్మ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలకు హెచ్చరించారు. గురువారం ఆంధ్రప్రదేశ్లో జరుగుతున్న సార్వత్రిక సమ్మెకు మద్దతుగా ఆయన ఆధ్వర్యంలో కార్మికులు ర్యాలీ నిర్వహించి నిరసన చేపట్టారు. అందులో భాగంగా మున్సిపల్ ఆఫీస్ నుండి బారీర్యాలీ గా బయలుదేరి ఎమ్మార్వో కార్యాలయం ఎదురుగా ఉన్న జాతీయరహదారి పై నిరసన గళం వినిపించారు. అనంత రం అజేయ్ శర్మ మాట్లాడుతు దేశంలో నరేంద్ర మోడీ తీసుకువచ్చిన లేబర్ చట్టాల మార్పు వెంటనే నిలిపే యాలని పలు కార్మికుల సమస్యలు స్పష్టం చేసారు. సంఘనాయకులు ఎన్.వై.నాయుడు,ఎం.శ్రీనుపెద్ద ఎత్తున కార్మిక వర్గం పాల్గొంది.

## ఉపాధిని దెబ్బతీసేందుకే కేంద్రం కుట్ర



కొమరాడ ఫిబ్రవరి 12 ప్రభాతవార్త

కేంద్ర ప్రభుత్వం ఉపాధి హామీ పథకాన్ని రద్దు చేసేందుకు కుట్ర పన్నుతున్నట్లు కనిపిస్తుందని రైతు కూలీ సంఘం నాయకులు శ్రీను నాయుడు అన్నారు. గురువారం కొమరాడ మండల కేంద్రంలో కార్మిక సంఘాల తో కలిసి నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బిజెపి ప్రభుత్వం తీసుకు వచ్చిన కార్మిక రైతు ప్రజా వ్యతిరేక విధానాలు వల్ల ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురయ్యే ప్రమాదం ఉందని అన్నారు. పాత విధానంలోనే ఉపాధి హామీ చట్టం కొనసాగించాలని డిమాండ్ చేశారు. సిపిఎం పార్టీ నాయకులు కొల్లి సాంబమూర్తి మాట్లాడుతూ కొత్తగా తీసుకువచ్చిన నాలుగు లేబర్ కోడ్లను రద్దు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో పలువురు పాల్గొన్నారు.

## పన్నుల వసూళ్లు అంత ఆన్లైన్లో జరగాలి : డి .డి .ఓ .హేమ హేమ సుందర్



చీపురుపల్లి ఫిబ్రవరి12, ప్రభాతవార్త

పంచాయతీల వారీగా వసూలు చేస్తున్న ఇంటి పన్నులు వసూళ్లు అంత ఆన్లైన్లో జరగాలని చీపురుపల్లి డిడి ఓ హేమ సుందర్ అధికారులకు సూచించారు. గురువారం నాడు చీపురుపల్లి మండలంలోని మెట్టపల్లి గ్రామాన్ని ఆయన సందర్శించారు. మెట్టపల్లి గ్రామంలో రికార్డుల పరిశీలన అనంతరం గ్రామంలో జరుగుతున్న ఇంటి పన్నుల కలెక్షన్ లను పరిశీలించడం జరిగింది. అలాగే యూనిఫైడ్ ఫ్యామిలీ సర్వే, సీటిజన్ ఈ-కేవైసీ వంటి సర్వేలను ఆయన పరిశీలించడం జరిగింది.అనంతరం గ్రామపంచాయతీలో జరుగుతున్న, టాక్స్ కలెక్షన్ ఆన్లైన్ అప్డేషన్ ను ఆయన పరిశీలించారు. అనంతరం టాక్స్ కలెక్షన్ అంతా ఆన్లైన్లో జరగాలని, అలాగే పారదర్శకంగా జరగాలని, వాళ్లకు వెంటనే ఇంటి పన్ను రసీదులు ఇవ్వాలని, సూచించారు. ఈ కార్యక్రమంలో పలువురు సచలయ్య సిబ్బంది అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## విజయనగరంలో వైభవంగా యూనియన్ బ్యాంక్ 'కార్ కార్నివాల్

విజయనగరం, ఫిబ్రవరి 12, (ప్రభాతవార్త ):




యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, విజయనగరం రీజి నల్ ఆఫీస్ ఆధ్వర్యంలో గురువారం కంటోన్మెంట్ శాఖ వద్ద నిర్వహించిన 'కార్ కార్నివాల్'(కార్ లోన్ మేళా) అత్యంత ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమాన్ని బ్యాంక్ జనరల్ మేనే జర్ ఎస్ కె దాస్, రీజినల్ మేనేజర్ జితేంద్ర శర్మ జ్యోతి ప్రజ్వలన చేసి అధికారికంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో జనరల్ మేనేజర్ దాస్ మాట్లాడుతూ, సామాన్యులకు కూడా కారు కలని నిజం చేసేలా యూనియన్ బ్యాంక్ ఆకర్షణీయమైన వడ్డీ రేట్లతో వాహన రుణాలను అందిస్తోందని, ఖాతాదారుల అవసరాలకు అనుగుణంగా త్వరితగతిన రుణాలను మంజూరు చేయడమే తమ లక్ష్యమని, తెలిపారు. రీజినల్ మేనేజర్ జితేంద్ర శర్మ మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా యూనియన్ బ్యాంక్ అందిస్తున్న వాహన రుణ సదుపాయాన్ని ప్రజలు విస్తృతంగా వినియోగిం చుకుంటున్నారని తెలిపారు. ఈ వేదికగా కొత్తగా వాహన రుణాలు పొందిన పలువురు ఖాతాదారులకు బ్యాంక్ జనరల్ మేనేజర్, రీజినల్ మేనేజర్ స్వయంగా ఖాతాదారులకు రుణ మంజూరు పత్రాలను, కారు తాళాలను అందజేశారు. తాళాలు అందుకున్న ఖాతాదారులు బ్యాంక్ అందిస్తున్న వేగవంతమైన సేవలకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమం చివరలో బ్యాంక్ మేనేజర్ పి.ఎస్. మల్లేశ్వరరావు విచ్చేసిన అతిథులకు, ఖాతాదారులకు కృతజ్ఞతలు తెలియజేశారు.

## విద్యుత్ ఉద్యోగుల రక్తదానం



విజయనగరం, ఫిబ్రవరి 12, (ప్రభాతవార్త )

ఏపీ ఎలక్ట్రికల్ ఎంప్లాయిస్ యూనియన్ 77 వ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా సూపరింటెండింగ్ ఇంజనీర్ ఎం.లక్ష్మణరావు ఆధ్వర్యంలో ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ సహకారం తో రక్తదాన శిబిరం గురువారం నిర్వహించారు. ఈ శిబిరం లో 89 మంది ఉద్యోగులు హాజరై స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. ఈ శిబిరానికి ముఖ్య అతిధి గా హాజరైన ఎస్.ఈ. లక్ష్మణరావు స్వయంగా రక్తదానం చేయడమేకాక, రెడ్ క్రాస్ సొసైటీ లైఫ్ మెంబెర్ గా చేరడంతో పాటు 25 మందిని లైఫ్ మెంబర్స్ గా చేర్పించడం విశేషం..అంతేకాకుండా బ్లడ్ సెంటర్ కి అవసరమయిన 10 కిలోవాట్స్ సామర్థ్యంగల సోలార్ ఎక్విప్మెంట్ ఏర్పాటు చేసేందుకు ఉద్యోగులు ఈ సందర్భంగా హామీ ఇచ్చారు. ఎస్ ఈ లక్ష్మణరావు ను రెడ్ క్రాస్ చైర్మన్ కె ఆర్ డి ప్రసాద్ అభినందించారు.

## జాతీయ సార్వత్రిక సమ్మెలో భాగంగా భోజన విరామ సమయంలో నిరసన



విజయనగరం, ఫిబ్రవరి 12 ప్రభాతవార్త ) :

జాతీయ సార్వత్రిక సమ్మెలో భాగంగా ఏపీ ఎన్జిజిఓఎస్ అసోసియేషన్ రాష్ట్ర నాయకత్వ ఆదేశాల మేరకు గురువారం విజయనగరం జిల్లా కలెక్టరేట్ ఎదుట మద్యాన్నం భోజన విరామ సమయంలో నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పెద్ద ఎత్తున ఉద్యోగులు, ఉపాధ్యాయులు, కార్మికులు, పెన్షనర్స్, పాల్గొన్నారు. ఈ సందర్భం గా అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు, జె ఏ సి చైర్మన్ ఏ .సురేష్ మాట్లాడుతూ ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమానికి పరిశీలకులుగా రాష్ట్ర సంఘం ఉపాధ్యక్షుడు ఆర్.వేణు గోపాల్ హాజరయ్యారు.

## కేంద్ర సర్కారు కార్మిక వ్యతిరేక చట్టాలపై నినదించిన కార్మిక లోకం

గరివిడి ఫిబ్రవరి,12 ప్రభాతవార్త

కేంద్ర ప్రభుత్వం 29 కార్మిక చట్టాలను నాలుగు లేబర్ కోడ్లుగా మార్చడాన్ని వ్యతిరేకిస్తూ సీటు ఆధ్వర్యంలో గురువారం గరివిడిలో నిరసన ర్యాలీ జరిగింది. నిరసన కారులైన కార్మికులు కేంద్ర సర్కారు తీరును గర్హించారు. గరివిడి రైల్వే వంతెన దిగువ నుండి తహసీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించి వ్యతిరేక నినాదాలు చేశారు. కార్మికులు చేసే నినాదాలు తో గరివిడి మార్మోగింది. సి ఐ టి యూ, ఐ ఎన్ టి యుసితో పాటు ఏడు కార్మిక సంఘాలు నిరసన ర్యాలీలో పాల్గొని ప్రభుత్వ వైఖరి పై దుమ్మెత్తి పోశారు. కార్మికుల కు నష్టం కలిగించే చట్టాలు పై వారు ధ్వజమెత్తారు. నిరసన కార్యక్రమంలో లో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు అంబళ్ల గౌరినాయుడు,అప్పలనాయుడు, సన్యాసి నాయుడు తదితరులు పాల్గొన్నారు. కాగా జీవిత బీమా కార్యాలయం వద్ద బీమా సమస్యలపై ఉద్యోగులు,బీమా ఏజెంట్లు,అధికారులు నిరసన తెలిపారు. ప్రభుత్వ వైఖరి ని వారు గర్హించారు. మోడీ సర్కారు పై వారు నిరసన గళం విప్పారు.

## ప్రకృతి వ్యవసాయం ఎంతో మేలు



నెల్లిమర్ల, ఫిబ్రవరి 12,ప్రభాతవార్త

మండలంలోని తంగుడు బిల్లి గ్రామంలో చందక లక్ష్మి, అరుణకుమారిలు సేద్యం చేస్తున్న ప్రకృతి వ్యవసాయ పొలాన్ని జిల్లా ప్రకృతి వ్యవసాయ అధికారులు ఆనందరావు, ఎన్ ఎఫ్ ఏ శంకర్ లు గురువారం పరిశీలించారు. దుంప జాతి, క్యారెట్, బీట్రూట్, ముల్లంగి, ఆకుకూరలు, తోటకూర, గోంగూర, పాలకూర, కాయగూరలు వంగ టమాట మిరప , చిన్న పండ్ల జాతి జామ, బొప్పాయి, అంతే ఏరా పంట సరిహద్దు పంట జొన్న మొక్కజొన్న, గంటి మొదలకు పంటలు ఒక 20 సెంట్లు విస్తీర్ణంలో వేయడం వలన నిరంతరం ఆదాయంతో పాటు మంచి పౌష్టికాహారం వస్తుందని వారు అన్నారు. అలాగే ఇలా సాగు చేయడం వలన జీవవైవిద్యం జరిగి నేల సారవంతం గా తయారవుతుందన్నారు. ఎరువులు, పురుగు మందులు, వాడకం అవసరం ఉండదన్నారు. కాబట్టి పండిన పంటలు మంచి పోషక విలువలతో కూడిన కూరగాయలు లభిస్తాయన్నారు. ఇవి తినడం వలన మానవుల ఆరోగ్యం బాగుంటుందన్నారు. కాబట్టి రైతులందరూ కూడా ఈ విధంగా తమకు ఉన్న విస్తీర్ణంలో ఇలా అన్ని రకాల పంటలు ప్రకృతి వ్యవసాయ విధానంలో చేయడం వలన మంచి లాభాలను పొందచ్చని సూచించారు.

# పిల్లల ఊబకాయంలో తల్లి పాత్రే ప్రధానం



పిల్లల్లో ఊబకాయానికి, తల్లిదండ్రుల జన్యువులూ ఒక కారణమేనన్నది తెలిసిన విషయమే. కానీ పిల్లల బరువులో ముఖ్యంగా ఊబకాయంలో తల్లి పాత్ర ప్రధానంగా ఉంటోందని అంటోంది యూనివర్సిటీ కాలేజీ లండన్ చేసిన ఓ అధ్యయనం. తల్లిదండ్రుల జన్యువులూ, బరువూ, వారి ఆహారపు అలవాట్లూ, పిల్లల బరువునీ, ఆహారపు అలవాట్లనీ ఎలా ప్రభావితం చేస్తాయో తెలుసుకునేందుకు మూడువేల కుటుంబాలపైన ఒక పరిశోధన చేశారు. తల్లిదండ్రుల జన్యు వివరాలనీ, పిల్లలు పుట్టినప్పట్నుంచీ పదిహేడేళ్లు వచ్చేంతవరకూ వారి బరువునీ వివిధ దశల్లో విశ్లేషించారు. ఈ క్రమంలో తండ్రి బరువు కన్నా, తల్లి గర్భిణిగా ఉన్నప్పటి బరువూ, గర్భం దాల్చడానికి ముందు ఉన్న బరువూ, అలాగే ఆమె ఆహారపు అలవాట్లూ, పిల్లలకు మూడేళ్లు వచ్చేంతవరకూ ఇంట్లో పాటించే ఆహార నియమాలే పిల్లల బరువుని నిర్ధారిస్తాయని ఈ పరిశోధనలో తేలింది. అంతేకాదు చదువుకున్న తల్లులకు పుట్టిన పిల్లల్లో కన్నా పెద్దగా చదువుకోని తల్లులకు పుట్టిన పిల్లలు బరువు ఎక్కువగా ఉండటాన్ని కూడా గమనించారు అంటే జన్యువులతో పాటు తల్లులు పాటించే చక్కని ఆహారపు అలవాట్లే పిల్లల భవిష్యత్ బరువుని నిర్ధారిస్తాయన్న మాట.

# ఐడ్రాప్స్‌తో కంటిచూపు మెరుగు



కళ్లు మన శరీరంలో అత్యంత ముఖ్యమైన ఇంద్రియాలలో ఒకటి. ఇవి వెలుతురును గ్రహించి, మెదడుకు సంకేతాలు పంపి మనకు చూడగల శక్తిని ఇస్తాయి. నలభైఐదేళ్లు దాటితే కంటి చూపులో మార్పులు రావడం మొదలవుతాయి. చిన్న అక్షరాలు స్పష్టంగా కనిపించవు. పట్టిపట్టి చదివితే తలనొప్పి మొదలవుతుంది. మరికొన్నిసార్లు అక్షరాలు అలికినట్టుగా ఉంటాయి. దీన్నే ఛత్వారం అనీ, ప్రెస్‌బయోపియా అనీ అంటారు. ప్రపంచవ్యాప్తంగా 180 కోట్ల మంది ఈ సమస్యతో బాధ పడుతున్నారని అధ్యయనాలు చెబుతున్నాయి. వయసుతోపాటు వచ్చే ఈ సమస్యకు పరిష్కారంగా వైద్యులు ఇంతవరకూ రీడింగ్ గ్లాసెస్‌నే సూచిస్తున్నారు. అయితే ఇకపైన వాటిని వాడాల్సిన అవసరం లేకుండా లెన్జ్ థెరాప్యుటిక్స్ అనే సంస్థ అసెక్లైడిన్ అఫ్తాల్మలాజిక్ సొల్యూషన్‌ని ఉపయోగించి విజ్ పేరుతో ఐడ్రాప్స్‌ని తీసుకొచ్చింది. వీటిని రోజులో ఒక్కసారి వాడితే చాలట. డ్రాప్స్ వేసుకున్న అరగంట తర్వాత నుంచి ఎటువంటి కళ్లద్దాల అవసరం లేకుండానే పదిగంటల పాటు కళ్లు స్పష్టంగా కనిపిస్తాయట. ప్రత్యేకమైన ఈ ఔషధం కంటి పాపలోని కండరాలపైన ఒత్తిడి తీసుకొచ్చి వాటి పరిమాణం లో మార్పు తీసుకొస్తుందట. దాంతో కళ్లు దగ్గర వస్తువులని స్పష్టంగా చూడ గలుగుతాయట. అంటే ఇక వెళ్లిన ప్రతిచోటకీ కళ్లద్దాలను తీసుకెళ్లాల్సిన అవసరం లేకుండా ఐడ్రాప్స్ వేసుకొని వెళ్తే సరిపోతుందన్న మాట.

కానీ ఇలాంటి సూచనలు పాటించే ముందు ఒకసారి డాక్టర్ సలహా తీసుకోవడం మంచిది. అలాగే చిన్న చిన్న చిట్కాలను పాటిస్తూ ఉండాలి. ప్రతిరోజూ పచ్చి కూరగాయలు, క్యారెట్, పాలకూర వంటి ఆహారం తీసుకోవాలి. ఎక్కువ సేపు మొబైల్, కంప్యూటర్ చూడకూడదు.

ప్రతి 20 నిమిషాలకు ఒకసారి 20 అడుగుల దూరంలో ఉన్న వస్తువును 20 సెకన్లు చూడాలి. కంటి పరీక్షలను క్రమం తప్పకుండా చేయించుకోవాలి. కళ్లను శుభ్రంగా ఉంచుకోవాలి.

# ఉద్యోగం వచ్చిందని తొందరపడొద్దు..





ప్రస్తుతం అమ్మాయిలు ఉన్నత చదువులు చదువుతున్నారు. చదువుతో పాటే మంచి ఉద్యోగం కోసం ప్రయత్నిస్తున్నారు. కష్టపడితే ఫలితం ఉంటుందన్నట్లు కెరీర్ కోసం ముందుగానే ఒక ప్రణాళికతో అడుగు వేస్తే విజయంతో పాటు ఫలితమూ దక్కుతుంది. అయితే అందుకు ఎంతో కృషి కూడా అవసరమే. చదువు పూర్తవగానే ఉద్యోగం వస్తే ఆ సంతోషం ఎంతో గొప్పగా ఉంటుంది. ఎందుకంటే అప్పటికి అంతగా బాధ్యతలు ఉండవు. వయసు కూడా తక్కువే ఉంటుంది కాబట్టి, ఉత్సాహంగా ఉంటుంది. గొప్ప విజయం సాధించినంత ఆనందంగా ఉంటుంది. ఇప్పుడే కాస్త జాగ్రత్తగా ఉండాలి. ఎక్కువ కష్టపడకుండానే ఉద్యోగం వచ్చిందని, అతి అంకితభావం ప్రదర్శిస్తూ అన్ని పనులు తామే పూర్తిచేస్తామన్న అత్యుత్సాహాన్ని ప్రదర్శించవద్దు. ఉద్యోగం వచ్చిందన్న సంబరంలో పార్టీలంటూ సమయాన్ని వృధా చేయవద్దు. అలా కాకుండా ఉద్యోగంలో చేరిన కొంతకాలం తరువాత కెరీర్‌ను అభివృద్ధి చేసుకునే అవకాశాలను వెతుక్కోవాలి. చేస్తున్న ఉద్యోగంలో ఉన్నత స్థాయి చేరుకునేందుకు ప్రయత్నించాలి. అప్పగించిన పనులు సకాలంలో పూర్తి చేయడం, కొత్త అవకాశాల్ని అందిపుచ్చుకోవడం రెండూ బ్యాలెన్స్ చేసుకుంటూ వ్యక్తిగత జీవితాన్ని ఆస్వాదించాలి. చిన్న వయసులో ఉద్యోగంలో చేరితే రెట్టింపు ఉత్సాహంతో పనిచేస్తూ పై వారి ప్రశంసలు పొందగలుతారు. పోటీతత్వంతో పైకెదగవచ్చు. అతి ముఖ్యమైన విషయమేమిటంటే తొందరగా ఉద్యోగం వచ్చిన చాలా మందికి ఒక రకమైన సంతోషం, సంతృప్తి ఉంటాయి. ఇందుకుకారణం ఆర్థి స్వేచ్ఛ. తాము సంపాదిస్తున్నామన్న ధీమా. అలా అని ఖర్చు పెట్టుకుంటూ పోతే భవిష్యత్తులో ప్రమాదాలు ఎదుర్కోవాల్సి వస్తుంది. బాధ్యతలు ఎక్కువగా లేనప్పుడు పొదుపు పెద్ద మొత్తంలో చేసే వీలుంటుంది. పొదుపు, మదుపు చేసుకునే వీలుంటుంది. పైగా ముందు నుంచే సేవింగ్స్ లాంటివి చేయడం, అత్యవసర నిధి సమకూర్చుకోవడం వంటి చేస్తూ ఉంటే భవిష్యత్తుపై భరోసా ఉంటుంది. ఇలా డబ్బు నిర్వహణ బాధ్యతలు పెరిగితే కెరీర్ అభివృద్ధిపైనా దృష్టి సారించవచ్చు.

# రోజూ ఉదయం సోంపు నీళ్లు..



సోంపు జీర్ణక్రియకు చాలా మంచిది. సోంపును నీటిలో నానబెట్టి లేదా మరిగించి తాగితే అనేక ఆరోగ్య ప్రయోజనాలు లభిస్తాయి. సోంపు నీళ్లు తాగడం వల్ల గ్యాస్, అజీర్ణం, పొట్టఉబ్బరం తగ్గిస్తుంది. భోజనం తర్వాత తాగితే ఆహారం సులభంగా జీర్ణమవుతుంది. మెటబాలిజం మెరుగుపరుస్తుంది. ఆకలి నియంత్రణలో సహాయం చేస్తుంది. శరీరంలో ఉన్న విషపదార్థాలను బయటకు పంపించడంలో సహాయపడుతుంది. హార్మోన్ల సమతుల్యతకు తోడ్పడుతుంది. సోంపులో ఉన్న విటమిన్ 'ఎ' కంటి ఆరోగ్యానికి మేలు చేస్తుంది. మొటిమలు తగ్గించడంలో సహాయపడుతుంది. అలాగే చర్మం కాంతివంతగా మారతుంది. దగ్గు, జలుబు సమయంలో సోంపు ఉపశమనం ఇస్తుంది. రోజుకు ఒకటి, లేదా రెండు గ్లాసుల సోంపు నీళ్లు మాత్రమే తాగాలి. అధికంగా తీసుకుంటే పొట్ట సమస్యలు రావొచ్చు. ఉదయం ఖాళీ కడుపుతో తాగితే మంచిది. లేదా భోజనం తర్వాత కూడా తాగవచ్చు.

# ఓర్పుతోనే సాధ్యం

మనిషి జీవితంలో ఎదగాలంటే ఎంతో చాకచక్యంగా ప్రవర్తించాల్సి ఉంటుంది. ఈ లోకంలో ఎందరో ఎన్నో విధాలుగా నడుచుకుంటూ వుంటారు. అన్నీ మనకు నచ్చక పోవచ్చు. ఒక్కోసారి వారి మీద మనకు కోపం వస్తుంది కూడాను. మనసులో పుట్టిన కోపాన్ని పాముకుబుసంలా వదలిపెట్టాలి. ఆ స్థితి రావాలంటే అంత సులువు కాదు. అయితే ప్రయత్నిస్తే అసాధ్యం కాదు. మనభారత, రామాయణాల్లో ఎన్నో పాత్రలు మనకు సహనాన్ని, సంయమనాన్ని ఎలా అలవర్చు కోవాలో నేర్పాయి. ధర్మరాజు ఏ విధంగా కష్ట సమయాల్లో సంయమనం పాటించాడో మనకు అర్థం అవుతుంది. ముఖ్యంగా హనుమంతుడు సీతాన్వేషణలో సముద్రాన్ని దాటే సమయంలో సురస అనే అతిభయంకర రాక్షసి అడ్డగించి నపుడే సంయమాన్ని పాటించి, ప్రవర్తించిన తీరు, ఆయన సహనానికి నిదర్శనం గా నిలిచింది. ఇక సీతమ్మను రాక్షస స్త్రీలు ఎంతగా వేధించినా, ఎన్ని మాటలు అన్నా వారిని ఓర్పుతో భరించి, రాముడి కోసం ఎదురు చూసింది. మానవులు ఎన్నో రకాల ఆభరణాలు ధరిస్తారు. అలంకారంగా వాటిని కోరుకుంటారు. సామాన్యులైనవారు భూషణాలుగా అంగీకరించి ఆనందిస్తారు. కానీ ఉత్తములైనవారు మాత్రం ఓర్పును భూషణంగా ధరిస్తారు. ఈ విషయాన్ని విదురుడు మహాభారతంలో చెప్పుకొచ్చారు. ప్రపంచంలోని దేశాలు ఓర్పుతో నిగ్రహంతో వేచివుండి సమస్యలకు పరిష్కారం ఆలోచిస్తే ఎన్నో యుద్ధాలను అరికట్టవచ్చు.

– డా॥ పులివర్తి కృష్ణమూర్తి

# అల్లం చారుతో అద్భుత ప్రయోజనాలు



**కావలసినవి:** కందిపప్పు- మూడు చెంచాలు, కరివేపాకు రెబ్బలు - రెండు, పసుపు- పావు చెంచా టొమాటో : ఒకటి, మిరియాలు: చెంచా, అల్లం: అంగుళమంత ముక్క, వెల్లుల్లి రెబ్బలు : ఆరు జీలకర్ర: చెంచా, దనియాలు: అరచెంచా, కొత్తిమీర తరుగు: రెండు చెంచాలు, నిమ్మరసం: మూడు చెంచాలు, ఉప్పు: తగినంత. **తాలింపుకోసం:** నూనె చెంచా, ఆవాలు అరచెంచా, మెంతులు పావుచెంచా, ఎండుమిర్చి రెండు, ఇంగువ చిటికెడు, కరివేపాకు రెండు రెబ్బలు. **తయారీ విధానం:** కందిపప్పుని అరగంట ముందే నానబెట్టి ఉంచుకోవాలి. కుక్కర్‌లో కందిపప్పు, పసుపు, కరివేపాకు రెబ్బలు, టొమాటో వేసి తగినన్ని నీళ్లుపోసి నాలు గైదు విజిల్స్ రానిచ్చి మెత్తగా ఉడికించు కోవాలి. ఆ పప్పుకి అరలీటర్ నీళ్లను కలిపి వడకట్టి పలుచటి పప్పు నీళ్లని మాత్రమే తీసుకోవాలి. మిరియాలు, జీలకర్ర, వెల్లుల్లి, అల్లం, దనియాల్ని కచ్చాపచ్చాగా మిక్సీ పట్టుకోవాలి. స్టవ్ మీద గిన్నె పెట్టి పప్పు నీళ్లను సన్నమంటపైన ఉంచి, అందులో తగినంత ఉప్పు, మిక్సీ పట్టుకున్న మిరియాలు- అల్లం మిశ్రమాన్ని వేసుకొని ఒక పొంగురానివ్వాలి. స్టవ్ కట్టేసి నిమ్మరసం, కొత్తిమీర తరుగు వేసుకోవాలి. చివరగా తాలింపు వేసుకుని ఆ తాలింపు గింజలని ఈరసంలో కలుపుకుంటే అల్లం -నిమ్మకాయ చారు సిద్ధం.

# రాగి బంతులతో ఆరోగ్యం



రాగి పాత్రలోని నీరు ఆరోగ్యానికి ఎంతో మంచిది. రాగిలో సూక్ష్మ క్రిములను నశింప చేసే లక్షణాలు ఉంటాయి. రాగి పాత్రలో నీళ్లు తాగడం జీర్ణ క్రియకు సహాయపడుతుంది. రాగిలోని ఖనిజాలు ఇమ్యూనిటీని పెంచుతాయి. రాగి నీళ్లు శరీరాన్ని డిటాక్స్ చేయడంలో సహాయపడతాయని చెబుతారు. కొంత మందికి రాగి పాత్రలో ఉంచిన నీళ్లను తాగే అలవాటు ఉంటుంది. ఆ నీళ్లు బ్యాక్టీరియాని దూరం చేసి, అదనంగా మినరల్‌ని అందిస్తాయని నమ్ముతారు. ఇందుకోసం రాగి బిందెలో, కాపర్ బాటిల్స్‌లో నింపిన నీళ్లు తాగుతుంటారు. అయితే వాటిని ఎక్కడికైనా వెంట పెట్టుకొని వెళ్లడం ఇబ్బంది. అలాంటప్పుడు ఉపయోగపడేవే ఈ కాపర్ ఫ్లోటింగ్ బాల్స్. వీటిని ప్లాస్టిక్ గాజు, ఇలా మనం వాడే ఏ వాటర్ బాటిల్‌లో వేసినా చాలు, రాగిపాత్రలు అందించే ప్రయోజనాలన్నీ ఇవీ అందిస్తాయి. ఎక్కడికైనా తేలిగ్గా తీసుకెళ్లొచ్చు. శుభ్రం చేయడమూ తేలిక.

తెర

# మీ ఆశలు నిరాశ కావు



విశ్వక్ సేన్, కె.వి. అనుదీప్ కలయికలో వస్తున్న చిత్రం ఫంకీ. సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య నిర్మించారు. కయాదు లోహర్ కథానాయిక. ఫిబ్రవరి 13న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ సందర్భంగా గురువారం జరిగిన విలేకర్ల సమావేశంలో అని నిర్మాత సూర్య దేవర నాగ వంశీ మాట్లాడుతూ సినీ నేపథ్యంలో దర్శకుడికి, నిర్మాత కూతురికి మధ్య జరిగే క్యూట్ కామెడీ సినిమా ఇది. ప్రతి సన్నివేశం హాయిగా నవ్వుకునేలా ఉంటుంది. సినిమా చూస్తున్నంత సేపు నవ్వుతూనే ఉంటారు. ఇది అనుదీప్ సినిమా..స్కేల్ తో కొలవద్దు. నవ్వుకోవడానికి సినిమాకి రండి. అసలు నిరాశ చెందరు. థియేటర్ నుండి నవ్వుతూ బయటకు వెళ్తారు అని అన్నారు. విశ్వక్ సేన్ మాట్లాడుతూ భీమ్స్ అద్భుతమైన సంగీతం అందించారు. మామూలుగా నా సినిమాల్లో పాటలు బాగుంటాయి అంటారు. అయితే నా గత రెండు చిత్రాలలో పాటలు ఆశించిన స్థాయిలో మెప్పించలేదు. ఫంకీ సినిమాకి భీమ్స్ మంచి పాటలు ఇచ్చారు. సినిమా విడుదల తర్వాత పాటలకు ఆదరణ ఇంకా పెరుగుతుందనే నమ్మకం ఉంది. కయాదు లోహర్ మాట్లాడుతూ ట్రైలర్ ఫంకీ ఎలా ఉండబోతుందో ఇప్పటికే మీ అందరికీ అర్థమైపోయింది. సినిమాని విడుదల కోసం ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్నాము. నేను పని చేసిన దర్శకులలో విభిన్న శైలి ఉన్న దర్శకుడు అనుదీప్. ఆయనతో వర్కింగ్ ఎక్స్పీ రియన్స్ బావుంది. నా కెరీర్‌లో మొదటి కామెడీ సినిమా ఇది అని అన్నారు. దర్శకుడు అనుదీప్ కె.వి మాట్లాడుతూ కయాదు లోహర్‌కి తెలుగు రాకపోయినా.. తెలుగు డైలాగులు నేర్చుకొని చెప్పింది. కెమెరా వర్క్, భీమ్స్ సంగీతం, నవీన్ నూలి ఎడిటింగ్ సినిమాకు ఎస్సెట్. ఇది మంచి ఫ్యామిలీ ఎంటర్టైనర్. అందరిని అలరిస్తుంది అన్నారు.

# మార్చి 6న సతీ లీలావతి



లావణ్య త్రిపాఠి కొణిదెల, దేవ్ మోహన్ జంటగా నటించిన సినిమా సతీ లీలావతి. తాతినేని సత్య దర్శకత్వంలో ఈ సినిమాను నాగ మోహన్ నిర్మించారు. మార్చి 6న ఈ మూవీని విడుదల చేయబోతున్నట్టు తెలిపారు. ఈ సందర్భంగా లావణ్య త్రిపాఠి మాట్లాడుతూ, సతీ లీలావతి మూవీని ప్రారంభించినప్పుడు నేను గర్భవతిని. కేవలం మూడు నెలల్లోనే షూటింగ్ పూర్తి చేశాను. దర్శక, నిర్మాతల సపోర్ట్ వల్లే నేను నటించగలిగాను. సప్తగిరిగారితో పని చేయడం ఆనందంగా ఉంది. దేవ్ మోహన్ నటన ప్రతి ఒక్కరినీ ఆకట్టుకుంటుంది. ఇది పూర్తిగా వినోదాత్మక చిత్రం. ఈ సినిమాను చూసి పెద్ద హిట్ చేయాలని కోరుకుంటున్నాను అని అన్నారు. తాతినేని సత్య మాట్లాడుతూ, కమల్ హాసన్ చేసిన సతీ లీలావతితో మాత్రం నా సినిమాని పోల్చను. అయితే అందరికీ కనెక్ట్ అయ్యేలా ఈ సినిమాను తీశాను అని చెప్పారు. పాత సతీ లీలావతి ఎంత పెద్ద హిట్ అయ్యిందో ఈ సినిమా కూడా అంత హిట్ కావాలని కోరుకుంటున్నా అని నటుడు సప్తగిరి అన్నారు.

# మేం అలాంటి బెట్స్ వేయలేం



సౌమిత్ పోలాడి హీరోగా నటిస్తూ సాయి కె వెన్నంతో కలిసి దర్శకత్వం వహించిన చిత్రం నిలవే. ఈ సినిమాతో శ్రేయాసి సేన్ హీరోయిన్‌గా పరిచయం అవుతోంది. హర్ష చెముడు, సుప్రియా ఐసోలా మరో జంటగా నటిస్తున్నారు. రాజ్ అల్లాడ, గిరిధర్ రావు పోలాడి, సాయి కె వెన్నం ఈ చిత్రాన్ని నిర్మించారు. ఈ చిత్రం ప్రేమికుల దినోత్సవం కానుకగా ఫిబ్రవరి 13న విడుదల కాబోతుంది. ఈ సందర్భంగా మాదాపూర్‌లో ప్రీరిలీజ్ ఈవెంట్‌ను నిర్వహించారు. చిత్ర దర్శకుడు సాయి కె వెన్నం మాట్లాడుతూ, ముప్పై లక్షల రూపాయలలో మంచి సినిమా తీయొచ్చు. కానీ జనాల్లోకి దానిని తీసుకెళ్ళాలంటే కోట్లు ఖర్చుపెట్టాలని ఆ మధ్య ఓ దర్శకుడు అన్నారు. అలానే హీరో నాని ... కోర్ట్ సినిమా చూడండి, నచ్చకపోతే నా నెక్స్ట్ మూవీ చూడకండి అంటూ బెట్ వేశారు. కానీ మేం అలాంటి బెట్స్ వేయలేం. మా దగ్గర మంచి సినిమా వుంది. అందరి సహకారంతో దీన్ని రిలీజ్ చేస్తున్నాం. డైరెక్టర్ సందీప్ రెడ్డి వంగా గారిని ఆ మధ్య కలిసినప్పుడు ఇక్కడ ఎవరూ క్రిస్టోఫర్ నోలన్ లేరు.. మన సినిమాను మనమే నమ్మాలి. నాకది వర్క్‌వుట్ అయ్యింది. నువ్వు కూడా అదే నమ్ము అని చెప్పిన మాట నాలో స్ఫూర్తిని నింపింది అని అన్నారు. ఈ కార్యక్రమానికి గాయని సునీత ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ.. ఈ మధ్య చాలా తక్కువ సినిమాల్లో చక్కటి భావోద్వే గాలను చూస్తున్నాం. అలాంటి అన్ని ఎమోషన్స్‌తో రూపు దిద్దుకున్న చిత్రమే ఇది. కాలం మారినా ఇంటెన్స్ మ్యూ జిక్ అలానే వుంటుంది. నేను ఇక్కడ వుండడానికి కారణం కూడా అదే! ఈ మూవీ నేను చూశాను. అర్థ వంతమైన సినిమా ఇది. ఈ మ్యూజికల్ లవ్ స్టోరీని థియేటర్‌లో ఆడేలా ప్రేక్షకులు తీర్పు ఇస్తారని ఆశిస్తున్నాను. క్లాసికల్ మూవీస్ సఖి, ఏ మాయే చేశావే తరహాలో ఇదీ ఆదరణ పొందుతుందని భావిస్తున్నాను. ఇందులోని పాటలు బాగున్నాయని ఒకసారి వినమని కీర వాణి గారిని కోరాను. ఆయన విని, తన వంతుగా సపోర్ట్ చేశారు అని అన్నారు. హీరోయిన్ శ్రేయాసి సేన్ మాట్లాడుతూ, తెలుగు సినిమాలో నాయికగా నటించినందుకు ఆనందంగా వుంది. ఈ మూవీ నేను అంగీకరించడానికి సంగీతమే ప్రధాన కారణం. జన్ జీ సినిమా ఇది. ఈ సినిమా చూశాక ప్రేమ మీద మంచి అభిప్రాయానికి వస్తారని నమ్ముతున్నాను అని తెలిపారు. హీరో సౌమిత్ పోలాడి మాట్లాడుతూ, చిన్నప్పటి నుంచి నటుడు కావాలనే కోరిక వుండేది. అందుకు మెగాస్టార్ చిరంజీవి గారే నాకు స్ఫూర్తి. యాక్షన్ మూవీస్‌లో కె.జి.ఎఫ్. ఎలాంటిదో, లవ్ స్టోరీస్‌లో నిలవే అలాంటిది అని చెప్పారు.

# 21న ఫిల్మ్ ఫేర్ ఫెస్టివల్



ప్రేక్షకులతో పాటు, సినీతారలు సైతం ఆసక్తిగా ఎదురుచూసే అవార్డుల వేడుక ఫిల్మ్ ఫేర్. 2025 సంవత్స రానికి గాను ప్రతిష్ఠాత్మక 70వ ఫిలింఫేర్ అవార్డుల సంబరానికి రంగం సిద్ధమైంది. ఈనెల 21న కరళ వేదికగా ఈ అవార్డుల ప్రదానోత్సవం గ్రాండ్‌గా జరుగనుంది. ఈ క్రమంలో ఈ ఏడాది అవార్డుల కోసం పోటీపడుతున్న తమిళ, తెలుగు, మలయాళ, కన్నడ చిత్రాల జాబితా విడుదలైంది. 2024లో విడుదలైన సినిమాల్లో ఎంపికైన వాటికి అవార్డులు అందించనున్నారు. అవార్డుల కోసం నామినేట్ అయిన ఉత్తమ చిత్రాలు, ఉత్తమ నటులు, ఇతర టెక్నీషియన్ల వివరాలను ఫిలింఫేర్ అధికారికంగా ప్రకటించింది. తెలుగు నుంచి అత్యధికంగా పుష్ప 2, కల్కి, 35 చిన్న కథ కాదు, హనుమాన్, లక్కీ భాస్కర్ సినిమాలు అత్యధిక విభాగాల్లో పోటీ పడుతున్నాయి. ఉత్తమ దర్శకులుగా నాగ్ అశ్విన్ (కల్కి), నంద కిశోర్ (35 చిన్న కథ కాదు), ప్రశాంత్ వర్మ (హనుమాన్), సుకుమార్ (పుష్ప: ది రూరల్), వెంకీ అట్లూరి (లక్కీ భాస్కర్), యదు వంశీ (కమిటీ కుర్రోళ్లు) ఎంపికయ్యారు. ఉత్తమ నటులుగా అల్లు అర్జున్ (పుష్ప: ది రూరల్), దుల్కర్ సల్మాన్ (లక్కీ భాస్కర్), ఎన్టీఆర్ (దేవర), నాని (సరిపోదా శనివారం), సిద్ధూ జొన్నలగడ్డ (టిల్లు స్క్వేర్), తేజ సజ్జ (హనుమాన్) అవార్డులు అందుకోనున్నారు.



# శ్రీకాంత్ విస్సాకు ఛాన్స్



నందమూరి హీరో కళ్యాణ్ రామ్ తాజాగా ఇప్పుడు మళ్లీ రేస్‌లోకి రావడానికి సిద్ధమవుతున్నారు. ఈ సారి కూడా మరో కొత్త దర్శకుడికి ఆయన ఛాన్స్ ఇస్తున్నట్టు తెలుస్తోంది. ఇప్పటికే.. అల్లు అర్జున్ హీరోగా సుకుమార్ తెరకెక్కించిన పుష్ప, పుష్ప 2 చిత్రాలతో పాటు ఈ మధ్య కాలంలో చాలా చిత్రాలకు రచయితగా పనిచేసిన శ్రీకాంత్ విస్సాను కళ్యాణ్ రామ్ దర్శకుడిగా పరిచయం చేయబోతున్నట్టు తెలుస్తోంది. శ్రీకాంత్ విస్సా దర్శకత్వం వహించే సినిమా ప్రీప్రొడక్షన్ పనులు ఇప్పటికే ప్రారంభమయ్యాయట. అర్జున్ సన్ ఆఫ్ వైజయంతి మూవీ నిర్మాణ భాగస్వామి ముప్పా అశోక్ వర్ధన్ ఈ సినిమాకూ ప్రొడ్యూసర్‌గా వ్యవహరించ బోతున్నాడట.

శ్రీకాంత్ విస్సా చెప్పిన కథ కళ్యాణ్ రామ్‌కి బాగా నచ్చడంతో గత ఏడాది చివరిలోనే ప్రాజెక్ట్‌ను లాక్ చేశారని, కొద్ది రోజుల్లో అధికారిక సమాచారం వస్తుందని, ఆ వెంటనే షూటింగ్ మొదలవుతుందని తెలుస్తోంది. కళ్యాణ్ రామ్‌కు న్యూ టాలెంట్‌ను ప్రోత్సహించడం అలవాటు. నిర్మాతగా మారినప్పటి నుంచి ఆయన కొత్త దర్శకులకు అవకాశాలు ఇస్తూ వచ్చారు. అలా ఆయన ఖాతాలో కొన్ని సూపర్ హిట్ సినిమాలు చేరాయి, కొన్ని భారీ పరాజయాలు వచ్చాయి. కళ్యాణ్ రామ్ పరిచయం చేసిన డైరెక్టర్లలో చాలామంది అగ్రస్థానానికి చేరుకున్నారు. పటాస్ దర్శకుడిగా పరిచయమైన అనిల్ రావిపూడి లాంటి వాళ్లు ఏకంగా హిట్ మెషిన్‌గా మారారు. అలానే బింబిసారతో దర్శకుడిగా పరిచయమైన వశిష్ఠ ఇప్పుడు చిరంజీవితో విశ్వంభర మూవీ తెరకెక్కిస్తున్నారు. అయితే అమిగోస్, ది డెవిల్, అర్జున్ సన్ ఆఫ్ వైజయంతి వంటి ప్రయోగాలు పెద్దగా ఫలించలేదు. దీంతో తీవ్ర నిరాశకు గురైన కళ్యాణ్ రామ్ కొంతకాలం బ్రేక్ తీసుకున్నారు.

# నేరుగా థియేటర్లలోనే



శివాజీ, లయ జంటగా నటించిన సాంప్రదాయని సుప్పిని సుద్దపూసని సినిమా ఓటీటీలో స్ట్రీమింగ్ కావడం లేదు. నేరుగా థియేటర్లలోనే విడుదల కాబోతోందని తెలుస్తోంది. ఈ సినిమాను ఫిబ్రవరి 12న ఇది ఈటీవీ విన్‌లో డైరెక్ట్‌గా స్ట్రీమింగ్ అవుతుందని ఇప్పటికే మేకర్స్ ప్రకటించారు. కానీ అలా జరగలేదు. శివాజీ ఈ సినిమాకు నిర్మాత కూడా కావడంతో చివరి నిమిషంలో ఆయన మనసు మార్చుకున్నట్టు సమాచారం. కాస్తంత సమయం తీసుకుని, మళ్ళీ భారీగా ప్రచారం చేసి, సినిమాను మార్చి మొదటివారంలో థియేటర్లలోనే రిలీజ్ చేయాలని నిర్ణయించుకున్నారని సమాచారం. శివాజీ, లయ జంటగా నటించిన ఈ సినిమాలో రోహన్, ప్రిన్స్, అలీ, ధన్‌రాజ్, ఇమ్మాన్యుయేల్ ఇతర పాత్రలను పోషించారు. సుధీర్ శ్రీరామ్ దీనికి దర్శకత్వం వహించగా, రంజిన్ రాజ్ సంగీతం అందించారు.

# అడివి శేష్ దర్శకత్వంలో గ్రాండ్ ఎంట్రీ?



పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ తనయుడు అకీరా నందన్ సినీ అరంగేట్రంపై మళ్లీ చర్చ జోరందుకుంది. అకీరా ఎంట్రీ ఎప్పుడు? ఎవరి దర్శకత్వంలో? అనే ప్రశ్నలు గత కొంత కాలంగా ఫిల్మ్ నగర్‌లో హాట్ టాపిక్‌గా మారాయి. ఇప్పుడు ఈ చర్చలో టాలెంటెడ్ హీరో/డైరెక్టర్ అడివి శేష్ పేరు వినిపించడం ఆసక్తిని మరింత పెంచుతోంది. ఇంతకుముందు అకీరాను శేఖర్ కమ్ముల పరిచయం చేయబోతున్నారనే వార్తలు వినిపించాయి. కానీ తాజాగా అడివి శేష్ అకీరా డెబ్యూ బాధ్యతలు తీసుకుంటారన్న ప్రచారం ఊపందుకుంది. అకీరాతో శేష్‌కు ఉన్న సాన్నిహిత్యం ఈ వార్తలకు బలం ఇస్తోంది. ముఖ్యంగా రైటర్స్ బ్లాక్ షార్ట్ ఫిల్మ్‌కు అకీరా సంగీతం అందించినప్పుడు శేష్ మద్దతుగా నిలిచారు. ఆ అనుబంధం ఇప్పటికీ కొనసాగుతోంది. క్షణం, గూఢచారి, మేజర్ వంటి చిత్రాలతో తనదైన ముద్ర వేసిన అడివి శేష్... అకీరా కోసం ప్రత్యేకమైన, వైవిధ్యమైన కథ సిద్ధం చేస్తున్నారనే టాక్ వినిపిస్తోంది. వారసుడి డెబ్యూ కాబట్టి సాధారణ కమర్షియల్ ఎంట్రీ కాకుండా, కంటెంట్ బేస్డ్ మూవీతో లాంచ్ చేయాలని పవన్ కళ్యాణ్ కూడా భావిస్తున్నారట. అయితే ఈ ప్రాజెక్ట్‌లో శేష్ దర్శకత్వం వహిస్తారా? లేక కేవలం కథ అందిస్తారా? అనే దానిపై క్లారిటీ రావాల్సి ఉంది.



## ఎన్ఆర్ఐ డాక్టర్ విశ్వనాథంకు అభినందనలు వెల్లువ



సంతబొమ్మాళి, ఫిబ్రవరి 12 ప్రభాతవార్త

సంతబొమ్మాళి మండలం దండు గోపాలపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆడిటోరియం, డిజిటల్ లైబ్రరీ నిర్మాణానికి కోటి రూపాయలు విరాళం అందించిన ఎన్ ఆర్ ఐ డాక్టర్ లమ్మత విశ్వనాథం, సుశీల దంపతులకు పలువురు అభినందనలు తెలిపారు. ఇదే పాఠశాలలో 1966లో టెన్త్ బ్యాచ్‌కు చెందిన విశ్వనాథం ప్రముఖ డాక్టర్‌గా అమెరికాలో స్థిరపడిన విషయం తెలిసిందే. సంతబొమ్మాళి మండలం కాశీపురం గ్రామానికి చెందిన ప్రముఖ కంటి వైద్య నిపుణులు డాక్టర్ లమ్మత కృష్ణమూర్తి కనిష్ట సోదరుడు, అస్సాం చీఫ్ సెక్రటరీ డాక్టర్ కోత రవి మేనమామ డాక్టర్ విశ్వనాథం ఔదార్యంను కొనియాడారు. అలాగే పలువురు నాయకులు సామాజిక కార్యకర్తలు విశ్వనాథం సుశీల దంపతులను అభినందించారు. తమ కుటుంబ సభ్యులచే నిర్వహించబడుతున్న కోత అప్పన్న మహాలక్ష్మీ వాలంటరీ ఆర్గనైజేషన్‌కు మూలధనం కింద 10 లక్షల రూపాయలు ఆ సంస్థ కార్యదర్శి కోత మధుసూదన్ రావుకి అందజేశారు. మరికొద్ది రోజుల్లో పాఠశాల మరియు పై అధికారుల ఆధ్వర్యంలో అభివృద్ధి పనులకు శ్రీకారం చూడుతున్నట్లు ఎన్ ఆర్ ఐ లమ్మత సుశీల విశ్వనాథం దంపతులు తెలిపారు. ఈ మేరకు కె ఎం ఏ ఎం సొసైటీ కార్యదర్శి కోత మధుసూదన్ రావు ఒక ప్రకటనలో తెలిపారు. పాఠశాల అభివృద్ధికి సహకరిస్తున్న డాక్టర్ లమ్మత కృష్ణమూర్తి హిమావతి, లమ్మత సూర్యనారాయణ నాగరత్నం, డాక్టర్ కోత రవి నిర్మల, లమ్మత విశ్వనాథం సుశీల దంపతులకు స్థానిక సర్పంచులు కోత ఇందిర, మార్పు అశోక చక్రవర్తి, అట్టాడ తిరుపతిరావు, పంగ అసిరి నాయుడు, వైస్ ఎంపీపీ పొందల తులసమ్మ, కోత శ్రీకన్య సతీష్, పాఠశాల ఉపాధ్యాయులు,విద్యా కమిటీ చైర్మన్ కొండాల భారతి కృతజ్ఞతలు తెలిపారు.

## 73 మంది విద్యార్థులకు కంటి అద్దాలు పంపిణీ

బూర్జ, ఫిబ్రవరి 12 ప్రభాతవార్త



మండలంలోని గుత్తావలి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో ఉన్న ఓ వి పేట ఆదర్శ పాఠశాలలో చదువుకుంటున్న విద్యార్థులకు శ్రీకాకుళం అంధత్వ నివారణ సంస్థ ఆధ్వర్యంలో గుత్తావల్లి పి.హెచ్.సి డాక్టర్ పైడి రోజా నేతృత్వంలో గురువారం నేత్ర పరీక్షలు నిర్వహించారు. వీరిలో 73 మంది విద్యార్థులకు డాక్టర్ రోజా చేతుల మీదుగా కళ్లద్దాలను ఉచితంగా అందించారు. ఈ నేత్ర శిబిరంలో ప్రిన్సిపల్ బి.శ్రీనివాసరావు, పిహెచ్‌సి డాక్టర్ ఎం.సతీష్, ఎం.బాబురావు, ఎంపిహెచ్ఓ మురళి నారాయణరావు, హెచ్.ఎస్.సూర్యనారాయణ, పీహెచ్ఎన్ ఎం.పద్మావతి, వైద్య సిబ్బంది శ్రీను, నాగేశ్వరి అప్పలనాయుడు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## లేబర్ కోడ్‌లను రద్దు చేయాలి : సిఐటియు నిరసన ర్యాలీ

సీతంపేట, ఫిబ్రవరి 12 ప్రభాతవార్త

కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ సీతంపేటలో సిఐటియు ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన సార్వత్రిక సమ్మె నిరసన విజయవంతమైంది. సిఐటియు కార్యాలయం నుంచి సీతంపేట వారపు సంత వరకు అన్ని కార్మిక సంఘాలకు చెందిన కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొని భారీ నిరసన ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాస్కరరావు, తిరుపతిరావు, సుందరమ్మ, శ్రీరాములు, లక్ష్మణరావు తదితరులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## 108 అంబులెన్స్‌లో ప్రసవం



సీతంపేట, ఫిబ్రవరి 12 ప్రభాతవార్త

సీతంపేట మండలంలో చింతాడ గ్రామానికి చెందిన సవర విజయలక్ష్మి పురిటి నొప్పులతో బాధపడుతుండడంతో కుటుంబ సభ్యులు సీతంపేట 108 అంబులెన్స్‌కు సమాచారం అందించారు, వెంటనే స్పందించిన 108 సిబ్బంది ఈఎంటి రాములు, పైలెట్ రమణ చింతాడ గ్రామానికి చేరుకున్నారు. పురిటి నొప్పులతో బాధపడుతున్న ఆ గర్భిణి మహిళను సీతంపేట ఏరియా ఆసుపత్రికి వైద్య నిమిత్తం అంబులెన్స్‌లో తెస్తుండగా మార్గమధ్యలో నొప్పులు అధికం కావడంతో మార్గమధ్యలో ఆశా వర్కర్, ఈఎన్టి, పైలెట్ సహాయంతో ప్రసవం నిర్వహించారు. విజయ లక్ష్మి పండంటి మగ బిడ్డకు జన్మనిచ్చారు. తల్లి బిడ్డకు మెరుగైన వైద్యం నిమిత్తం సపర్యలు చేస్తూ సీతంపేట ఏరియా ఆసుపత్రిలో చేర్పించారు. 108 సిబ్బంది చేసిన కృషికి కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలియజేశారు.

## చిల్లపుట్టుగ బాధితులకు పరిహారం ..ఆదుకున్న కూటమి ప్రభుత్వం

కంచిలి, ఫిబ్రవరి 12 ప్రభాతవార్త



కంచిలి మండలం చిల్లపుట్టుగ గ్రామంలో గత సంవత్సరంలో జరిగిన కరెంట్ బాధితులకు రాష్ట్ర ప్రభుత్వం పరిహారం మంజూరు చేసిందని సర్పంచ్, మండల కూటమి నాయకులు పేర్కొన్నారు. గురువారం కంచిలి మండలం తలతంపర గ్రామంలో విలేకరుల సమావేశంలో కరెంట్ బాధితులు సమక్షంలో కూటమి నాయకులు, విలేకరులతో సర్పంచ్ జగబంధు డోలై మాట్లాడారు. చిల్లు పుట్టుగలో గత సంవత్సరం విద్యుత్ ప్రమాదంలో ముగ్గురు చనిపోయారని ఒక్కొక్కరికి ఐదు లక్షల రూపాయలు పరిహారం మంజూరు చేసిందని అన్నారు. ప్రమాదం జరిగిన సమయంలో కంచిలి మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు మాదిన రామారావు తన స్వగృహంలో శుభకార్యం జరుగుతున్నప్పటికీ జరిగిన సంఘటన తెలుసుకొని గ్రామంలో ప్రమాద బాధితులను పరామర్శించి తెలుగుదేశం పార్టీ ఆదుకుంటుందని చెప్పి సంఘటను ఇచ్ఛాపురం ఎమ్మెల్యే బెందాళం అశోక్ బాబు, అలాగే మంత్రి అచ్చెన్నాయుడుకు, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, విద్యుత్ ఉన్నతాధికారులకు తెలియజేయడంతో వారు స్పందించి బాధిత కుటుంబాలకు ఆదుకోవాలని ఉద్దేశంతో నేడు పరిహారం మంజూరు చేయడం ఎంతో మంచి విషయం అన్నారు. ఆయా కుటుంబాలు కూటమి ప్రభుత్వంకు ఎల్లప్పుడూ రుణపడి ఉంటాయని చెప్పారు. మాదిన రామారావు, మర్రిపాటి పూర్ణ, బోడ్డ హరిబాబు, టీవీ రమణ, అభిమన్యు ప్రధాన్, బల్లెడ దుర్గా శ్రీను గ్రామస్తులు పాల్గొన్నారు.


## కార్మిక హక్కుల రక్షణకై ఐక్యంగా పోరాడుదాం : సిఐటియు నేతల పిలుపు

కొత్తూరు, ఫిబ్రవరి 12 ప్రభాతవార్త:



కార్మికుల హక్కుల పరిరక్షణ కోసం ఐక్య పోరాటం చేయాలని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు సిర్ల ప్రసాద్, సీఐటీయూ నాయకులు పనస రమేష్, పల్ల క్రిష్ణ పిలుపునిచ్చారు. కేంద్ర ప్రభుత్వ కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ కొత్తూరు మండల కేంద్రంలో గురువారం కార్మిక ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, కార్మికులకు నష్టం కలిగించే నాలుగు లేబర్ కోడ్‌లను, రైతులకు నష్టం కలిగించే మూడు వ్యవసాయ చట్టాలను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. గ్రామీణ ఉపాధి హామీ పథకం పేరు మార్చి నిధులు తగ్గించి నిర్వీర్యం చేయడాన్ని తీవ్రంగా ఖండించారు. కార్మికులు పోరాడి సాధించుకున్న 44 కార్మిక చట్టాలను నాలుగు లేబర్ కోడ్‌లుగా మార్చి వారి హక్కులను కాలరాస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దీనివల్ల ఎనిమిది గంటల పని దినం, ప్రమాద బీమా, ఈఎస్ఐ, యూనియన్ పెట్టుకునే హక్కు వంటివి కార్మికులు కోల్పోతారని హెచ్చరించారు. లేబర్ అధికారులు కేవలం ఫెసిలియేటర్స్‌గా మారిపోతారని అన్నారు. కేంద్ర ప్రభుత్వ విధానాలకు మద్దతు తెలుపుతున్న రాష్ట్ర కూటమి ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా పోరాడాలని వారు పిలుపునిచ్చారు. వ్యవసాయ కార్మికులకు పని హామీ, ఉపాధి కల్పిస్తున్న మహాత్మా గాంధీ గ్రామీణ ఉపాధి పథకాన్ని పేరు మార్చి, నిధులు తగ్గించివేస్తున్న కేంద్ర బిజెపి ప్రభుత్వ చర్యలను తిప్పికొట్టాలని డిమాండ్ చేశారు. భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డును పునరుద్ధరించి, పెండింగ్‌లో ఉన్న క్లైమ్స్‌ను వెంటనే అమలు చేయాలని, పంచాయతీ పారిశుద్ధ్య కార్మికులకు వేతనాలు పెంచాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ అనుబంధ సంఘాల నాయకులు వెంకటమ్మ, రాజు, శ్రీను, బాలరాజు, రామారావు, పూర్ణిమ, సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

## వాసుదేవుని సన్నిధిలో కోలాటం



కంచిలి, ఫిబ్రవరి 12 ప్రభాతవార్త :

మండస గ్రామంలో జరుగుతున్న వాసుదేవ పెరుమాళ్ళ ఉత్సవాలలో కంచిలి కంచమ్మ తల్లి కోలాటం బృందం నృత్యం చేసింది. మండస ఉత్సవ కమిటీ పిలుపు మేరకు కోలాటం బృందం మహిళలు కోలాటం చేస్తూ పలువురిని ఆకట్టుకున్నారు. ఉత్సవ కమిటీ కోలాటంలో పాల్గొన్న మహిళలకు దుశ్శాలువతో సత్కరించారు.

## కార్మికులకు నష్టాలను కలిగించే లేబర్‌కోడ్‌లను రద్దుచేయాలి

కోటబొమ్మాళి, ఫిబ్రవరి 12 (ప్రభాతవార్త) :



కార్మికులకు నష్టం కలిగించే నాలుగు లేబర్ కోడ్లు రద్దు చేయాలని సిఐటియు జిల్లా కార్యవర్గ సభ్యులు హనుమంతు ఈశ్వరరావు అన్నారు. రైతులకు నష్టం కలిగించే మూడు వ్యవసాయ చట్టాలను రద్దు చేయాలని, గ్రామీణ ఉపాధి హామీ పథకంకు పేరు మార్చి నిధులు తగ్గించి నీరుగార్చుటాన్ని నిరశిస్తు దేశవ్యాపిత ఆల్ ట్రేడ్ యూనియన్స్, కిసాన్ సంయుక్త మోర్చాదేశవ్యాప్త సమ్మె పిలుపులో భాగంగా కోటబొమ్మాళిలో రైతు బజారు నుంచి కొత్తపేట జంక్షన్ వరకు అంగన్వాడీ కార్యకర్తలు, ఆశావర్కర్లు, రైస్ మిల్లు కార్మికులతో కలిసి ఆయన ర్యాలీ తీశారు. ఈ సందర్భంగా జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ కార్మికులు పోరాడి సాధించుకున్న 44 కార్మిక చట్టాలను నాలుగు లేబర్ కోడ్‌లుగా మార్చి హక్కులను హరించారని, ఎనిమిది గంటల పని దినం, ప్రమాద బీమా ఈఎస్ఐ యూనియన్ పెట్టుకునే హక్కు కార్మికులు కోల్పోతారన్నారు, లేబర్ అధికారులు ఫెసిలిటేటర్లుగా మారిపోతారని అన్నారు. కేంద్ర ప్రభుత్వ కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలకు మద్దతు తెలుపుతున్న రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం విధానాలకు వ్యతిరేకంగా పోరాడాలని పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు దుంపల సుదర్శన, గొండు నీలన్న, బోర శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

## సార్వత్రిక సమ్మెలో కదం తొక్కిన కార్మికులు



వీరఘట్టం, ఫిబ్రవరి 12 ప్రభాతవార్త

సార్వత్రిక సమ్మెలో భాగంగా గురువారం మండల కేంద్రం వీరఘట్టంలో భారీ నిరసన ర్యాలిని నిర్వహించారు. గ్రోమోర్ సెంటర్ నుండి హనుమాన్ జంక్షన్ వరకు ర్యాలీ ప్రదర్శన అనంతరం అంబేద్కర్ సెంటర్ వద్ద మానవహారం నిర్వహించారు. ఆశ, అంగన్వాడీ, ఎండిఎం, బిల్డింగు, ఆటో, ముఠా, ఫీల్డ్ అసిస్టెంట్లు, వ్యవసాయకార్మికులు, వివోఏలు, వీఆర్ఏలు, పంచాయతీ కార్మికులు, గ్రీన్ అంబాసిడర్లు, మొదలైన కార్మికులు అందరూ కలిసికట్టుగా పాల్గొన్నారు. కార్మికులకు కట్టు బానిసలుగా మార్చే లేబర్ కోడ్లను రద్దు చేయాలని, కనీస వేతనం 26,000గా నిర్ణయం చేయాలని, కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ కార్మికులకు పర్మనెంట్ చేయాలని గ్రామీణ ప్రజలకు ఉపాధిని గ్యారెంటీ కల్పించే మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకాన్ని పునరుద్ధరించాలని. కొత్త ఉపాధి చట్టం వి బి జి రామ్ జి నీ రద్దు చేయాలని, విద్యుత్ సవరణ చట్టం, ప్రభుత్వ రంగ పరిశ్రమలు పరిరక్షణ, విత్తన సవరణ చట్టం, వ్యవసాయ నల్ల చట్టాలు రద్దు చేయాలి తదితర డిమాండ్లు సాధన కోసం కార్మిక, రైతు, ప్రజా వ్యతిరేక నిర్ణయాలను తిప్పికొట్టాలని నినాదినిస్తూ ర్యాలీని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజా సంఘాల నాయకులు సిఐటి నగర ఉపాధ్యక్షులు వి.ఇందిరా, సిఐటి వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు ఎన్.సింహాచలం నాయకులు ఎన్.ప్రసాద్, వై.ప్రసాద్, సిహెచ్ భాగ్యలక్ష్మి, ఫీల్డ్ అసిస్టెంట్లు పి.ప్రసాద్, వివోఏలు భాస్కరరావు, ఆశ నాయకులు జి.యశోద, ఆర్.జ్యోతి, అంగన్వాడీ లత, భవాని, వీఆర్ఏలు కృష్ణ, బిల్డింగ్ రంగనాయకులు పి. శ్రీను, అఖిల భారత గ్రామీణ వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు పి.భాస్కరరావు, వామపక్ష వ్యవసాయ కార్మిక సంఘం దుర్గారావు తదితరులు పాల్గొని మాట్లాడారు.

## దళిత వాడల అభివృద్ధే...ఎమ్మెల్యే జయకృష్ణ అజెండా

వీరఘట్టం, ఫిబ్రవరి 12 ప్రభాతవార్త



దళితులు అంటే ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణకి అపార నమ్మకమని, వారి అభివృద్ధే తన అజెండాగా మలుచుకొని ముందుకు సాగుతున్నారని కూటమి యువ నాయకులు జంపు శేఖర్ అన్నారు. ఆయన గురువారం ఎమ్మెల్యే జయకృష్ణ ఆదేశాల మేరకు తన బృందంతో మండల కేంద్రంలోని బిసీ కాలనీ దళితవాడల్లో పర్యటించారు. తాను ఎమ్మెల్యే పంపగా వచ్చానని, తమ సమస్యల ఏమైనా ఉంటే ఎమ్మెల్యే దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించే విధంగా కృషి చేస్తామంటూ వారందరూ ప్రజలకు విన్నవించారు. అయితే క్షేత్రస్థాయిలో పరిశీలించిన ఈ బృందం దృష్టికి కొన్ని సమస్యలు ఉత్పన్నమయ్యాయి. డ్రైనేజీ వ్యవస్థ లేకపోవడమే కాక వున్న కొద్ది డ్రైన్స్ కూడా దెబ్బతిని వున్నాయి. అంతేగాక కొన్ని కనెక్టివిటీ రోడ్స్‌తో పాటు త్రాగునీటి సమస్య కూడా ఉండటంతో ప్రజలు కొద్దిగా ఇబ్బందులు పడుతున్నారని అన్నారు ఈ సమస్యలన్నీ ఎమ్మెల్యే జయకృష్ణ దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించడం జరుగుతుంది అని వారికి హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మోటార్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షులు చుక్కా శ్రీనివాసరావు, మాజీ పంచాయతీ సభ్యులు నులకజోడు ఇషాక్, వీరయ్య, శంకర్, వెంకీ, జోగారావు, నల్లయ్య, నరేష్ మరియు మహిళలు, దళిత యువత తదితరులు పాల్గొన్నారు.

## ప్రతిభకు ప్రోత్సాహం లక్ష్య సాధనకు సోపానం

కొత్తూరు, ఫిబ్రవరి 12 ప్రభాతవార్త :



విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను గుర్తించి ఇచ్చే ప్రోత్సాహం, వారు తమ ఉన్నత లక్ష్యాలను చేరుకోవడానికి బలమైన పునాదిగా మారుతుందని జిల్లా కెరీర్ అండ్ మెంటల్ హెల్త్ కౌన్సిలర్ అంపిలి ప్రశాంత్ కుమార్ పేర్కొన్నారు. గూణభద్ర గ్రామానికి చెందిన సాయి చలం ఎడ్యుకేషనల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో కొత్తూరు స్థానిక జూనియర్ కళాశాలలో ఇంటర్ ప్రథమ సంవత్సర విద్యార్థులకు నిర్వహించిన అభినందన సభలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు కేవలం మార్కులకే పరిమితం కాకుండా, తమ నైపుణ్యాలను మెరుగుపరుచుకుంటూ పట్టుదలతో చదవాలని సూచించారు. ట్రస్ట్ నిర్వాహకులు లంకవలస సాయి గణేష్, సింహాచలం దాస్ విద్యార్థులను ప్రోత్సహించడం అభినందనీయమన్నారు.

### నగదు పురస్కారాలు అందజేత

ఇంటర్ మొదటి సంవత్సరం పరీక్షల్లో అద్భుత ప్రతిభ కనబరిచిన ఆరుగురు విద్యార్థులను ఈ సందర్భంగా ఘనంగా సత్కరించారు. ఒక్కో విద్యార్థికి రూ.2000 చొప్పున నగదు చెక్కులను అందజేశారు. నగదుతో పాటు విద్యార్థులకు జ్ఞాపికలను కళాశాల ప్రిన్సిపాల్ ధనుంజయ, ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు గోవిందరావు చేతుల మీదుగా పంపిణీ చేశారు. తమ ప్రతిభను గుర్తించి సత్కరించడం పట్ల విద్యార్థులు, వారి తల్లిదండ్రులు సంతోషం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు మరియు ట్రస్ట్ ప్రతినిధులు పాల్గొన్నారు.

## సుదీర్ఘ సమస్యకి మోక్షం



ఇచ్ఛాపురం, ఫిబ్రవరి 12 ప్రభాతవార్త

మున్సిపాలిటీ 17వ వార్డు లాలాపేట మసీదు రోడ్డు గత 15 ఏళ్లుగా అర్ధాంతరంగా ఆగిపోవడంతో 63 మీటర్ల రహదారి భాగం లేక ప్రజలు ప్రయాణీకులు ఇబ్బందులు పడుతున్నారు. లాలాపేట ముస్లిం వీధి వద్ద చాలా సంవత్సరాలుగా రోడ్డు మీద నీరు నిల్వ ఉండి ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ సమస్యను గుర్తించిన 17వ వార్డు ఇన్‌చార్జ్ జన్నెల సంతోష్ ఎమ్మెల్యే బెందాళం అశోక్ దృష్టికి తీసుకెళ్లారు. ఎమ్మెల్యే సహకారంతో 15వ ఆర్థిక సంఘం నిధుల నుండి రూ.3 లక్షల గ్రాంట్ మంజూరు చేయించి రోడ్డు నిర్మాణం పూర్తి చేశారు. దీంతో ప్రాంత ప్రజలకు దీర్ఘకాలిక సమస్యకు శాశ్వత పరిష్కారం లభించింది. ఈ సందర్భంగా 17వ వార్డు ప్రజలు, స్థానికులు జన్నెల సంతోష్‌కి, ఎమ్మెల్యే బెందాళం అశోక్‌కి ధన్యవాదాలు తెలిపారు. ఎట్టకేలకు ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే బెందాళం అశోక్ కృషితో 15వ ఆర్థిక సంఘం నిధులు 3 లక్షల రూపాయలతో సి సి రోడ్డు పనులు మొదలు పెట్టారు. వార్డు తెలుగుదేశం ఇన్‌చార్జ్ జన్నెల సంతోష్ యాదవ్, కాంట్రాక్టర్ అప్పలనాయుడు, ఏఈ రవికిరణ్ జిలాని సంసుద్దీన్, రబ్బానీ తదితరులు పాల్గొన్నారు.

## ఏసుక్రీస్తు ఉజ్జీవ మహాసభలో అన్వేష్

ఇచ్ఛాపురం, ఫిబ్రవరి 12 ప్రభాతవార్త:



రాజాం పట్టణంలో యేసుక్రీస్తు రక్షణ ఉజ్జీవ సభలు మూడు రోజులు ఘనంగా జరిగాయి. రాజాం పట్టణంలో ప్రముఖ దైవసేవకులు కన్వీనర్ రెవరెండ్ ప్రసాద్ నిర్వహించారు, వర్తమానం అంతర్జాతీయ సువార్తకులు ఛార్లెస్ జాకబ్ అద్భుతమైన వర్తమానములు అందించారు. రెవరెండ్ ప్రసాద్ పట్టణంలో అనేక ఆధ్యాత్మిక కార్యక్రమాలు జరిపిస్తున్నారు, క్రైస్తవుల ఆధ్యాత్మిక ఎదుగుదలకు, క్రైస్తవుల ఐక్యత కోసం కృషి చేస్తున్నారు, ముఖ్య అతిథిగా వైస్సార్సీపీ స్టేట్ క్రిస్టియన్ మైనార్టీ సెల్ ప్రధాన కార్యదర్శి డా. ప్రత్తి అన్వేష్ పాల్గొని శుభాకాంక్షలు తెలియజేశారు. క్రైస్తవులు అందరు ఐక్యత కలిగి ఉంటే మైనార్టీలో అనేక సంక్షేమ అభివృద్ధి సాధించగలమని చెప్పారు. అనేక మంది దైవ సేవకులు, విశ్వాసులు, ప్రజలు పాల్గొని ఘనంగా ప్రార్థనలతో ముగించారు.

## నాటుసారా ముద్దాయిలకు ఉపాధి కల్పన




పాతపట్నం, ఫిబ్రవరి 12 ప్రభాతవార్త:

మండలంలో ఉన్నటువంటి నాటుసారా ముద్దాయిలందరు పూర్తిగా ఈ వృత్తిని వదిలిపెట్టినందుకు వారి యొక్క జీవనోపాధి నిమిత్తం ప్రభుత్వం నుండి వారికి ఋణాలు మంజూరు చేయుటకు పాతపట్నం ఎక్సైజ్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ కోట కృష్ణారావు గురువారం స్థానిక వెలుగు ఏపిఎం రవిరాజును కలిశారు. ఇందులో భాగంగా బొన్ని గ్రామంలోని సవర చిన్నప్పన్న, పుతీకాగూడ గ్రామంలోని సవర పార్వతి కుటుంబాలకు ఉపాధి కల్పించాలని ఏపిఎంకి వినతిపత్రం సమర్పించినట్లుగా ఎక్సైజ్ సిఐ కృష్ణారావు ఒక ప్రకటనలో తెలిపారు. అందుకు వారు సానుకులముగా స్పందించి ఋణాలు మంజూరు చేయుటకు సహకరిస్తామని హామీ ఇచ్చినట్లు పేర్కొన్నారు. అనంతరం వెలుగు కార్యాలయంలో జరుగుతున్న ఎఫ్ఎన్ఎస్ డబ్ల్యూ శిక్షణా కార్యక్రమంలో పాల్గొని నాటుసారా వలన కలిగే దుష్పరిణామాలు మరియు నిర్మూలనపై అవగాన సదస్సును నిర్వహించినట్లు తెలిపారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన నవోదయం 2.0 కార్యక్రమం పాతపట్నం మండలంలో దిగ్విజయంగా ముగిసిందని, పాతపట్నం మండలం నాటుసారా రహిత మండలంగా ప్రకటించబడిందని ఆయన తెలియజేశారు. ఈ కార్యక్రమములో వెలుగు సిసిలు జనార్ధన, అప్పన్న, వెలుగు ఐసి చిట్టిబాబు, సబ్ కమిటీ మెంబర్లు, విఓఏలు, ఎక్సైజ్ సిబ్బంది పాల్గొన్నారు.

## హడ్డుబంగి బాలికల ఆశ్రమ పాఠశాలను ఏపీవో ఆకస్మిక తనిఖీ

సీతంపేట, ఫిబ్రవరి 12 ప్రభాతవార్త



సీతంపేట ఐటిడిఏ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న హడ్డుబంగి గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాలను ఏపీవో జి.చిన్నబాబు గురువారం ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. వసతి గృహంలో నిత్యావసర సరుకులు నాణ్యతను పరిశీలించారు. పాఠశాలలో మరుగుదొడ్లు శుభ్రంగా ఉండాలని, విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని స్పష్టం చేశారు. సిక్ రూములో జ్వరంతో బాధపడుతున్న విద్యార్థులు ఆరోగ్యం అడిగి తెలుసుకున్నారు. అనారోగ్యంతో బాధపడుతున్న విద్యార్థినులను వెంటనే సీతంపేట ఏరియా ఆసుపత్రికి తరలించాలని వారికి మెరుగైన వైద్యం అందించాలని స్పష్టం చేశారు. మరుగుదొడ్లను పరిశీలించి మరింత శుభ్రంగా ఉండాలని సిబ్బందికి సూచించారు. నాణ్యతలేని కందిపప్పును వెంటనే మార్చి కొత్త స్టాక్‌ను పంపించాలని జీసీసీ సిబ్బందికి ఆదేశించారు. పదో తరగతి విద్యార్థులకు జరుగుతున్న ప్రీ ఫైనల్ పరీక్షలను పరిశీలించారు. విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం పెట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం ఉమావాణి, తదితరులు పాల్గొన్నారు.

# శ్రీకాకుళం వార్త



## డార్విన్‌కు ఘన నివాళి



పాతపట్నం, ఫిబ్రవరి 12 ప్రభాతవార్త:

జాతుల ఉత్పత్తిని శాస్త్రీయంగా వివరించిన గొప్ప ప్రకృతి శాస్త్రవేత్త చార్లెస్ డార్విన్ అని స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు సనపల వైకుంఠరావు అన్నారు. గురువారం పాఠశాలలో డార్విన్ జయంతిని పురస్కరించుకొని నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా జీవశాస్త్ర ఉపాధ్యాయులు ఎన్టీ రామారావు మాట్లాడుతూ ప్రకృతిలో జీవజాతులు తమ ఉమ్మడి పూర్వీకుల నుండి క్రమానుగతముగా పరిణామం చెందుతూ ఏర్పడినవిగా డార్విన్ నిరూపించారని తెలిపారు. అంతేకాకుండా ప్రకృతి జీవుల మనుగడను శాసిస్తుందని, తోక లేని కోతులు నుండి మనిషి పరిణామం చెందుతూ వచ్చాడనే డార్విన్ సిద్ధాంతాన్ని గుర్తు చేశారు.

## మంత్రి, పియుసి కమిటీ చైర్మన్ కలిసిన బీసీ ఉద్యోగుల సంఘం నాయకులు



ఆమదాలవలస, ఫిబ్రవరి 12 (ప్రభాతవార్త)

విద్యుత్ శాఖ బిసి ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శి, సంయుక్త కార్యదర్శి, ఖజానా శాఖ, జిల్లా బీసీ సంఘాల ప్రతినిధులు, విద్యుత్ శాఖ ఉద్యోగులు కలిసి విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్, పీయూసీ కమిటీ చైర్మన్, ఎమ్మెల్యే కూన రవి కుమార్ ఆంధ్రప్రదేశ్ సచివాలయం 3వ బ్లాక్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా 2026 సంవత్సరానికి సంబంధించిన క్యాలెండర్ మరియు డైరీలను గౌరవ అతిథుల చేతుల మీదుగా ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మరియు జిల్లా స్థాయి బీసీ ఉద్యోగుల సంఘాల నాయకులు, విద్యుత్ శాఖకు చెందిన పలువురు అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

## ఉపాధి హామీ పథకం ఆడిట్‌పై సమీక్షా సమావేశం

సంతబొమ్మాళి, ఫిబ్రవరి 12 ప్రభాతవార్త



మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకంకు సంబంధించి 17వ సోషల్ ఆడిట్‌పై సమీక్షా సమావేశం గురువారం నిర్వహించారు. 2025-26ఆర్థిక సంవత్సరంలో మండలంలో రూ.36కోట్లు పనులు జరగాయని ఎంపీడీఓ జయంత్ ప్రసాద్ వివరించారు. ఆడిట్ విధి విధనాలను ఎస్ఆర్పి మాధవరావు తెలిపారు. ఈ సమావేశంలో ఎంపీపీ ప్రతినిధి మేరుగు అప్పారావు, విజిలెన్స్ అధికారిని శ్రీదేవి, మండల పంచాయతీ రాజ్ అధికారి అంజిత్ కుమార్, ఏపీఓ పంగ నర్సింహామూర్తి, పలువురు సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు టెక్నీకల్ అసిస్టెంట్‌లు తదితరులు పాల్గొన్నారు.

## పోలిపల్లి పైడితల్లమ్మ జాతర ఏర్పాట్లపై దృష్టి సారించిన కమిషనర్



రాజాం, ఫిబ్రవరి 12 ప్రభాతవార్త

ఉత్తరాంధ్ర ఇలవేల్పు శ్రీశ్రీశ్రీ పోలిపల్లి పైడితల్లి అమ్మవారి 100వ వార్షిక జాతర ఈ నెల 22, 23, 24 తేదీలలో నిర్వహించనున్న నేపథ్యంలో రాజాం మున్సిపల్ కమిషనర్ ఏ.రామచంద్రరావు ప్రత్యేక దృష్టి సారించారు. జాతరకు భక్తులు తరలివస్తారని భావించి ముందస్తుగా సౌకర్యాల ఏర్పాట్లను వేగవంతం చేస్తున్నారు. కమిషనర్ స్వయం గా పర్యటించి రాజాం పట్టణంతో పాటు పరిసర ప్రాంతాల్లో రోడ్ల పక్కన ఉన్న చెట్లు, పొదలు తొలగిం చడం, జంగిల్ క్లీనింగ్, పారిశుద్ధ్య పనులను జాతరకు పది రోజుల ముందుగానే ప్రారంభించాలని ఆదేశించారు. ఈ చర్యల్లో భాగంగా కొండంపేట గ్రామం, మీనాక్షి కాలనీ, బావిరేతమ్మ వనం నుంచి మెంటిపేట చెరువుగట్టు మీదుగా కొండంపేట రోడ్డు జంక్షన్ వరకు విస్తృతంగా శుభ్రపరిచే పనులు చేపట్టారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని కమిషనర్ తెలిపారు.

## సార్వత్రిక సమ్మె విజయవంతం

ఆమదాలవలస, ఫిబ్రవరి 12 (ప్రభాతవార్త)



కేంద్ర కార్మిక సంఘాల సమాఖ్య సంయుక్త కిసాన్ మోర్చా స్వతంత్ర ఫెడరేషన్ల సంయుక్త పిలుపు మేరకు దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెలో భాగంగా పట్టణంలో కార్మిక సంఘాల ఆధ్వర్యంలో నిర్వహించిన సమ్మె విజయవంతమైంది. ఈ సమ్మెలో అంగన్వాడీ, ఆశ, మధ్యాహ్నం భోజన పథకం, మున్సిపల్ కార్మికులు, రైల్వే సఫాయి కార్మికులు, కళాసిలు, వీఆర్ఏలు, పెన్షనర్లు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. గురువారం పట్టణంలోని జూనియర్ కళాశాల దగ్గర నుండి పోలీస్ స్టేషన్ రైల్వే స్టేషన్ మీదుగా వన్ వే ట్రాఫిక్ జంక్షన్ వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం గాంధీ విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించి అక్కడ మానవహారం నిర్వహించారు. సిఐటియు జిల్లా ఉపాధ్యక్షురాలు కే.నాగమణి అధ్యక్షతన జరిగిన ఈ సభలో సిఐటియు సీనియర్ నాయకులు కే శ్రీనివాస్ మాట్లాడుతూ కార్మికుల పొట్ట కొట్టి కార్పొరేటర్లు కట్టబెట్టే చర్యల్లో భాగంగానే లేబర్ కోడ్లను మోడీ నేతృత్వంలోని ఎన్డీఏ ప్రభుత్వం తీసుకొచ్చిందని విమర్శించారు. కార్మికులను కట్టు బానిసలుగా చేసి దోపిడీని తీవ్రతరం చేసేందుకే ప్రభుత్వం కార్పొరేట్ల ప్రయోజనాల కోసమే ఈ లేబర్ కోడ్‌లు నాలుగింటిని తీసుకొచ్చిందని తెలిపారు. పని గంటల పెంపు సమ్మె హక్కు రద్దు అతి తక్కువ కనీస వేతనం ఫిక్స్డ్ టర్మ్ ఎంప్లాయిమెంట్ వంటి దుర్మార్గ చర్యలు ఈ లేబర్ కోడ్‌లు సారాంశం అని తెలిపారు. వీటిని వ్యతిరేకించి పోరాడాల్సిన అవసరం ఉందని ఐక్యంగా కార్మిక వర్గం పోరాడాలని పిలిపించారు. జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర కార్యదర్శి గొంటి గిరిధర్ ఐలు నాయకులు బొడ్డేపల్లి మోహనరావు, జన విజ్ఞాన వేదిక జిల్లా గౌరవ అధ్యక్షులు బొడ్డేపల్లి జనార్ధనరావులు మాట్లాడుతూ పోరాటాల ద్వారానే కార్మిక హక్కులు కాపాడుకోగలమని తెలిపారు. రాజ్యాంగం కల్పించిన ప్రాథమిక హక్కుల్లో కార్మిక హక్కులు ఒక భాగమని వాటిని రద్దు చేయాలని తుదకు రాజ్యాంగాన్ని రద్దు చేయాలని మోడీ ప్రభుత్వం చూస్తోందని ఈ దాడి పట్ల అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు. పాత ఉపాధి హామీ పథకాన్ని కొనసాగించాలని డిమాండ్ చేసారు. ఈ ర్యాలీలో పెన్షనర్ల నాయకులు మూర్తి మాస్టారు హెచ్.వి.సత్యనారాయణ కె.షణ్ముఖరావు, పి.బానోజీరావు, అదపాక రాజు పార్వతి, సంతోష్, తారకేష్, ఆదినారాయణ, భూలక్ష్మి, సింహాచలం తదితరులు పాల్గొన్నారు.

## పీహెచ్‌సీకి వైద్య పరికరాలు అందజేసిన స్టేట్ బ్యాంక్



వీరఘట్టం, ఫిబ్రవరి 12 ప్రభాతవార్త :

స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి గురువారం మౌలిక సదుపాయాల్లో భాగంగా కొన్ని పరికరాలను వీరఘట్టం స్టేట్ బ్యాంక్ మేనేజర్ బాలశ్రీ చేతుల మీదుగా అందజేశారు. ఫ్యాన్ ఇండియా సి ఎస్ ఆర్ కార్యక్రమంలో భాగంగా స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా అమరావతి సర్కిల్, ఏ డబ్ల్యూ ఏ ఆర్ ఈ గ్రూపుతో కలిసి ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి కావలసిన మౌలిక సదుపాయాలు, వైద్య పరికరాలు అందజేశారు. ఎందుకు పీహెచ్సీ వైద్యాధికారి డాక్టర్ ఎం.సాయికుమార్ ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలుపుతూ మీరు అందించిన వైద్య పరికరాలతో పేద ప్రజలకు మెరుగైన సేవలందిస్తామని ఆయన ఈ సందర్భంగా తెలిపారు. తెలియజేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ ప్రదీప్, ఆరోగ్య పర్యవేక్షకులు మరియు సిబ్బంది పాల్గొన్నారు.

## గ్రామాల అభివృద్ధిలో యువత భాగస్వామ్యం కావాలి

కొత్తూరు, ఫిబ్రవరి 12 ప్రభాతవార్త :



గ్రామ పంచాయతీల అభివృద్ధిలో ప్రజాప్రతినిధులు, యువతకు వారి విధులు, బాధ్యతలపై అవగాహన కల్పించే లక్ష్యంతో 'దిన వెలుగు అసోసియేషన్' ఆధ్వర్యంలో బుధవారం ప్రత్యేక శిక్షణ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో 4 మండలాల నుంచి సుమారు 42 మంది ప్రజాప్రతినిధులు, యువత ఉత్సాహంగా పాల్గొన్నారు. రిసోర్స్ పర్సన్ కె.దాసు నాయుడు మాట్లాడుతూ పంచాయతీలు చేపడుతున్న వివిధ కార్యక్రమాలను వివరించారు. ఎన్నికైన ప్రజాప్రతినిధులు తమ విధులను సక్రమంగా నిర్వహించినప్పుడే గ్రామాలు అభివృద్ధి చెందుతాయని ఆయన నొక్కి చెప్పారు. ఈ ప్రక్రియలో యువతీ యువకులు చురుగ్గా పాల్గొని అవగాహన కలిగి ఉండాలని పిలుపునిచ్చారు. స్టేట్ రిసోర్స్ పర్సన్ దేవుళ్ళు మాట్లాడుతూ ఆదివాసీ గ్రామాలు ప్రకృతి వ్యవసాయం వైపు అడుగులు వేయాలని సూచించారు. చిరుధాన్యాల సాగు ద్వారా పోషక విలువలతో కూడిన సమీకృత ఆహారాన్ని పొందడమే కాకుండా, ఆర్థికంగానూ ఎదగవచ్చని ఆయన తెలిపారు. ప్రతి గ్రామాన్ని 'బయో విలేజ్'గా మార్చి, ఆదర్శ పంచాయతీలుగా తీర్చిదిద్దాలని దేవుళ్ళు పిలుపునిచ్చారు. ఈ శిక్షణ కార్యక్రమంలో ఐటీడీఏ నుంచి డి.పి.ఎం సుమలత, వెలుగు అసోసియేషన్ డైరెక్టర్ బి.సంజీవరావు, ఇతర సంస్థ సిబ్బంది పాల్గొన్నారు. శిక్షణలో పాల్గొన్నవారు తమ సందేహాలను నివృత్తి చేసుకున్నారు.

13-2pg10exC.qxd:13-2pg10exC.qxd 1/1/02 6:25 AM Page 1






# టి20 వరల్డ్ కప్‌లో శ్రీలంక జోరు

## ఒమెన్‌పై 105 రన్స్ తేడాతో సూపర్ విక్టరీ

**న్యూఢిల్లీ:** ఐసీసీ టీ20 ప్రపంచకప్ 2026లో శ్రీలంక జోరు కొనసాగుతోంది. వరుసగా రెండో మ్యాచ్‌లోనూ విజయం సాధించింది. గ్రూప్ బీ లో భాగంగా పల్లెకెలె వేదికగా గురువారం జరిగిన మ్యాచ్‌లో శ్రీలంక 105 పరుగుల తేడాతో ఒమన్‌ను చిత్తు చేసింది. ఈ మ్యాచ్‌లో శ్రీలంక పూర్తి ఆధిపత్యం చెలాయించగా, ఒమన్ తేలిపోయి కనీస పోటీనివ్వలేకపోయింది. ఈ విజయంతో గ్రూప్ బీ నుంచి సూపర్ 8 అవకాశాలను మెరుగుపర్చుకోగా, ఒమన్ ఇంటిబాట పట్టేందుకు సిద్ధమైంది. ఈ మ్యాచ్‌లో ముందుగా బ్యాటింగ్ చేసిన శ్రీలంక నిర్ణీత 20 ఓవర్లలో 5 వికెట్లకు 225 పరుగులు చేసింది. కుశాల్ మెండీస్(45 బంతుల్లో 7 ఫోర్లతో 61), పవన్ రత్నాయక(28 బంతుల్లో 8 ఫోర్లు, సిక్స్‌తో 60), డసన్ షనక(20 బంతుల్లో 2 ఫోర్లు, 5 సిక్స్‌లతో 50) హాఫ్ సెంచరీలతో రాణించారు. ఒమన్ బౌలర్లలో జితెన్ రమణంది(2/41) రెండు వికెట్లు తీయగా, జయ్ ఒడెడ్రా, సుఫ్యాన్ మెహ్మూద్ చెరో వికెట్ తీసారు. అనంతరం ఒమన్ నిర్ణీత 20 ఓవర్లలో 9 వికెట్లకు 120 పరుగులు చేయగలిగింది. మహమ్మద్ నదీమ్(56 బంతుల్లో 3 ఫోర్లు, సిక్స్‌తో 53 నాటౌట్) అజేయ హాఫ్ సెంచరీతో సత్తా చాటాడు. శ్రీలంక బౌలర్లలో దుష్మంత్ చమీరా(2/19), మహీష్ తీక్షణ(2/11) రెండేసి వికెట్లు తీయగా, దునిత్ వెల్లలేగే, దుషన్ హేమంత, కామిందు మెండీస్ తలో వికెట్ తీసారు. ఈ గెలుపుతో శ్రీలంక గ్రూప్‌బీలో టాపర్‌గా కొనసాగుతోంది.




# వరల్డ్‌కప్ అరంగేట్రంలో సంచలనం..

## అనామక ఇటలీ చేతిలో చిత్తైన నేపాల్

**న్యూఢిల్లీ:** టీ20 ప్రపంచకప్ 2026లో పసికూన ఇటలీ సంచలనం సృష్టించింది. ముంబయి వేదికగా గురువారం నేపాల్‌తో జరిగిన మ్యాచ్‌లో ఏకంగా 10 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. చిన్న జట్టు ఇటలీ అరంగేట్రంలోనే మాతో జాగ్రత్త అనే హెచ్చరికలు పంపుతూ బోణీ కొట్టింది. గత మ్యాచ్‌లో ఇంగ్లండ్‌ను వణికించిన నేపాల్‌ను గడగడ వణికిస్తూ జయభేరి మోగించింది. ఓపెనర్ల విధ్వంసంతో 124 పరుగుల స్వల్ప లక్ష్యాన్ని ఉఫ్‌మని ఊదేసి. మేము చెలరేగితే ఇలా ఉంటది అని చాటింది. ఊహించని ఓటమితో నేపాల్ షాక్‌లో కూరుకుపోయింది. నేపాల్ నిర్దేశించిన 124 పరుగుల లక్ష్యాన్ని ఇటలీ 12.4 ఓవర్లలో ఒక్క వికెట్ కూడా కోల్పోకుండా ఛేదించింది. ఓపెనర్లు జస్టిన్ మోస్కా (60 పరుగులు), ఆంథని మోస్కా (62 పరుగులు) హాఫ్ సెంచరీలతో చెలరేగారు. దీంతో 44 బంతులు మిగిలుండగానే ఇటలీ విజయం సాధించింది. అంతకుముందు బ్యాటింగ్ చేసిన నేపాల్ 19.3 ఓవర్లలో 123 పరుగులకు ఆలౌట్ అయ్యింది. ఆరిఫ్ షేక్ (27 పరుగులు), రోహిత్ పౌడెల్ (23 పరుగులు), ఆసిఫ్ షేక్ (20 పరుగులు) ఫర్వాలేదనిపించారు. ఇటలీ బౌలర్లలో క్రిషన్ 3, బెన్ 2, అలీ హసన్, జస్ప్రీత్ సింగ్, సమ్స్‌తలో 1 వికెట్ దక్కించుకున్నారు. కాగా, ఇదే టోర్నీలో రీసెంట్‌గా తొలి మ్యాచ్‌లో పటిష్ఠమైన ఇంగ్లాండ్‌ను ఓడించినంతపని చేసిన నేపాల్ ఈ మ్యాచ్‌లో కనీసం పోటీ ఇవ్వకపోవడం గమనార్హం. ఆల్‌రౌండ్ ప్రదర్శన చేసిన ఇటలీ రెండో మ్యాచ్‌తో టోర్నీలో బోణీ కొట్టింది.

## షూటింగ్ ఛాంపియన్‌షిప్‌లో..

# ఐశ్వరీ ప్రపంచ రికార్డు



**న్యూఢిల్లీ:** ఆసియా షూటింగ్ చాంపియన్‌షిప్ 2026లో భారత్‌కు చెందిన షూటర్ ఐశ్వరీ ప్రతాప్ సింగ్ తోమర్ ప్రపంచ రికార్డు సాధించింది. పురుషుల 50 మీటర్ల రైఫిల్ 3 పి ఈవెంట్‌లో స్వర్ణం గెలుచుకున్నాడు. గురువారం ఢిల్లీలో జరిగిన షూటింగ్ ఛాంపియన్‌షిప్‌లో 50 మీటర్ల రైఫిల్ 3 పొజిషన్స్ ఫైనల్‌లో ఐశ్వర్య అద్భుత ప్రదర్శన కనపరిచాడు. రెండుసార్లు ఒలింపియన్ అయిన తోమర్, నీరజ్ కుమార్‌ను కేవలం 0.2 పాయింట్ల తేడాతో ఓడించి ఆసియా ఛాంపియన్‌గా నిలిచాడు. పోటీలో చివరి షాట్ కంటే 0.2 పాయింట్లు వెనుకబడి, తోమర్ అద్భుతమైన 10.7 పాయింట్లు సాధించి తన మొత్తం 362 పాయింట్లను ప్రపంచ రికార్డుగా నమోదు చేశాడు. నీరజ్ తన చివరి షాట్‌లో 10.3 పాయింట్లు మాత్రమే సాధించి రజతంతో సరిపెట్టుకున్నాడు. అనుభవజ్ఞుడైన అఖిల్ షెరాన్ కాంస్య పతకం కోసం మూడవ స్థానంలో నిలిచాడు. ఫైనల్‌లో అతను 343.5 స్కోరుతో కాంస్య పతకాన్ని గెలుచుకున్నాడు. అంతకుముందు నీరాజ్ 593 స్కోరుతో క్వాలిఫికేషన్ రౌండ్‌లో అగ్రస్థానంలో నిలిచాడు. పారిస్ ఒలింపిక్స్ కాంస్య పతక విజేత స్వాప్నిల్ కుసాలే ఈ ఖండాంతర పోటీలో పాల్గొనలేదు.

## ఆసియా ఫుట్‌బాల్ కప్‌లో

# భారత్ మహిళల, పురుషుల జట్లు డ్రా

**న్యూఢిల్లీ:** ఎఎఫ్‌సి అండర్17 ఆసియాకప్-2026లో భారత ఫుట్‌బాల్ జట్లు కఠినమైన పోటీలో మ్యాచ్‌లను డ్రా గా ముగించాయి. కౌలాలంపూర్‌లో గురువారం జరిగిన ఫైనల్ డ్రాలో ఎఎఫ్‌సి అండర్ 17 మహిళల ఆసియా కప్ గ్రూప్ బి లో జపాన్, ఆస్ట్రేలియా, లెబనాన్‌లతో కలిసి భారత్ జట్టు డ్రాగా ముగించింది. ఇదే సమయంలో ఎఫ్‌సి అండర్ 17 పురుషుల ఆసియా కప్ గ్రూప్ డి లో ఉజ్బెకిస్తాన్, ఆస్ట్రేలియా మరియు డిపిఆర్ కొరియాతో కలిసి ఉంది. క్వాలిఫయర్స్‌లో ఇరాన్, లెబనాన్, పాలస్తీనా, చైనీస్ తైపీలను అధిగమించి భారత్ చరిత్రలో 10వ సారి ఎఎఫ్‌సి అండర్17 ఆసియా కప్‌కు అర్హత సాధించింది. బ్లూ కోల్ట్స్ జట్టు ఆస్ట్రేలియాతో తమ ప్రచారాన్ని ప్రారంభించి, ఆ తర్వాత ఉజ్బెకిస్తాన్ మరియు డిపిఆర్ కొరియాతో తలపడుతుంది. ఉజ్బెకిస్తాన్ డిఫెండింగ్ ఛాంపియన్ కావడంతో ఈ టోర్నమెంట్‌కు స్వయంచాలకంగా అర్హత సాధించింది. గత 2025 ఎడిషన్‌లో ఆస్ట్రేలియా గ్రూప్ దశలోనే ఓడిపోయింది మరియు జోర్డాన్, భూటాన్, ఫిలిప్పీన్స్‌పై విజయాల తర్వాత 2026 టోర్నమెంట్‌కు అర్హత సాధించింది. రెండుసార్లు మాజీ ఛాంపియన్లు అయిన డిపిఆర్ కొరియా 2025లో సెమీఫైనలిస్టులుగా నిలిచింది. తద్వారా ప్రస్తుత ఎడిషన్‌కు ఇప్పటికే అర్హత సాధించింది. గ్రూప్ ఎ లో ఆతిథ్య సౌదీ అరేబియా తజికిస్తాన్, థాయిలాండ్, మయన్మార్‌లతో డ్రా చేసుకుంది.

## టి20 వరల్డ్ కప్‌లో..

# గ్రూప్ ఆఫ్ డెత్‌లో అఫ్ఘానిస్థాన్

## సూపర్ 8 నుండి ఒమెన్, ఐర్లాండ్ ఔట్



**న్యూఢిల్లీ:** టీ20 ప్రపంచ కప్-2026లో ఆఫ్ఘనిస్తాన్ వరుసగా రెండు పరాజయాలను చవిచూసింది. దీంతో వారు సూపర్ 8 దశకు అర్హత సాధించే విషయం కష్టక్లిష్టంగా మారింది. ఇక రెండు మ్యాచ్‌లకు రెండు ఓడిన ఐర్లాండ్, ఒమన్ సూపర్ 8 రేసు నుంచి తప్పుకున్నాయి. కాగా దక్షిణాఫ్రికాతో జరిగిన రెండో సూపర్ ఓవర్‌లో ఉత్కంఠభరితమైన ఓటమి తర్వాత ఆఫ్ఘనిస్తాన్ ప్రపంచ కప్‌కు వెళ్లే మార్గం మరింత కష్టతరంగా మారింది. కానీ సూపర్ 8 రౌండ్‌కు చేరుకోవాలనే వారి ఆశలు ఇంకా పూర్తిగా ముగియలేదు. దక్షిణాఫ్రికా చేతిలో ఓడిపోయిన తర్వాత ఇతర జట్ల ఫలితాలపై ఆధారపడవలసి ఉంటుంది. ఆఫ్ఘన్ ఇప్పుడు వారి నికర రన్ రేట్‌ను మెరుగుపరచుకోవడానికి యుఎఇ, కెనడాతో జరిగే మిగిలిన రెండు గ్రూప్ మ్యాచ్‌లను పెద్ద తేడాతో గెలవాల్సిన పరిస్థితి తప్పనిసరి అయింది. ఆఫ్ఘనిస్తాన్ జట్టు సూపర్ 8 కి అర్హత సాధించడానికి రెండు కీలక పరిస్థితులు కనిపిస్తున్నాయి. మొదటి సందర్భంలో, న్యూజిలాండ్ దక్షిణాఫ్రికాను ఓడిస్తే, యుఎఇ దక్షిణాఫ్రికాను ఓడించి, కెనడా యుఎఇని ఓడిస్తే ఆఫ్ఘనిస్తాన్‌కు ఒకింత సూపర్ 8కి అవకాశాలు ఉంటాయి. ఈ సందర్భంలో న్యూజిలాండ్ గ్రూప్ డిలో అగ్రస్థానంలో ఉంటుంది. అయితే ఆఫ్ఘనిస్తాన్, దక్షిణాఫ్రికా 4 పాయింట్లతో సమానంగా ఉంటాయి. ఇక్కడ నిర్ణయం నికర రన్ రేట్ ఆధారంగా ఉంటుంది.

దీంతో పెద్ద తేడాతో గెలిస్తే ఆఫ్ఘనిస్తాన్ తదుపరి రౌండ్‌కు టికెట్ పొందవచ్చు. రెండవ సమీకరణం న్యూజిలాండ్‌ను ఓడిస్తే, దక్షిణాఫ్రికా 8 పాయింట్లతో గ్రూప్‌లో అగ్రస్థానంలో ఉంటుంది. ఈ సందర్భంలో, కెనడా న్యూజిలాండ్‌ను ఓడించి, ఆపై యుఎఇ కెనడాపై గెలిస్తే ఆఫ్ఘనిస్తాన్ మరియు న్యూజిలాండ్ రెండూ చెరో 4 పాయింట్లు కలిగి ఉంటాయి.

మరోసారి, సూపర్ 8కి చేరుకున్న రెండవ జట్టు నికర రన్ రేట్ ద్వారా నిర్ణయించబడుతుంది. దీనిలో ఆఫ్ఘనిస్తాన్ న్యూజిలాండ్ కంటే మెరుగైన స్థితిలో ఉండాలి. ఇక ఈ టోర్నమెంట్‌లో మూడు బలమైన జట్లను కలపడంతో దీన్ని గ్రూప్ ఆఫ్ డెత్ గా పరిగణించారు. ఈ గ్రూప్‌లో బలమైన ఆఫ్ఘనిస్తాన్, న్యూజిలాండ్ మరియు దక్షిణాఫ్రికా ఒకదానిపై ఒకటి పోటీపడుతున్నాయి. గత టీ20 ప్రపంచ కప్‌లో సెమీ ఫైనలిస్ట్ అయిన ఆఫ్ఘనిస్తాన్ ప్రస్తుతం కీలకమైన క్లిష్టపరిస్థితిని ఎదుర్కొంటోంది. రషీద్ ఖాన్, అతని బృందం తదుపరి ఈ నె 16న యుఎఇతో మరియు ఫిబ్రవరి 19న కెనడాతో తలపడనుంది.




## పురుషుల ప్రో లీగ్..

# భారత్ ఓటమి

## 3-1తో బెల్జియం విక్టరీ


**న్యూఢిల్లీ:** పురుషుల ప్రో లీగ్ 2025-26లో బెల్జియం చేతిలో భారత్ ఓటమిపాలయింది. పురుషుల ప్రో లీగ్ రూర్కెలా లెగ్‌లో బెల్జియం భారత్‌ను 3-1 తేడాతో చిత్తు చేసింది. బెల్జియం తరపున నెల్సన్ ఒనానా (23వ నిముషం), థామస్ క్రోల్స్ (53), ఆర్నో వాన్ డెస్సెల్ (57) గోల్స్ సాధించగా, భారత్ తరపున శిలానంద్ లక్రా (29) గోల్స్ చేశాడు. బెల్జియంకు 4వ నిమిషంలోనే పెనాల్టీ కార్నర్ లభించింది, అయితే, అలెగ్జాండర్ హెండ్రిక్స్ డ్రాగ్‌ఫ్లిక్‌ను భారత తొలి రషర్ వివేక్ సాగర్ ప్రసాద్ ఆపాడు. బెల్జియం (14) మరో పెనాల్టీ కార్నర్‌ను గెలుచుకుంది. కానీ ఈసారి టామ్ బూన్ అడ్డుకోవడంతో లక్ష్యం నుండి తృటిలో దూరమైంది. రెండవ క్వార్టర్‌లో (21) బెల్జియంకు పెనాల్టీ కార్నర్ లభించినా భారత గోల్ కీపర్ పవన్ అలెగ్జాండర్ హెండ్రిక్స్ గోల్ చేయకుండా నిరోధించాడు. బెల్జియంకు చెందిన థామస్ క్రోల్స్ గోల్ సాధించాడు. కానీ పవన్ తన గోల్‌ను కాపాడుకోవడానికి మరో కీలకమైన సేవ్ చేశాడు. ఈ సమయంలో థామస్ బంతిని నెల్సన్ ఒనానా (23)కి పాస్ చేయడంతో అతను గోల్ చేశాడు. ఆతిథ్య జట్టు (29) మరో అద్భుతమైన దాడి చేసి పెనాల్టీ కార్నర్‌ను గెలుచు కుంది. మూడవ క్వార్టర్‌లో (38) బెల్జియం మరో పెనాల్టీ కార్నర్‌ను గెలుచుకుంది. జర్మన్‌ప్రీత్ సింగ్ గోల్ లైన్‌లో సేవ్ చేసి స్కోర్‌లను సమంగా ఉంచాడు. నీలకంఠ శర్మ (53) కార్తీ సెల్వమ్‌కు అద్భుతమైన పాస్ అందించినా ఫార్వర్డ్ గోల్‌పై షాట్ తీసుకోలేకపోయాడు. లూకాస్ బాల్తాజార్ బేస్‌లైన్ నుండి సర్కిల్‌లోకి సరైన పాస్‌ను ఆడాగా, థామస్ క్రోల్స్ (53) ఆధిక్యాన్ని అందించాడు. థామస్ మళ్లీ (57) బంతిని సెట్ చేసి బెల్జియంకు విజయాన్ని అందించాడు.

# నష్టాల్లో ముగిసిన సెన్సెక్స్, నిఫ్టీ

## నిఫ్టీ, ఐటి సూచీల్లోనే 1.62 లక్షలకోట్లు ఆవిరి




**ముంబయి, ఫిబ్రవరి 12:** దేశీయ స్టాక్ మార్కెట్లు గురువారం నష్టాలతో ముగిశాయి. ప్రధానంగా ఐటీ రంగ షేర్లలో భారీ అమ్మకాల ఒత్తిడి సూచీలను కిందకు లాగింది. కొన్ని బ్యాంకింగ్, ఫైనాన్షియల్ స్టాక్స్‌లో కొనుగోళ్లు కనిపించినా, టెక్నాలజీ రంగంలో బలహీన సెంటిమెంట్‌ను అధిగమించలేకపోయాయి. ట్రేడింగ్ ముగిసే సమయానికి, బీఎస్‌ఈ సెన్సెక్స్ 558.72 పాయింట్లు నష్టపోయి 83,674.92 వద్ద స్థిరపడింది. ఎన్ఎస్ఈ నిఫ్టీ 146.65 పాయింట్లు క్షీణించి 25,807.2 వద్ద ముగిసింది. రంగాల వారీగా చూస్తే, నిఫ్టీ ఐటీ ఇండెక్స్ ఏకంగా 5.51 శాతం కుప్పకూలింది. టెక్ మహీంద్రా, ఇన్ఫోసిస్, టీసీఎస్, హెచ్‌సీఎల్ టెక్ షేర్లు తీవ్ర అమ్మకాల ఒత్తిడికి గురై నష్టాలు చవిచూసిన కంపెనీలుగా నిలిచాయి. ఆటో దిగ్గజం మహీంద్రా మహీంద్రా కూడా నష్టాల్లోనే ముగిసింది. మరోవైపు, మార్కెట్ బలహీనంగా ఉన్నప్పటికీ బజాజ్ ఫైనాన్స్, ఐసీఐసీఐ బ్యాంక్, భారత్ ఎలక్ట్రానిక్స్ (తీనిలి), ట్రెంట్ వంటివి లాభపడి సూచీలకు కొంత మద్దతు ఇచ్చాయి. నిఫ్టీ 25,840-25,900 స్థాయిని దాటనంత వరకు స్వల్పకాలికంగా మార్కెట్ బలహీనంగానే కొనసాగిందని అంచనావేసారు. ఐటీతో పాటు రియల్టీ, ఆయిల్ అండ్ గ్యాస్ రంగాల షేర్లు కూడా ఒత్తిడికి గురయ్యాయి. బ్రాడర్ మార్కెట్లలో మిడ్‌క్యాప్, స్మాల్‌క్యాప్ సూచీలు కూడా నష్టాలతోనే ముగిశాయి. ప్రత్యేకించి నిఫ్టీలో ఐటి సూచీ 5.51శాతం దిగజారింది. నిఫ్టీ ఐటి కంపెనీ మొత్తం మార్కెట్ విలువలు రూ.27,32,579 కోట్లకు చేరింది. సూరుగా 1.6 లక్షలకోట్లు కంపెనీల షేర్లరూపంలో నష్టం వచ్చినట్లు తెలుస్తోంది. టిసిఎస్ 5.48శాతం 52 వారాల కనిష్టం రూ.2750కి చేరింది. ఇన్ఫోసిస్ 5.48, టెక్‌మహీంద్ర 6.40శాతం, హెచ్‌సిఎల్ టెక్, ఎంఫసిస్, విప్రో కంపెనీలు 4.5 నుంచి ఐదుశాతం చొప్పున దిగజారాయి. మొత్తం ఐటి సూచీని డేంజర్‌జోన్‌లోకి గురువారం నెట్టివేసినట్లయింది. ఒక బిఎస్ఇ మిడ్‌క్యాప్ సూచీ 0.46శాతం క్షీణించింది. స్మాల్‌క్యాప్‌సూచీ కూడా 0.86శాతంమేర దిగజారింది. బిఎస్ఇలో 1676 కంపెనీలు పెరిగితే 2530 కంపెనీలుక్షీణించాయి. డాలరుతో రూపాయి మారకం విలువలు 96.82గా కొనసాగి రూపాయి క్షీణతను కొనసాగించారు. కమోడిటీ మార్కెట్‌లో బ్రెంట్ ముడిచమురు ఏప్రిల్ సెటిల్‌మెంట్లకుగాను 39 సెంట్లు క్షీణించి బ్యారెల్‌కు 69.01 డాలర్లుగా మారాయి.



# వేతన పెంపును ప్రకటించిన 'విప్రో'

**బెంగళూరు, ఫిబ్రవరి 12:** సాఫ్ట్‌వేర్ సేవల కంపెనీ విప్రో తన ఉద్యోగులకు మార్చి ఒకటవ తేదీనుంచి జీతాలను పెంచుతున్నట్లుప్రకటిం చడంతో ఉద్యోగులకు కొండంత ఊరట లభించింది. వేతన పెంపు ఎంతమేర ఉంటుం దన్నది ఇప్పటివరకూ స్పష్టత ఇవ్వలేదు. భారతీయ ఐటి సేవల కంపెనీలు వేతనాల పెంపుపై ఫోకస్ పెంచాయి. అలాగే వేరియబ్ వేతనాలపెంపును కూడా పరిశీలిస్తున్నాయి. అనిశ్చిత వాణిజ్య పరిస్థితుల్లో వేరియబుల్ పే మంచిదన్న భావనతో ఉన్నారు. సుంకాల యుద్ధం, భౌగోళిక ఉద్రిక్తతలు ఇందుకు కీలకంగా భావించాలి. టిసిఎస్ ఏప్రిల్‌ఖుంచి పెంచాలని చూసినా గత సెప్టెంబరునుంచే పెంచుతున్నట్లు ప్రకటించింది.

# హిందాల్కో నికరలాభం రూ.2049 కోట్లు

**ముంబయి, ఫిబ్రవరి 12:** హిందాల్కో ఇం డస్ట్రీస్ నికరలాభం మూడో త్రైమాసికంలో రూ.2049 కోట్లు ఆర్జించినట్లు ప్రకటిం చింది. అయితే గత ఏడాది ఇదే కాలంలో 4741 కోట్లు ఆర్జించిన సంస్థ 56.8శాతం నికరలాభాలు క్షీణించినట్లు ప్రక టించింది. రాబడులపరంగా 0.7 శాతం పెరిగాయి. రూ. 66,521గా నమోదయింది. గతత్రైమాసి కంలో 66,058 కోట్లనుంచి స్వల్పంగా పెరిగింది. ఎబిడిటా కూడా 10.8శాతం క్షీణించి రూ.7994 కోట్లుగా ఉంది. అంతకుముందు ఏడాది ఇదే కాలంలో రూ. 8996 కోట్లుగా ఉంది.ఎబిడిటా మార్జిన్ 13.6శాతంనుంచి 12శాతానికి తగ్గింది. కంపెనీ న్యూయార్క్ లోని ఒస్వేగో ప్లాం ట్‌లో అగ్నిప్రమాదం కారణంగా రూ. 2610 కోట్లు భారం పడింది. ఇదే త్రైమా సిక ఫలితాలపై ప్రభావంచూపించిందని కంపెనీ చెపుతోంది. ఇక అల్యూమినియం విభాగం త్రైమాసిక ఎబిడిటా రూ.4832 కోట్లుగా ఉంది. 14శాతంపెరిగింది. ఆదిత్య ఎఫ్ఆర్‌పి, బ్యాటరీ ఫాయిల్, ఎసి ఫిన్ కోటింగ్; కాపర్ ట్యూబ్స్ వంటివాటిలో మంచి బిజినెస్ చేసుకోగలిగామని హిం దాల్కో ఎండి సతీష్‌పాయ్ అన్నారు. త్రైమా సిక పలితాలప్రకటనకు ముందు హిం దాల్కో షేర్లు 0.65శాతం దిగువన అంటే రూ.964.40వద్ద ఎన్ఎస్ఇలో కొనసా గాయి. బెంచ్‌మార్క్ నిఫ్టీ 0.57శాతం పత నం అయితే షేహిందాల్కో షేర్లు మరింత క్షీణించాయి.






# జనవరి రిటైల్ ద్రవ్యోల్బణం 2.75%



**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 12:** వినియోగదారుల ధరలసూచీ ఆధారంగా నిర్ధారించే ద్రవ్యోల్బణాన్ని జనవరి నెలకుగాను 2.75శాతంగా ఉందని కేంద్ర అర్థగణాంకశాఖ పథక అమలుశాఖ వెల్లడించింది. అఖిలభారత వినియోగదారుల ఆహార ధరల సూచీ ఆధారంగా జనవరిలో 2.13శాతంగా ఉంది. గ్రామీణ ప్రాంతాల్లో ఆహార ఉత్పత్తులధరలు 1.96శాతంపెరిగాయి. పట్టణప్రాంతాల్లో 2.44శాతంగా ఉన్నట్లు మోస్పీ వెల్లడించింది. ఏటికేడాది హౌసింగ్ ద్రవ్యోల్బణం రేటు జనవరిలో 2.05శాతంగా ఉంది. హౌసింగ్ దరలు కూడా 2.39శాతం గ్రామీణప్రాంతాల్లోను 1.92శాతం పట్టణప్రాంతాల్లోను పెరుగుదలనమోదుచేసాయి. జనవరి సిపిఐ ద్రవ్యోల్బణ డేటాను 2024 బేస్ ఇయర్‌గా చేసుకుని నిర్ధారించారు. గడచిన 12 ఏళ్లుగా వ్యయం తీరు ఎలా మార్పులు చెందిందీ కూడా ఈ బేస్ ఇయర్ మార్పువల్ల తెలుస్తుందని మోస్పీ వెల్లడించింది. కొత్త వ్యవస్థలో సేవలరంగానికి కొంత ఒత్తిడిపెరుగుతుంది. ఆహార ఉత్పత్తుల వాటా మాత్రం కొంతమేర తగ్గుతుంది. ఇక గ్రామీణ హౌసింగ్, ఆన్‌లైన్ మీడియా సర్వీస్ ప్రొవైడర్లు లేదా స్ట్రీమింగ్ సేవలసంస్థలు, విలువలు జోడింపు ఉన్న డైయిరీ ఉత్పత్తులు, బార్లే, ఇతర ఉప ఉత్పత్తులు, పెన్‌డ్రైవ్ బాహ్య హార్డ్ డిస్క్, అటెండెంట్, బేబి సిట్టర్, కసరత్తుల సామనరగి వంటి వాటిని కూడా ఈసారి ద్రవ్యోల్బణంలో మదింపుకోసం ఎంచుకున్నారు. విసిఆర్, డివిడి ప్లేయర్లు, రేడియో టేప్‌రికార్డరు, సెకండ్‌హ్యాండ్ దుస్తులు, పీచు లేదా పీచుతో రూపొందించిన తాడు వంటిఉత్పత్తులను మాత్రం మదింపునుంచి మినహాయించారు. 2012 వరకూ వచ్చిన బేస్ ఇయర్‌సాయంతో రిటైల్‌ద్రవ్యోల్బణాన్ని గణించారు. ఈసూచీలో ఆహారం, శీతలపానీయాలకు ఎక్కువ వాటా ఉంది. ఆ తర్వాత హౌసింగ్, ఇంధనం, సేవలరంగం అంటే రవాణా, ఆరోగ్యం, విద్యారంగాలు కూడా నిలిచాయి. ప్రతి కేటగిరికి ఇచ్చిన ప్రాధాన్యం కుటుంబీకుల వ్యయ సర్వేల ఆధారంగా ఉంటుందని సగటు వ్యయం ఆధారంగా మదింపుచేసి నిర్ధారించడం జరుగుతుందని మోస్పీ వెల్లడించింది.

Printed and Published by Gireesh Sanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at D.No. 1 -187, Kushalpuram, Srikakulam Dist. PIN: 532005 Ph. 270684, 271144, 9848387562 Fax : 08942–271146, RNI No. AP TEL/2004/13708 Editor :*Damerla Sai Baba *Responsible for selection of News under the PRB Act. Regd.: No.J/RNP/VM111 Air Surcharge: Delhi : 40 Ps.